సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 288

గురువారం 8-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సింధు శ్రమించి..

మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రీక్వార్టర్స్‌లోకి స్టార్ షట్లర్ - 14లో

చికిత్సలోనూ వివక్ష!

'మహిళలు..మానసిక చికిత్స'పై డాక్టర్ సవితా మల్హోత్రా ఏం చెప్పారంటే.. -13లో

మోదీకి నెతన్యాహు ఫోన్

ప్రధాని నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో మాట్లాడారు. గాజా శాంతి ప్రణాళిక గురించి వివరించారు.

వివరాలు 6లో ▸

చమురు మంటలు

అమెరికా 2 చమురు నౌకలను దిగ్బంధిం చింది. అవి వెనెజువెలావే అని అమెరికా అంటుండగా, తమవేనని రష్యా వాదిస్తోంది.

వివరాలు 6లో ▸



ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తం

ఆక్రమణల తొలగింపు.. మసీదు కూల్చివేత రంగు పులుముకుని ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన సమీపంలో అలజడి చెలరేగింది.

వివరాలు 6లో ▸

కాంగ్రెస్, మజ్లిస్‌తో బీజేపీ..

మహారాష్ట్ర మున్సిపల్‌కౌన్సిల్ ఎన్నికల్లో విచిత్ర పొత్తు.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి. బీజేపీ ఎంఐఎంతోనూ జతకట్టింది.

వివరాలు 6లో ▸

నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ గురువారం మీడియా సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఆయన మీడియాతో మాట్లాడతారు.

సీమ ఎత్తిపోతలపై శాపనార్థాలు!



సరైన అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రారంభించారంటూ చంద్రబాబు అక్కసు

పోలవరం సాక్షిగా బడాయి మాటలు.. పచ్చి అబద్ధాలు

- తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యలను కనీసం ఖండించని బాబు
- ఏకాంత భేటీలో ఇద్దరి మధ్య ఏం ఒప్పందం కుదిరిందో చెప్పకుండా గద్దింపు
- శ్రీశైలంలో 841 అడుగులకు దిగువన నీటిని వాడుకోవడానికి సీమ ఎత్తిపోతల చేపట్టారంటూ నిష్ఠూరం.. సీమకు మేలు జరిగితే బాబుకొచ్చిన నష్టమేమిటని రైతుల ప్రశ్న
- 881 అడుగుల కంటే ఎత్తులో శ్రీశైలం నీళ్లు నిల్వ ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం
- 800 నుంచి 841 అడుగులలోపే వచ్చిన నీటిని వచ్చినట్లుగా శ్రీశైలం నుంచి రోజుకు 7 టీఎంసీలను తోడేస్తున్న తెలంగాణ
- అలాంటప్పుడు ఇక శ్రీశైలంలో నీటి మట్టం 881 అడుగులకు చేరేదెప్పుడు? పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు ఎప్పుడు నీళ్లు రావాలి?
- వర్షాభావ సంవత్సరాల్లో మరింత ఘోరం

2 లో

- అందుకే మనకు హక్కుగా దక్కిన వాటా జలాలను వాడుకోవడానికే రాయలసీమ ఎత్తిపోతల చేపట్టిన వైఎస్ జగన్
- అది పూర్తయితే జగన్‌కు మంచి పేరొస్తుందనే కక్షతో దాన్ని ఆపేసిన చంద్రబాబు సర్కార్
- రాష్ట్రంలో 90 శాతం ప్రాజెక్టులు తానే నిర్మించానంటూ బాబు బడాయి మాటలు
- గండికోట, బ్రహ్మంసాగర్‌లో పూర్తి స్థాయిలో తానే నీటిని నిల్వ చేశానంటూ పచ్చి అబద్ధాలు
- జలయజ్ఞంలో 83 ప్రాజెక్టులు చేపట్టింది.. వాటిలో 44 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేసింది వైఎస్సారే
- అందులో నెల్లూరు, సంగం, గాలేరు-నగరి, వెలిగొండలను జాతికి అంకితం చేసింది వైఎస్ జగనే
- నాలుగు సార్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టుకు డిజైన్.. నిర్మాణం.. పూర్తి చేసిన దాఖలాలే లేవంటున్న ఇంజనీర్లు

రాయలసీమకు వెన్నుపోటే

- రాయలసీమ లిఫ్ట్ స్కీం అనవసరం అనడం దారుణం
- సీమకు నీరు రాకుండా అడ్డుపడిన చంద్రబాబు రాయలసీమ ద్రోహి
- చంద్రబాబు ప్రభుత్వంలో ఒక్క ప్రాజెక్టు పనులూ జరగలేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి ధ్వజం

2లో

ఫీజు బకాయిలివ్వండి మహాప్రభో

రూ.6,300 కోట్లు పెండింగ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు రాక అవస్థలు పడుతున్నాం

ఈ నెల.. వచ్చే నెల.. అంటూ మాటల దాటవేత ఇంకెన్నాళ్లు?

కనీసం పండగకు ఉద్యోగులకు జీతాలివ్వలేని దుస్థితి నెలకొంది

వడ్డీలకు అప్పులు తెచ్చి కాలేజీలు నడపలేకపోతున్నాం

ప్రభుత్వానికి డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల అసోసియేషన్ల లేఖలు



సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలను నడిపే పరిస్థితి లేదని ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కళాశాలల నిర్వహణ కోసం బ్యాంకుల నుంచి తీసుకునే లోన్లలో ఓవర్ డ్రాఫ్ట్ పరిమితి కూడా దాటిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాయి. అప్పులు కట్టడానికి మళ్లీ అప్పులు చేయడం, అప్పుపుట్టే దారి లేకపోవడంతో విద్యాసంస్థల ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని తెలిపాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం తీరును నిలదీస్తూ రెండు అసోసియేషన్లు బుధవారం వేర్వేరుగా

మిగతా 3వ పేజీలో ▸

సాక్షి టెన్త్‌క్లాస్ స్పెషల్

సోషల్ ముఖ్యమైన ప్రశ్నలు-సమాధానాలు, క్విజ్

- వివరాలు 11,12ల్లో ▸

విశాఖ తీరంలో క్షిపణి పరీక్ష!

- విశాఖపట్నం తీరం నుంచి ఈ నెల 12, 13 తేదీల్లో క్షిపణి పరీక్షకు రక్షణ శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. బంగాళాఖాతం వెంబడి 500 కి.మీ పరిధిలో 12వ తేదీ అర్ధరాత్రి 2 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 9 గంటల వరకు నోటీస్ టు ఎయిర్‌మెన్(నోటమ్) అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

వివరాలు 16లో ▸

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84	ఫారం దగ్గర లైవ్ బర్డ్ 157 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో 267 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్ 184 కిలో	స్కిన్ లెస్ 304 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇప్పటికే అప్పుల్లో, ప్రజలను నమ్మించి మోసం చేయడంలో నెంబర్.1 మనమే సార్!

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల ప్రైవేటీకరణను

రద్దు చేయండి

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ

- ప్రైవేటీకరణ చట్ట విరుద్ధం.. ప్రభుత్వ విధానాన్ని అడ్డుకోండి
- ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయండి
- స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
- వైఎస్సార్‌సీపీ వ్యాజ్యం కోటిమంది ప్రజల గొంతుక.. ప్రైవేటీకరణతో అంతిమంగా ప్రజలు తీవ్రంగా నష్టపోతారు
- వైద్యం, వైద్య విద్యను బాబు ప్రభుత్వం ఖరీదైనదిగా మార్చేస్తోంది.. వైద్య కళాశాలల్లో రూ.వేలల్లో ఉన్న ఫీజులు రూ.లక్షల్లోకి వెళ్తాయి
- హైకోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

5 లో

10 లో

పచ్చని సుక్షేత్రమే కానీ..

పిన్ను పీకేసిన గ్రనేడ్

కోనసీమ అంటే.. అందమైన ప్రాంతం. కానీ, అందరికీ తెలియని కోనసీమ మరొకటుంది. చిన్న శబ్దానికే చిగురుటాకులా వణికిపోయే ప్రాంతం అది.. దానికి కారణం చమురు, సహజవాయువు నిక్షేపాలు.. కొబ్బరి అందాల వెనుక ఉన్న కానరాని కష్టాలపై కథనం.

పారని రాజకీయ కుట్ర

- రాజకీయ కక్షతో 'సాక్షి' ఫోటోగ్రాఫర్‌తో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకుడిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిన పోలీసులకు తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం గట్టి షాక్ ఇచ్చింది. వారిద్దరి రిమాండ్‌ను బుధవారం రాత్రి న్యాయస్థానం తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేసింది.

3లో

మిమ్మల్ని నమ్మి భూములెలా ఇవ్వాలి?

రాజధాని భూసమీకరణపై వడ్డమాను గ్రామసభలో రైతుల నిలదీత

- గతంలో రోడ్డున పడినా పట్టించుకోలేదంటూ మంత్రి నారాయణపై ఆగ్రహం.. మూడేళ్లలో ప్లాట్లు అభివృద్ధి చేయకపోతే మా పరిస్థితి ఏంటి?
- లేదంటే ఎకరాకు రూ.5 లక్షలు పరిహారమిస్తారా?
- ప్రభుత్వం నుంచి హక్కులు సాధించుకునేలా అగ్రిమెంట్ చేయండి.. ఎకరాకు రూ.60 వేల కౌలు, రిటర్నబుల్ ప్లాట్ల సైజ్ పెంచాలని పట్టు

16 లో

మంత్రి నారాయణ, టీడీపీ ఎమ్మెల్యే శ్రావణ్‌ను నిలదీస్తున్న రైతులు

క్లుప్తంగా...

లిఫ్టుతో సీమ నీటి అవసరాలు తీర్చాల్సిందే

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

సాక్షి, అమరావతి: రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల ప్రయోజనం లేదన్న మంత్రి నిమ్మలపై ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రాయలసీమ నీటి అవసరాలు తీర్చాల్సిందేనని చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. నిత్యం కరువుతో అల్లాడుతున్న రాయలసీమ జిల్లాల సాగునీటి అవసరాలను తీర్చేందుకు సీమ ఎత్తిపోతల పథకం చేపట్టారన్నారు. అలాంటి ప్రాజెక్టును అవసరం లేదని చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. ఈ ప్రకటన ఎందుకు చేశారు? ఏ నిపుణులు మీకు సమాచారమిచ్చారు? దానికి ప్రాతిపదికేమిటో స్పష్టం చేయాలని మంత్రిని డిమాండ్ చేశారు.

కౌలు రైతు బలవన్మరణం

భిక్షాలు మృతదేహం

సత్తెనపల్లి: కౌలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం పల్నాడు జిల్లాలో జరిగింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామానికి చెందిన బొలమాల భిక్షాలు (38) గ్రామంలో 6 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగు చేశాడు. రూ.10 లక్షల మేర పంటల సాగుకు అప్పు చేశాడు. దిగుబడి సరిగ్గా రాకపోవడం, పండించిన పంట ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లేకపోవడంతో అప్పులు తీరే మార్గం కనిపించక భిక్షాలు దిగులు చెందేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం తాను కౌలు చేస్తున్న పొలంలోనే గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుంటూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బిల్లులు పెట్టుకోకుండా అడ్డుకోవడం శోచనీయం

ప్రభుత్వంపై సర్పంచుల సంఘం మండిపాటు

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీల్లో సర్పంచులు చేసిన పనులకు ఎం–బుక్ పూర్తయిన తర్వాత కూడా బిల్లులను పెట్టుకోవడాన్ని ప్రభుత్వం అడ్డుకోవడంపై సర్పంచుల సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. సంఘం ప్రతినిధులు బుధవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సుధాకర్‌బాబును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు బిల్లులు పెట్టుకోకుండా అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు కొన్ని గ్రామ పంచాయతీల్లో అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఆయా గ్రామపంచాయతీల్లో అత్యవసరమైన పనులకు బిల్లులకు పెట్టే విధంగా సహకరించాలని, ఆయా గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్ ఫ్రీజింగ్ నుంచి రిలీజ్ చేయాలని వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఐ బొమ్మ రవి బెయిల్ పిటిషన్లు కొట్టివేత

సిటీ కోర్టులు (హైదరాబాద్): పైరసీ వెబ్‌సైట్ 'ఐ బొమ్మ' రవి బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. సినిమా పైరసీ కేసుల్లో ప్రధాన నిందితుడైన రవిపై సైబర్ క్రైమ్ పోలీసులు మొత్తం 5 కేసులు నమోదు చేశారు. ఈ కేసులపై రవి తరఫు న్యాయవాది సీవీ శ్రీనాథ్.. నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేసి వాదనలు వినిపించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. రవికి విదేశాల్లో పౌరసత్వం కూడా ఉన్నందున, బెయిల్ ఇస్తే దేశం దాటిపోయే అవకాశం ఉందని కోర్టుకు గుర్తు చేశారు. ఈ ఐదు బెయిల్ పిటిషన్లపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు బుధవారం వాటిని కొట్టి వేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది.

సీమ ఎత్తిపోతలపై శాపనార్థాలు!

సరైన అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రారంభించారంటూ చంద్రబాబు అక్కసు

పోలవరం సాక్షిగా బడాయి మాటలు.. పచ్చి అబద్ధాలు

తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యలను కనీసం ఖండించని బాబు

ఏకాంత భేటీలో ఇద్దరి మధ్య ఏం ఒప్పందం కుదిరిందో చెప్పకుండా గద్దింపు

- **శ్రీశైలంలో 841 అడుగులకు దిగువన నీటిని వాడుకోవడానికి సీమ ఎత్తిపోతల చేపట్టారంటూ నిష్ఠూరం.. సీమకు మేలు జరిగితే బాబుకొచ్చిన నష్టమేమిటని రైతుల ప్రశ్న**
- **881 అడుగుల కంటే ఎత్తులో శ్రీశైలం నీళ్లు నిల్వ ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం**

పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి జీవనాడి పోలవరం సాక్షిగా... రాయలసీమ ఎత్తిపోతలపై సీఎం చంద్రబాబు తన కడుపు మంట, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.3,528 కోట్లు మంజూరు చేసి సరైన అనుమతులు లేకుండా ప్రారంభించారని విమర్శించారు. అనుమతులు లేని ప్రాజెక్టును మొదలుపెట్టి విచ్చలవిడిగా, అడ్డగోలుగా పనులు చేశారన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 841 అడుగుల దిగువన కేవలం 34 టీఎంసీలే నిల్వ ఉంటాయని.. అందులో రాష్ట్ర వాటా 22 టీఎంసీలని.. ఆ నీటిని వాడుకోవడానికి మల్యాల, ముచ్చుమర్రి (హంద్రీ–నీవా) ఎత్తిపోతల ఉందంటూ దబాయించారు. ఆ నీటిలో రోజుకు 3 టీఎంసీలను మళ్లించేలా, పర్యావరణ అనుమతి తీసుకోకుండానే రాయలసీమ ఎత్తిపోతల చేపట్టారని.. దానిపై ఎవరో ఎన్జీటీలో కేసు వేస్తే పనులు ఆపేయాలని తీర్పు ఇచ్చిందని.. దాంతో పనులు ఆగిపోయాయంటూ తనకు అలవాటైన రీతిలో చంద్రబాబు పచ్చి అబద్ధాలు వల్లె వేశారు. పోలవరం పనులను బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించిన సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని చంద్రబాబు చెప్పారు. వచ్చే ఫిబ్రవరి నాటికి డయాఫ్రమ్‌వాల్ పూర్తవుతుందని, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2 పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నాయని, హంద్రీ–నీవా ద్వారా అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చామని, కుప్పం వరకు నీళ్లు పారించామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కాగా సీఎం చంద్రబాబునాయుడుతో ఏకాంతంగా (క్లోజ్ రూమ్‌లో) సమావేశమై రాయలసీమ ఎత్తిపోతల పనులు ఆపేయించా..! ఆ పనులు ఆగిపోయాయో లేదో అన్నది తెలుసుకోవాలంటే తనిఖీ చేసుకోవచ్చంటూ తెలంగాణ అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలను ఇంతవరకూ చంద్రబాబు ఖండించకపోవడం గమనార్హం. ఆ సమావేశంలో ఏం ఒప్పందం కుదిరిందన్నది వెల్లడించలేదు. దీంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పింది నిజమేనని చంద్రబాబు అంగీకరించారన్నది స్పష్టమవుతోంది. దీన్ని బట్టి.. రాయలసీమ ఎత్తిపోతల పూర్తయితే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే ఈర్ష్యతో.. పనిగట్టుకుని ఆ ఎత్తిపోతల పనులను చంద్రబాబు ఆపేయించారని సాగునీటిరంగ నిపుణులు తేల్చిచెబుతున్నారు.

రాయలసీమ, నెల్లూరు వరదాయిని..

- శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు కాగా కనీస నీటి మట్టం 854 అడుగులు. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ఆయకట్టుకు సాగునీరు, చెన్నైకి తాగునీటిని శ్రీశైలం జలాశయంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారానే నీటిని విడుదల చేయాలి.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను శ్రీశైలం ప్రాజెక్టులో 841 అడుగుల నీటి మట్టం వద్ద అమర్చారు. శ్రీశైలంలో నీటి మట్టం 881 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు రోజుకు గరిష్ఠంగా 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుంది. అదే 854 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 7 వేలు, 841 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 2 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించే వీలుంది. ఇక శ్రీశైలంలో 841 అడుగుల కంటే దిగువన నీటి మట్టం ఉంటే చుక్క నీటిని కూడా తీసుకోలేం.
- విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబు సర్కార్.. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాయి. కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశించే వరకూ ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలాన్ని ఏపీ ప్రభుత్వం.. నాగార్జునసాగర్‌ను తెలంగాణ సర్కార్ నిర్వహించాలని నాడు కేంద్రం నిర్దేశించింది. కానీ.. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రం తమ భూభాగంలో ఉందంటూ అప్పట్లో తెలంగాణ తన అధీనంలోకి తీసుకున్నప్పటికీ చంద్రబాబు అభ్యంతరం చెప్పలేదు. ఇంతలో ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ సర్కార్‌కు సీఎం చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు.
- ఇదే అదునుగా తెలంగాణ సర్కార్ కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని 25 నుంచి 40 టీఎంసీలకు పెంచుతున్నా.. అనుమతి లేకుండా శ్రీశైలం నుంచి రోజుకు 2 టీఎంసీలు తరలించేలా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల చేపట్టినా నాడు బాబు సర్కార్ నోరు మెదపలేదు. ఫలితంగా శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రం నుంచి 4 టీఎంసీలు, కల్వకుర్తి నుంచి 0.4 టీఎంసీ, ఎస్సెల్బీసీ నుంచి 0.5 టీఎంసీ, పాలమూరు–రంగారెడ్డి–డిండి ఎత్తిపోతల ద్వారా 2 టీఎంసీలు వెరసి శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటి మట్టం నుంచే రోజుకు 6.95 టీఎంసీలు తరలించే సామర్థ్యాన్ని తెలంగాణ సాధించుకుంది. శ్రీశైలం నుంచి 800 అడుగుల స్థాయిలో హంద్రీ –నీవా ద్వారా కేవలం 0.33 టీఎంసీలు తరలించే సామర్థ్యం మాత్రమే ఏపీకి ఉంది.
- శ్రీశైలం దిగువన తాగు, సాగునీటి అవసరాలు ఉన్నప్పుడు కృష్ణా బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే నీటిని విడుదల చేస్తూ రెండు రాష్ట్రాలు విద్యుదుత్పత్తి చేయాలన్నది నిబంధన. కానీ.. 2014 నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ప్రారంభం కాకున్నా సరే.. డెడ్ స్టోరేజీలో ఉన్న నీటిని శ్రీశైలం దిగువన ఎలాంటి నీటి అవసరాలు లేనప్పటికీ ఎడమ గట్టు కేంద్రంలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ.. దిగువకు నీటిని తరలిస్తూ శ్రీశైలాన్ని ఖాళీ చేస్తూ రాయలసీమ రైతుల హక్కులను హరిస్తున్నా చంద్రబాబు సర్కార్ నోరు మెదపలేదు. ఇక శ్రీశైలంలోకి వరద ప్రవాహం ప్రారంభమయ్యాక కూడా తెలంగాణ సర్కార్ వచ్చింది వచ్చినట్టుగా నీళ్లను తరలించడం వల్ల నీటి మట్టం 881 అడుగులకు చేరడం గగనంగా మారింది. ఈ నేపథ్యంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీళ్లందక.. తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ఆయకట్టులో 2014–19 మధ్య ఏటా పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణా బేసిన్‌లో 2015–16లో వర్షాభావ పరిస్థితుల వల్ల శ్రీశైలానికి 58.69 టీఎంసీల ప్రవాహమే రాగా.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు కేవలం 0.95 టీఎంసీని మాత్రమే సరఫరా చేశారు. ఆ ఏడాది గుక్కెడు తాగునీటి కోసం కటకటలాడటమే అందుకు నిదర్శనం.
- ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తడారిన గొంతులను తడిపేందుకు.. బచావత్ ట్రిబ్యునల్ ద్వారా హక్కుగా దక్కిన నీటిని వాడుకుని ఎండిపోతున్న పంటలను రక్షించడం కోసం.. తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసేలా రూ.3,825 కోట్లతో 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ ఎత్తిపోతల రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు వరదాయిని అవుతుందని సాగునీటి రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు.
- చంద్రబాబు చెబుతున్నట్లుగా శ్రీశైలం జలాశయంలో 841 అడుగుల దిగువన నిల్వ ఉండే 34 టీఎంసీలను తరలించడానికి కాదు.. 841 అడుగుల ఎగువ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువకు మూడు టీఎంసీలను ఎత్తిపోసి.. మనకు హక్కుగా దక్కిన వాటా జలాలను పూర్తి స్థాయిలో వాడుకోవడానికి చేపట్టిందే రాయలసీమ ఎత్తిపోతల.

అడుగడుగునా మోకాలడ్డు..

రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరొస్తుందోననే ఈర్ష్యతో.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీడీపీ సానుభూతిపరుడు గవినోళ్ల శ్రీనివాస్ ద్వారా ఎన్జీటీ (చెన్నై) బెంచ్‌లో చంద్రబాబు రిట్ పిటిషన్ దాఖలు చేయించారని.. అదే వ్యక్తితో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పశ్చిమ మండలాల రూపురేఖలను మార్చడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన ముదివేడు, నేతిగుంటపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల పనులపైనా ఎన్జీటీలో ఫిర్యాదు చేయించారని సాగునీటిరంగ నిపుణులు, రైతులు అప్పట్లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ఎత్తిపోతలతోపాటు ఆ మూడు రిజర్వాయర్ల నిర్మాణం వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని ఎన్జీటీలో పిటిషనర్ వాదించారు. అయితే తెలుగుగంగ, గాలేరు–నగరి, ఎస్సార్బీసీలకు పర్యావరణ అనుమతి ఉందని.. ఆ ప్రాజెక్టులకు నీటిని అందించడానికి చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి అవసరం లేదని వైఎస్ జగన్ ప్రభుత్వం నాడు ఎన్జీటీకి స్పష్టం చేసింది. కానీ.. పర్యావరణ అనుమతి తీసుకుని, ఆ పనులు చేపట్టాలంటూ 2020 అక్టోబర్ 29న ఎన్జీటీ ఆదేశించింది. దీంతో పర్యావరణ అనుమతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తూనే.. రాయలసీమ, నెల్లూరు, చెన్నై తాగునీటి అవసరాల కోసం సీమ ఎత్తిపోతల పనులను కొనసాగించింది. ఈ క్రమంలో రూ.990 కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు. కానీ.. గతేడాది ఫిబ్రవరి 27న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నిర్వహించిన ఈఏసీ సమావేశంలో రాయలసీమ ఎత్తిపోతలను తొలి దశలో తాగునీటి అవసరాల కోసం చేపడుతున్నామని.. మలి దశలో పర్యావరణ అనుమతి తీసుకుంటామని చంద్రబాబు సర్కారు స్పష్టం చేసి ఉంటే ఆ ఎత్తిపోతల పనులకు ఎలాంటి అడ్డంకి ఉండేది కాదని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే ఈర్ష్యతోనే ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను ఈఏసీ సమావేశంలో చంద్రబాబు సర్కార్ చెప్పలేదని స్పష్టం చేస్తున్నారు.

ఒక్క ప్రాజెక్టూ కట్టకుండా బడాయి మాటలు..

ఉమ్మడి రాష్ట్రంలో 1995–99, 1999–2004.. విభజన తర్వాత 2014–19, మళ్లీ ఇప్పుడు.. మొత్తం నాలుగు సార్లు సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్నారు. దాదాపు 16 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టు డిజైన్ చేయలేదు.. నిర్మాణాన్ని చేపట్టలేదు.. పూర్తి చేసి జాతికి అంకితం చేయలేదు అంటూ జలవనరుల శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన రిటైర్డు ఇంజనీర్–ఇన్–చీఫ్‌లు, చీఫ్ ఇంజనీర్లు స్పష్టం చేస్తున్నారు. కానీ.. రాష్ట్రంలో 90 శాతం ప్రాజెక్టులు తానే కట్టానంటూ సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు వల్లె వేస్తూ బడాయి మాటలు మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో జలయజ్ఞం కింద ఒకేసారి రూ.లక్ష కోట్ల వ్యయంతో పోలవరం, పులిచింతల, గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తోటపల్లి, పుష్కర, తాడిపూడి, వంశధార స్టేజ్–2 ఫేజ్–2 వంటి భారీ, సూరంపాలెం, భూపతిపాలెం వంటి మధ్య తరహా 83 ప్రాజెక్టులు చేపట్టి.. తాను మరణించే నాటికే 44 ప్రాజెక్టులను పూర్తి చేసి, జాతికి అంకితం ఇచ్చి చరిత్రలో నిలిచిపోయారని ఇంజనీర్లు, సాగునీటి రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. జలయజ్ఞంలో భాగంగా దుర్భిక్ష రాయలసీమ, నెల్లూరు జిల్లాలను సస్యశ్యామలం చేయడం కోసం 2005లో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచినప్పుడు.. దాన్ని నిరసిస్తూ, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రకాశం బ్యారేజీపై దేవినేని ఉమాహేశ్వరరావుతో తెలంగాణ ప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో మాజీ మంత్రి నాగం జనార్ధనరెడ్డితో చంద్రబాబు ధర్నాలు చేయించారని గుర్తు చేస్తున్నారు. ఇక తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ నిర్మాణంలో లోపాల వల్ల మట్టికట్టలో లీకేజీలు ఏర్పడటంతో 2020 వరకూ ఎన్నడూ నాలుగైదు టీఎంసీలకు మించి నిల్వ చేసిన దాఖలు లేవు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రూ.90 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మించి, మట్టికట్ట లీకేజీలకు అడ్డుకట్ట వేసి 2020 నుంచి బ్రహ్మంసాగర్‌లో పూర్తి సామర్థ్యం మేరకు 17.74 టీఎంసీలను నిల్వ చేస్తే.. ఆ పని తాను చేసినట్లుగా సీఎం చంద్రబాబు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందంటూ ఆ పనులను పర్యవేక్షించిన రిటైర్డు అధికారి ఒకరు విస్తుపోయారు. మహానేత వైఎస్ నిర్మించిన గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు వైఎస్ జగన్ 2019లో రూ.వెయ్యి కోట్లతో పునరావాసం కల్పించి.. ఆ రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం మేరకు 26.85 టీఎంసీలను ప్రతి ఏటా నిల్వ చేస్తే.. ఆ పని తాను చేసినట్లుగా సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడటం గమనార్హం. ఇక మహానేత వైఎస్సార్ పూర్తి చేసిన పుష్కర, తాడిపూడి, చాగల్నాడు, కల్వకుర్తి, నెట్టెంపాడు, దేవాదుల లాంటి ఎత్తిపోతల పథకాలను తాను పూర్తి చేసినట్లుగా సీఎం చంద్రబాబు గొప్పలు చెప్పుకున్నారు. 2014–19 మధ్య చంద్రబాబు సర్కార్ పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయకుండా.. కమీషన్ల కోసం గోదావరి కుడి గట్టుపై పట్టిసీమ, ఎడమ గట్టుపై పురుషోత్తపట్నం ఎత్తిపోతలను చేపట్టింది. ఆ రెండు ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతులు తీసుకోలేదు. ఇక చింతలపూడి ఎత్తిపోతల తొలిదశకు 2008లో నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం పర్యావరణ అనుమతి తీసుకుంది. కానీ.. 2018లో ఆ ఎత్తిపోతల సామర్థ్యాన్ని చంద్రబాబు సర్కార్ పెంచింది. అయితే దానికి పర్యావరణ అనుమతి తీసుకోలేదు. ఈ మూడు ఎత్తిపోతల పథకాలపై ఎన్జీటీలో కేసులు దాఖలయ్యాయి. పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిన ఆ మూడు ఎత్తిపోతల పథకాలపై జరిమానా విధిస్తూ 2021 డిసెంబర్ 2న ఎన్జీటీ తీర్పు ఇచ్చింది. పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై రూ.24.56 కోట్లు, పట్టిసీమ ఎత్తిపోతలపై రూ.24.9 కోట్లు, చింతలపూడి ఎత్తిపోతలపై రూ.73.6 కోట్లను జరిమానాగా విధించింది.

జగన్ హయాంలోనే సీమ సుభిక్షం..

- నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పులిచింతల నిర్వాసితులకు పరిహారం చెల్లించింది. తెలంగాణకు పరిహారం చెల్లించి పూర్తి స్థాయిలో అంటే 45.77 టీఎంసీలను పులిచింతలలో నిల్వ చేసి కృష్ణా డెల్టాలో రెండు పంటలకు నీళ్లందించి చరిత్ర సృష్టించింది.
- తెలుగుగంగ లింక్ కెనాల్‌ను ఆధునికీకరించి.. వెలుగోడు రిజర్వాయర్‌ను సకాలంలో గరిష్ఠ సామర్థ్యం 16.95 టీఎంసీలను చేర్చి నింపింది. రూ.600 కోట్లతో తెలుగుగంగ ప్రధాన కాలువకు లైనింగ్ చేసి.. డిజైన్ మేరకు ప్రవాహ సామర్థ్యాన్ని 5 వేల క్యూసెక్కులకు పెంచింది.
- బ్రహ్మంసాగర్ మట్టికట్టకు రూ.90 కోట్లతో డయాఫ్రం వాల్‌ను వేసి లీకేజీలకు అడ్డుకట్ట వేసి దాని పూర్తి సామర్థ్యం మేరకు 17.74 టీఎంసీలను నిల్వ చేసింది.
- తెలుగుగంగలో అంతర్భాగమైన సోమశిల రిజర్వాయర్‌లో గరిష్ఠ సామర్థ్యం మేరకు 78 టీఎంసీలు, కండలేరు రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం మేరకు 68.3 టీఎంసీలను నింపి ఐదేళ్లూ ఆయకట్టులో రెండు పంటలకూ నీళ్లందించింది.
- గాలేరు–నగరి వరద కాలువలో అవుకు వద్ద రెండు సొరంగాలను పూర్తి చేసి.. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లను పరిహారంగా చెల్లించి, వారికి పునరావాసం కూడా కల్పించి గరిష్ఠ సామర్థ్యం మేరకు 26.85 టీఎంసీలను నిల్వ చేసింది.
- చిత్రావతి రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.250 కోట్లను పరిహారంగా చెల్లించి, పునరావాసం కల్పించి.. గరిష్ఠ సామర్థ్యం మేరకు పది టీఎంసీలు నిల్వ చేసింది.
- ఇలా ఐదేళ్లూ రిజర్వాయర్లను సకాలంలో నింపి.. రాయలసీమను సస్యశ్యామలం చేసింది.

కొత్తగా అనేక పనులు చేపట్టిన జగన్ సర్కార్...

మారిన వాతావరణ పరిస్థితుల్లో వర్షాలు కురిసే రోజులు తగ్గాయి. శ్రీశైలానికి గరిష్ఠంగా వరద వచ్చినప్పుడు దాన్ని ఒడిసి పట్టుకునే సామర్థ్యం కాలువలకు లేదు. దీంతో కృష్ణా వరద జలాలను గరిష్ఠ స్థాయిలో ఒడిసి పట్టి శ్రీశైలానికి వరద వచ్చే 30–40 రోజుల్లోనే రాయలసీమ, నెల్లూరు ప్రాజెక్టులను నింపేలా వైఎస్సార్‌సీపీ హయాంలో కాలువల సామర్థ్యం పెంచే పనులు, అవసరమైన చోట్ల కొత్త ప్రాజెక్టుల పనులను చేపట్టింది.

- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచే పనులు.. శ్రీశైలం కుడి గట్టు ప్రధాన కాలువ సామర్థ్యాన్ని, గాలేరు–నగరి వరద కాలువ, తెలుగుగంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం పెంచే పనులను చేపట్టింది.
- కేసీ కెనాల్ ఆయకట్టును స్థిరీకరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజోలి, జోలదరాసి రిజర్వాయర్ల పనులను చేపట్టింది.
- తెలుగుగంగ ఆయకట్టుకు సమృద్ధిగా నీటిని అందించడానికి కుందూ ఎత్తిపోతల పనులను చేపట్టింది.
- గాలేరు–నగరి సుజల స్రవంతి–హంద్రీ–నీవా సుజల స్రవంతిలను అనుసంధానం చేస్తూ ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు పనులు చేపట్టింది.
- హంద్రీ–నీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3,850 నుంచి 6,300 క్యూసెక్కులకు పెంచే పనులను చేపట్టింది.
- కానీ.. చంద్రబాబు సర్కార్ ఆ పనులన్నింటినీ ఆపేసి రాయలసీమకు వెన్నుపోటు పొడిచింది.

రాయలసీమకు వెన్నుపోటే

రాయలసీమ లిఫ్ట్ స్కీం అనవసరం అనడం దారుణం

- **సీమకు నీరు రాకుండా అడ్డుపడిన చంద్రబాబు రాయలసీమ ద్రోహి**
- **బాబు ప్రభుత్వంలో ఒక్క ప్రాజెక్టు పనులూ జరగలేదు**
- **అయినా రాయలసీమ ప్రాజెక్టులకు రూ.8 వేల కోట్లు ఖర్చు చేశారట!**
- **కమీషన్ల కోసం పాత బిల్లులు చెల్లించి, ఆ పనులు చేశామని చెప్పడం సిగ్గుచేటు**
- **అఖిలపక్ష సమావేశంలో పనులు, ఖర్చుల వివరాలు చూపండి**
- **మంత్రి నిమ్మలది అవివేకం, అవగాహన రాహిత్యం**
- **వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి ధ్వజం**



సాక్షి, అమరావతి: రాయలసీమ లిఫ్ట్ స్కీం అనవసరం అని అనడమంటే రాయలసీమకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు పొడవడమే అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి స్పష్టంచేశారు. రాయలసీమకు నీరు రాకుండా అడ్డుపడిన చంద్రబాబు ముమ్మాటికీ రాయలసీమ ద్రోహి అని చెప్పారు. సతీష్‌కుమార్ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు పనులు కూడా చేపట్టలేదని చెప్పారు. అయినా రాయలసీమ ప్రాజెక్టులపై రూ.8 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేవలం కమీషన్ల కోసం పాత బిల్లులు చెల్లించి, వాటిని వారే చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నిజంగా పనులు చేసి ఉంటే, అఖిలపక్షం ఏర్పాటు చేసి ఆ పనులు, ఖర్చుల వివరాలు అన్నీ చూపాలని, చంద్రబాబు రాయలసీమ ద్రోహి కాదని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనపై చంద్రబాబు వివరణ ఇవ్వాలని చెప్పారు. 'రాయలసీమ అవసరాలు గుర్తించిన వైఎస్ జగన్ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ స్కీంను చేపట్టింది. 2024లో ప్రభుత్వం దిగిపోయే వరకు రాయలసీమ లిఫ్ట్ స్కీం పనులను శరవేగంగా కొనసాగించింది. రూ.795 కోట్ల బిల్లులు కూడా చెల్లించింది. ఆ తర్వాత వచ్చిన సీఎం చంద్రబాబు.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై రాయలసీమ లిఫ్ట్ స్కీంను ఆపేశారు. అంతే తప్ప, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపిస్తున్నట్టు పనులేవీ 2020లో ఆగిపోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే వరకు పనులు నిర్విరామంగా సాగాయి. 85 శాతం పనులు పూర్తయ్యాయి. కేవలం పంపులు బిగించడం మాత్రమే మిగిలి ఉంది. ఎం బుక్ (మెజర్‌మెంట్ బుక్) పరిశీలిస్తే అన్ని విషయాలు తెలుస్తాయి. అయినా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయడం దుర్మార్గం' అని చెప్పారు.

ఆ ప్రాజెక్టుతో చంద్రబాబుకే లబ్ధి

'రాయలసీమ లిఫ్ట్ స్కీంపై మంత్రి నిమ్మల రామానాయుడి మాటలు ఆయన అవివేకానికి, అవగాహన లేమికి నిదర్శనం. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంస్థకు అవసరం లేని పనులు అప్పగించి బిల్లులు చెల్లించారని మంత్రి ఆరోపిస్తున్నారు. గాలేరు – నగరి (జీఎన్ఎస్ఎస్), హంద్రీ – నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) లింక్ పనులు రాయలసీమకు ఎంతో ఉపయోగకరం. మంత్రి వస్తే దాన్ని చూపడానికి మేము సిద్ధం. కుప్పంకు నీరివ్వాలంటే 620 కి.మీ దూరం నుంచి ఇవ్వాలి. అది చాలా కష్టం. కానీ, నాడు సీఎం వైఎస్ జగన్ చేపట్టిన జీఎన్ఎస్ఎస్ – హెచ్ఎన్ఎస్ఎస్ లింక్ ప్రాజెక్టు పూర్తయితే 120 కిలోమీటర్ల నుంచి నీరు లిఫ్ట్ చేస్తే సరిపోతుంది. అదే కాకుండా చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల పరిధిలోని ఎత్తయిన ప్రాంతాలకు నీరు సులువుగా చేరిపోతుంది. అందుకే ఆ ప్రాజెక్టు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రూ.1100 కోట్లు ఖర్చు చేశారు. ఆ ప్రాజెక్టు పూర్తయితే ఎక్కువ లబ్ధి పొందేది కూడా చంద్రబాబే' అని తెలిపారు. 'తెలంగాణ అక్రమ ప్రాజెక్టులతో శ్రీశైలం రిజర్వాయర్‌లో 800 అడుగుల ఎత్తు నుంచే నీటిని తరలిస్తుంటే, రాయలసీమ రైతులు బతకొద్దా? వారికి రాయలసీమ లిఫ్ట్ స్కీం మినహా వేరే ప్రత్యామ్నాయం లేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందన్న అక్కసుతో నాడు కూడా రేవంత్ రెడ్డితో కలిసి చంద్రబాబు కుట్రలు చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కేసులు వేయించి పనులు అడ్డుకున్నాడు' అని సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు.

'సీమ' ఎత్తిపోతలపై నోరు విప్పాలి!

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కడప సెవెన్ రోడ్స్: సీఎం చంద్రబాబుతో క్లోజ్డ్ రూములో మాట్లాడి రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపించానంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఈ ప్రాంత ప్రజల్లో ఆందోళన, అభద్రతా భావం నెలకొందని, ఈ అంశంపై ప్రభుత్వం నోరు విప్పాలని కడప వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి మంత్రి సవిత అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో 'సీమ' ఎత్తిపోతలపై ఎంపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ శాసనమండలి సభ్యులు పి.రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ దాసరి సుధలు సైతం అవినాష్‌తో శృతి కలిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దీంతో.. మంత్రితోపాటు అధికార పక్ష ఎమ్మెల్యేలు సమాధానం చెప్పలేక ఎదురుదాడికి దిగారు. వాగ్వాదాలు జరగడంతో అధికార పక్షం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు సమావేశాన్ని బహిష్కరించారు.

తెలంగాణ అక్రమంగా నీటి తరలింపు..

వైఎస్ అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పాదన, పాలమూరు–రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాలతో రోజూ నీటిని అక్రమంగా తరలిస్తోందన్నారు. దీని వల్ల శ్రీశైలంలో 854 అడుగుల నీటిమట్టం చేరాలంటే కష్టమవుతుందన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు వరద రోజుల్లోనే రాయలసీమ ప్రాజెక్టులకు అవసరమైన నీటిని డ్రా చేసుకునేందుకు వీలుగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచారన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం ఎడమ కాలువ నుంచి అక్రమంగా ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తోందన్నారు. దీంతో జగన్ సీఎంగా ఉన్న సమయంలో 800 అడుగుల నుంచే రోజుకు 3 టీఎంసీల చొప్పున సీమ ప్రాజెక్టులకు నీటిని తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని తెలిపారు. చంద్రబాబు నిర్వాకంవల్ల గత మార్చిలో కేంద్రం ఈ పథకానికి పర్యావరణ అనుమతులను తిరస్కరించిందని.. ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉంటున్న చంద్రబాబు తలుచుకుంటే అనుమతులు నిమిషాల్లో వస్తాయన్నారు. కానీ, సీమ ఎత్తిపోతల వల్ల ఉపయోగంలేదంటూ ఇరిగేషన్ మంత్రి నిమ్మల చేసిన వ్యాఖ్యలు బుద్ధిలేనివిగా ఎంపీ కొట్టిపారేశారు.

క్లుప్తంగా...

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఇటీవల జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ), సీఆర్‌డీఏ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేయనుంది.

జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్‌పర్సన్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థల చైర్‌పర్సన్లను నియమిస్తూ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. పీరికట్ల విఠల్ రావు (శ్రీకాకుళం), డొక్కాడ రామకృష్ణ (విజయనగరం), వన్నంరెడ్డి సతీష్ కుమార్ (విశాఖ), భూపతి రాజు ఈశ్వర్ రాజువర్మ (తూర్పు గోదావరి), జుత్తిగ నాగరాజు (పశ్చిమ గోదావరి), ఎంఎస్ బేగ్ (కృష్ణా), వందనా దేవి (గుంటూరు), సుచిత్ర ముప్పవరపు (ప్రకాశం), శాంత కుమారి (నెల్లూరు), రెడ్డివారి గురవారెడ్డి (చిత్తూరు), భాను ప్రకాష్ దాసరి (కడప), తుగ్గలి నాగేంద్ర (కర్నూలు), వడ్డె వెంకట్ (అనంతపురం) చైర్ పర్సన్లుగా నియమితులయ్యారు.

99 పైసలకే భూములు ఇస్తే తప్పేంటి?: లోకేశ్

మహారాణిపేట: 'పెద్ద కంపెనీలకు 99 పైసలకే భూమి ఇస్తే తప్పేంటి? ఫార్చ్యూన్ 500 కంపెనీలకు భూములు కేటాయిస్తాం.. అటువంటి కంపెనీలకు గజం కాదు.. ఎకరం కాదు.. మొత్తం ఇస్తాం.. తప్పేంటి? అని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. ఉద్యోగాలు కల్పించడానికే తక్కువ ధరలకు భూములు ఇస్తున్నామని.. గత ప్రభుత్వం చేయలేని పని తాము ఇప్పుడు చేస్తున్నామని ఆయన సమర్థించుకున్నారు. బుధవారం ఆయన విశాఖ జిల్లా కోర్టు బయట మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, అపోహలు వద్దని, స్టీల్ ప్లాంట్ లాభాల్లో నడవాలని, అందుకు అందరూ సహకరించాలని అన్నారు. విశాఖ ఉక్కులో ఒక్క ఎకరం కూడా ప్రైవేట్ సహా ఇతర అవసరాలకు కేటాయించడం లేదన్నారు. సీపీఎంకు స్క్రిప్ట్ ఎక్కడి నుంచి వచ్చిందో వాళ్లే చెప్పాలని, క్రెడిట్ కోసం ఎవరూ పోరాటాలు చేయడం లేదన్నారు. కాగా, రాజకీయ లబ్ధి కోసమే కొంతమంది జల వివాదం సృష్టిస్తున్నారని, ఏపీలో పలు ప్రాజెక్టు కడుతున్నామని, తెలంగాణ దాటి నీరు ఆంధ్రాకు వచ్చిన తర్వాత తీసుకుంటున్నామని లోకేశ్ తెలిపారు. తెలంగాణ వాటాకు ఎక్కడా చిల్లు పెట్టడం లేదు కదా..! కనీసం కామన్ సెన్స్‌తో ఆలోచించాలని అన్నారు.

'ఏపీఆర్ఏపీఎల్' బోర్డ్ పునర్వ్యవస్థీకరణ

సీఈఓగా ప్రవీణ్‌చంద్

సాక్షి, అమరావతి: ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్ (ఏపీఆర్ఏపీఎల్) బోర్డును ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. సంస్థ చైర్మన్‌గా సీఎస్ కె.విజయానంద్‌కు బాధ్యతలు అప్పగించింది. మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) సీఎండీ శివశంకర్ తోలేటి, డైరెక్టర్లుగా ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కేవీ కిశోర్‌కుమార్, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎన్‌వీ రమణమూర్తిని నియమించింది. కాగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు అవకాశం కల్పించింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీజు బకాయిలివ్వండి మహాప్రభో

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ లేఖలను విడుదల చేశాయి. కనీసం సంక్రాంతి పండగకు ఉద్యోగులకు, అధ్యాపకులకు జీతాలివ్వలేకపోతున్న దుస్థితిని ప్రభుత్వం కల్పించిందంటూ నిరసన తెలిపాయి. గత సెప్టెంబర్‌లో విడతల వారీగా కళాశాలలకు రావాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఆ హామీని గాలికొదిలేసిందని మండిపడ్డాయి. 9 క్వార్టర్లకు సంబంధించి సుమారు రూ.6,300 కోట్ల బకాయిలున్నట్లు తెలిపాయి. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపించాయి. ఫీజు క్యాలెండర్‌ను తేదీలతో ప్రకటిస్తామని చెప్పి ముఖం చాటేస్తుండటంపై మండిపడ్డాయి. ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ అధికారులు, పట్టభద్రుల ఎమ్మెల్సీలతో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ గోడును ఆలకించేవారు కనిపించలేదని అసహనాన్ని వ్యక్తం చేశాయి. ఎప్పటికప్పుడు 'ఈనెల.. వచ్చేనెల..' అంటూ మాటలు దాటవేయడం తప్ప రూపాయి విడుదల చేయటం లేదని దుయ్యబట్టాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు 2026–29 విద్యాసంవత్సరాలకు ఫీజులు పెంచాలని కోరాయి. ఫీజులు నిర్ధారణ చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణాజీ, రాజకుమార్ చౌదరి, ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోయి సుబ్బారావు, గ్రంధి సత్యనారాయణ లేఖలు విడుదల చేశారు.

అప్రజాస్వామిక గెలుపు

బొమ్మనహాళ్ ఎంపీపీ ఎన్నికను హైకోర్టు దృష్టికి తీసుకెళదాం

- అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ ఎంపీటీసీలకు వైఎస్ జగన్ భరోసా
- భయపడొద్దు.. అండగా ఉంటామంటూ నల్లజర్ల కార్యకర్తలకు ధైర్యాన్నిచ్చిన వైఎస్ జగన్
- అక్రమ కేసుల విషయంలో పార్టీ న్యాయ సహాయం అందిస్తుందని వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ ఎంపీటీసీలు కలిశారు. బొమ్మనహాళ్ ఎంపీపీ ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలపై టీడీపీ నేతలు చేసిన దాడులు, దౌర్జన్యాలను వైఎస్ జగన్‌కు వారు వివరించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా జరపాల్సిన ఎన్నికను ఇలా అప్రజాస్వామిక పద్ధతిలో గెలుపొందడం దారుణమని వైఎస్ జగన్ మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, హైకోర్టు దృష్టికి తీసుకెళదామని భరోసా ఇచ్చారు. ఎంపీపీ ఎన్నిక రోజు రాయదుర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మెట్టు గోవిందరెడ్డిపై జరిగిన దాడి వివరాలను ఆయన కుమారుడు విశ్వనాథ్‌రెడ్డిని వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వ్యవస్థలను దిగజార్చేలా పోలీసుల తీరు..

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కలిశారు. నల్లజర్ల మండలం తూర్పు చోడవరంలో వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుక నిర్వహించినందుకు తమపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడమే కాకుండా.. పోలీసులు బెదిరించడాన్ని, నడిరోడ్డుపై నడిపించడాన్ని వారు పార్టీ అధినేతకు వివరించారు. వైఎస్ జగన్ స్పందిస్తూ.. వైఎస్సార్‌సీపీ క్యాడర్ ఎవరూ భయపడవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. అక్రమ కేసులు, వేధింపులపై పార్టీ లీగల్ సెల్ న్యాయ సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ దన్నుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని.. వ్యవస్థలను దిగజార్చేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరును వైఎస్ జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సమావేశంలో మాజీ హోం మంత్రి, గోపాలపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తానేటి వనిత, నల్లజర్ల మండల నాయకులు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఏలూరు జిల్లా జనసేన నేతలు

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఏలూరు జిల్లా జనసేన నేతలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. చింతలపూడి నియోజకవర్గానికి చెందిన జనసేన నేతలు బండారు గంగా సురేష్, ఆనెం సుభాష్, పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన జడ్డు దామోదర్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, చింతలపూడి ఇన్‌చార్జి కంభం విజయరాజు, నేతలు జెట్టి గురునాధరావు, బీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు, నేతలు గౌతు స్వామి, తోట రామకృష్ణ పాల్గొన్నారు.

ఆఫ్కాఫ్.. 'కొల్లు' వశం

చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు మంత్రి రవీంద్ర వర్గీయులకే

- చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రాంప్రసాద్
- పోటీకే దిగని మంత్రి అచ్చెన్నాయుడి వర్గం
- శాఖ అచ్చెన్నాయుడిది.. పట్టు మాత్రం రవీంద్రదే!

ఆఫ్కాఫ్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన యాతగిరి రాంప్రసాద్, బలసాడి రంగారావు

సాక్షి, అమరావతి : ఏపీ మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్కాఫ్) చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల విషయంలో మంత్రి కొల్లు రవీంద్ర పంతం నెగ్గించుకున్నారు. మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడి ఎత్తులను చిత్తుచేస్తూ ఆ శాఖలోనూ తాను బలపర్చిన వారికి పదవులు దక్కేలా చేశారు. వెనక్కి తగ్గేదే లేదంటూ చెప్పిన అచ్చెన్నాయుడి వర్గం చివరిక్షణంలో అసలు పోటీకే దిగలేదు. దీన్నిబట్టి చూస్తే పార్టీలోను, మత్స్యశాఖపైన ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికంటే ఎక్సైజ్‌శాఖ మంత్రి రవీంద్రకే పట్టుందంటూ తెలుగుదేశం వర్గీయులే చర్చించుకుంటున్నారు. ఆఫ్కాఫ్ చైర్మన్‌గా వైఎస్సార్ కడప జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ యాతగిరి రాంప్రసాద్, వైస్ చైర్మన్‌గా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమాఖ్య చైర్మన్ బలసాడి రంగారావు ఎన్నికయ్యారు. వీరిలో రాంప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవమైంది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా ఆఫ్కాఫ్ చైర్మన్ పదవికి మంత్రి కొల్లు సిఫార్సుతో టీడీపీ అధిష్టానం రాంప్రసాద్ పేరును ప్రకటించగా, కర్నూలు జిల్లా సమాఖ్య చైర్మన్ శివనవీన్‌కుమార్ పేరిట మంత్రి అచ్చెన్నాయుడు జీవో జారీచేయించారు. దీంతో కొల్లు రవీంద్ర వర్గీయులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ పదవి తాను బలపర్చిన నవీన్ కుమార్‌కు దక్కేలా మంత్రి అచ్చెన్నాయుడు చివరివరకు ప్రయత్నించారు. మంత్రి రవీంద్ర.. మంత్రి లోకేశ్ ద్వారా పావులు కదపడంతో మెజార్టీ జిల్లా సమాఖ్యల చైర్మన్లు రాంప్రసాద్ వైపు నిలిచారు. లోకేశ్ పేషీ నుంచి వచ్చిన ఒత్తిళ్ల ఫలితంగా చివరి నిమిషంలో అచ్చెన్నాయుడి అభ్యర్థి నవీన్ కుమార్ బరిలో నుంచి తప్పుకున్నారు. దీంతో చైర్మన్‌గా రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైస్ చైర్మన్ బరిలో నిలిచి అభాసుపాలైన జనసేన..

ఆఫ్కాఫ్ వైస్ చైర్మన్ ఎన్నికలో ఊహించని ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ పదవిని కూడా ఏకగ్రీవం అయ్యేలా చూడాలని అధిష్టానం ఆదేశించింది. శ్రీకాకుళం జిల్లా సమాఖ్య చైర్మన్ చీకటి శ్రీరాములును వైస్ చైర్మన్‌గా ఎంపిక చేయాలని అచ్చెన్నాయుడు యత్నించారు. కానీ నవీన్‌కుమార్‌తో పాటు శ్రీరాములు కూడా తాను బరిలో నిలవడం లేదని చెప్పేశారు. కాకినాడ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అనుచరుడైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమాఖ్య చైర్మన్ బలసాడి రంగారావుకు వైస్ చైర్మన్ పదవి ఏకగ్రీవంగా దక్కుతుందని భావించారు. అదేసమయంలో జనసేన పార్టీకి చెందిన పశ్చిమ గోదావరి జిల్లా సమాఖ్య చైర్మన్ మైలా వసంతరావు వైస్ చైర్మన్ పదవికి నామినేషన్ వేశారు. ఎలాగైనా ఈ పదవి దక్కించుకోవాలని యత్నించిన ఆయన సొంత పార్టీ నేతల ద్వారా కూటమి నేతలపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరో రెండు జిల్లా సమాఖ్యల చైర్మన్లు కూడా వెళ్లిపోయారు. వసంతరావు నామినేషన్ ఉపసంహరించుకోకపోవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో బలసాడి రంగారావుకు 10 మంది మద్దతు పలికారు. వసంతరావుకు ఒక్కరు కూడా మద్దతు పలకలేదు. దీంతో వైస్ చైర్మన్‌గా బలసాడి రంగారావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కిరణ్‌కుమార్ ప్రకటించారు.

బెదిరించి.. భయపెట్టి..

నంద్యాల విజయ డెయిరీ చైర్మన్ గిరీ కోసం 'భూమా' దండోపాయాలు

- సొసైటీ సభ్యత్వం ఉంటేనే అది సాధ్యం
- కానీ, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తమ్ముడు భూమా విఖ్యాత్‌రెడ్డి రూ.1.20 కోట్లు బాకీ
- ఇది చెల్లించకపోవడంతో చక్రవర్తులపల్లె పాల సొసైటీలో అతని సభ్యత్వం రద్దు
- దీంతో అడ్డదారుల్లో ముత్యాలపాడు సొసైటీలో సభ్యత్వం లేకుండానే అధ్యక్షుడిగా ఎన్నిక
- దీనికి వివరణ ఇవ్వాల్సిందిగా సొసైటీ సభ్యులకు త్రీమెన్ కమిటీ నోటీసులు
- వీరిని దారిలోకి తెచ్చుకునేందుకు బైండోవర్ అస్త్రం
- నోటీసులు ఇవ్వకుండా బైండోవర్ ఎలా చేస్తారని నిలదీసిన డైరెక్టర్లు
- మంత్రి లోకేశ్‌ను విఖ్యాత్‌రెడ్డి కలవగానే మారిన సీన్



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న డైరెక్టర్ పీపీ మధుసూదన్‌రెడ్డి

నంద్యాల : నంద్యాల విజయ డెయిరీ చైర్మన్ పదవి కోసం టీడీపీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. చట్టానికి విరుద్ధంగా పోలీసు బలగాలతో డెయిరీ ఎన్నికలు సవ్యంగా జరగకుండా కుట్రలు పన్నుతున్నారు. చైర్మన్ పదవిని తన తమ్ముడు భూమా విఖ్యాత్‌రెడ్డికి కట్టబెట్టేందుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. చాగలమర్రి మండలం చక్రవర్తులపల్లె గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడిగా భూమా విఖ్యాత్‌రెడ్డి ఎన్నిక చెల్లదని.. దానికి వివరణ ఇవ్వాలని నోటీసులిచ్చిన త్రిసభ్య కమిటీ సభ్యులను టార్గెట్ చేశారు. ఇందులో భాగంగా.. డైరెక్టర్లు పీపీ మధుసూదన్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, రవికాంత్‌రెడ్డి, ఎండీ ప్రదీప్‌కుమార్‌లను బైండోవర్ చేసేందుకు నంద్యాలకు చెందిన ముగ్గురు సీఐలు, ఎస్ఐలు, సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు బుధవారం ఉదయం నుంచే విజయ డెయిరీ వద్ద మోహరించారు. రవికాంత్‌రెడ్డిని అదుపులో తీసుకుని తాలూకా పోలీసుస్టేషన్‌లో ఉంచారు. మిగిలిన ఇద్దరు డైరెక్టర్లతో పాటు ఎండీని బైండోవర్ చేసేందుకు ఉపక్రమించారు. అయితే, నోటీసులు ఇవ్వకుండా స్టేషన్‌కు రమ్మంటే ఎలా వస్తామని వీరు ప్రశ్నించగా.. రావాల్సిందేనని పోలీసులు పట్టుబట్టారు. దీంతో.. డెయిరీ వద్ద రోజంతా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయితే, మధుసూదన్‌రెడ్డి తాను అయ్యప్ప మాల వేసుకున్నందున పూజకు వెళ్లాలని చెప్పి వెళ్లారు. సాయంత్రం డెయిరీ ఎండీ ఇతర డైరెక్టర్లపై బైండోవర్ కేసులు పెట్టి తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరుపరిచారు.

> **లోకేశ్‌ను కలిసిన వెంటనే సీన్ మారింది..**
>
> ఇక ఈనెల 6న భూమా విఖ్యాత్‌రెడ్డి మంత్రి నారా లోకేశ్‌ను కలవడంతో డెయిరీ రాజకీయం పూర్తిగా మారిపోయింది. త్రిసభ్య కమిటీ సభ్యులు, డెయిరీ ఎండీపై ఆ మర్నాడే బైండోవర్ కేసు పెట్టారంటే టీడీపీ అధిష్టానం నుండే పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు ఇక్కడ చర్చ జరుగుతోంది.

త్రిసభ్య కమిటీ ముందు హాజరుకాకుండా హైడ్రామా..

ఒమరోవైపు.. భూమా విఖ్యాత్‌రెడ్డి విజయ డెయిరీకి రూ.1.20 కోట్లు అప్పు ఉండి చెల్లించకపోవడంతో అతని సభ్యత్వాన్ని రద్దుచేశారు. దీంతో.. పాల సొసైటీ అధ్యక్షుడు కాకపోతే చైర్మన్ కావడం సాధ్యం కాదని భావించి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు పాల సొసైటీలో సభ్యత్వం లేకుండానే అధ్యక్షుడిగా విఖ్యాత్‌రెడ్డి ఎన్నికైనట్లు ప్రకటించుకున్నారు. అయితే, విఖ్యాత్ అప్పు చెల్లించకపోవడంతో డిఫాల్టర్‌గా ప్రకటించామని, అతని సభ్యత్వం కూడా రద్దుచేశామని.. మీరెలా అధ్యక్షుడిగా ఎన్నుకుంటారో త్రిసభ్య కమిటీకి వివరణ ఇవ్వాలని కమిటీ సభ్యులు పలుమార్లు నోటీసులు ఇచ్చారు. ఈ కమిటీలో డైరెక్టర్లు పీపీ మధుసూదన్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, రవికాంత్‌రెడ్డిలు ఉన్నారు. కానీ, వివరణ ఇవ్వలేదు. అయితే, ఈనెల 10న వివరణ ఇవ్వాల్సి ఉండగా కమిటీ సభ్యులపైనే బైండోవర్ కేసులు నమోదుచేయడం చర్చనీయాంశమైంది.

నిబంధనల ప్రకారం డైరెక్టర్‌గా వస్తే స్వాగతిస్తాం..

భూమా విఖ్యాత్‌రెడ్డి డీఫాల్టర్ అయ్యాడు. ముత్యాలపాడు సొసైటీలో సభ్యత్వం లేకుండా అధ్యక్షుడు కావడం నిబంధనలకు విరుద్ధం. ఆ సొసైటీకి అధ్యక్షుడిగా ఎంపికపై సమాధానం ఇవ్వాలంటూ సభ్యులకు మూడుసార్లు నోటీసులిచ్చాం. ఈనెల 10న వివరణ ఇచ్చేందుకు మరోమారు అవకాశమిచ్చాం. కానీ, మాపై బైండోవర్ కేసులు అంటూ పోలీసులు హడావుడి చేయడమేమిటి? నోటీసులిచ్చి ఎప్పుడైనా మమ్మల్ని తీసుకెళ్లొచ్చు. అక్రమంగా ఎండీ ప్రదీప్‌కుమార్‌పై బైండోవర్ కేసు పెట్టడం దుర్మార్గం. కమిటీ రిపోర్టును అడ్డుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మాకు రాజకీయ ఉద్దేశాల్లేవు. రైతుల సంక్షేమమే ముఖ్యం. విజయ డెయిరీ ఎన్నికల్లో ఎవరైనా చట్టబద్ధంగా పోటీచేసి గెలవొచ్చు. **– డైరెక్టర్లు పీపీ మధుసూదన్‌రెడ్డి, విజయసింహారెడ్డి**

హడ్కో నుంచి రూ.900 కోట్లు అప్పు

సాక్షి, అమరావతి: బడ్జెట్ బయట అప్పుల పరంపరను చంద్రబాబు సర్కారు కొనసాగిస్తూనే ఉంది. హడ్కో (హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) నుంచి ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.900 కోట్లు రుణం తీసుకోవడానికి గ్యారెంటీ ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రుణ వాయిదాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చూసేందుకు కంఫర్ట్ లెటర్ జారీ చేయడంతో పాటు అసలు, వడ్డీకి గ్యారెంటీ ఇస్తున్నట్లు పేర్కొంది. రుణ వ్యవధి మొత్తం కాలానికి అసలు, వడ్డీకి ఈ గ్యారెంటీ ఉంటుందని తెలిపింది. వడ్డీ రేటు, కాల పరిమితి, మారటోరియం వ్యవధి మొదలైన షరతులు ఏవైనా ఉంటే వాటితో పాటు అసలు, వడ్డీ తిరిగి చెల్లింపు షెడ్యూల్‌ను సమర్పించాలని ఉత్తర్వుల్లో కోరింది. రుణ సంస్థకు చెల్లింపులో ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ విఫలమైతే ప్రభుత్వ హామీ అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. హామీ ఇచ్చిన మొత్తంపై 2 శాతం గ్యారెంటీ కమీషన్ చెల్లించాలని పేర్కొంది. రాష్ట్ర డిస్కంలకు బొగ్గు, విద్యుత్ కొనుగోలు, ఇతర ముఖ్యమైన ఖర్చులు, నిర్వహణ అవసరాలు తీర్చడానికి హడ్కో నుంచి రూ.900 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతించినట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం వివరించింది. చంద్రబాబు సర్కారు ఇప్పటికే ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.6,710 కోట్లు అప్పు చేసేందుకు గ్యారెంటీ ఇచ్చింది. తాజా రూ.900 కోట్లతో కలిపి రుణం రూ.7,610 కోట్లకు చేరింది.

100 సీట్లతో పిడుగురాళ్ల వైద్య కళాశాల

సాక్షి, అమరావతి: 2026–27లో 100 ఎంబీబీఎస్ సీట్లతో పిడుగురాళ్ల వైద్య కళాశాలను ప్రారంభిస్తామని మంత్రి సత్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో వైద్య కళాశాల ప్రారంభించడం కోసం ఆరు పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 330 పడకల సామర్థ్యంతో జిల్లా ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. మారిన ఎన్ఎంసీ నిబంధనల మేరకు 420 పడకల ఆస్పత్రి అవసరం ఉందన్నారు. కళాశాలకు 237 మంది వైద్యులు, ఇతర సిబ్బందితో పాటు బోధనాస్పత్రికి 600 మంది సిబ్బందిని సమకూర్చాల్సి ఉందన్నారు. ప్రైమరీ, సెకండరీ వైద్య సేవలందించే 1,454 ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) గుర్తింపు లభించినట్టు తెలిపారు. వీటిలో విలేజ్ క్లినిక్‌లు 1,236, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 72, పట్టణ ఆరోగ్య కేంద్రాలు 139, సామాజిక ఆరోగ్య కేంద్రాలు 7 ఉన్నాయని పేర్కొన్నారు.

పారని రాజకీయ కుట్ర

- సాక్షి ఫొటోగ్రాఫర్, వైఎస్సార్‌సీపీ నాయకుడి రిమాండ్‌ని తిరస్కరించిన న్యాయస్థానం
- 'తిరుమలలో మద్యం బాటిళ్లు' ఫొటోలు ప్రచురించినందుకు అక్రమ కేసులు
- టీటీడీ, టీడీపీ పెద్దల ఒత్తిడితోనే కక్ష సాధింపు

పోలీసుల అదుపులో కోటి, ఫొటోగ్రాఫర్ కృష్ణ

సాక్షి, అమరావతి: రాజకీయ కక్షతో సాక్షి ఫొటో గ్రాఫర్ మోహన్‌కృష్ణతోపాటు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిన పోలీసులకు తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం గట్టి షాక్ ఇచ్చింది. వారిద్దరి రిమాండ్‌ని బుధవారం రాత్రి న్యాయస్థానం తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకెళితే.. తిరుమలలో ఈనెల 4న ఖాళీ మద్యం బాటిళ్లు బయటపడటంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలపాక కోటి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఖాళీ మద్యం బాటిళ్లు ఉన్నాయన్న విషయాన్ని సాక్షి ఫొటో గ్రాఫర్ మోహన్ కృష్ణకు సమాచారం ఇచ్చారు. అదే విషయాన్ని తిరుమల ఫొటో గ్రాఫర్ గిరి, సాక్షి టీవీ కెమెరామెన్‌కి సమాచారం ఇచ్చారు. ఫొటోలు, వీడియోలు తీశారు. ఆ వివరాలతో 'సాక్షి'తోపాటు అన్ని పత్రికల్లోనూ ప్రచురితమయ్యాయి. అన్ని మీడియా ఛానళ్లలోనూ ప్రసారమయ్యాయి. అదే రోజు తిరుమల టూటౌన్‌లో కేసు నమోదైంది. అయితే గుర్తు తెలియని వ్యక్తుల పేరున ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అలాగే ఈనెల 5న తిరుపతి కలెక్టరేట్ వద్ద రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సీఎం చంద్రబాబు చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాను పోలీసులు అడ్డుకుని ఉద్యమకారులను అరెస్టు చేశారు. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న సాక్షి ఫొటోగ్రాఫర్ మోహన్ కృష్ణపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి స్టేషన్‌లో కూర్చోబెట్టారు. ఈ పరిణామాన్ని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కేసు నమోదు చేయబోమని పోలీసులు హామీ ఇచ్చారు. అయితే టీటీడీ, టీడీపీ పెద్దల ఒత్తిడితో పోలీసులు తిరుమలలో మద్యం బాటిళ్ల వ్యవహారంపై మోహన్‌కృష్ణపైనా, కోటిపైనా కేసులు నమోదు చేశారు. సాక్షి ఫొటోగ్రాఫర్‌ను టార్గెట్‌గా చేసుకుని రెండురోజులుగా ఓవర్ యాక్షన్ చేశారు. మంగళవారం తిరుమల టూటౌన్ పోలీసులు సాక్షి ఫొటో గ్రాఫర్ ఇంటికి వెళ్లి తనిఖీల పేరుతో హడావుడి చేసి ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారు. బెదిరింపులకూ దిగారు. దీంతో బుధవారం ఉదయం న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మోహన్ కృష్ణ అలిపిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. అయితే సాయంత్రం వరకు డ్రామాలాడిన పోలీసులు ఆ తర్వాత టీడీపీ, టీటీడీ పెద్దల ఒత్తిడితో బెయిల్ రాకుండా ఉండేందుకు ఎఫ్ఐఆర్‌లో 152 సెక్షన్ అదనంగా చేర్చారు. సాక్షి ఫొటోగ్రాఫర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటిని దేవలోక్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు కట్టుకథ అల్లారు. బుధవారం రాత్రి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కోర్టులో బాధితుల తరఫున న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వాదనలతో ఏకీభవించిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్‌ను తిరస్కరించారు. దీంతో టీడీపీ నేతలు, టీటీడీ పాలకమండలి పెద్దలు షాక్‌కు గురయ్యారు.

అమరావతికి చట్టబద్ధత కల్పించండి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేసిన సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ చట్టబద్ధత కల్పించాలని సీఎం చంద్రబాబు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో అమరావతి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. న్యాయపరమైన, చట్టపరమైన సమస్యల కారణంగా ఇటీవల ఆ బిల్లును వెనక్కి పంపారని కొద్దిరోజుల క్రితం 'సాక్షి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే అంశంపై కేంద్ర మంత్రిని చంద్రబాబు కోరడం ఆసక్తిగా మారింది. బుధవారం రాత్రి అమిత్‌షాతో చంద్రబాబు 11వ సారి భేటీ అయ్యారు. అమరావతి అంశంతోపాటు, ఇటీవల తీవ్ర చర్చనీయాంశనీయమైన రాయలసీమ ఎత్తిపోతల పథకం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, త్వరలో ఖాళీ కాబోయే రాజ్యసభ సీట్ల విషయంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. భేటీ అనంతరం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దాని ప్రకారం.. ఇటీవల ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన జీ రామ్ జీ పథకంలోని కొన్ని అంశాల నుంచి రాష్ట్రానికి వెసులుబాటు కల్పించాలని సీఎం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఏపీపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అమిత్ షాకు సీఎం వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరారు.

ఎలా ముందుకెళ్లమంటారు?

ఈ భేటీలో రాష్ట్రంలో తాజాగా జరుగుతున్న రాజకీయ పరిణామాలపై అమిత్‌షా ఆరా తీసినట్లు తెలిసింది. 'రాయలసీమ ఎత్తిపోతల పనులు నేనే ఆపించాను. క్లోజ్ రూమ్‌లో చంద్రబాబుతో మాట్లాడి, ఒప్పించి ఆపించాను' అంటూ ఇటీవల తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ వ్యాఖ్యలతో రాయలసీమ ప్రజలు చంద్రబాబుపై నిప్పులు చెరుగుతున్నారు. అమిత్‌షా భేటీలో ఈ అంశం చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ అంశంలో భవిష్యత్తులో ఎలా ముందుకు వెళ్లాలనే విషయాలపై అమిత్‌షా చంద్రబాబుకు సూచనలు చేసినట్లుగా తెలిసింది. అదే విధంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై తీవ్ర వ్యతిరేకత కూడగట్టుకున్న కూటమి ఆ విషయంలో ఆచీతూచీ వ్యవహరించే తీరుపై చర్చించినట్లు సమాచారం. ఇక ఇటీవల జరిగిన ఇండిగో సంక్షోభం వ్యవహారంలో కేంద్ర మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘోరంగా విఫలమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపైనా ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు తెలిసింది.

స్త్రీలపై ఆధిపత్యం చలాయించాలని చూడకండి. దేశం స్వేచ్ఛగా ఉండాలంటే, ముందుగా స్త్రీలు విముక్తి పొందాలి.

– ఫియర్‌లెస్ నాడియా

సాక్షి

గురువారం, 8 జనవరి 2026

ట్రంప్ అసంతృప్తి లోగుట్టు!

పరాయి దేశాల్లో సైనిక కుట్రలు, కుయుక్తుల మాటెలావున్నా అగ్రరాజ్యం హోదాలో అమెరికా నాగరికంగా, గంభీరంగా ఉన్నట్టు కనబడేది. తాను ఏం చేసినా ప్రపంచశాంతి కోసమే, అది సురక్షితంగా ఉండటానికేనని ప్రవచించేది. నిరుడు ఆ దేశాధ్యక్షపీఠాన్ని అధిరోహించిన డోనాల్డ్ ట్రంప్‌కు ఇలాంటి డొంకతిరుగుడు నచ్చదు. బాహాటంగా బెదిరింపులకు దిగటం ఆయన నైజం. ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి ఆయన మాట్లాడిన మాటలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. తనను ఆనందడోలికల్లో ముంచెత్తడానికి భారత్ ప్రయత్నిస్తోందట. అయితే తాను సంతోషంగా లేని విషయం మోదీకి తెలుసట. మరో రెండు రోజులకు దాన్ని కాస్త మార్చి, తనతో మోదీ సంతోషంగా లేరంటూ మరో ప్రకటన చేశారు. ఇలా మాట్లాడుతూనే రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు నిలిపేయకపోతే సుంకాలు మరింత పెంచుతామని హెచ్చరించారు. రెండు దేశాల దౌత్యసంబంధాలు లేదా వాణిజ్యసంబంధాల్లో ఏకాభిప్రాయం కుదరనప్పుడు పరస్పరం చర్చించుకోవటం ఆనవాయితీ. ఇచ్చిపుచ్చుకునే ధోరణి చూపితే ఎక్కడో ఒకచోట సదవగాహన సాధ్యమవుతుంది. కానీ ఫలానాది మాత్రమే కావాలని పట్టుబట్టడం, మొండికేయటం వల్ల సమస్య ఎప్పటికీ అపరిష్కృతంగా ఉండి పోతుంది. మన దేశానికి మారిషస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రిటన్, ఒమన్‌లతో ఒప్పందాలు కుదిరాయి. అటు అమెరికాకు ఈయూ, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం, మలేసియాలతో ఇదే విధంగా ఒప్పందాలు ఏర్పడ్డాయి. ఇలా వేరే దేశాలతో ఈ రెండు దేశాలూ ఒప్పందాలు కుదుర్చుకోగలిగినప్పుడు వాటి మధ్య మాత్రం ఒప్పందాలు ఎందుకు అసాధ్యమవుతున్నాయి? తమ భద్రత అమెరికా చేతుల్లో ఉండటంతో వేరే దేశాలు అమెరికా షరతులను శిరసావహించక తప్పదు. వ్యూహాత్మక అంశాల్లో స్వతంత్రత పాటించే వారిని ఒత్తిళ్లు ప్రభావితం చేయలేవు. అందువల్లనే భారత్ వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు అంత తేలిగ్గా సాధ్యపడవు.

ట్రంప్‌ను సంతోషపెట్టడం వేరే దేశాల బాధ్యత ఎందుకవుతుంది? అసలు ఆ బాధ్యత అమెరికా ప్రజలకే ఉండదు. అన్ని దేశాల పాలకుల మాదిరే తన దేశ ప్రజలు ఆనందంగా ఉండేలా చూసుకునే బాధ్యత ట్రంప్‌ది. ఆయన్ను అందుకు ఒప్పించటం రిపబ్లికన్ల బాధ్యత. లేనట్టయితే నష్టపోయేది ఆ పార్టీయే. భారత్–పాక్ యుద్ధాన్ని ఆపానని గప్పాలు కొట్టుకున్నట్టే భారత్ తనను సంతోషపరచటానికి ప్రయత్నిస్తోందని ట్రంప్ చెప్పారా? ఈ విషయంలో మన దేశంవైపు నుంచి ఖండనేమీ లేదు. వాణిజ్య ఒప్పందం అనేది చాలా సీరియస్ అంశం. బహిరంగ వేదికలపై దాన్ని చర్చించటం సాధ్యపడదు. తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారానో, ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలోనో కూర్చునో తోచింది చెప్పటం, అందుకు అనుగుణంగా అవతలి దేశం మారాలని, కాళ్లబేరానికి రావాలని భావించటం... అది సాధ్యపడనప్పుడు హెచ్–1బి వీసా ఫీజు పెంచటం, బహిరంగ విమర్శలకు దిగటం ట్రంప్ ఎన్నుకున్న తప్పుడు మార్గం.

నిజానికి మన దేశం చాలావరకూ తగ్గిందనే చెప్పాలి. నిరుటితో పోలిస్తే అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు 80 శాతం పెరిగాయి. 1962లో వచ్చిన అణుశక్తి చట్టాన్ని ఇటీవల రద్దుచేసి ఆ రంగంలో ప్రైవేటు సంస్థల ప్రమేయానికి అనుమతిస్తూ మన దేశం 'శాంతి' పేరిట కొత్త చట్టం తెచ్చింది. అణువిద్యుత్ కర్మాగారాల్లో ప్రమాదం జరిగితే పరిహారం చెల్లింపు బాధ్యత ఆ పరికరాల సరఫరాదారుకు ఉండబోదన్న విషయంలోనూ అంగీకరించింది. ఇవి తనను సంతోషపరచటానికేనని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. అవి ఎంతమాత్రమూ సరిపోవని చెప్పడం కూడా ఆయన ఉద్దేశం కావొచ్చు. ఇక 95 శాతం అమెరికా ఎగుమతులపై సుంకాలు ఎత్తేయటానికి మన దేశం సిద్ధపడింది. బాదం, యాపిల్, అవకాడో వంటివాటిపై సుంకాలు తగ్గించటానికి ఒప్పుకున్నదంటున్నారు. కానీ డెయిరీ ఉత్పత్తులు, జన్యుమార్పిడి మొక్కజొన్న,సోయా బీన్స్ వగైరాలపై ఆంక్షలొద్దన్న ట్రంప్ షరతుకు అంగీకరించటం లేదు. మన రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేవి మాత్రమే ఆయనను సంతోష పరుస్తాయనుకుంటే ఆ విషయంలో చేయగలిగిందేమీ లేదని మన దేశం చెప్పటమేసరైంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.పంచమి ఉ.10.22 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** పుబ్బ సా.4.26 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.11.52 నుండి 1.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.17 నుండి 11.01 వరకు తదుపరి ప.2.41 నుండి 3.25 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.54 నుండి 11.03 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.36
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

దాపరికం లేని సామ్రాజ్యవాదం

సందర్భం

టంకశాల అశోక్

ఇందులో కొత్తగా అర్థం చేసుకోవలసిన విషయాలేమీ లేవు. వెనిజులాపై సైనిక దాడి, అధ్యక్షుడు నికోలస్ మదురో అపహరణలో ఉన్నది తమ సామ్రాజ్యవాద ప్రయోజనాలేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తానే వివరించి చెప్పారు. అదీగాక, లాటిన్ అమెరికాతో కూడిన పశ్చిమార్ధ భూగోళం 1823 నాటి 'మన్రో డాక్ట్రిన్' నిర్దేశించినట్లు ఎప్పటికీ తమదిగానే ఉంటుందనీ, అందుకు అదనంగా ఇపుడు 'ట్రంప్ డాక్ట్రిన్' ప్రకారం అందుకోసం సైనిక బలాన్ని వినియోగించగలమనీ బాహాటంగా ప్రకటించారు. వెనిజులా ఆపరేషన్ తర్వాత 'అందుకు విరుద్ధంగా మాట్లాడే ధైర్యం ఇక ఎవరికీ ఉండద'ని హెచ్చరించారు. నిజానికి ఈ ఆపరేషన్‌కు ముందు నవంబర్‌లో విడుదల చేసిన 'జాతీయ భద్రతా వ్యూహ పత్రం'లో ఉన్నది కూడా ఇదే!

ఏ చట్టాలూ పాటించరా?

వెనిజులాలో అమెరికాది అతి నగ్నమైన సామ్రాజ్యవాద చర్యను ఇంత సూటిగా, అన్ని కోణాల నుంచి ట్రంప్ వివరించినట్లు ఆయన విమర్శకులు కూడా చెప్పలేరేమో! అమెరికా అధ్యక్షునిది అన్ని విషయాలలోనూ దాపరికం లేనితనమే. అందుకు ఆయనను అభినందించవచ్చు కూడా! ఒక్క విషయంలో మాత్రం మదురోపై అసత్య ప్రచారాలు చేశారు. ఆయన మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేసి, అందుకోసం స్వయంగా ఒక కంపెనీని నడుపుతూ, అమెరికాకు పెద్ద ఎత్తున రవాణా చేస్తున్నారని! ఇవి తప్పుడు ఆరోపణలని అమెరికన్ మీడియాయే పలుమార్లు రాసినందున ఆ విషయమై చర్చించటం వృథా. పైగా, డ్రగ్స్ రవాణా కేసులలో శిక్షలు సైతం పడిన హోండురాస్ మాజీ అధ్యక్షుడు జువాన్ ఓర్లాండో తదితరులకు క్షమాభిక్ష ప్రకటించి జైలు నుంచి విడుదల చేసిన ట్రంప్, మాదక ద్రవ్యాల కారణంగా మదురోపై చర్య తీసుకుంటున్నట్లు వాదించటం హాస్యాస్పదమని అమెరికన్ మీడియా కొట్టివేస్తున్నది. మాదకద్రవ్యాల రవాణా జరుగుతున్నదంటూ ఇటీవలి వారాలలో సుమారు 30 వెనిజులా పడవలపై బాంబింగ్ చేసి, 100 మందికి పైగా ప్రాణాలు తీసినదంతా ఎటువంటి ఆధారాలు చూపకుండా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా జరిగిన విషయాన్ని అదే మీడియా గుర్తు చేస్తున్నది. అమెరికా ప్రజాప్రతినిధులు, నిపుణులు పలువురు కూడా అదే విమర్శలు చేస్తున్నారు. వారిలో ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్లు సైతం ఉన్నారు. చర్చలకు సిద్ధమని మదురో ప్రకటించిన కొద్ది రోజులకే ఈ చర్య జరగటం గమనించదగ్గది.



వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించి తీసుకెళ్తున్న అమెరికా సైన్యం

వెనిజులా సహా పలు లాటిన్ అమెరికన్ దేశాలలో రష్యా, చైనాల ప్రాబల్యం పెరుగుతుండటం ట్రంప్‌కు ఆందోళనగా మారింది. పశ్చిమార్ధ గోళం వైపు ఎవరూ కన్నెత్తి చూసే సాహసం చేయలేరన్న హెచ్చరికలు, తమ సైనిక బలం గురించిన మాటలు... ఇవన్నీ అటువంటి ఆందోళన నుంచి వచ్చినవే.

ఈ విధమైన దాడి చేయవలసిన అగత్యం ఇపుడేమి ఏర్పడింది? చమురు నిల్వల స్వాధీనం మాత్రమేనా, మరేమైనా ఉందా? మదురోను పదవీచ్యుతుడిని చేయటంతో వెనిజులా తమ అధీనంలోకి వచ్చినట్లేనా? మదురో స్థానంలోకి వచ్చిన ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాము కోరుకున్నట్లు పాలించగలరన్న సూచన జరిగేదేనా? అంతిమంగా అధికారం 'భద్రంగా, సవ్యంగా, న్యాయబద్ధంగా' మరొకరికి బదిలీ కావటం అంటే ఏమిటి? అంతవరకు వెనిజులాను 'తామే పాలించగల'మన్న ట్రంప్ ప్రకటన ఆచరణ సాధ్యమేనా? ఈ చర్యకుగానీ, ఆయన చేసిన ప్రకటనలకు గానీ అర్థం, అమెరికా తమ సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం తన చట్టాలకు గానీ, అంతర్జాతీయ చట్టాలకు గానీ ఎంతమాత్రం కట్టుబడి ఉండబోదని స్పష్టంగా ప్రకటించటమేనా?

మేమే బాస్!

దాడికి కారణం చమురు నిల్వలన్నది విస్తారంగా వినవస్తున్న మాట. కానీ అది ఒక కోణం. 'మన్రో డాక్ట్రిన్' ప్రకారం తమ ఇలాకాగా పరిగణించే లాటిన్ అమెరికాలో తమను ధిక్కరించే ప్రభుత్వాలు గానీ, వామపక్ష ప్రభుత్వాలు గానీ ఏర్పడితే కూలదోయటం గత 70 ఏళ్లలో కనీసం 15 సార్లు జరిగింది. వెనిజులా ప్రభుత్వం కూల్చివేతకు హ్యూగో ఛావేజ్ కాలం నుంచి 20 ఏళ్లకు పైగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. ఇది నేపథ్యం కాగా, వెనిజులా సహా పలు లాటిన్ అమెరికన్ దేశాలలో కొంత కాలంగా రష్యా, చైనాల ప్రాబల్యం క్రమంగా పెరుగుతుండటం ట్రంప్‌కు అన్నింటికీ మించిన ఆందోళనగా మారింది. ప్రస్తుత దాడి సందర్భంగా ఆయన మన్రో డాక్ట్రిన్, ట్రంప్ డాక్ట్రిన్ ప్రస్తావనలు, పశ్చిమార్ధ గోళం వైపు ఇక ఎవరూ కన్నెత్తి చూసే సాహసం చేయలేరన్న హెచ్చరికలు, తమ సైనిక బలం గురించిన మాటలు, ఇవన్నీ అటువంటి ఆందోళన నుంచి వచ్చినవే. చమురు ఆ తర్వాతి సంగతి. అమెరికా ప్రాబల్యం ఇతరత్రా కూడా ప్రపంచవ్యాప్తంగా కొంతకాలంగా బలహీనపడుతున్నందున, పశ్చిమార్ధ గోళంలో, దానితో పాటు పశ్చిమాసియాలో తమ బలాన్ని ఏ విధంగానైనా నిలుపుకొని తీరాలన్నది ట్రంప్ పట్టుదల. వెనిజులాపై దాడి, అదే పని చేయగలమంటూ ఇరాన్‌కు హెచ్చరికలు, ఇజ్రాయెల్ ద్వారా పాలస్తీనా ఆక్రమణ వంటి చర్యల ద్వారా ఆ లక్ష్యం దీర్ఘకాలంలో ఎంతవరకు నెరవేరగలదన్నది వేచి చూడాల్సిన విషయం.

పోతే, వెనిజులాలో ఉపాధ్యక్షురాలి నాయకత్వాన కొనసాగుతున్న ప్రభుత్వం, సైన్యం కూడా ట్రంప్ దాడిని ఖండిస్తూ, 'తమ దేశం ఎప్పటికీ అమెరికన్ వలస కాబోద'ని స్పష్టం చేశాయి. అటువంటి స్థితిలో అధికారం 'భద్రంగా న్యాయబద్ధంగా' బదిలీ కావటం ఏ విధంగా ఆచరణ సాధ్యం? బలమైన సోషలిస్టు శక్తులు, ఆ ప్రాంతమంతటా గెరిల్లా గ్రూపులు, అదే మూడ్‌లో ఉన్న వెనిజులా సైన్యం దృష్ట్యా పరిణామాలు ఏ విధంగా ఉండవచ్చు? కొన్ని దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక, రాజకీయ, సైనిక జోక్యాలు, ఎన్నికైన ప్రభుత్వాలను 'నియంతృత్వ'మనే ప్రచారాలతో పడగొట్టడాలతో లాటిన్ అమెరికా అంతటా ప్రజాభిప్రాయం చాలావరకు అమెరికాకు వ్యతిరేకంగా ఉంది. అమెరికాపై విమర్శలు యూరప్ సహా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి.

ప్రపంచం దృష్టి నుంచి అంతిమంగా తేలే ప్రశ్న: రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఉదారవాద వ్యవస్థలు, అంతర్జాతీయ వ్యవస్థలు, అంతర్జాతీయ నియమ నిబంధనల మేరకు పరస్పర సంబంధాలు, దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం వంటివి బలహీనపడుతున్నా ఇంకా నిలిచి ఉంటాయా, లేక అమెరికా సామ్రాజ్యవాదానికి మరింత బలవుతాయా అన్నది. బలి చేయటమేనన్నది నిర్ణయమైతే ట్రంప్ గురి క్రమంగా బహుళ ధ్రువ ప్రపంచం, బ్రిక్స్, ఎస్‌సీఓ, డీ–డాలరైజేషన్ ప్రయత్నాల వైపు మళ్లుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సందర్భం



డానీ

ఇది వెనిజులా గురించి కాదు. ఇది వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో మంచివాడా, చెడ్డవాడా? అన్న ప్రశ్న కాదు. ఇది ప్రజాస్వామ్యమా, నియంతృత్వమా? అన్న రాజకీయ చర్చ కూడా కాదు. ఒక దేశం మరో దేశపు రాజకీయ భవిష్యత్తును బలప్రయోగంతో నిర్ణయించే హక్కును కలిగి ఉంటుందా?

ఈ ప్రశ్నకు 'ఉండకూడదు' అని గట్టిగా సమాధానం చెప్పడానికే 1945 అక్టోబరు 24న ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. ఏ దేశమైనా సరే మరో దేశ సార్వభౌమత్వాన్ని బలప్రయోగం ద్వారానో, బెదిరింపుల ద్వారానో ధ్వంసం చేయకూడదు. ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఆర్టికల్ 2(4) ఈ అంశాన్ని చాలా స్పష్టంగా చెబుతోంది. కానీ వాస్తవంలో జరుగుతున్నది ఏమిటీ?

మార్కెట్ విస్తరణ కోసం, దిగజారుతున్న తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడం కోసం బలహీన దేశాలపై సైనిక దాడి. దాడికి లక్ష్యంగా పెట్టుకున్న దేశ ప్రజలకు అక్కడి ప్రభుత్వం నచ్చడం లేదని ప్రచారం. 'రాజ్యాంగ మార్పు' పేరుతో రాజకీయ బ్లాక్ మెయిల్. ఇది సుదీర్ఘకాలంగా అమెరికా ఆచరిస్తున్న విధానం.

ప్రజలకెందుకు శిక్ష?

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత వివిధ దేశాల్లో అమెరికా చేసిన 'రాజ్యపాలన మార్పు' ఆపరేషన్లు వందకు పైగా ఉంటాయి. 1991లో సోవియట్ రష్యా పతనమై ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా అమెరికా ఆగడాలు ఆగలేదు. ఇరాక్, లిబియా, సిరియా, ఉక్రెయిన్, హోండురాస్, వెనిజులా – ఈ జాబితా పెద్దది. ఈ దారుణాలన్నింటి వెనుక ఒక దారుణ సత్యం ఉంది; ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండానే బలప్రయోగానికి పాల్పడటం! తన ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే దేశాలను అమెరికా సహించదు. వాటిమీద 'ఆర్థిక ఆంక్షలు' విధిస్తుంది. ఇది ప్రత్యక్ష యుద్ధానికి మరో రూపం. రెండింటి ప్రభావం ఒక్కటే.

వెనిజులాపై అమెరికా విధించిన ఆంక్షలు ఆయుధాల యుద్ధం కాదు. కానీ, వాటి ప్రభావంతో జరిగే ఆర్థిక నష్టం ప్రత్యక్ష యుద్ధం కన్నా తక్కువ కాదు. వెనిజులాలో చమురు ఉత్పత్తి 75 శాతం పడిపోయింది. ప్రజల సగటు ఆదాయం 60 శాతం కంటే ఎక్కువగా కూలిపోయింది. ఇది మదురో మీద శిక్షా? లేదా వెనిజులా పిల్లల మీద శిక్షా? ఒకవేళ, శిక్ష పడాల్సింది పాలకుల మీద అయితే, సామాన్య ప్రజల్ని ఆకలితో చనిపోయేలా చేయడం ఏం న్యాయం?

పాలకులు నిరంకుశులుగా మారితే ఆ దేశ ప్రజలు వారిని తప్పిస్తారు. దానికోసం పోరాటాలు చేస్తారు. తిరుగుబాట్లు చేస్తారు. అమెరికా వాళ్లకు ఆ అవకాశం ఇవ్వదు. పాలకులను శిక్షిస్తున్నాం అనే వంకతో దేశాన్ని శిక్షిస్తుంది. దేశ ప్రజల్ని శిక్షిస్తుంది. ఒక దేశ అధ్యక్షుడిని గుర్తిస్తామా, తిరస్కరిస్తామా అన్నది నిర్ణయించాల్సింది ఆ దేశ ప్రజలే; వైట్ హౌస్ కాదు! పెంటగాన్ అస్సలే కాదు!!

గ్లోబల్ గూండాయిజం

ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక్క భద్రతా మండలికి మాత్రమే సభ్య దేశాల మీద ఆంక్షలు విధించే హక్కు ఉంది. అమెరికా తనకు తాను అంతర్జాతీయ భద్రతా మండలి అనుకుంటుంది. ట్రంప్ అయితే అంతకన్నా ఎక్కువే అనుకునే వ్యక్తి. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' – ఇది కొత్త వలసవాదానికి అమెరికా పెట్టిన అందమైన పేరు. 'ప్రజాస్వామ్య రక్షణ' నెపంతో గ్లోబల్ గూండాయిజాన్ని చలాయిస్తుంది.

ఇది పశ్చిమార్ధగోళ అంతర్గత వ్యవహారం; పూర్వార్ధ గోళానికి దీనితో సంబంధం లేదని అంటున్నాడు ట్రంప్. ఇదొక అపభ్రంశ వాదం. పశ్చిమార్ధ గోళంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలు మాత్రమే ఉండవు. దానికి ఉత్తరాన కెనడా వంటి దేశాలు, దక్షిణాన మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు అనేకం ఉన్నాయి. వాదన కోసమైనా అవన్నీ అమెరికా ఆధిపత్యాన్ని అంగీకరిస్తాయా?

రెండవ ప్రపంచ యుద్ధం దాదాపుగా ముగిశాక, 1945 మే 8న యూరప్‌లో విజయ దినం జరిగాక, అమెరికా దూకుడుతో జపాన్ మీద అణుబాంబుల దాడి చేసింది. ఇది ఎంత అమానుష చర్యో ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన రెండు దశాబ్దాలకే రెండో ప్రపంచ యుద్ధం జరిగింది. ఆ తరువాత ఎనభై ఏళ్ళు గడిచినా మూడో ప్రపంచ యుద్ధం రాలేదు. దానికి ప్రధాన కారణం: నాగసాకీ, హిరోషిమాల్లో మానవ హననం, ఆ పైన కొనసాగిన సమస్యల్ని చూసిన దేశాలు మరో ప్రపంచ యుద్ధానికి సాహసించలేదు. కానీ, ఇప్పుడు ఐక్య రాజ్య సమితిని కాదని మూడో ప్రపంచ యుద్ధానికి అమెరికా కాలు దువ్వుతోంది.

అణుయుగంలో ప్రపంచ యుద్ధం అంటే మొత్తం మానవజాతి హననమే. ఈ భయంతోనే తన జోలికి ఎవ్వరూ రారని అమెరికా ధీమా. ఈ రోజు ప్రపంచం మౌనం వహిస్తే రేపు మానవజాతికే సమాధి. కాబట్టి ప్రశ్న మదురో కాదు; మనమే! ప్రశ్న వెనిజులా కాదు; ప్రపంచం!! బలిసిన దేశాల ఆయుధ సంపత్తి కింద ప్రపంచం నడవకూడదు.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు

సోషల్ టాక్

మన వెంట



నిన్న లేకుండా నేడు ఉండదు. నేడు లేకుండా రేపు ఉండదు. మనం లేకున్నా గతం, వర్తమానం, భవిష్యత్తు అనేవి ఎప్పటికీ ఉంటాయి. మనం ఉన్నన్నాళ్లూ మన వెంట ఉండవలసింది మాత్రం న్యాయం, సత్యం, విజయం, కీర్తి. ఇవే మనల్ని కాలాతీత వ్యక్తుల్ని చేస్తాయి.

– కిమ్ జోంగ్ ఉన్, ఉత్తర కొరియా సుప్రీం లీడర్

ఇల్లు కదలండి

నా మాట నమ్మండి. ఇల్లు కదిలి బయటికి వెళితేనే ఎవరైనా అనుకున్నది సాధించగలరు. మనం ఎవరికీ తక్కువ కాదు. ప్రతి ఒక్కరూ ఈ ప్రపంచంలోకి శిశువుగానే వస్తారు. శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుంటారు. మనమూ అంతే!

– యశ్, కన్నడ నటుడు

డెడ్‌లైన్లు

ఒత్తిడిలో సంగీతాన్ని సృష్టించటం నాకు ఇష్టం లేదు. ఎవరైనా నా పనికి డెడ్‌లైన్ విధిస్తే అది నాకు శిక్షలా ఉంటుంది. తొందర పాటు లేకుండా స్వేచ్ఛగా చేసే పని చక్కగా కుదురుతుంది. ఏ పనైనా అంతే, చేసి తీరాలని చేయటం కంటే, చేయకపోవటమే మంచిది.

– హ్యారిస్ జయరాజ్, స్వరకర్త

ఆటోమేషన్

21వ శతాబ్దపు పరిశ్రమల్లో టెక్నాలజీ వినియోగం తప్పనిసరి. ఆటోమేషన్ కంపెనీ ఉత్పాదకతను పెంచుతుంది. అది ఉద్యోగాలను చంపుతుందనేది అపోహ. నిజానికి మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది. రోబోలు మానవులకు కొత్త పనులు కల్పిస్తాయి.

– అనంత్ గుప్తా, టెక్‌సెలెక్స్ సీఈవో

బదులుగా...

మనకు అవసరమైన వాటిపై దృష్టి పెట్టటం మాని, మనకు అవసరం లేని వాటిపైనే దృష్టి పెడతాం. అది మనకు ఏ విధంగానూ ఉపయోగపడదు. సానుకూలంగా ఆలోచించండి. ప్రతిస్పందించటానికి బదులుగా స్పందించటానికి మీ మనసుకు శిక్షణ ఇవ్వండి.

– జిజా హరిసింగ్, రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్

ఇష్టమైనది

మా నాన్నగారు చెప్పేవారు, "నువ్వు పనికిరానివాడివిగా ఉండాలనుకుంటే ఆ పనైనా సక్రమంగా చెయ్యి. లేకుంటే 'పనికిరానితనానికి' చెడ్డ పేరు తెస్తావ్..." అని! ఆ మాటకు నేను గ్రహించిన అర్థం ఏమిటంటే – ఇష్టమైన పనిని ఇష్టం లేకుండా చేయకూడదని!

– అతుల్ కోచర్, షెఫ్

తిరుపతి దాహార్తిని తీర్చరా?

అభిప్రాయం

డా॥ శిరీష

'రాయలసీమ ఎత్తిపోతల పథకం' నిలిచిపోతే శ్రీవారి భక్తులకు, తిరుపతి నగర ప్రజలకు నీటి కష్టాలు తప్పవు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా 'రాయలసీమ ఎత్తి పోతల పథకాన్ని నేనే నిలుపుదల చేయించాన'ని ప్రకటించడం చూస్తే... భవిష్యత్తును ఊహించడం కష్టమేమీ కాదు. ఈ పథకాన్ని ఆపడం అంటే మొత్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హక్కులకు భంగం కలిగించడమే కాక, ప్రత్యేకంగా రాయలసీమకు తీరని అన్యాయం చేసినట్లే!

రాయలసీమ ప్రాజెక్టులు అయిన 'గాలేరు–నగరి', 'తెలుగుగంగ', 'ఎస్‌ఆర్‌బీసీ'లకు నీరు అందాలి అంటే పోతిరెడ్డిపాడు ద్వారా అందాలి. పోతిరెడ్డిపాడుకు నీటి సరఫరా అయ్యేది శ్రీశైలం ప్రాజెక్టు నుంచే. శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటిమట్టం ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీరు అందుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఎడమ కాల్వ నుంచి నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండటం వల్ల శ్రీశైలంలో నీటిమట్టం ఆ స్థాయిలో ఉండటం సాధ్యం కాని పరిస్థితి తలెత్తుతోంది. దీనికి తోడు శ్రీశైలం రిజర్వాయర్ పూడిక వల్ల శ్రీశైలం ఎగువభాగం నుంచి నీరు తీసుకోవడం కష్టంగా మారుతున్న ప్రత్యేక పరిస్థితి ఒకటి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టితో రూపొందించిన పథకం 'రాయలసీమ ఎత్తిపోతల పథకం'. రోజుకు మూడు టీఎంసీల నీటిని సీమకు సరఫరా చేసే విధంగా దీన్ని రూపొందించారు.

శ్రీవారి భక్తులు, తిరుపతి నగర, తిరుపతి జిల్లా శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం... 'గాలేరు–నగరి' ప్రాజెక్టు ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. పైన చెప్పుకున్నట్లు దీనికి నీరు రావాలంటే పోతిరెడ్డిపాడు ద్వారా రావాలి. రాయలసీమ ఎత్తిపోతల పథకం అమలు కాకపోతే భవిష్యత్తులో తిరుపతి–తిరుమల నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తుల అవసరాల రీత్యా కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం సాకారం కావాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టు నుంచి కండలేరు ద్వారా తిరుపతి–తిరుమల అవసరాల కోసం పరిమితమైన నీటి సరఫరా అవుతోంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టడం వరకే కూటమి ప్రభుత్వం పరిమితం కాకుండా... రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించాలి. అందుకు తగిన నిధులు విడుదల చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సాధించుకునే పోరాటంలో తిరుపతి నగర ప్రజలు కూడా భాగస్వాములు కావాలి.

వ్యాసకర్త తిరుపతి నగర పాలక సంస్థ మేయర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్ఈసీ మెంబర్

డేటా పాయింట్



త్రిమూర్తుల స్పర్శ

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

భారతదేశంలోని పవిత్ర క్షేత్రత్రయాలు – గయ, కాశీ, ప్రయాగ. త్రిమూర్తుల ఏకత్వానికి నిలువుటద్దం 'గయ'. ఇక్కడ కర్మకాండలు నిర్వహిస్తే వారికి ఉత్తమ గతులు లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీనినే 'గయా శ్రాద్ధం' అంటారు. ఇంటి వద్ద పితృకార్యాలు చేసినప్పుడు కూడా 'గయా పిండ సదృశా భవంతు' అని స్మరించుకుంటారంటే భారతీయ సమాజంలో ఈ క్షేత్ర ప్రాముఖ్యం అర్థమవుతుంది.

వేల ఏళ్ళ క్రితం గయుడనే రాక్షసుడు విష్ణువు గురించి ఘోర తపస్సు చేసి, వందల మైళ్ళ పొడవున్న భారీ శరీరాన్ని వరంగా పొందాడు. ఒక ద్వీపమంత దేహంతో లోకాలను భయపెడుతున్న గయుడిని అణచడానికి బ్రహ్మదేవుడు ఒక ఉపాయం పన్నాడు. గయుడి దగ్గరకు వెళ్లి అతడి శక్తిని అమితంగా పొగిడాడు. గర్వంతో ఉబ్బిపోయిన గయుడు సాక్షాత్తు బ్రహ్మకే 'వరమిస్తాను కోరుకో' అన్నాడు. తన యజ్ఞం కోసం గయుడి శరీరంపై కొంత భాగం కావాలని బ్రహ్మ కోరగా, యజ్ఞ సమయంలో తన దేహం కదలకుండా ఉండటానికి భారీ బరువును తనపై ఉంచాలని గయుడు షరతు పెట్టాడు.

బ్రహ్మ సంకల్పంతో 'శివశిల'ను గయుడిపై ఉంచారు. వెంటనే శ్రీమహావిష్ణువు తన పాదాన్ని ఆ రాక్షసుడి రొమ్ముపై మోపాడు. త్రిమూర్తుల స్పర్శతో గయుడిలోని అజ్ఞానం తొలగి, బుద్ధి శుద్ధమయింది. పశుబలం కన్నా దైవబలం గొప్పదని గ్రహించిన గయుడు పవిత్రుడయ్యాడు. తన చెడును తొలగించినందుకు పశ్చాత్తాపంతో విష్ణువును ప్రార్థించి, ఆ ప్రాంతానికి తన పేరు ఉండాలనీ, అక్కడ పితృశ్రాద్ధం నిర్వహించేవారికి పుణ్యలోకాలు ప్రాప్తించాలనీ కోరాడు. విష్ణువు ఆ కోరికను మన్నించడంతో గయుడి శరీరమే 'గయా క్షేత్రం'గా వెలిసింది. త్రిమూర్తుల సమష్టి కృషి వల్ల ఒక రాక్షసుడి దేహం లోక కల్యాణానికి వేదికగా మారడం విశేషం. ఒక మురికిగా ఉన్న లోహం పరుసవేదిని తాకి బంగారంగా మారినట్లు, త్రిమూర్తుల అనుగ్రహంతో రాక్షసుడి దేహం పవిత్ర క్షేత్రంగా రూపాంతరం చెందింది అని భక్తుల విశ్వాసం.

జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చడంపై కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో, గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం దిగువ బత్తినవాండ్ల పల్లికి చెందిన న్యాయవాది బండ్రెడ్డి వెంకట నారాయణరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చే ప్రక్రియను ఆపాలన్న సుమన్ అభ్యర్థనను ధర్మాసనం నిరాకరించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు

ఎథిక్స్ కమిటీ సమావేశంలో నిర్ణయం!

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని శాసనసభ ఎథిక్స్ కమిటీ నిర్ణయించినట్లు తెలిసింది. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన బుధవారం నైతిక విలువల కమిటీ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరవుతున్నారని, దానిపై ఏం చేయాలనే దానిపై కమిటీ సభ్యులు చర్చించినట్లు టీడీపీ నేతలు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు జ్యోతుల నెహ్రూ, మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. అసెంబ్లీకి గైర్హాజరు అంశంపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.

ఇన్ఫినిటీ లెర్న్ 'ఇన్ఫినిటీ వన్' ఆన్‌లైన్ ట్యూషన్

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ అయిన ఇన్ఫినిటీ లెర్న్, శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ 'ఇన్ఫినిటీ వన్' అనే ప్రీమియం ఆన్‌లైన్ ట్యూషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమాన్ని సీబీఎస్ఈ, స్టేట్ బోర్డ్, ఫౌండేషన్, జేఈఈ, నీట్ విభాగాల్లో 4 నుంచి 12 తరగతుల విద్యార్థుల కోసం రూపొందించినట్లు వెల్లడించింది. ఈ ప్రోగ్రామ్ ద్వారా 100 శాతం లైవ్ 1:1 క్లాసులు, ప్రత్యేకంగా కేటాయించిన ఉపాధ్యాయులతో నిర్వహిస్తామని వివరించింది. లైవ్ క్లాసులతో పాటు నిరంతర మూల్యాంకనం, వీక్లీ జవాబు పత్రాల మూల్యాంకనం, రికార్డు చేసిన సెషన్లు, 24 గంటల సందేహ నివృత్తి సపోర్ట్ అందిస్తామని వెల్లడించింది. శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సీఈవో, డైరెక్టర్ సుష్మా బొప్పన మాట్లాడుతూ ఇన్ఫినిటీ వన్ ద్వారా అకడమిక్ కఠినత, వ్యక్తిగత మార్గదర్శకత్వం, నిరంతర ఫీడ్‌బ్యాక్ అందిస్తామని తెలిపారు. 'ఇన్ఫినిటీ వన్‌లో సిలబస్ పూర్తయిందా అని మేం అడగం. విద్యార్థి ఆ సమస్యను పరిష్కరించగలడా లేదా అన్నదే చూస్తాం' అని ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండింగ్ సీఈవో ఉజ్జ్వల్ సింగ్ పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో మద్రాస్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్

శ్రీకాళహస్తి: మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కల్పతి రాజేంద్రన్ శ్రీరామ్ బుధవారం కుటుంబ సమేతంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ బైక్ యాత్ర

175 నియోజకవర్గాల్లో పర్యటనలో భాగంగా నగరికి

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలంటూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం, జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవికొట్టు రాజు బైక్ యాత్ర చేస్తున్నారు. 175 నియోజకవర్గాల్లో బైక్ యాత్ర చేయడానికి సంకల్పించిన ఆయన గత ఏడాది డిసెంబరు 21న యాత్ర ప్రారంభించిన రాజు, బుధవారం చిత్తూరు జిల్లా నగరికి చేరుకున్నారు. బైక్‌పై వైఎస్ జగన్ చిత్రపటాలు ఉన్న ఫ్లెక్సీలతో, వైఎస్సార్‌సీపీ జెండాతో ప్రత్యేకంగా సిద్ధం చేసుకున్న బైక్‌పై వస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. 97 రోజుల పర్యటన నిమిత్తం బయలుదేరానని జగనన్నపై ఉన్న అభిమానమే ఈ పర్యటనకు కారణమని అడవికొట్టు రాజు తెలిపారు. – నగరి

ఏజెన్సీ గజగజ

ఏజెన్సీ ప్రాంతంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. బుధవారం జి.మాడుగులలో 2.7, ముంచంగిపుట్టులో 3.5, అరకులోయలో 3.6, పాడేరులో 4.4, పెదబయలు 5.8, చింతపల్లిలో 6, హుకుంపేటలో 6.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. వణికిస్తున్న చలితో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పొగమంచు దట్టంగా కమ్మేయడంతో ఉదయం 9, 10 గంటల వరకు కూడా మంచుతెరలు వీడడం లేదు. పొగమంచుతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి, పాడేరు/చింతపల్లి(అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఏఆర్‌సీలో ఆడ సింహం మృతి

ఆరిలోవ: విశాఖపట్నంలోని జంతు పునరావాస కేంద్రం (యానిమల్ రెస్క్యూ సెంటర్-ఏఆర్‌సీ)లో వృద్ధాప్యంతో ఓ సింహం మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించగా అవయవాలు పనిచేయని కారణంగా బుధవారం మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఏఆర్‌సీలో బిగో అనే 24 సంవత్సరాల ఆడ సింహం ఆసియాటిక్ జాతికి చెందినదని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సాధారణంగా అడవుల్లో ఉండే సింహం జీవన ప్రమాణం 15 ఏళ్లని, జూలో వైద్యం, ఆహారం క్రమం తప్పకుండా అందిస్తుండటంతో అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తున్నాయని వివరించారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఆస్పత్రుల ప్రైవేటీకరణను రద్దు చేయండి

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ

చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైవేటీకరణతో.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందాల్సిన వైద్య సేవలు ఖరీదైనవిగా మారిపోతాయి. వైద్య కళాశాలల్లో రూ.వేలల్లో ఉన్న ఫీజులు రూ.లక్షల్లోకి వెళ్లిపోతాయి. ప్రైవేటీకరణతో అంతిమంగా పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతారు.

– పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులను ప్రైవేటీకరించాలన్న చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవాలంటూ హైకోర్టులో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి ఇప్పటికే కోటికి పైగా సంతకాలు సేకరించగా... ఇప్పుడు న్యాయ పోరాటం ప్రారంభించింది. ఈ మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల విషయంలో చంద్రబాబు సర్కారు తీరును సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తరఫున ఆయన న్యాయవాది మారక్కగారి బాలకృష్ణ హైకోర్టులో పిల్ వేశారు. ప్రభుత్వ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కాగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల ప్రైవేటీకరణ చట్ట విరుద్ధమని అప్పిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ప్రైవేటీకరణకు జారీ చేసిన ఉత్తర్వులు, టెండర్ నోటిఫికేషన్‌ను సైతం సవాల్ చేశారు. దాదాపు 2,300 పేజీలతో ఆయన పిల్ వేయడం విశేషం. కాగా, వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన వ్యాజ్యంపై బుధవారం స్పందించిన హైకోర్టు... పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఎండీ, రాష్ట్ర వైద్య విద్య పరిశోధన కార్పొరేషన్ (ఏపీఎంఈఆర్‌సీ) ఎండీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

ప్రభుత్వ విధానాన్ని నిర్దిష్టంగా సవాల్ చేశాం

వైఎస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... కోటిమంది గొంతుకగా తాము పిల్ వేశామని, ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వ విధానాన్ని సవాల్ చేశామని చెప్పారు. ప్రైవేటీకరణపై ఇప్పటికే ఒక వ్యాజ్యం దాఖలైందని గుర్తు చేసిన ధర్మాసనం... అందులో వాదనలు వినిపించేందుకు అనుమతిస్తామని పేర్కొంది. అయితే, అందులోని అంశాలకు, ప్రస్తుత వ్యాజ్యంలో తాము లేవనెత్తినవాటికి చాలా తేడా ఉందని పొన్నవోలు బదులిచ్చారు. ప్రభుత్వ విధానాన్ని నిర్దిష్టంగా సవాల్ చేశామని, ప్రైవేటీకరణ కారణంగా వైద్య ఖర్చులను భరించడంలో ప్రజల శక్తి, ప్రభుత్వంపై పెట్టుకున్న చట్టబద్ధమైన నమ్మకం వంటి అనేక విషయాలను లేవనెత్తామని చెప్పారు.

ప్రభుత్వం జాప్యం చేస్తుంది..

పొన్నవోలు వాదనలపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ, ఒకే అంశంపై ఇలా పిటిషన్లు వేస్తూ ఉంటే, ఎప్పటికీ తేలవని వ్యాఖ్యానించింది. ఈ పిల్‌ను అడ్డంపెట్టుకుని ప్రభుత్వం కౌంటర్ దాఖలుకు మరింత సమయం కోరుతుందని, దీంతో విచారణలో జాప్యం జరుగుతుందని పేర్కొంది. సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ... తమ పిల్‌ను ఇప్పటికే దాఖలైన వ్యాజ్యంతో జత చేసినా అభ్యంతరం లేదన్నారు. దీంతో ధర్మాసనం వైఎస్సార్‌సీపీ వ్యాజ్యాన్ని ప్రైవేటీకరణపై గతంలో దాఖలైన వ్యాజ్యంతో జత చేసింది.

26 మంది మావోయిస్టుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళా మావోయిస్టులు ఉండగా, అందరిపై కలిపి రూ.64 లక్షల రివార్డు ఉందని ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు. కాగా, లొంగిపోయిన మావోలు దండకారణ్యంలో పలు విధ్వంస ఘటనల్లో పాల్గొన్నారని తెలిపారు. మిగిలిన మావోయిస్టులు కూడా హింసను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని ఆయన సూచించారు.

మావోయిస్టుల డంప్ లభ్యం

సుక్మా జిల్లాలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా బలగాలు ఈనెల 5, 6 తేదీల్లో గోగొండ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టగా కొండపై మావోయిస్టుల డంప్ లభ్యమైంది. ఇందులో గన్‌పౌడర్, జిలిటెన్ స్టిక్స్, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, వైర్‌లెస్ పరికరాలు, యూనిఫామ్, సాహిత్యం వంటి సామగ్రి లభ్యమైందని పోలీసులు వెల్లడించారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

శశి కుమార్ (ఫైల్)

చంద్రగిరి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా తిరుచానూరులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బీటీఆర్ కాలనీకి చెందిన గిరిజకు తమిళనాడులోని మదురైకి చెందిన ఎలక్ట్రీషియన్ శశికుమార్(47)తో 19 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. తన కుమారుడు 10వ తరగతి చదువుతుండడం, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో, డీమార్ట్ సమీపంలోని ఓ ఆసుపత్రిలో గిరిజ పనిలో చేరింది. తన భార్య పనికి వెళ్లడం ఇష్టం లేకపోవడంతో తరచూ ఆమెతో శశికుమార్ గొడవ పడుతుండేవాడు. బుధవారం ఉదయం కూడా వీరి మధ్య గొడవ జరగడంతో గిరిజ పక్కనే ఉన్న తన మరదలు ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శశికుమార్ పూటుగా మద్యం తాగాడు. ఆ మత్తులో పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకున్న గిరిజ అపస్మారక స్థితిలో తన భర్తను చూసి వెంటనే కుటుంబీకులకు చెప్పింది. వారు 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి శశికుమార్‌ను తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తుని రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

ప్రయాణికుల ఆందోళన

మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపకదళం

ప్రమాదానికి కారణాలు వెల్లడించని వైనం

తుని: కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో అలజడి రేగింది. రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌పై శ్లాబు పై నుంచి బుధవారం ఒక్కసారిగా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో స్టేషన్ ప్రాంగణంలో ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. ఓ ప్రయాణికుడు ఇచ్చిన సమాచారంతో తుని అగ్నిమాపక అధికారి రాముడు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. విద్యుత్ వైర్లు, సోలార్ ప్యానల్‌కు సంబంధించిన వైర్లు షార్ట్ సర్క్యూట్ అయినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. కాగా మంట వస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. గుర్తు తెలియని వ్యక్తి నిప్పు అంటించాడని వదంతులు వ్యాపించడంతో ఆర్‌పీఎఫ్ పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను మతిస్థిమితం లేని వ్యక్తిగా నిర్ధారించారు. పొగ వచ్చినా రైల్వే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ప్రమాదం అయితే బాధ్యత ఎవరు తీసుకుంటారని స్థానికులు ప్రశ్నించారు. ప్రమాదంపై వివరణ కోరగా తుని స్టేషన్ మాస్టర్‌తో పాటు అన్ని విభాగాలకు సంబంధించిన అధికారులు తమకు సంబంధం లేదని చెప్పడం విస్మయానికి గురి చేసింది.

ట్రాలీని ఢీకొట్టిన లారీ.. దంపతుల మృతి

రాము, వెంకటరత్నం (ఫైల్)

వైరా: ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామ సమీపాన మంగళవారం ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. శ్రీకాకుళం నుంచి ఖమ్మం జిల్లా వైరాకు వడ్డాది రాము (40) వచ్చి స్థిరపడ్డాడు. ఆయనకు ఏపీకే చెందిన వెంకటరత్నం (37)తో వివాహం జరిగింది. రాము వైరాలో వస్త్రదుకాణం నిర్వహిస్తున్నాడు. వెంకటరత్నం కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని గిరిజన గురుకుల పాఠశాలలో టీజీటీగా పనిచేస్తోంది. రాము ట్రాలీ ఆటోలో పాఠశాల నుంచి భార్యను వైరా తీసుకొస్తుండగా లారీ ఢీకొట్టడంతో ఆమె మృతి చెందింది. రాము ఆస్పత్రిలో మరణించాడు.

మోడల్ స్కూల్‌ను పరిశీలించిన అధికారులు

తల్లిదండ్రులతో సమావేశం **పాఠశాలలో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ**

స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పనపాకంపేట మోడల్ స్కూల్‌లో దళిత విద్యార్థులపై కుల వివక్ష చూపడంపై అధికార యంత్రాంగం స్పందించింది. బుధవారం అధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపారు. మోడల్ స్కూల్‌లో దళిత విద్యార్థులతో కలసి తమ పిల్లలను చదివించమంటూ ఇతర కులాలకు చెందిన కొందరు అధికార పార్టీ నేతల అండతో అనధికారికంగా అరిగెలవారిపల్లిలో పాత పాఠశాలలో తరగతులు నిర్వహించుకున్నారు. ఈ వ్యహారంపై దళితులు మంగళవారం పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. దీనిపై 'మోడల్ స్కూల్‌లో కులవివక్ష' అన్న శీర్షికన బుధవారం సాక్షి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంఈవో–2 భాస్కర్ బాబు, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సీఐ సురేష్ కుమార్ పాఠశాలను సందర్శించారు. రికార్డుల ప్రకారం పనపాకంపేట మోడల్ స్కూల్‌లోనే తరగతులు నిర్వహిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అరిగెలవారిపల్లిలో అనధికారికంగా నిర్వహిస్తున్న తరగతులను రద్దు చేసి అక్కడి విద్యార్థులను తిరిగి మోడల్ స్కూల్‌లో కలుపుతామని చెప్పడంతో దళిత విద్యార్థుల తల్లిదండ్రులు సమ్మతించారు. ఆపై టీడీపీ నాయకుల ఆదేశాలతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. మోడల్ స్కూల్‌కు ఉపాధ్యాయుడిని నియమించడంతో పాటు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

అధికార పార్టీ జోక్యంపై తల్లిదండ్రుల మండిపాటు

పార్టీలతో సంబంధంలేకుండా సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, రాజకీయ నాయకులతో కలసి సమావేశాలు నిర్వహించడంపై దళిత విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. ఇన్ని రోజులుగా దళితులైన మా పిల్లలతో ఇతర కులాల వారు ఎందుకు చదువుకోలేదో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. కేవలం వారికి అనుకూలంగా ఉన్న వారితో మాట్లాడి, వారికి నచ్చిన విధంగా రికార్డులు రాసుకున్నారని ఆగ్రహించారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి' దిన పత్రికకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కాళ్లు పట్టుకుంటేనే సాగునీరిస్తా!

పొలానికి నీళ్లు ఆపేసి రైతుపై టీడీపీ నేత దాష్టీకం

రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

10 ఎకరాల్లో ఎండిపోతున్న పొగాకు

కొండాపురం: అధికార అహంకారంతో ఓ టీడీపీ నేత చేస్తున్న అరాచకంపై అధికారులు సైతం మౌనం దాల్చడంతో పదెకరాల్లో పంట ప్రశ్నార్థకంగా మారింది. పంటకు చెరువు నీరు పారకుండా అడ్డుకట్ట వేసిన టీడీపీ నేతపై బాధిత రైతు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. 'రైతు వచ్చి నా కాళ్లు పట్టుకుంటేనే సాగునీరిస్తా.. లేకుంటే పంట ఎండబెట్టుకోవాల్సిందే.. నీకు ఇష్టం వచ్చిన దగ్గర చెప్పుకో.. ఇది మా ప్రభుత్వం' అంటూ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురానికి చెందిన టీడీపీ నేత, అదే గ్రామ చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు హుకుం జారీ చేయడంతో బాధిత రైతు పాటిబండ్ల దత్తాత్రేయ లబోదిబోమంటున్నాడు.

ఎకరాకు రూ.10 వేలు ఇస్తే.. నీరిస్తారంట

దత్తాత్రేయ బుధవారం విలేకరుల ఎదుట ఎండిపోతున్న తన పొగాకు పంటను చూపించి కన్నీటి పర్యంతమయ్యాడు. గ్రామంలో 10 ఎకరాల భూమిని 15 ఏళ్లుగా కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేసుకుంటున్నానని, అప్పటి నుంచి పొలానికి ఆనుకొని ఉన్న పాత చెరువు నుంచి సాగునీటిని పొలాలకు పారించుకుంటూ పండించుకుంటున్నట్లు తెలిపారు. జాగర్లమూడి శ్రీనివాసులుకు అధికారులు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పదవి ఇచ్చారని, అప్పటి నుంచి రాజకీయంగా తన పంట పొలాలకు సాగు నీటిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామస్తులందరూ చెప్పినా ఒప్పుకోవడం లేదని వాపోయాడు. గ్రామ పెద్దల ద్వారా అడిగిస్తే ఒక ఎకరాకు రూ.10 వేలు ఇస్తే.. నీటిని పారించుకోవచ్చని డిమాండ్ చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. పలు మార్లు పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎండిపోతున్న తన పొలానికి సాగు నీటిని అందించి తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రమేష్‌ను వివారణ కోరగా ఆ చెరువు కింద ఎలాంటి సాగు లేదని, రైతు తన పొగాకు పంటకు సాగు నీళ్లు కావాలని డీఈకి వినతిపత్రం ఇస్తే పరిశీలిస్తామని చెప్పారు.

రక్షకులా.. రాక్షసులా!

బూటు కాళ్లతో తొక్కారు.. లాఠీలతో అరికాళ్లపై కొట్టారు

దళిత విద్యార్థులను చిత్రహింసలు పెట్టడమే మీరు చేసే న్యాయమా?

పన్నెండు మంది కలిసి స్తంభాన్ని తొలగిస్తే నలుగురు దళిత బిడ్డలను స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టడమేంటి?

పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగిన అప్పాపురం దళితవాడ వాసులు

ఎస్ఐను సస్పెండ్ చేయాలంటూ నాలుగు గంటల పాటు రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న దళితవాడ మహిళలు, ప్రజలు

ప్రత్తిపాడు: 'బూటు కాళ్లతో మా పిల్లలను తొక్కుతారా? పన్నెండు మంది కలిసి పోల్ పీక్కెళితే అందులో నలుగురు దళిత బిడ్డలను మాత్రమే స్టేషన్‌కు పిలిపించి లాఠీలు విరిగేలా అరికాళ్లపై కొట్టడమేంటి?' అంటూ అప్పాపురం దళితవాడ ప్రజలు పోలీసుల తీరుపై నిప్పులు చెరిగారు. పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులను పిలిచి చెప్పే కనీస జ్ఞానం కూడా లేదా? లాఠీలతో కొట్టి అక్కడే నడిపిస్తారా' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం అప్పాపురానికి చెందిన పన్నెండు మంది విద్యార్థులు వాలీబాల్ నెట్ కట్టుకునేందుకు సోమవారం ఓ వీధిలో ఉన్న టెలిఫోన్ స్తంభాన్ని(పోల్) తొలగించి, తీసుకెళ్లారు. ఆ సమయంలో స్తంభానికి చుట్టి ఉన్న విద్యుత్‌వైర్లు కదిలి ఇళ్లలో ఉన్న విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయంటూ ఓ మహిళ కాకుమాను పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం వారిలో నలుగురు యువకులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కొట్టారని ఆరోపిస్తూ అదే రోజు రాత్రి తల్లిదండ్రులు స్టేషను వద్దకు వెళ్లి పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

నాలుగు గంటల పాటు రాస్తారోకో

'మా పిల్లలను బూటు కాళ్లతో తొక్కి, లాఠీలు విరిగేలా అరికాళ్లపై కొట్టిన ఎస్ఐ ఏక్‌నాథ్‌ను సస్పెండ్ చేయాలి. కులం పేరుతో దూషించిన ఏఎస్ఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం అప్పాపురం దళితవాడ వాసులు బాధిత విద్యార్థులు, యువకులతో కలిసి మెయిన్ రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా చేశారు. పన్నెండు మందిలో అగ్రవర్ణాల పిల్లలు కూడా ఉన్నారని, కానీ వాళ్లను వదిలేసి దళిత బిడ్డలనే స్టేషన్‌కు పిలిపించి దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. చదువుకునే పిల్లలను ఇలా విచక్షణారహితంగా కొట్టడం ఏమిటంటూ తల్లిదండ్రులు నిప్పులు చెరిగారు. బాధిత యువకులు, విద్యార్థులు స్టేషన్‌లో సీసీ కెమెరాల్లేని గదిలోకి తీసుకువెళ్లి పోలీసులు అమానుషంగా దాడి చేశారని వాపోయారు. స్టీల్ రాడ్లతో సైతం కొట్టారని ఆరోపించారు. ఈ క్రమంలో వందల మంది మహిళలు, స్థానికులు రాస్తారోకోలో పాల్గొనడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. దళితసంఘ నాయకుడు చార్వాక దళితులకు మద్దతు పలికి, రాస్తారోకోలో పాల్గొన్నారు. దళిత బిడ్డలపై అబద్ధాలతో ఫిర్యాదు చేసిన మహిళతో పాటు కులం పేరుతో తమను, తమ పిల్లలను దూషించిన ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ చార్వాక దళితవాడ ప్రజలతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో చివరికి వారు శాంతించారు. కాగా, పోలీసుల దాష్టీకానికి బలైన దళిత విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అండగా నిలిచారు. బుధవారం మధ్యాహ్నం అప్పాపురం దళితవాడలో పర్యటించిన ఆయన బాధిత విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఘటనను ఇంతటితో వదిలేది లేదని, బాధ్యులైన ఏ ఒక్కరినీ వదలబోమని హెచ్చరించారు.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LIMITED
Corporate office: H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati-517503

Tender Notice No. CGM/RAC & IPC/Solar/01/2025-26, Dt.07.01.2026

Bids through www.apeprocurement.gov.in are invited from the eligible bidders Selection of "Third-Party Agency to Conduct Inspection and Quality Verification of Rooftop Solar (RTS) Plant Installations Implemented under the PM-Surya Ghar: Muft Bijli Yojana (ULA Model) within the Jurisdiction of APSPDCL". The tenders will be made available after 23:00Hrs on 08.01.2026 in the website: www.apeprocurement.gov.in

Contact: 9440815488 & 9440811745.

CHIEF GENERAL MANGER
RAC & IPC

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డ్ బ్యాంక్)
ప్రధాన కార్యాలయం : గుంటూరు

టెండరు ఆహ్వాన నోటీసు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు తమ శాఖలకు 1 mg ఎలక్ట్రానిక్ బంగారు వెయింగ్ మెషిన్ల సరఫరా నిమిత్తం 3 సంవత్సరాల వారంటీతో అభ్యర్థన పత్రాలను ఆహ్వానిస్తోంది. అభ్యర్థన పత్రాలను GeM పోర్టల్ ద్వారా సమర్పించవలెను. నిర్దేశిత ఫార్మాట్‌లో బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ 29.01.2026 సాయంత్రం 5.00 గంటల వరకు. మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన చిరునామా: ది జనరల్ మేనేజర్ (సర్వీసెస్), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, హెడ్ ఆఫీస్, 2వ అంతస్తు, సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, 5/2వ లేన్, డోర్ నం. 5-38-27/28, HP పెట్రోల్ బంక్ ఎదురుగా, బ్రాడీపేట, గుంటూరు-522002. ఫోన్: 9490158007 లేదా బ్యాంకు వెబ్‌సైట్ https://apgb.bank.in లేదా GeM పోర్టల్ https://bidplus.gem.gov.in/all-bids ను సందర్శించవచ్చును, బిడ్ ఐడి: GEM/2026/B/7085703, టెండర్‌కు సంబంధించిన నిబంధనలు మరియు షరతులను సవరించడానికి లేదా ఎలాంటి కారణం చెప్పకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు బ్యాంకుకు ఉంటుంది. *షరతులు వర్తిస్తాయి.

జనరల్ మేనేజర్, హెడ్ ఆఫీస్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, గుంటూరు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమగ్ర శిక్షా, అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 28 నిర్మాణ పనుల కొరకు చీఫ్ ఇంజినీర్, APSS, విజయవాడ వారి యొక్క టెండరు ప్రకటన NIT No. 90 to 116/APSS/CWs/2025-26, తేది : 02.01.2026 కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

టెండర్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 05.01.2026, సా. 5.00 గం.తరువాత.
టెండర్ల స్వీకరణకు చివరి తేది : 19.01.2026, సా. 5.00 గం.వరకు.

గమనిక : తదుపరి వివరాలను https://tender.apeprocurement.gov.inలో చూడవచ్చును లేదా సంప్రదించండి 9849922290.

సం/- B. శ్రీనివాసరావు, I.A.S.,
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, APSS, అమరావతి

DIPR RO No.4731PP/CL/Advt/1/1/2021-22, Dt: 07.01.2026

REGIONAL AYURVEDA RESEARCH INSTITUTE, VIJAYAWADA
(Central Council for Research in Ayurvedic Sciences, Ministry of AYUSH, Govt. of India)
New Rajiv Nagar, Payakapuram, Vijayawada-520015(A.P)
Email: narivbd-vijayawada@gov.in or narivbd.vijayawada@gmail.com

F.No.RV-Admn/25/2025-ADMN/Advertisement/1977 Dt. 05-01-2026

Advertisement No.01/2025-26

Walk-in-Interview

This Institute intends to engage services of the following posts on contractual & co-terminus basis for the following projects and for any other upcoming projects.

1. Tribal Health Care Research Project (THCRP) under Tribal Sub Plan.
2. Ayurveda Mobile Health Care Programme Under SCSP
3. Efficacy and Safety of AYUSH SR in the management of Pre menstrual Syndrome A Randomized Double Blind Placebo Controlled Study
4. Dermatology in Ayurveda-A Comprehensive Review

These SRF's are engaged initially for a period of one year or till the project tenure, whichever is earlier. Further, engagement tenure may be extended at the discretion of the competant authority based on project tenure and performance of the concerned.

Name & No. of the Post	Qualification, experience and age limit	Monthly remuneration	Date and Time of Written Test/ Interview
Senior Research Fellow(Ay.) -06*	Essential: BAMS from any recognized University Desirable: 1.Preference will be given to those who possess higher qualification or who have previous Research experience i.e. having worked for any research project funded by the Ministry of AYUSH,ICMR, CSIR, DST or equivalent organization. 2.Skills of drafting, editing of scientific documents/articles/technical reports etc. 3.Publication in peer reviewed journals. 4.Working knowledge of computer applications. 5. Age not exceeding 35 years as on 01-01-2026.	Rs.42,000/- + HRA	28-01-2026 at 10.00 AM

* No.of posts may vary.
For further information and application form please see the CCRAS website www.ccras.nic.in

Sd/-
Assistant Director-In-Charge

వెనెజువెలా చమురు మాదే

మధ్యంతర ప్రభుత్వం నుంచి మార్కెట్ ధరకే కొనుగోలు చేస్తాం

- రోజుకు 30 మిలియన్ల నుంచి 50 మిలియన్ల బ్యారెళ్లు దిగుమతి చేసుకుంటాం
- డబ్బును రెండు దేశాల ప్రజలకు మేలు జరిగేలా ఖర్చు చేస్తాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

కారకాస్: వెనెజువెలాలోని అపారమైన చమురు నిల్వలను దోచుకోవడానికే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో దంపతులను అక్రమంగా నిర్బంధించారంటూ ప్రపంచమంతటా ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. వెనెజువెలా చమురు తమదేనని తేల్చిచెప్పారు. అయితే, మార్కెట్ ధరకే కొనుగోలు చేయబోతున్నామని వెల్లడించారు. 30 మిలియన్ల నుంచి 50 మిలియన్ల బ్యారెళ్ల అత్యధిక నాణ్యత కలిగిన చమురును వెనెజువెలా మధ్యంతర ప్రభుత్వం నుంచి స్వీకరిస్తామని తెలిపారు. ఈ మేరకు ట్రంప్ మంగళవారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఎలాంటి ఖర్చు లేకుండా బలప్రయోగంతో చమురును సొంతం చేసుకోవడానికి ట్రంప్ కుట్రలు సాగిస్తున్నారంటూ వస్తున్న విమర్శలను పరోక్షంగా ఖండించారు. ''స్టోరేజీ నౌకల్లో చమురును వెనెజువెలా నుంచి నేరుగా అమెరికాలోని అన్‌లోడింగ్ కేంద్రాలకు తరలిస్తాం. అమెరికా అధ్యక్షుడిగా నా నియంత్రణలో ఉన్న డబ్బును వెనెజువెలా, అమెరికా ప్రజలకు కచ్చితంగా మేలు జరిగేలా ఖర్చు చేస్తాం'' అని ట్రంప్ తేల్చిచెప్పారు.

గొప్ప పని చేశావంటూ క్రెడిట్ ఇస్తారు

వెనెజువెలాపై దాడి చట్టవిరుద్ధం, అన్యాయం అంటూ ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలను ట్రంప్ తిప్పికొట్టారు. డ్రగ్స్ టెర్రరిజం కేసులో నికోలస్ మదురోను అరెస్టు చేయాలని మాజీ అధ్యక్షుడు బైడెన్ ఆదేశించినట్లు గుర్తుచేశారు. తాను చేసింది తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. వాషింగ్టన్‌లో ఓ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. వెనెజువెలాపై విజయవంతంగా సైనిక ఆపరేషన్ నిర్వహించినందుకు తనను ప్రశంసించాల్సిందిపోయి తప్పుపట్టడం సరైంది కాదని అన్నారు. మదురోను చట్టబద్ధమైన అధ్యక్షుడిగా అమెరికా ప్రభుత్వం ఏనాడూ గుర్తించలేదని వెల్లడించారు. ప్రతిపక్ష నాయకులు ఏదో ఒకరు తనను పొగిడేస్తారని, గొప్ప పని చేశావంటూ క్రెడిట్ ఇస్తారని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ హెచ్చరికలను వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్స్ కొట్టిపారేశారు. తన విధిని నిర్ణయించేది భగవంతుడే తప్ప మరొకరు కాదని స్పష్టంచేశారు. తనను బెదిరించేవారు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలని ఆమె అన్నారు.

బ్యారెల్‌కు 56 డాలర్లు?

వెనెజువెలా చమురును అమెరికా సర్కార్ బ్యారెల్ 56 డాలర్ల ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ చెప్పినట్లుగా రోజుకు సగటున 20 మిలియన్ల బ్యారెల్స్ కొనుగోలు చేయొచ్చు. 2.8 బిలియన్ డాలర్ల విలువైన చమురు, చమురు సంబంధిత ఉత్పత్తులను అమెరికా దిగుమతి చేసుకోనుంది. అంతా అనుకున్నట్లు జరిగితే రోజువారీ అవసరాల కంటే ఎక్కువ చమురే వెనెజువెలా నుంచి దిగుమతి కానున్నట్లు యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ తెలియజేసింది.

రేపు వైట్‌హౌస్‌లో కీలక భేటీ!

వెనెజువెలా చమురును అమెరికాకు తరలించే ప్రక్రియ ఊపందుకుంటోంది. వెనెజువెలా చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో కీలక సమావేశం జరగనున్నట్లు సమాచారం. స్వయంగా అమెరికా ప్రభుత్వమే ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా చమురు దిగ్గజ సంస్థలు ఎక్సాన్, చెవ్రాన్, కొనాకోఫిలిప్స్ ప్రతినిధులు పాల్గొనబోతున్నారు. వెనెజువెలా, అమెరికా మధ్య చమురు వాణిజ్యంపై ఈ సమావేశంలో చర్చిస్తారని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. అయితే తమ రాజధాని కారకాస్‌పై ఈ నెల 3న అమెరికా నిర్వహించిన దాడిలో కనీసం 24 మంది భద్రతా సిబ్బంది మరణించారని వెనెజువెలా అధికారులు వెల్లడించారు. అలాగే 32 మంది క్యూబా సైనికులు, పోలీసు అధికారులు మృతిచెందినట్లు తెలియజేశారు.

అమెరికా, రష్యా నడుమ.. చమురు మంటలు!

- రెండు చమురు నౌకలను దిగ్బంధించిన అమెరికా
- వెనెజువెలావే అని వాదన
- తమవేనంటున్న రష్యా
- అమెరికా ఓ సముద్రపు దొంగ అంటూ ధ్వజం
- అగ్రరాజ్యాల నడుమ కాక రేపుతున్న ఉదంతం
- యూఎస్‌కు సహకరించిన బ్రిటన్ నావికా దళం

వాషింగ్టన్: ఉరుములేని పిడుగులా అమెరికా, రష్యా మధ్య ఉన్నట్టుండి నిప్పు రాజుకుంది. చమురే ఇందుకు నిమిత్తంగా మారడం విశేషం. వెనెజువెలాకు చెందినవిగా భావిస్తున్న రెండు నిషేధిత చమురు నౌకలను అమెరికా బుధవారం దిగ్బంధించింది. వీటిలో ఒకదానిని ఉత్తర అట్లాంటిక్, మరోదాన్ని కరీబియన్ సముద్ర జలాల్లో పట్టుకున్నట్టు అధికారులు బుధవారం వెల్లడించారు. అయితే అవి తమవేనని రష్యా పేర్కొనడం సంచలనం రేపింది. తొలుత వాటిలో ఒక ట్యాంకరే తమదని రష్యా చెప్పినట్టు వార్తలొచ్చినా, రెండూ తమవేనని కాసేపటికే రష్యా పేర్కొంది. ''అమెరికా ఓ సముద్రపు దొంగ. నిబంధనలను ఉల్లంఘిస్తూ మా నౌకలను దిగ్బంధించింది'' అంటూ మండిపడింది. అంతేగాక వాటి రక్షణ నిమిత్తం రష్యా హుటాహుటిన జలాంతర్గాములను తరలిస్తున్నట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ వ్యవహారం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఇది ఎటు తిరిగి చివరికి ఎలా పరిణమిస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా పట్టుకున్న రెండు నౌకల్లో ఒకటి బెల్లా1, రెండోది సోఫియా. బెల్లా1ను అమెరికా నిషేధాంక్షలను ఉల్లంఘించి తిరుగుతోందనే అభియోగాలపై నెల రోజులుగా అమెరికా నావికా దళం వెంటాడుతూ వస్తోంది. దాన్ని ఎట్టకేలకు ఉత్తర అట్లాంటిక్ జలాల్లో అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొంది. అందుకు బ్రిటన్ నావికా దళం సాయపడటం గమనార్హం. గగనతల నిఘా సాయం అందించడమే గాక బెల్లా1ను పట్టుకునేందుకు తమ యుద్ధ నౌకను బ్రిటన్ పంపింది. ఈ విషయాన్ని బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హీలీ ధ్రువీకరించారు. దానిని ఒక 'ధూర్త నౌక'గా ఆయన అభివర్ణించారు. సోఫియాను కరీబియన్ జలాల్లో పట్టుకున్నట్టు హోంలాండ్ సెక్యూరిటీ మంత్రి క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. ఈ రెండు చమురు నౌకలూ చివరిసారిగా వెనెజువెలాలోనే లంగరు వేశాయని చెప్పుకొచ్చారు. అవి ఆ దేశానికి చెందినవి కాకుండాపోయే ఆస్కారమే లేదన్నారు. హెజ్బొల్లా ఉగ్రమూకకు చెందిన సరుకును

బెల్లా1 చమురు నౌక

సోఫియా చమురు నౌకను తమ అధీనంలోకి తీసుకుంటున్న అమెరికా తీర రక్షక దళం

రవాణా చేస్తోందంటూ బెల్లా1పై 2024లోనే అమెరికా నిషేధాంక్షలు విధించింది. ''గత డిసెంబర్‌లోనే కరేబియన్ దీవుల్లో దాన్ని నిలువరించేందుకు అమెరికా తీరరక్షక దళం ప్రయత్నించింది. కానీ ఒడ్డుకు చేరేందుకు బెల్లా1 నిరాకరించి ముందుకు సాగింది. అనంతరం మారినెరా అని పేరు మార్చుకోవడమే గాక డాక్‌యార్డుపై రష్యా జెండాను ఎగురవేసింది. ముందు భాగానికి రష్యా పతాకపు రంగులు పూసుకుంది'' అని హోంలాండ్ విభాగం అధికారులు తెలిపారు. మరోవైపు రష్యా మాత్రం బెల్లా1 అనేది తమ చమురు నౌకేనని చెబుతుండటం విశేషం. అమెరికా జలాలకు ఏకంగా 4,000 కి.మీ.ల దూరంలో ఆ దేశ తీరరక్షక దళం తమ నౌకను అక్రమంగా నిర్బంధించిందని ఆరోపించింది. తర్వాత కాసేపటికే సోఫియా కూడా తమ నౌకేనని రష్యా పేర్కొంది. అమెరికా చర్య పట్ల తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది. ''1982 నాటి ఐరాస ఒప్పందం మేరకు అంతర్జాతీయ జలాలు స్వేచ్ఛాయుత నౌకాయానానికి నెలవు. ఇతర దేశాల్లో నమోదైన నౌకల్ని దిగ్బంధించే అధికారం ఎవరికీ లేదు'' అంటూ రష్యా రవాణా శాఖ ఘాటు పదజాలంతో ప్రకటన జారీ చేసింది. నౌకల రక్షణ నిమిత్తం జలాంతర్గాములను కూడా రష్యా రంగంలోకి దించినట్టు చెబుతున్నారు. తమ నౌకను అమెరికా నావికా దళం అనవసరంగా లక్ష్యంగా చేసుకుని వెంటాడుతోందని మంగళవారం సాయంత్రమే రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అయితే యూరప్ దేశాలు మాత్రం అమెరికా చర్యను స్వాగతిస్తుండటం విశేషం.

..ఇక ఇరాన్ వంతు !!

- అందుకు పథకం సిద్ధం
- ప్రఖ్యాత ఆర్థికవేత్త జెఫ్రీ శాక్స్ అంచనా
- ట్రంప్‌ది మతిలేని దూకుడు
- అమెరికా ఓ ధూర్త దేశమని వ్యాఖ్య

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానాన్ని ఆ దేశానికి చెందిన ప్రఖ్యాత ఆర్థికవేత్త జెఫ్రీ శాక్స్ తీవ్రంగా తప్పుబట్టారు. ''ట్రంప్ అదుపు తప్పారు. ఆయనది మతిలేని దూకుడు'' అంటూ విమర్శించారు. అమెరికా నిత్యం పాటిస్తానని గొప్పగా చెప్పుకునే నిబంధనలు నిజానికి కాకమ్మ కథలు మాత్రమేనంటూ దుయ్యబట్టారు. వెనెజువెలా అనంతరం ట్రంప్ తదుపరి లక్ష్యం కచ్చితంగా ఇరాన్ అని తాజాగా ఇండియాటుడే వార్తాసంస్థతో మాట్లాడుతూ శాక్స్ అభిప్రాయపడ్డారు. ''ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవలే ఫ్లోరిడాలోని మారా లాగో ఎస్టేట్‌లో ట్రంప్‌తో భేటీ అయ్యారు. తదుపరి లక్ష్యం ఇరాన్ అని ఆ సందర్భంగా వారిద్దరూ నిర్ణయానికి వచ్చారు'' అని వెల్లడించారు. అమెరికాను ధూర్త దేశం (రోగ్ స్టేట్)గా శాచ్స్ అభివర్ణించారు. ఇజ్రాయెల్ అంతకుమించిన ధూర్త దేశమంటూ ఆక్షేపించారు. ''అవి రెండూ నిజంగా ఇరాన్‌పై భారీ ఎత్తున దాడికి దిగితే తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. ప్రపంచ యుద్ధ స్థాయికి విస్తరిస్తుంది'' అని హెచ్చరించారు. ఇరాన్ వద్ద పలు అత్యాధునిక క్షిపణులున్నాయని గుర్తు చేశారు. ''ఇరాన్ మాత్రమే కాదు. మెక్సికో, కొలంబియా, క్యూబా, డెన్మార్క్, నైజీరియా ఇలా కనీసం మరో అర డజను దేశాలను ట్రంప్ బెదిరిస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాద పోకడలను భారత్ తదితర బ్రిక్స్ దేశాలే అడ్డుకోవాలి'' అని అభిప్రాయపడ్డారు. గ్రీన్‌లాండ్ ఎప్పటికీ డెన్మార్క్‌దేనని యూరప్ దేశాలన్నీ ముక్తకంఠంతో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.

పిల్ల చేష్టల ట్రంప్

సైన్యం, ముఖ్యంగా సీఐఏ, పెంటగాన్ వంటి భద్రతా సంస్థలు, ఇంకా సామ్రాజ్యవాద కుబేరులతో కూడిన రాజ్యాంగేతర శక్తి అయిన డీప్‌స్టేట్ ప్రస్తుతం అమెరికాను పాలిస్తోందంటూ శాక్స్ ఆరోపించారు. ''ఇక ట్రంప్ నిజానికి ఓ ఉన్మాది. ఎక్కడ చమురు కనిపించినా అది తమదేననే రకం. ఆయనవి పిల్ల చేష్టలు. వెనెజువెలాపై ఆయనకు ఎప్పట్నుంచో కన్నుంది. తొలి దఫా అధ్యక్షునిగా ఉండగా 2017లో లాటిన్ అమెరికాకు చెందిన పలువురు నేతలను విందుకు పిలిచారు. వెనెజువెలాపై తానెందుకు దాడి చేయకూడదని వారిని అడిగారు. అది ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందంటూ వారు వారించడంతో వెనక్కు తగ్గారు. ఇప్పుడు మాత్రం మతిలేని దూకుడుతో మదురోను బంధించి తీసుకెళ్లారు. అయితే దీని వెనక డీప్‌స్టేట్ అజెండా సైతం దాగుంది. ఎందుకంటే అమెరికా విదేశాంగ విధానాన్ని నియంత్రించేది అధ్యక్షుడు కాదు, డీప్‌స్టేట్'' అని శాక్స్ చెప్పుకొచ్చారు. ''నిజానికి ఆ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు అమెరికా 20 ఏళ్లుగా ప్రయత్నిస్తూనే వస్తోంది. కానీ పలు దేశాల్లో నాయకత్వాన్ని మార్చేందుకు ఇప్పటిదాకా అమెరికా చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. వెనెజువెలాలో అదే పునరావృతం అయ్యేలా కన్పిస్తోంది'' అని అంచనా వేశారు.



జెఫ్రీ శాక్స్

ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తం

ఢిల్లీలోని ఫయిాజ్ ఇలాహీ మసీదు సమీపంలో ఘటన

ఆక్రమణల తొలగింపు దృశ్యం

- అధికారులు, పోలీసులపైకి రాళ్లు రువ్విన నిరసనకారులు
- ఐదుగురు పోలీసులకు గాయాలు
- ఆందోళనకారులపై పోలీసుల టియర్‌గ్యాస్ ప్రయోగం
- మైనర్‌సహా ఐదుగురి అరెస్ట్

న్యూఢిల్లీ: వదంతులు షికార్లు చేయడంతో భూముల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కాస్తా హఠాత్తుగా మసీదు కూల్చివేత రంగు పులుముకుని ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన సమీప ప్రాంతంలో ఒక్కసారిగా అలజడి చెలరేగింది. ఫయిాజ్ ఇలాహీ మసీదులోని ఆక్రమణలను తొలగించేందుకు మంగళవారం అర్ధరాత్రి దాటాక 12.30 గంటల ప్రాంతంలో ఘటనాస్థలికి చేరుకున్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులపైకి స్థానికులు రాళ్లు, ఇటుకలు, గాజుసీసాలను రువ్వారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. జనాన్ని చెదరగొట్టే ప్రయత్నంచేశారు. రాళ్లు, గ్లాస్ బాటిళ్లను రువ్విన ఘటనలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సహా ఐదుగురు పోలీసులు గాయపడ్డారు. దీంతో ఘటనకు కారకులైన మైనర్‌సహా ఐదుగురిని పోలీసులు బుధవారం కస్టడీలోకి తీసుకున్నారు. మరో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. రామ్‌లీలా మైదాన్ సమీపంలోని ఫయిాజ్ ఇలాహీ మసీదు, తుర్క్‌మన్ గేటు సమీప స్మశానవాటిక దగ్గర్లోని భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఆక్రమణలను తొలగించాలని ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగడంతో చివరకు అది ఉద్రిక్తతలకు దారితీసింది. ఆక్రమణల తొలగింపులో భాగంగా అక్కడి మసీదును నేలకూలుస్తున్నారని ఒక ఆకతాయి పెట్టిన సోషల్‌మీడియా పోస్ట్‌తో పుట్టగొడుగుల్లా పుకార్లు పుట్టుకొచ్చి చివరకు ఘర్షణకు దారితీసింది. ఢిల్లీ సెంట్రల్ పోలీస్ కమీషనరేట్‌కు సంబంధించిన ఈ స్థలంలో అక్రమంగా వెలసిన డయాగ్నస్టిక్ సెంటర్, ఫంక్షన్ హాల్‌ను తొలగించామని అక్కడి మసీదుకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వివేక్ స్పష్టంచేశారు.

తప్పుడు వీడియోతో అలజడి

అక్రమ కట్టడాలను కూల్చేందుకు కూలిన భవన శిథిలాలు, చెత్తను తొలగించేందుకు 30 బుల్డోజర్లు, 50 డంపింగ్ ట్రక్కులను తీసుకురావడంతో స్థానికులు ఇదంతా చూసి గుమిగూడారు. 300 మంది పౌరకార్మికులను శిథిలాలను తొలగించేందుకు అధికారులు వెంట తీసుకొచ్చారు. స్థానికులు సమీపంలోకి రాకుండా పోలీసులు బారికేడ్లను అడ్డుగా ఉంచారు. మంగళవారం అర్ధరాత్రిదాటాక ఆక్రమించిన స్థలంలోని వాణిజ్యసముదాయాలను కూల్చేస్తున్న వీడియోను ఒక వ్యక్తి వీడియో తీసి ''మసీదును కూల్చేస్తున్నారు. అందరూ వెంటనే ఇళ్ల నుంచి బయటికొచ్చి ఉద్య మాన్ని ఉధృతం చేయండి'' అని సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. దీంతో పెద్దసంఖ్యలో స్థానికులు రాళ్లు పట్టుకుని రావడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. తర్వాత పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాళ్లు, సీసాలు విసిరేస్తూ దాడికి దిగారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా తప్పుడు వీడియోలు పోస్ట్‌చేసినందుకు, ఉద్రిక్తపరిస్థితులు సృష్టించినందుకు 17 ఏళ్ల బాలుడుసహా ఐదుగురిని అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్, మజ్లిస్‌తో బీజేపీ దోస్తీ!

- మహారాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో విచిత్రం
- రెండు చోట్ల భిన్నధ్రువాల మధ్య పొత్తులు
- కౌన్సిల్ చైర్మన్ పదవులు దక్కించుకున్న బీజేపీ
- అంబర్‌నాథ్‌లో 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లపై సస్పెన్షన్ వేటు
- బీజేపీ అనైతిక, అవకాశవాద పొత్తులు పెట్టుకుందని శివసేన (ఉద్ధవ్) ఆగ్రహం

ముంబై: ఇదొక విచిత్రమైన పొత్తు. ఎవరూ ఊహించని పొత్తు. రాజకీయంగా బద్ధశత్రువులైన బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం)తో కూడా బీజేపీ జతకట్టింది. మహారాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఈ విచిత్రం చోటుచేసుకుంది. మొత్తానికి ఈ వ్యవహారం సంచలనాత్మకంగా మారింది. అధిష్టానం నిర్ణయంతో సంబంధం లేకుండా స్థానిక నాయకులే పొత్తులు కుదుర్చుకోవడం గమనార్హం. దీనిపై ఆయా పార్టీల అగ్ర నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించారు. మున్సిపల్ కౌన్సిళ్లకు డిసెంబర్ 20న ఎన్నికలు జరిగాయి. ఎన్నికల తర్వాత అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్‌లో బీజేపీ, కాంగ్రెస్ అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో బీజేపీ, ఎంఐఎం చేతులు కలిపాయి. మున్సిపాల్టీల్లో పాగా వేయడానికి భిన్నధ్రువాలు ఒక్కటయ్యాయి. అంబర్‌నాథ్ కౌన్సిల్ కుర్చీ కోసం 'అంబర్‌నాథ్ వికాస్ అఘాడీ' పేరిట బీజేపీ, కాంగ్రెస్, ఎన్సీపీ(అజిత్ పవార్) పొత్తు కుదుర్చుకున్నాయి. శివసేన(షిండే)ను పక్కనపెట్టాయి. మొత్తం 60 సీట్లకు గాను శివసేన(షిండే) 27 సీట్లు గెల్చుకొని ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ 14, కాంగ్రెస్ 12, ఎన్సీపీ(అజిత్ పవార్) 4, స్వతంత్రులు 2 సీట్లు గెల్చుకున్నారు. ఒక స్వతంత్ర కౌన్సిలర్ అఘాడీకి మద్దతు ప్రకటించడంతో కూటమి బలం 31కి చేరింది. చైర్మన్ పీఠాన్ని దక్కించుకునే బలం చేకూరింది. మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా బీజేపీ సభ్యుడు తేజశ్రీ కరాంజులే పాటిల్ ఎన్నికయ్యారు. బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. తమ పార్టీ కౌన్సిలర్లు బీజేపీకి మద్దతు ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నాయకత్వం ఆగ్రహం వ్యక్తంచేసింది. నూతనంగా ఎన్నికైన 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లతోపాటు బ్లాక్ అధ్యక్షుడు ప్రదీప్ పాటిల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఎలాంటి పొత్తు లేదని, రాష్ట్ర నాయకత్వానికి సమాచారం ఇవ్వకుండా స్థానిక నేతలు నిర్ణయం తీసుకున్నారని, దీనికి తమ పార్టీ అధిష్టానం అనుమతి లేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సచిన్ సావంత్ బుధవారం చెప్పారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు: ఒవైసీ

అకోట్ మున్సిపల్ కౌన్సిల్‌లో 'అకోట్ వికాస్ మంచ్' పేరిట బీజేపీ, ఎంఐఎం, శివసేన(ఉద్ధవ్), శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్ పవార్), ఎన్సీపీ(శరద్ పవార్), ప్రహర్ శక్తి పార్టీ కూటమిగా ఏర్పడ్డాయి. 35 సీట్లకుగాను రెండు స్థానాల్లో ఎన్నికలు జరగలేదు. పొత్తుతో కూటమి బలం 25కు చేరింది. బీజేపీ కౌన్సిలర్ మాయ ధూలే మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది. మజ్లిస్‌కు చెందిన నలుగురు సభ్యులు ఆ పార్టీని వదిలేసి తమ పార్టీకి మద్దతు ఇచ్చినట్లు బీజేపీ ఎంపీ అనూప్ ధాత్రే తెలిపారు. ఈ పరిణామంపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. బీజేపీతో ఎప్పటికీ పొత్తు ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి: ఫడ్నవీస్

అనైతిక పొత్తులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని మహారాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. పార్టీ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఇతర పార్టీలతో చేయి కలిపిన బీజేపీ స్థానిక నాయకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా సరే పార్టీ క్రమశిక్షణకు, విధానాలకు కట్టుబడి ఉండాలన్నారు. మరోవైపు శివసేన(ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు బహిర్గతమయ్యాయని విమర్శించారు.

6.5 కోట్ల ఓటర్లు తొలగింపు

12 రాష్ట్రాలు, యూటీల్లో ముగిసిన రెండో దశ ఎస్ఐఆర్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల నుంచి 6.5 కోట్ల మంది ఓటర్ల పేర్లను కేంద్ర ఎన్నికల సంఘం తొలగించింది. మృతి చెందడం, శాశ్వతంగా వలస వెళ్లడం, డూప్లికేట్ కేటగిరీ వంటి కారణాలతో ఆయా ఓట్లు తొలగింపునకు గురయ్యాయి. రెండో దశలో భాగంగా 9 రాష్ట్రాలు, 3 యూటీల్లో గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. రాష్ట్రాలవారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం తాజాగా ప్రచురించింది. ఎస్ఐఆర్‌లో భాగంగా మొత్తం 50.90 కోట్ల ఓటర్ల అర్హతలను తనిఖీ చేశారు. అనర్హుల పేర్లను తొలగించిన తర్వాత 44.40 కోట్ల మంది ఓటర్ల పేర్లతో ముసాయిదా జాబితాలు సిద్ధం చేశారు. తొలగింపునకు గురైనవారి పేర్లను ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్/డూప్లికేట్(ఎస్ఏడీ) విభాగంలో చేర్చినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఏకంగా 2.89 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించడం గమనార్హం.

ఏప్రిల్ 1 నుంచి ఇళ్ల గణన

కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సమగ్ర జన గణనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జన గణన తొలి దశలో భాగంగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య జరగనుంది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతంలో హౌస్ లిస్టింగ్‌ను కనీసం 30 రోజులపాటు నిర్వహిస్తారు. వాస్తవానికి జన గణన 2021లో జరగాల్సి ఉండగా, కోవిడ్–19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈసారి జన గణనను రెండు దశల్లో నిర్వహిస్తున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్–సెప్టెంబర్‌లో హౌస్ లిస్టింగ్, రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జన గణన పూర్తిచేస్తారు. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, నిర్మాణాల వివరాలు సేకరిస్తారు. వచ్చే ఏడాది జనాభా లెక్కలను ఎలక్ట్రానిక్ రూపంలో సేకరించబోతున్నారు. అంటే ఇది దేశంలో మొట్టమొదటి డిజిటల్ సెన్సస్ అని చెప్పుకోవచ్చు.

ఎన్డీఏతో జతకట్టిన అన్బుమణి పీఎంకే

చెన్నై: త్వరలో ఎన్నికలు జరగనున్న తమిళనాడులో డాక్టర్ అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పాట్టలి మక్కల్ కట్చి(పీఎంకే) చీలిక వర్గం పార్టీ బుధవారం ఎన్డీఏ కూటమితో జతకట్టింది. తమిళనాడులో ఎన్డీఏ కూటమికి సారథ్య బాధ్యతలు చూసుకుంటున్న అన్నాడీఎంకే పార్టీ చీఫ్ కె.పళనిస్వామి పిలుపుమేరకు ఆ కూటమిలో చేరుతున్నట్లు అన్బుమణి ప్రకటించారు. బుధవారం చెన్నైలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి కూడా అయిన పళనిస్వామి నివాసంలో అన్బుమణి భేటీ అయ్యారు. తర్వాత మీడియాతో పళనిస్వామి మాట్లాడారు. '' మా కూటమిలో ఇప్పుడే పీఎంకే చేరింది. మరిన్ని పార్టీలు మాతో త్వరలో జతకట్టబోతున్నాయి. రాబోయే శాసనసభ ఎన్నికలకు సంబంధించి పీఎంకేకు సీట్ల సర్దుబాటు ఇప్పటికే జరిగిపోయింది. ఎన్ని సీట్లు కేటాయించామనేది త్వరలో వెల్లడిస్తాం'' అని పళనిస్వామి అన్నారు. ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న డీఎంకే పార్టీని ఓడించేందుకే ఎన్డీఏ కూటమిలో జతకట్టానని అన్బుమణి స్పష్టంచేశారు.

మోదీకి నెతన్యాహు ఫోన్

గాజా శాంతిపై ఇజ్రాయెల్ ప్రధాని వివరణ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. వారిద్దరూ పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇరుదేశాల ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గాజా శాంతి ప్రణాళిక అమలు గురించి మోదీకి నెతన్యాహు సవివరంగా తెలియజేశారు. భారత్, ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాలపై ఇద్దరు నేతలు చర్చించారు. రెండు దేశాల బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. మానవాళికి పెనుముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఉమ్మడి ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు.

హింసలో పాల్గొంటే బహిష్కరిస్తాం

భారతీయ విద్యార్థులకు అమెరికా హెచ్చరిక

న్యూఢిల్లీ: అమెరికాలో నిరసన ప్రదర్శనలు, ఘర్షణలు, హింసాత్మక ఘటనల్లో పాలుపంచుకుంటే ఆ భారతీయ విద్యార్థులు దేశబహిష్కరణకు గురయ్యే పెను ప్రమాదం పొంచి ఉందని అమెరికా హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. యూఎస్ ఎంబసీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టింది. ''విద్యార్థి వీసా మీద అమెరికాలో అడుగుపెట్టిన భారతీయ విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాలి. అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఏదైనా హింసాత్మక ఘటనల్లో పాలుపంచుకుని అమెరికా అధికారులు మిమ్మల్ని అదుపులోకి తీసుకోవడం, అరెస్ట్‌చేయడం వంటివి జరిగితే మీ స్టూడెంట్ వీసాను రద్దుచేసే అవకాశం ఉంది. వీసా రద్దయిన కారణంగా మిమ్మల్ని దేశం నుంచి బహిష్కరించి స్వదేశానికి సాగనంపాల్సి ఉంటుంది. భవిష్యత్తులో అమెరికాకు విచ్చేసేందుకు, వీసా పొందేందుకు శాశ్వతంగా అర్హత కోల్పోతారు. అమెరికా వీసా చట్టాలకు అనుగుణంగా నడుచుకోండి'' అని యూఎస్ ఎంబసీ పేర్కొంది.

అమర్త్యసేన్‌కు ఎస్ఐఆర్ నోటీస్

ఆగ్రహం వ్యక్తం చేసిన టీఎంసీ

కోల్‌కతా: ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న దిగ్గజ ఆర్థికవేత్త అమర్త్యసేన్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే సంబంధ నోటీస్‌ను జారీచేసింది. అమర్త్యసేన్, ఆయన తల్లి మధ్య వయసు వ్యత్యాసం కేవలం 15 సంవత్సరాలలోపే ఉన్నట్లు ఎస్ఐఆర్ సంబంధ దరఖాస్తులో పేర్కొనడంతో దీనిపై వివరణ కోరుతూ నోటీస్ పంపామని పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివరించారు. పశ్చిమబెంగాల్‌లోని బోల్‌పూర్‌లోని శాంతినికేతన్‌లో సేన్ సొంతింటికి ఈ నోటీస్‌ను పంపించారు. ప్రస్తుతం అమర్త్యసేన్ విదేశాల్లో ఉండటంతో ఆయనకు ఈ విషయం తెలియజేస్తామని సేన్ కుటుంబసభ్యులు తెలిపారు. నోబెల్ పురస్కారంతో భారత్‌ను గర్వపడేలా చేసిన దిగ్గజ ఆర్థికవేత్తకు సైతం ఇలాంటి నోటీస్‌లు పంపడమేంటంటూ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈసీ సిగ్గుమాలిన పని చేసిందని ఆరోపించింది.

సాక్షి గుంటూరు

గురువారం । 8 । జనవరి । 2026

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 3900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 39.8368 టీఎంసీలు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 558.70 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 51,229 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1100, గరిష్ట ధర రూ.3000, మోడల్ ధర రూ.1700 వరకు పలికింది.

న్యూస్‌రీల్

ఆపస్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఉపాధ్యాయ సంఘు (ఆపస్) నూతన సంవత్సర కేలండర్, డైరీని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి బుధవారం గుంటూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.పద్మ, ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎ.బాలచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి జెడ్పీ సమావేశం వాయిదా

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీలో గురువారం జరగాల్సిన స్థాయీ సంఘ సమావేశాలతో పాటు సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సీఎం చంద్రబాబు గుంటూరు నగరానికి వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు ఓ ప్రకటనలో తెలిపారు.

అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలి

ఏఎన్‌యూ(పెదకాకాని): అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ఎస్ఎం) ఆంధ్రప్రదేశ్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో దాదాపు ఐదు వేల అధ్యాపకుల పోస్టుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డి.ఎస్.వి.ఎస్ బాలసుబ్రహ్మణ్యం కోరారు. అనంతరం ప్రొఫెసర్ మధుమూర్తి మాట్లాడుతూ కొన్ని న్యాయపరమైన అడ్డంకులు ఉన్నందువల్ల అధ్యాపక పోస్టుల భర్తీ ఆలస్యం అవుతుందని, వీలైనంత తొందరలో భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంతా లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ రామచంద్రన్, డాక్టర్ వాణి, డాక్టర్ గంగరాజు, డాక్టర్ బాల మురళి, తదితరులు పాల్గొన్నారు.

సరస్ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కొండపల్లి

గుంటూరు రూరల్: గుంటూరులోని నల్లపాడు రోడ్డు రెడ్డికళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన సరస్ మేళా ఏర్పాట్లను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ఇది ఒక వేదికని తెలిపారు. ఇది మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడుతుందన్నారు. ఈ అఖిల భారత డ్వాక్రాబజార్ సరస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు గురువారం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శన విక్రయాలు జరుగుతాయన్నారు. గుంటూరులో ఈ మేళా 12 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఎత్తున ఏర్పాటు చేయబడిందన్నారు.300 షాపులు ఉంటాయని, వాటిలో 65 షాపులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉత్పత్తులను ప్రదర్శన విక్రయాలు చేస్తారన్నారు.

రోడ్డెక్కిన కూటమి రచ్చ

- తెనాలి నేతల మధ్య ముదిరిన గొడవ
- ఆధిపత్యం పోకూడదని ఎమ్మెల్సీ రాజా ఆరాటం
- ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్న మంత్రి మనోహర్
- ఫ్లెక్సీ పేరుతో రోడ్డెక్కిన ఆలపాటి వర్గం
- టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు మంత్రి సిద్ధం

తెనాలి వేదికగా కూటమిలో విభేదాలు రోడ్డున పడ్డాయి. తెనాలిలో గెలిచి మంత్రిగా కొనసాగుతున్న నాదెండ్ల మనోహర్ ఆధిపత్యానికి గండి కొట్టి తన పట్టు నిలుపుకోవడం కోసం ఎమ్మెల్సీ ఆలపాటి రాజా చేస్తున్న ప్రయత్నాలు కూటమిలో చిచ్చు పెడుతున్నాయి. మంగళవారం ఫ్లెక్సీల తొలగింపునకు పూనుకున్న మున్సిపల్ అధికారులను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు.

రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఆలపాటి రాజా వర్గీయులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రి నాదెండ్ల మనోహర్ మధ్య ఆధిపత్య పోరు ముదిరింది. దీంతో రాజా వర్గం రోడ్డెక్కిందని చెబుతున్నారు. దీనిపై తెలుగు దేశం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు మనోహర్ సన్నద్ధమైనట్టు తెలిసింది. కూటమి పార్టీల పొత్తుతో ఎన్నికల్లో తెనాలి ఎమ్మెల్యేగా గెలిచిన నాదెండ్ల మనోహర్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పదవిని చేపట్టారు. పొత్తు ధర్మంలో తెనాలి సీటును కోల్పోయిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది తెలుగుదేశం పార్టీ. తెనాలిలో తన ప్రాభవాన్ని కోల్పోవడానికి ఇష్టపడని ఆలపాటి రాజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే దూకుడు ప్రదర్శించారు. గతేడాది సంక్రాంతి పండక్కి కోడి పందేలను నిర్వహించకుండా అడ్డుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో స్వయంగా రాజానే వెళ్లి పందేలను ఆరంభించటంతో వేడి రాజుకుంది. పట్టణంలో నిర్మించే భవనాల్లో 4, 5వ అంతస్తులకు రాజా సానుకూలతను చూపినా మంత్రి మనోహర్ విభేదించిన విషయం తెలిసిందే.

దక్కని ప్రాధాన్యత

పదవి లేనప్పుడు ప్రభుత్వ అధికారిక సభలు, సమావేశాల్లో రాజాకు ఆహ్వానం లేకుండాపోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటికి కేంద్రమంత్రి పెమ్మసాని ద్వారా కొన్ని పనులు అయ్యాయి. పెద్దగా పనులు కావటం లేదనే భావన ఆయనలో ఉంది. టీడీపీ నాయకులు వెళ్లినా మనోహర్ నుంచి తగిన స్పందన లేదనే భావన ఆ పార్టీ వర్గీయుల్లో కనిపిస్తోంది. మనోహర్‌కే అధికారులు ప్రాధాన్యత ఇవ్వటంతో టీడీపీ నాయకులకు ఇబ్బందికరంగా మారింది. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పదవి నుంచి దింపి, టీడీపీ హస్తగతం చేసుకుందామని కౌన్సిలర్లు చేసిన ప్రయత్నానికీ మనోహర్ సాయం చేయలేదు.

నామినేటెడ్ పదవుల్లోనూ...

స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని టీడీపీ వర్గీయులు ఆశించారు. మంత్రి మనోహర్ మాత్రం యాదవ సామాజికవర్గానికి చెందిన తోట దుర్గాప్రసాద్‌కు వచ్చేలా చక్రం తిప్పారు. వైస్‌చైర్మన్ పదవి టీడీపీకి, పాలకవర్గ సభ్యులు చెరో సగం ప్రకారం ఒప్పందం జరిగిందని చెబుతారు. దుర్గాప్రసాద్ నియామకం తర్వాత పాలకవర్గంలోని ఇతర పదవులకు టీడీపీ తరఫున పేర్లను ఇవ్వలేదు. దీంతో దుర్గాప్రసాద్ నాలుగైదు నెలలుగా కేవలం చైర్మన్ పదవికి పరిమితమయ్యారు. ప్రమాణస్వీకారం, బాధ్యతలు చేపట్టడం వంటివి లేకుండా పోయాయి. దీంతోపాటు మరో కీలకమైన వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకం కూడా పెండింగులో ఉండిపోయింది.

సాగని టీడీపీ నేతల ఆటలు

2014–19 కాలంలో ఒక్కో ప్రభుత్వ కార్యాలయాన్ని ఒక్కో టీడీపీ నాయకుడు అడ్డాగా మార్చుకుని, కావాల్సిన పనులను చేయించుకున్నారని తెనాలిలో అందరికీ తెలుసు. మనోహర్ వచ్చిన తర్వాత అది సాధ్యం కావటం లేదు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తెనాలిలో నియోజకవర్గ మెగా గ్రీవెన్స్‌ను నిర్వహించారు. సమావేశం తర్వాత కేంద్రమంత్రి పెమ్మసానిని మాత్రమే మనోహర్ తన ఇంటికి భోజనానికి తీసుకెళ్లారని, ఆలపాటిని పిలవలేదని ఆయన వర్గీయులు ఇప్పటికీ కినుకతో ఉన్నారు. అధికారులు మనోహర్‌కు జవాబుదారీగా ఉండటం, కార్యకర్తలకు పనులు కాకపోవటంతో ఎమ్మెల్సీగా ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానిస్తున్నా మంత్రి మనోహర్ కార్యక్రమాలకు ఆలపాటి దూరంగా ఉంటున్నారు. టీడీపీ తరఫున పోటీగా గ్రీవెన్స్ నిర్వహించటం, సీఎంఆర్‌ఎఫ్ నిధులను తెప్పిస్తూ లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు.

సామాన్యుడికి దొరకని ‘కోడి’

- కిలో మాంసం ఏకంగా రూ.320
- ముమ్ముందు మరింత పెరిగే అవకాశం
- కోళ్ల పెంపకం తగ్గడమే కారణమా?

తాడేపల్లి రూరల్: సామాన్యుడు కోడి మాంసం తినే పరిస్థితి లేకుండా పోతోంది. చికెన్ ధర చుక్కలను తాకుతోంది. రెండు నెలల క్రితం కిలో రూ. 250 ఉండగా.. నెల క్రితం రూ. 180 పలికింది. క్రమేపీ పెరుగుతూ ప్రస్తుతం రూ. 320కు చేరింది. ఎన్నడూ లేని విధంగా ధర పలకడంతో చికెన్ ప్రియులు ముద్ద దిగక వాపోతున్నారు. కోడిగుడ్డు సైతం రూ.8 వరకు పలుకుతోంది. రోజురోజుకూ చికెన్, గుడ్లతోపాటు కూరగాలయ ధరలు కూడా పెరుగుతున్నాయి.

కారణమేంటి?

హేచరీస్‌కు సెలవులు ఇవ్వడం, చికెన్ చిక్స్‌లో సమస్య తలెత్తడంతో ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా చికెన్ ధర భారీగా పెరిగినట్లు ఆయా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శాకాహారం వైపు చూస్తున్న సామాన్యుడు అక్కడా ధరల దెబ్బకు బెంబేలెత్తుతున్నాడు. చికెన్ ధరలతో పప్పు దినుసులు, కూరగాయల ధరలు పోటీ పడుతుండడంతో సామాన్యులకు పౌష్టికాహారం అందని పరిస్థితి ఏర్పడింది.

విక్రయాలు తగ్గాయ్..

మంగళగిరి నియోజకవర్గంలో కోడి మాంసం అమ్మే దుకాణాలు 500కు పైగా ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి టన్నుల కొద్దీ కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు. గతంలో ఒక్కొక్క వ్యాపారి రెండు రోజులకు ఒకసారి టన్ను నుంచి 2 టన్నుల వరకు కోళ్లను దిగుమతి చేసుకునేవారు. ఆదివారం వస్తోందంటే 4 నుండి 5 టన్నులు దించుకొనేవారు. ప్రస్తుతం మాంసం ధర పెరగడంతో దుకాణాలు వెలవెలపోతున్నాయి. జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది ఉందని పలువురు వ్యాపారులు తెలిపారు. కట్టర్‌కు రోజు రూ.వెయ్యి, కోళ్లను కోసేవారికి రూ.700 ఇవ్వాలి. ప్రతి రోజు మెయింటెన్స్ కింద రూ.2 వేలు నుంచి రూ. 3 వేలు పక్కకు తీయాలి. వ్యాపారాలు జరగక జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నామని నిర్వాహకులు చెప్పారు.

కూరగాయలదీ అదే దారి..

చికెన్ ధరలకు పోటీగా పండుగల నేపథ్యంలో కూరగాయలు, పప్పు దినుసుల ధరలు కూడా భారీగా పెరిగాయి. టమాటా, పచ్చిమిర్చి, బీట్‌రూట్, క్యారెట్ కిలో రూ. 40 నుంచి రూ. 50 వరకు చేరింది. కిలో కందిపప్పు రూ. 120 వరకు ఉంది.

మరింత పెరగొచ్చు...

కార్తికమాసం, జనవరి ఫస్ట్, సంక్రాంతి పండుగలు వరుసగా రావడం తెలిసిందే. పండుగల అవసరాల నేపథ్యంలో గ్రామీణ, పట్టణ అవసరాలకు సరిపడా కోళ్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీంతో అతి తక్కువ కాలంలోనే రూ. 320 నుంచి రూ. 360 వరకు కిలో స్కిన్‌లెస్ ధర పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారస్తులు అంటున్నారు. నాటు కోడి మాంసం కూడా కిలో కనిష్ఠంగా రూ. 750 నుండి రూ.వెయ్యి వరకు ఉంది. పల్లెల్లోని ప్రజలు సైతం ఫారం కోళ్ల మాంసంపైనే ఆధారపడుతున్నారు.

పోలవరంపై బాబు అబద్ధాలు

- నది డైవర్షన్ చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌దే
- తెలంగాణలో టీడీపీని కాపాడుకునేందుకు చంద్రబాబు ప్రయత్నాలు
- ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెడుతున్న సీఎం
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ధ్వజం

మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని ఆయన తన నివాసంలో బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు చెప్పిన అబద్ధాన్ని మళ్లీ చెబుతుంటారని ధ్వజమెత్తారు. ఆయనకు మీడియా బలం ఉందని, ఆ మీడియాలో మొదటి పేజీలో అబద్ధాన్ని అచ్చువేసి, మళ్లీ రాష్ట్ర ప్రజలకు చెబుతారని మండిపడ్డారు. డయాఫ్రం వాల్ వేయడంలో ప్రొటోకాల్‌ను విస్మరించింది చంద్రబాబు ప్రభుత్వమని ఆరోపించారు. డయాఫ్రం వాల్ వేయాలంటే ముందు కాఫర్ డ్యాం కట్టాలనే జ్ఞానం లేని వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. కాఫర్ డ్యాం వేయకుండా డయాఫ్రం వాల్ ఎలా వేశారని చంద్రబాబును సూటిగా అడుగుతున్నానని అన్నారు. ప్రాజెక్ట్ అలస్యమయ్యేందుకు చంద్రబాబే కారణమని స్పష్టం చేశారు. నది డైవర్షన్ చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్ అనవసరమని గతంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తెలంగాణలో టీడీపీని కాపాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తాకట్టు పెట్టవద్దని హితవు పలికారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బాగు కోసం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు ఒక్క సమస్య అయినా పరిష్కారించారా అని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌పై ఆరోగ్యకరమైన చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. ఈ ప్రాజెక్ట్ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కలల పంటని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ చంద్రబాబుకి ఏటీఎం కార్డు వంటిదని గతంలో జరిగిన ఎన్నికల వేళల్లో ప్రధాని మోదీ చెప్పారని ఆయన గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్ట్ 45.7 లెవల్‌కు నీరు నింపామని, అయితే చంద్రబాబు 41.1కు కుదించారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని వాఖ్యానించారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టులపై కనీసం ఎవరూ దృష్టి సారించలేదని తెలిపారు.

మిర్చి యార్డులో ఇబ్బందులు లేకుండా చూడాలి

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆదేశించారు. గుంటూరు చుట్టుగుంటలోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్ ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, మిర్చి రైతులు, ట్రాన్స్‌పోర్ట్, పోలీసు అధికారులు, లారీ యూనియన్ నాయకులు, సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది తేజ రకం తప్ప మిగిలిన రకాలకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ముందుగా పలువురు మిర్చి రైతులు మాట్లాడుతూ యార్డులో సరిపడా ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు లేవన్నారు. రైతులకు సరైన వసతులు కల్పించాలని వేడుకున్నారు. మిర్చి ఎగుమతి వ్యాపారులు మాట్లాడుతూ అమరావతి లారీ ఓనర్స్ అసోసియేషన్ వాహనాలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు బాడుగ అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ టోల్‌గేట్‌ల ధరలు పెరిగాయని, భారీ వాహనాలు కావడంతో ఇతర రాష్ట్రాల్లో పోలీసులు కేసులు రాసి, జరిమానాలు భారీగా విధిస్తున్నారని వాపోయారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, జేడీఎం కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి బాదుడు..!

- ప్రైవేటు ట్రావెల్స్‌లో ఆర్టీసీ టికెట్‌కు మూడింతల ధర
- పండగ రద్దీ అదనుగా సామాన్యుడి జేబుకు చిల్లు
- చంద్రబాబు పాలనలో కనీసం నోరు మెదపని యంత్రాంగం



ఆన్‌లైన్‌లో హైదరాబాద్‌కు చార్జీ రూ.4 వేలుగా చూపిస్తున్న ప్రైవేట్ బస్సు నిర్వాహకులు

ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రైవేట్ బస్సులు

పట్నంబజారు: సంక్రాంతి పండుగను అవకాశంగా మలుచుకుని ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ఆపరేటర్లు ప్రయాణికులను చార్జీల పేరుతో బాదేస్తున్నారు. పట్టపగలే దోపిడీకి పాల్పడుతున్నారు. గుంటూరు నగరంలోని లాడ్జ్ సెంటర్, బీఆర్ స్టేడియం, ఆర్టీసీ బస్టాండ్, బృందావన్‌గార్డెన్స్, కాకాని రోడ్డులో అనేక ప్రైవేట్ ట్రావెల్స్ ఉన్నాయి. గుంటూరు జిల్లా పరిధిలో సుమారుగా 200పైగా ప్రైవేట్ బస్సుల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. స్వగ్రామాలకు వెళ్లాలనే ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, ఆర్టీసీ చార్జీలకు రెండు నుంచి మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ఇలా ప్రైవేటు ట్రావెల్స్ ప్రజలను దోచుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇష్టారాజ్యం

గుంటూరు నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల్లో సాధారణ చార్జీలు మచ్చుకైనా కనిపించడం లేదు. ‘టికెట్ కావాలంటే ఇదే రేటు’ అన్నట్టుగా ట్రావెల్స్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ప్రత్యామ్నాయం లేక ప్రయాణికులు అధిక చార్జీలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రత్యేక బస్సుల సంగతేంటో?

ఇప్పటివరకు ఆర్టీసీ హైదరాబాద్, చెన్నై, వైజాగ్, బెంగళూరుతోపాటు ఇతర ప్రాంతాలకు ఎన్ని బస్సులు తిప్పాలనే నిర్ణయం తీసుకోలేదు. గుంటూరు ఆర్టీసీ పరిధిలో గుంటూరు డిపో 1, డిపో 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలతో కలిపి సుమారు 400 బస్సులు వరకు ఉన్నాయి. స్త్రీ శక్తి పథకం వచ్చిన తరువాత దూరప్రాంతాల బస్సుల సంఖ్యను అధికారులు తగ్గించారు. పండుగల సీజన్‌లో సైతం బస్సులు ఏర్పాటుపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. సుమారు 250 నుంచి 300 బస్సుల వరకు మహిళల ఉచిత ప్రయాణానికే సరిపోతున్నాయని ఆర్టీసీ అధికారులు చెప్పకనే చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితి ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

అడిగే దిక్కు లేదు...

ట్రావెల్స్ కార్యాలయాల వద్ద నేరుగా టికెట్లు తీసుకునే ప్రయాణికుల నుంచి ఆన్‌లైన్ కన్నా ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. చివరి నిమిషంలో బస్సు టైమింగ్ మార్పులు, బస్సు రద్దు, వేరే బస్సులకు మారుస్తామంటూ గందరగోళం సృష్టించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు ఎక్కడా కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పండుగల సమయంలో ప్రత్యేక తనిఖీలు, నిర్ణీత చార్జీలను అమలు చేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నట్లు చెప్పారు. ఫిర్యాదులకు స్పందన లేకపోవడం ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నాయి. చార్జీల పేరిట చేస్తున్న దోపిడీకి తక్షణమే అడ్డుకట్ట వేయాలని, ఆర్టీసీ ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలని, అధిక చార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బహిరంగంగానే దోపిడీ

గుంటూరు–హైదరాబాద్ మార్గంలో ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.600–700 మధ్య ఉంది. ఏసీ గరుడ ప్లస్ బస్సుల్లో రూ.1,000 లోపే ఉంది. అదే మార్గంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రూ. 2 వేల నుంచి రూ.3 వేల వరకు టిక్కెట్ ధరలు నిర్ణయించారు. స్లీపర్ బస్సుల పరిస్థితి అయితే.. రూ 4 వేల పైమాటేనని ప్రయాణికులు వాపోతున్నారు. గుంటూరు–చెన్నై మార్గంలో ఆర్టీసీ ఏసీ చార్జీ సుమారు రూ.1,300 గా ఉంది. ప్రైవేటు బస్సుల్లో రూ.2,800 నుంచి రూ.3,000 వరకు పలుకుతోంది. గుంటూరు–బెంగళూరు మార్గంలో ఆర్టీసీ ఏసీ స్లీపర్ చార్జీ రూ.1,700–1,800గా ఉంటే, ప్రైవేటు ట్రావెల్స్‌లో అదే టికెట్ రూ.3,000 దాటుతోంది.

రేపటి నుంచి వార్షిక నాటకోత్సవాలు

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: గుంటూరు కళాపరిషత్ వార్షిక నాటకోత్సవాలను ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు నాయుడు గోపి తెలిపారు. గుంటూరు మార్కెట్ కూడలిలో శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం మీడియా సమావేశంలో నాటకోత్సవాల బ్రోచర్లను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9, 10, 11 తేదీల్లో 28వ వార్షిక నాటకోత్సవాలు జరగనున్నాయని తెలిపారు.

కార్యక్రమాలు ఇలా...

9న సాయంత్రం జ్యోతిప్రజ్వలన చేసి, అనంతరం శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం (శ్రీకాకుళం జిల్లా) ఆధ్వర్యంలో మాయాజాలం (సాంఘిక నాటిక), తదుపరి ప్రారంభ సభ ఉంటుందని అన్నారు. రాత్రి స్వర్ణ సూర్య డ్రామా లవర్స్ (హైదరాబాద్) స్త్రీమాత్రేనమః (సాంఘిక నాటిక)తోపాటు విజయవాడ సాంస్కృతిక సమితి ‘మమ్మల్నీ బ్రతకనీయండి’ (సాంఘిక నాటిక) ప్రదర్శన ఉంటాయని చెప్పారు. 10న రాత్రి కళానికేతన్ (వీరన్నపాలెం) వారి ‘దీపం కింద చీకటి’ (సాంఘిక నాటిక), బీవీకే క్రియేషన్స్ (కాకినాడ) వారి ‘కన్నీటికి విలువెంత’ (సాంఘిక నాటిక), ‘అన్నదాత’ సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారని వివరించారు. 11న రాత్రి ఏపీ ప్రజానాట్య మండలి (విశాఖపట్నం) వారి ‘ఒక రాక్షసుడి కథ’ (సాంఘిక నాటిక), మైత్రీ కళానిలయం (విజయవాడ) వారి ‘వాస్తవం’ (సాంఘిక నాటిక), ‘గంగోత్రి’ (పెదకాకాని) వారి ‘పేగు రాసిన శాసనం’ (సాంఘిక నాటిక) ప్రదర్శిస్తారని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బండ్ల పూర్ణచంద్రరావు, గౌరవ సలహాదారు ఆలోకం పెద్దబ్బాయి, కార్యవర్గ సభ్యులు పోపూరి శివరామకృష్ణ, షేక్ సైదా, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి నియామకం



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలో పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

■ వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జోన్–3 రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పోలూరి వెంకటరెడ్డి, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం కార్యదర్శిగా చింకా శ్రీనివాసరావు, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా మారెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా చిలకా రమేష్‌లను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

■ అదేవిధంగా పార్టీ యువజన విభాగం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా సూరజ్ బేగ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ తంగెళ్ల పీరా, కార్యదర్శులుగా షేక్ ఉమర్ ఫారూఖ్, కుక్కళ్ల రవిబాబు.

■ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా గొల్ల జ్యోతి, కార్యదర్శులుగా దంతాల శివపార్వతి, సోమవరపు పద్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మాండ్రు అనిత, మణికల దుర్గ, మాదాసు రత్నకుమారి.

■ జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షుడిగా లచ్చితులసి, ప్రధాన కార్యదర్శులుగా యేమినేని ధనుంజయరావు, కుక్కల రాంప్రసాద్, కార్యదర్శులుగా పాదిలి శ్రీనివాసరావు, కందుల వెంకటేశ్వర్లు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, కోలా వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బత్తుల దాసు, దానబోయిన లక్ష్మీనారాయణ, మునిరత్నం.

■ జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షుడిగా లంకపోతు పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండమాగుల వెంకటరెడ్డి, కార్యదర్శులుగా కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, వీర్ల వీరాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఏసుపోగు పోతురాజు.

■ అంగన్‌వాడీ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా బోడపాటి సుశీల, సోషల్ మీడియా విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ మూర్తజ, ప్రధాన కార్యదర్శులుగా భీమిరెడ్డి సాయికృష్ణారెడ్డి, నల్గొండ అఖిల్, శివనాగరాజు, కార్యదర్శిగా నంబూరు రాంబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నెలమికంటి రూబెన్, మందాల యశ్వంత్‌రెడ్డి, కడియం ఆనంద్.

■ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా మున్నంగి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా పి.శ్రీక్రాంత్, ప్రధాన కార్యదర్శులుగా వెల్లువోలు గోపాలకృష్ణ, మాతంగి వినోద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.సురేష్, షేక్ నాగూర్‌బాషా.

■ జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షులుగా బోయిన నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల నాగరాజు, కార్యదర్శిగా చుక్కా నాబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కంచర్ల ఎలేషా, పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడిగా కూచిపూడి సురేష్, ప్రధాన కార్యదర్శిగా బేతపూడి సాంబయ్య, కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గడ్డం తాతారావు, తుపాకుల కృష్ణ, గంజిమాల కోటేశ్వరరావు.

■ జిల్లా ప్రచార కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా గొల్లపూడి మహేష్, కార్యదర్శులుగా కొప్పుల సంగీతరావు, జంగా ప్రేమ్ చంద్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తురకా నరేష్, రావూరి జాషువ, ఆరేపల్లి రవి.

■ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా కూరగంటి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా పుట్ల సంపత్, కార్యదర్శిగా కూచిపూడి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాయపాటి సుశీలరావు, కారుమూరి అంకమ్మరావు.

■ జిల్లా గ్రీవెన్స్‌సెల్ ఉపాధ్యక్షుడిగా పి.జయప్రకాష్‌నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శిగా కుర్రా అమరలింగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మురికి రామరాజు.

■ జిల్లా ఇంటిలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా దోరడ్ల వెంకటేష్, కార్యదర్శిగా పరిశ బాలచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గుమ్మడి సంగీతరావు, కూచిపూడి మధుసూధనరావు, గాదె కేశవరెడ్డి, షేక్ గౌస్ బాషా.

■ వైఎస్సార్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గనిపిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పెనుమల అరుణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కంచర్ల కరుణబాబు, పలకల మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా జ్యోతుల ఏసుబాబు, కార్యదర్శులుగా మొగల్ షౌకత్ ఆలీబేగ్, బోడపాటి ధర్మరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మొండితోక బుజ్జిబాబు, వల్లెపు రాజశేఖర్.

■ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులుగా షేక్ లతీఫ్, మొహమ్మద్ ఫారూఖ్, కార్యదర్శులుగా షేక్ మీరావలి, షేక్ సంధాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్‌సర్దార్, షేక్ పెదమస్తాన్‌వలి, షేక్ అబ్దుల్లా, షేక్ షరీఫ్, షేక్ ఖాజావలి.

■ దివ్యాంగుల విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతక్కి కిరణ్‌కుమార్, కార్యదర్శులుగా పల్లపోతు దివాకర్, వనమా అములు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మల్లవరపు నాగమల్లేశ్వరరావు, నర్రంశెట్టి హరినాద్‌బాబు.

■ జిల్లా చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా గంజి రామకోటేశ్వరరావు

■ ఎస్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ గోపి, కార్యదర్శిగా కేతావత్ గోపినాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దేవరకొండ దుర్గారావు, కట్టా శివశంకర్ జగన్ మోహన్.

■ ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శిగా దాసరిపల్లి విక్టో, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కర్రా చిన హనుమయ్య, దేవరపల్లి ప్రకాష్‌రావు.

■ జిల్లా ఆర్టీఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా సన్నాయి శ్రీనివాసరావు, జిల్లా బూత్ కమిటీ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రేపూడి రత్నంబాబు, వలంటీర్ల విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా షేక్ అమీర్‌లను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

■ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం గుంటూరు నగర అధ్యక్షుడిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పల్లపు మహేష్‌ను నియమించారు. దివ్యాంగుల విభాగం నగర అధ్యక్షుడిగా యేటిగడ్డ శివారెడ్డి, యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శిగా షేక్ హుస్సేన్‌వలి, కార్యదర్శులుగా బత్తుల మనోహర్, తంగిరాల బ్రహ్మారెడ్డి, నెమలికంటి రాజ్‌కిరణ్‌లు నియమితులయ్యారు.

కోల్డ్ స్టోరేజీ యాజమాన్యాల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కోల్డ్‌స్టోరేజీల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రబాబు

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లాలో శీతల గిడ్డంగుల యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని కోల్డ్ స్టోరేజ్‌ల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సురేంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ది గుంటూరు జిల్లా కోల్డ్ స్టోరేజ్‌ల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు సమస్యలతో కూడిన వినతిప్రతం అందజేశారు.

■ కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు మాట్లాడుతూ కోట్ల రూపాయల బ్యాంకు రుణాలతో నిర్మించుకున్న కోల్డ్ స్టోరేజీల యాజమాన్యాలు గత పది సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం తమని ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యంగా మారే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

■ కోల్డ్ స్టోరేజ్‌లను వ్యవసాయ పరిశ్రమగా గుర్తించగలిగితే కొంత ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. కోళ్ల, రొయ్యల పరిశ్రమలను వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా గుర్తించినట్లు తమను కూడా గుర్తించినట్లయితే కరెంటు టారిఫ్‌లు తగ్గి కొంత ఉపశమనం కలుగుతుందని వేడుకున్నారు.

■ స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ కార్యదర్శి కేఎస్ రాఘవయ్య, కోశాధికారి ఆర్.రమణ, సభ్యుడు జుగిరాజ్ భండారి తదితరులు ఉన్నారు.

22 నుంచి విజ్ఞాన్ లో ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్-2026

ప్రత్యేక ఆకర్షణగా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్

సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, డైరెక్టర్లు

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, అమరావతిలోని ఏపీ స్పేస్‌టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్–2026 ను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అమరావతిలోని సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా 'సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026' ను కూడా మూడు రోజుల పాటు ఇదే సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కాలేజీ స్థాయి విద్యార్థులకు కెమికల్ రాకెట్రీ, స్కూల్ స్థాయి విద్యార్థులకు హైడ్రో రాకెట్రీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్‌ను 'లివరేజింగ్ స్పేస్ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్–2047' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026' లో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, స్కూల్, పాలిటెక్నిక్ విద్యార్థి బృందాలు పాల్గొననున్నాయని తెలిపారు. విజేతలకు ప్రత్యేక ట్రోఫీలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తెనాలి రూరల్: మేనమామపై హత్యాయత్నం చేసిన మేనల్లుళ్లు, బావ, మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి–బుర్రిపాలెం రోడ్డులోని దాల్ మిల్లులో పని చేస్తున్న పట్టణ సీఎం కాలనీకి చెందిన సత్యనారాయణపై ఈ నెల 4న అతని మేనల్లుళ్లు మణికంఠ, సాయికృష్ణ, బావ మురళి, మణికంఠ స్నేహితులు తెనాలికి చెందిన నాగబాబు, రాజు ఇనుపరాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. రూరల్ ఎఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు బుర్రిపాలెం రోడ్డులో ఉన్నారన్న సమాచారంతో బుధవారం వారిని అదుపులోకి తీసుకున్నారు.

9న ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ పై ఉచిత అవగాహన

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూ పూర్వ విద్యార్థులచే ధర్మపీఠం ఆధ్వర్యంలో జనవరి 9వ తేదీన ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు శెట్టిపల్లి శశికిరణ్ తెలియజేశారు. ఏఎన్‌యూలో బుధవారం కిరణ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు, కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు అవసరమైన అర్హతను సాధించే క్రమంలో నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రకటనను జారీ చేసిందన్నారు. దాని ప్రకారం జనవరి 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి మార్చి 28 , 29లలో పరీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఏపీ సెట్ లో అర్హత సాధించిన వారికి పీహెచ్‌డీ చేసేందుకు కూడా మార్గం సుగమమవుతుందన్నారు. ఈ పరీక్షకు సిద్ధమవుతున్న వారికి కఠినమైన మొదటి పేపరును అందులోని 10 యూనిట్లపై అవగాహన కలిగించేలా వెబినార్ ద్వారా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి కల విద్యార్థులు ధర్మపీఠం ప్రతినిధి ఫోన్ 944 0374778, 9493037766 నెంబర్లకు చేసి రిజర్వ్ చేసుకోవలసిందిగా శశికిరణ్ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ధర్మపీఠం సంక్షేమ సేవా సంఘం ఉపాధ్యక్షురాలు తాళ్లూరి కుమారి, ప్రహర్షిత పాల్గొన్నారు.

చిల్లర ఇవ్వలేదని దుకాణదారుడిపై దాడి

తాడేపల్లి రూరల్ : మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు ఒక్క రూపాయి కోసం ఓ కూల్‌డ్రింక్ షాప్ నిర్వాహకుడిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన గుంటూరు జిల్లా సీతానగరంలో చోటు చేసుకుంది. జరిగిన ఘటనపై తాడేపల్లి ఎస్ఐ అపర్ణ కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన నలుగురిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈనెల 4 రాత్రి సమయంలో నలుగురు యువకులు ఆటోలో వచ్చి వాటర్ బాటిల్, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. అయితే షాపు యజమాని పులిగడ్డ వెంకటరావు తమకు రూపాయి వెనక్కి ఇవ్వలేదని ఆ నలుగురు యువకులు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తెనాలి ఐతానగర్‌కు చెందిన బాలసాని శ్రీకాంత్, బాలసాని కోటేశ్వరరావు, గరికె శ్రీను, బాలసాని నాగరాజు దాడికి పాల్పడినట్లు గుర్తించి, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ అపర్ణ తెలిపారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయానికి

ప్రతిష్ఠాత్మక సిమెన్స్ ఈడీఏ సెంటర్

పెదకాకాని: విద్యాలయాలలో అత్యాధునిక రీసెర్చ్, ఆవిష్కరణల రూపకల్పనతోపాటు పరిశ్రమలతో అనుసంధానం చేయడానికి సిమెన్స్ సంస్థ ఏర్పాటు చేసిన సిమెన్స్ ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమిషన్ సెంటర్ (సిమెన్స్ ఈడీఏ సెంటర్) ఏర్పాటుకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ ఎంపికైనట్లు వీవీఐటీయూ ప్రొ–చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటీయూ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం సిమెన్స్ అకడమిక్ పార్టనర్ గ్రాంట్‌కు సమర్పించిన విద్యార్థుల ప్రాజెక్ట్ సమూనాలు, అధ్యాపకుల పరిశోధనల ఆధారంగా ఈ కేంద్రం ఎంపిక కాబడిందని బుధవారం ప్రొఛాన్సలర్ తెలిపారు. ఈ సెంటర్ ఏర్పాటుకు మూడు సంవత్సలకు కోటిన్నర విలువచేసే ఐసీ డిజైన్ అండ్ వెరిఫికేషన్, ఎంబడెడ్ సిస్టమ్స్, పీసీబీ డిజైన్స్ అనుబంధ ఈడీఏ సాధనాలను సిమెన్స్ సంస్థ అందించినట్లు వివరించారు. అనంతరం ఈసీఈ విభాగాధిపతి, ఈడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.వై. భానుమూర్తి, సైట్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఎస్.కె ఇనావుల్‌హక్ లను వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వీసీ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి. అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు అభినందించారు.

నడిరోడ్డుపై నడిపించి కోర్టుకు..



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉన్న రౌడీషీటర్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు నడిరోడ్డుపై నడిపించి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసుకు సంబంధించి గుంటూరు లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న గణపతి రాజేష్, అతని స్నేహితులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఉమర్‌బుడేసాహెబ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీ కొనడడంతో వివాదం జరిగింది. దీనిపై కక్ష పెంచుకున్న గణపతిరాజేష్ అతని స్నేహితులతో కలిసి గతేడాది డిసెంబర్ 21న బుడేసాహెబ్ ఇంటికి వెళ్లి రాడ్లు, కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన బుడేసాహెబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఇందిరాకాలనీకి చెందిన గణపతి రాజేష్ అలియాస్ శ్రీను, గణపతి ఆనంద్, బత్తుల హరీష్‌తో పాటు మరో మైనర్‌ను అదుపులోకి తీసుకుని బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కాగా రౌడీషీటర్ గణపతి రాజేష్ 10 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ ఆఫీసు విజయవాడ

ఫోన్ :0866-2431225. ఈ-మెయిల్:zmvijayawada@mahabank.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(అనుబంధం - IV -A)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనతో చదువుబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

[illegible] "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, ఎక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" ఈ Baanknet పోర్టల్ (https://baanknet.com) ద్వారా [illegible]

ఖాతా : గుర్రం రాజేష్ బాబు - గుంటూరు బ్రాంచ్, మొబైల్ నెం. : 97643 88104.	
ఋణగ్రహీత(లు), హామీదారులు పేరు & సంబంధిత బ్రాంచ్	1. శ్రీ గుర్రం రాజేష్ బాబు (ఋణగ్రహీత), చిరునామా : ఫ్లాటు నెం.401, [illegible] హైదరాబాద్, తెలంగాణా. 2. శ్రీ గుర్రం శ్రీనివాస రావు (హామీదారు), చిరునామా : ఫ్లాటు నెం.501, [illegible] హైదరాబాద్, తెలంగాణా-500072
తేది.14-09-2023 నాటికి బకాయి మొత్తం	రూ.77,50,202/- [illegible] తేది.14-09-2023 నుండి వడ్డీ తేది.14-09-2023 నుండి [illegible]
తెలిసిన మేరకు ఎన్‌కంబరెన్స్‌లు ఏమైనా ఉన్నచో స్థిరాస్తి యొక్క సంక్షిప్త వివరములు	గుంటూరు, [illegible]
స్వాధీనత విధానం	భౌతిక
రిజర్వు ధర	రూ.46,00,000/- [illegible]
ధరావత్తు (EMD)	రూ.4,60,000/- [illegible]
బిడ్ పెంపుదల మొత్తం	రూ.5,000/- [illegible]

ఇ-వేలం తేది : 28-01-2026 మధ్యాహ్నం 1.00 నుండి సాయంత్రం గం.5-00 వరకు [illegible]

ఆస్తుల తనిఖీ తేది : తేది.10-01-2026 నుండి తేది.20-01-2026, ఉదయం గం.10-00 నుండి సాయంత్రం గం.05-00 వరకు

బిడ్ [illegible] : PSB Alliance - Baanknet.com వారి నిబంధనల ప్రకారం

సహాయం కొరకు : ఈ-మెయిల్ : support.BAANKNET@psballiance.com, ఫోన్ నెం. : 8291220220

[illegible] "https://www.bankofmaharashtra.in/propsale.asp" [illegible] BAANKNET పోర్టల్ (https://baanknet.com) [illegible]

తేది : 07.01.2026, ప్రదేశం : విజయవాడ — అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

SHRIRAM శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032. ఆఫీస్: డి.నెం.3/10, 1వ అంతస్తు, స్టోన్ హౌస్ పేట, నెల్లూరు జిల్లా-524002.

లాంఛనాత్మకంగా స్వాధీనత ప్రకటన

[illegible] సెక్షన్ 13 (12) [illegible] సెక్షన్ 13 (4) [illegible] 05 జనవరి 2026న [illegible]

ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయియున్న మొత్తం
1. చింతపట్ల నరేష్, [illegible] నెల్లూరు జిల్లా-524001. 2. [illegible] 524284. 3. చింతపట్ల సంధ్య, [illegible] నెల్లూరు జిల్లా - 524001.	ఋణ ఖాతా నెం. 1. NELL4TF1506270004 2. NELL4TF1608230004 ద్వారా రూ. 2,91,36,438/- [illegible] డిమాండ్ నోటీసు తేది: 24-06-2024

ఆస్తి వివరములు: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ జిల్లా, [illegible]

తేది: 05.01.2026 ప్రదేశం : నెల్లూరు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, [illegible] విజయవాడ - 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. ముక్తేశ్వరరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. : 88866 40777

ఆస్తి తనిఖీ కొరకు : 94945 26440

Appendix – IV –A

[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

[illegible] తేది.20-05-2021 [illegible] నెం.38905014368కు రూ.98,85,584/- [illegible] నెం.38930986305కు రూ.1,70,693/- [illegible] నెం. 38277054584కు రూ.34,21,930/- + తేది.21.05.2021 [illegible] తేది: 28-01-2026న [illegible]

[illegible] నెం.14860/2019, తేది.08.11.2019, [illegible] 252 చ॥గ॥లు లేదా 211.68 చ॥మీ॥ల [illegible] 1168/10053/B/MNGLRI/ATMVIL/2019 [illegible]

రిజర్వు ధర : రూ.47,00,000/-	ధరావత్తు : రూ.4,70,000/-	బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 28-01-2026, సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

[illegible] ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : తేది:08-01-2026 నుండి 27-01-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) [illegible] www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices [illegible] M/s. PSB Alliance & M/s. Baanknet [illegible] https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & [illegible] 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.com [illegible]

2) [illegible] సెక్షన్ 194-1A [illegible]

తేది: 07-01-2026, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి Smart Economic Display

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE

■ గుంటూరులో గాని గుంటూరు పరిసర ప్రాంతాలలో మీ స్థలము, పొలము, అపార్ట్‌మెంట్‌కి హైరేంజ్ అపార్ట్‌మెంట్స్ గాని విల్లాస్ ప్రాజెక్ట్ గాని, ఓపెన్ ప్లాట్స్, వెంచర్స్ గానీ డెవలప్ మెంట్‌కి అనువైనది అని మీరు అనుకుంటే మమ్మల్ని సంప్రదించండి. ఓనర్స్ మాత్రమే. Madhu infrasructure pvt limited gachibowli, hyderabad. parkvilte.in. cell: 9121286882

PLOT FOR SALE

■ గుంటూరు: సిటీ పరిధిలో 1250, 1360, 3000 చ॥ గజాల తూర్పు ఫేస్ ప్లాట్స్ సేల్, గోరంట్ల, అడ్రిత్రి యెల్లోరా ప్రక్కన రేట్ గజం 14,000. సంప్ర॥ 8790894569

SERVICES

DOCUMENTS MISSING

■ నేను దివంగత తాడిగిరి జ్యాన్సెస్ భార్యనైన చింతాబత్తిని దయామణి అనునేను. గుంటూరు జిల్లా మేడికొండూరు మం॥ కొర్రపాడు గ్రామం సర్వే నెం.211, 213 నందు 1.98ఎ॥ భూమి కలదు. డి.నెం:1461/1998&1462/1998 క్రింద రిజిష్టర్ చేయబడినది. ఈ నెల 3వ తేదిన మేడికొండూరుకు బస్సులో వస్తుండగా పోయినవి. ఎవరికైన దొరికినచో తెలియపర్చగలరు. 9849717303

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 8333833368

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nr Dt. 9150011538, 9750497504

WANTED

■ గుంటూరు కొత్తపేట ఇంటి వద్ద పని చేయుటకు వాచ్‌మెన్ కావలెను. భార్య భర్తలకు ప్రాధాన్యత ఇవ్వబడును. వసతి సౌకర్యం కలదు. 9868132826, 9441121025

■ Reuirements as Graphic Designer Sales, Teachers, Hardware Networking, Site Engineers, Telecallers. Q: Any Graduate. loc: AP & TG. 7799261057

■ MNC, LTD కంపెనీల్లో కం॥ఆపరేటర్స్, రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, సూ॥వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్, జీ. 10-25వేలు. ఫోన్. 79939 76590

■ Montessori School, Gnt. Wanted Qualified Primary Teachers, P.E.T, Receptionist మరియు వాచ్‌మాన్ ఫ్యామిలీ కావలెను. 8121400100

■ శ్రీ శాంతి హోమ్‌కేర్ తెనాలి, గుంటూరు, రేపల్లె, నందు పనిచేయుటకు ఆయాలు కేర్ టేకర్స్, నర్సులు(M/F) కావలెను. 7995123705, 7893145549

■ నరసరావుపేట హాస్పిటల్లో పనిచేయుటకు లేడీస్ సెక్యూరిటీ కావలెను. డ్యూటీ 8 గం, జీతం 12K, ESI, PF, Qul: ఇంటర్ P/F. ✆ 73866 88787

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ గుంటూరులో Experience Field Executives కావలెను. Salary: 15-20K + Incentive. ✆ 72079 42933

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K-20K.Ph: 9640400073, 9160900024

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం

గుంటూరు 7075167663 7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించుకుని ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

న్యూస్‌రీల్

గోదా రంగనాథులకు విశేష పూజలు

ఫిరంగిపురం: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రంలోని గీతా మందిరంలో వేంచేసియున్న గోదా రంగనాథ స్వామికి బుధవారం అర్చకులు రాజేంద్రశర్మ విశేష పూజలు చేశారు. గోదా రంగనాథ ఉత్సవ మూర్తులకు విశేషంగా అలంకారం చేసి అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గీతాభజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ, లలితాసహస్ర నామ పారాయణ జరిపారు.

తాళాలు వేసిన ద్విచక్రవాహనం చోరీ

తాడేపల్లి రూరల్: ఉండవల్లి కరకట్ట వెంబడి పోలకంపాడు వద్ద బుధవారం తెల్లవారుజామున ఇంటి ముందు తాళాలు వేసి పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని ఇద్దరు యువకులు చాకచక్యంగా తాళాలు తీసి దొంగిలించారు. పోలకంపాడులో నివాసం ఉండే లారీ యజమాని బత్తుల ప్రభుదాసు మంగళవారం రాత్రి 12.45 గంటల సమయంలో తన స్కూటీని ఇంటి ముందు పార్క్ చేసి తాళాలు వేసి ఇంటిలోకి వెళ్లి నిద్రపోయారు. ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వచ్చి తమ బండి తాళం విరగొట్టి నెట్టుకుంటూ ఉండవల్లి సెంటర్‌వైపు వాహనాన్ని తీసుకువెళ్లారు. జరిగిన సంఘటనపై బత్తుల ప్రభుదాసు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పలువురు చిరు వ్యాపారులకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ సహకారం అందించారు. ఈ మేరకు పలువురు స్థానిక నాయకులు బుధవారం ఆయా మండలాల్లోని చిరు వ్యాపారులకు బడ్డీకొట్లు, టిఫిన్, తోపుడు బళ్లు, ఇస్త్రీబళ్లు అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధి కోసం అవసరమైన వాటిని అందజేసినందుకు మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాలలోని పలువురు చిరు వ్యాపారులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు బుధవారం మంగళగిరికి చెందిన ఖిద్మత్ టీమ్ నిత్యావసర సరుకులను అందజేసింది. ఈ సందర్భంగా ఖిద్మత్ టీమ్ సభ్యులు మాట్లాడుతూ.. ఎంటీఎంసీ పరిధిలోని డోలాస్‌నగర్‌కు చెందిన జొన్నలగడ్డ రమేష్, ప్రకాష్ నగర్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన చింటూ ఇద్దరూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారని అన్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని వారిని పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు విలువగల నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశామని తెలిపారు.

రహదారిపై మురుగుతో ఇక్కట్లు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఓల్డ్ టోల్‌గేటు దగ్గర నుంచి వృద్ధాశ్రమానికి వెళ్లే రహదారిలో ఎడమ చేతి వైపున ఉన్న రహదారిలో మురుగు ముందుకు పారక స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. ఓల్డ్ టోల్‌గేటు దగ్గర నుంచి వృద్ధాశ్రమం వరకు పక్కా సీసీ డ్రెయిన్ ఏర్పాటు చేశారు. ఆ డ్రెయిన్‌కు ఇతర మార్గాల నుంచి వచ్చే డ్రెయిన్‌లను అనుసంధానం చేశారు. ఆశ్రమం రోడ్డులోని డ్రెయిన్‌లో మురుగు వెళ్లే మార్గం లేకపోవడంతో కార్పొరేషన్ అధికారులు మోటారు ఏర్పాటు చేశారు. ఆ విద్యుత్ మోటార్లు ఆన్ చేయనప్పుడు గంటల వ్యవధిలో డ్రెయినేజీలన్నీ నిండిపోయి రోడ్ల మీదకు మురుగు వస్తోంది. రోడ్లపైకి వచ్చిన మురుగు పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లోకి వెళ్లడంతో ఆ ప్రాంతమంతా మురుగు కూపంగా మారి దుర్వాసన వస్తోంది. కార్పొరేషన్ అధికారులు మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

400 రోజులకు చేరిన ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 400వ రోజుకు చేరుకున్నాయి. సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, యూనియన్ కార్యదర్శి స్టీవెన్‌లు దీక్షా శిబిరాన్ని ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలిపారు. సీపీఎం అన్ని వేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దీక్షల్లో సుబ్బారావు, ఇశ్రాయేల్, యహోషువా, దేవరాజు, హగ్గయ్య కూర్చొన్నారు. నాయకులు బూరగ అంకయ్య, సాంబశివరావు, టి.నాగేశ్వరరావు, సుభాని, జోజప్ప, ఆశీర్వాదం, ఇస్మాయిల్, మహిళలు, మహిళా మండలి కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియామకం

పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వివరాల వెల్లడి



తాడికొండ: తాడికొండ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీల నియామక ఉత్తర్వులను బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం వెలువరించింది. ఈ మేరకు తాడికొండ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా సంపతి నాగరాజు, నియోజకవర్గ చేతివృత్తుల విభాగం అధ్యక్షులుగా షేక్ మహమ్మద్ ఖాసిం, నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులుగా మహమ్మద్ బషీర్ నియమితులయ్యారు. మేడికొండూరు మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా మర్రి వినోద్ కుమార్, తాడికొండ మండల సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా తాడిబోయిన గణేష్ నియమితులయ్యారు.

- ఫిరంగిపురం మండలంలో..

ఫిరంగిపురం మండల బీసీ విభాగ కమిటీ అధ్యక్షులుగా మర్రి శివగోపి, ఉపాధ్యక్షులుగా గొరిగ జోసెఫ్, ఎం.సాంబశివరావు, జనరల్ సెక్రటరీలుగా బొర్రా రమేష్, గోరంట్ల పెద్దబ్బాయి, ఒంటిపులి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా కె.వరప్రసాద్, వల్లెపు రామకృష్ణ, నందిగంటి వెంకట్రావు, చిమటా తిరుపతయ్య, ఆర్.పుల్లారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పతి నాగేశ్వరరావు, వేల్పుల గోపీ, ఏలూరి సిద్దయ్య, తాటి అప్పారావు, రాయదుర్గం రామయ్య, తోక సుబ్బారావు, గోపిదేశి గోపి నియమితులయ్యారు.

- రైతు విభాగం కమిటీ అధ్యక్షులుగా కంభాల రామారావు, ఉపాధ్యక్షులుగా జొన్నల సాంబిరెడ్డి, షేక్ మౌలాలి, జనరల్ సెక్రటరీలుగా పిట్టల శ్రీనివాస్, షేక్ కన్న మాబు షరీఫ్, కొల్లి సాంబిరెడ్డి, సెక్రటరీలుగా సంగల వెంకటప్పారెడ్డి, దూలం అంజిరెడ్డి, సాకే గోవింద్, కంజుల వెంకట సుబ్బారెడ్డి, నూతలపాటి నరేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దేవరపల్లి రామకృష్ణ, మేళం జయపాల్ రావు, చుక్కా లూర్ధురాజు, షేక్ నబీ సాహెబ్, పచ్చల బాబురావు, వల్లం రెడ్డి సుబ్బరామిరెడ్డి, ఎస్సీ విభాగం అధ్యక్షులుగా బోయలపల్లి సాల్మన్, ఉపాధ్యక్షులుగా దేవరపల్లి దాసు, యేసుపోగు మహేష్ బాబు, జనరల్ సెక్రటరీలుగా కారసాల బాజి, దార్ల పూర్ణయ్య, మీసాల రోశయ్య, సెక్రటరీలుగా తురకా రాయప్ప, పచ్చల అశోక్, దారా కోటేశ్వరరావు, గేరపాటి ఆదియ్య, మోడి జోసప్ తంబి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చుక్కా జొజప్ప ఉప్పులూరి నాగరాజు, దారా నాగరాజు, దుమ్మల రామారావు, తాళ్లూరి కాశయ్య, చెవుల చిన్న నరసింహారావు, ఈపూరి ప్రసాద్‌లు నియమితులయ్యారు.
- సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా కంబాల సతీష్, ఉపాధ్యక్షులుగా పోపూరి వెంకట భాను ప్రకాష్ రెడ్డి, పీసపాటి మహబూబ్ సుభానీ, జనరల్ సెక్రటరీలుగా రేపూడి భాస్కర్, మేకల నాగేశ్వరరావు, అప్పాల వెంకటేశ్వరరావు, సెక్రటరీలుగా కొరబండి సంతోషరావు, పరగటి వెంకట్రావు, చట్టి వెంకట్రావు, కన్ను మహబూబ్ సుభానీ, పులకన హరికృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పచ్చల లూర్ధురాజు, పుల్లగూర రమేష్, గేరా శ్రీనివాసరావు, కంచర్ల రత్నరాజు, షేక్ జిలానీ, అల్లడి కోటేశ్వరరావు, గొట్టిపాటి సజీవ నియమితులయ్యారు.
- ఫిరంగిపురం మండల యూత్ వింగ్ కమిటీ అధ్యక్షులుగా సయ్యద్ సైదు సాహెబ్, ఉపాధ్యక్షులుగా సాలె జోసఫ్, గోపిదేశి పూర్ణయ్య, జనరల్ సెక్రటరీలుగా చీరాల లింగయ్య, సాకె సుబ్బారావు, సంగు రమణారెడ్డి, సెక్రటరీలుగా బొంతు మస్తాన్ రావు, వేల్పుల బొల్లయ్య, గేరపాటి కిరణ్ కుమార్, దొడ్డా సర్వేశ్వర రెడ్డి, షేక్ నవాజ్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మార్పుల రాఘవేంద్ర రెడ్డి, పచ్చల శామ్యూల్ జాన్, చుక్కా కిరణ్, దాట్ల వెంకట రెడ్డి, షేక్ మస్తాన్ వలి, చిట్టా శ్రీనివాసరెడ్డి, మేకల రమేష్, తుళ్లూరు మండల యువజన విభాగం అధ్యక్షులుగా బెజ్జం రాంబాబు, ఉపాధ్యక్షుడుగా బొడ్డుపల్లి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీలుగా తోకల రామకృష్ణ, ధరావత్ స్వామి నాయక్, కొప్పుల మహేష్, (తంబి), సెక్రటరీలుగా బొలుసుపాటి వీరబాబు, తోకల నాగేశ్వరరావు, జొన్నకూటి రాజేష్, ధనసిరి ఫణీంద్ర కుమార్, బెజ్జం గోవర్ధన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బచ్చల డేవిడ్, మెరుగుమాల ఏసుబాబు, కారుమంచి అశోక్, బండి బుజ్జిబాబు, వేకల సాగర్, గోపిదేశి గోపాల కృష్ణ, పులి కృపాదానం నియమితులయ్యారు.
- తుళ్లూరు మండల పబ్లిసిటీ వింగ్ కమిటీ అధ్యక్షులుగా కావూరి అజయ్, ఉపాధ్యక్షులుగా నెల్లూరి ఫణీంద్ర, నేలపాటి వినీత్ కుమార్, జనరల్ సెక్రటరీలుగా సరిగల శివ, వల్లంరెడ్డి యశ్వంత్ రెడ్డి, వన్నం రాజు, సెక్రటరీలుగా షేక్ సాదిక్, శానం రత్నబాబు, సంకా నాగమల్లేశ్వరరావు, వలపర్ల వసంతరావు, అంకాల మదన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రేమాజి లక్షణరాజు, కట్టెపోగు ప్రకాశరావు, పూజల చక్రవర్తి, బండి చంద్రశేఖర్, మల్కాపురపు సుబ్బారావు, దివెల్ల వెంకటేశ్వరరావు, బేతపూడి వికాస్ నియమితులయ్యారు.
- తాడికొండ మండల యువజన విభాగం అధ్యక్షులుగా షేక్ అజీస్, ఉపాధ్యక్షులుగా ఎస్.నాగరాజు, ఎ.దాసు, జనరల్ సెక్రటరీలుగా ఎం.నితిన్ రెడ్డి, షేక్ షంషుద్దీన్, టి.రాజశేఖర్ రెడ్డి, షేక్ భాషా, ఎం.పవన్ రెడ్డి, షేక్ జిలానీ, షేక్ సుభానీ, జి.అప్పారావు, షేక్ అబ్దుల్ రెహమాన్, ఎన్.అశోక్ కుమార్, పి.దేవరాజు, కె.అజయ్, ఐ.మహేష్ రెడ్డి, షేక్ ఆషిక్, షేక్ రఫీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు వెలువరించింది.

మహిళా విభాగం కమిటీ అధ్యక్షులుగా..

మహిళా విభాగం కమిటీ అధ్యక్షులుగా యెండ్రెడ్డి హేమలతారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా బండ వెలంగిణి మరియకుమారి, జనరల్ సెక్రటరీలుగా కురగంటి చిరంజీవి, గల్లా నాగవేణి, రామచంద్రపు తేజరాణి, షేక్ బాజీ, సెక్రటరీలుగా పాములపాటి వెంకటేశ్వరమ్మ, డొల్లా జ్యోతి, షేక్ మస్తాన్ బీ, మెంతుల జాన్సీరాణి, దాసరి అన్నమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జొన్నలగడ్డ మేసుదానమ్మ, కర్రి వరదానం, జొన్నలగడ్డ కమలమ్మ, కర్రి మరియమ్మ, ఒంపుగుడి ద్వారక, గొట్టిపాటి ప్రమీల, నేలపాటి యేసుదానం నియమితులయ్యారు

మైనార్టీ సెల్ అధ్యక్షులుగా..

మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ మస్తాన్ వలి, ఉపాధ్యక్షులుగా గంగూలి మస్తాన్ వలి, షేక్ మహబూబ్ సుభానీ, జనరల్ సెక్రటరీలుగా షేక్ అమానుల్లా, షేక్ ఖాసిమ్ షాలిద్, గుంటూరు షేక్ మస్తాన్ వలి, సెక్రటరీలుగా షేక్ గౌస్, షేక్ మస్తాన్ బాజీ, షేక్ చాంద్ బాషా, షేక్ మస్తాన్ షరీఫ్, డి.కాలేషా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ పెద్ద జాను, షేక్ ఖాసిం షరీఫ్, షేక్ తంగెళ్ల(జానీ), షేక్ అమర్ జాన్, షేక్ మస్తాన్ వలి, షేక్ రఫి, షేక్ రహంతుల్లా నియమితులయ్యారు.

మంగళగిరి నియోజకవర్గంలో..

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా పెంటపల్లి వినయ్, మంగళగిరి మండల వలంటీర్స్ వింగ్ ప్రెసిడెంట్‌గా కుందరపు నీలిమ, మంగళగిరి మండల యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా కాజ సురేష్ , మంగళగిరి మండల మహిళా విభాగ వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మిశెట్టి రాణిప్రియ, మంగళగిరి మండల యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా షేక్ జిలాని, దుగ్గిరాల మండల యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా కూరపాటి నరేంద్ర నియమితులయ్యారు.

సమష్టిగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ, రవాణా శాఖ సమన్వయంతో పని చేయాలని మంగళగిరి నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులతో మారథాన్ నిర్వహించారు. గౌతమ బుద్ధరోడ్‌లో ర్యాలీగా వెళ్లి అవగాహన కల్పించారు. డీఎస్పీ మురళీకృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. మంగళగిరిలో రోడ్డుప్రమాదాలు జరగకుండా ఉండడమే లక్ష్యంగా ప్రజలందరినీ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగస్వామ్యం చేయడం కోసమే మారథాన్ నిర్వహించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరాస్వామి, రూరల్ ఎస్ఐ వెంకట్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇంటి స్థలం చూపాలి

సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: అమరావతి రాజధానికి అనుసంధానంగా నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం సందర్భంగా కేఎల్ రావు కాలనీ బకింగ్‌హామ్ కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి కారణంగా ఇల్లు కోల్పోయిన పేదలకు ఇంటి స్థలాల పొజిషన్ చూపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ప్రభుత్వాధికారులను కోరారు. బుధవారం తాడేపల్లి పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం పేదల ఇళ్లు తొలగించిన అధికారులు ప్రకాష్‌నగర్‌లోని తెల్లక్వారి దగ్గర, ఆత్మకూరులోని జగనన్న కాలనీలో బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని చెప్పారని అన్నారు. ఆత్మకూరులో పేదలకు కేటాయంచిన స్థలాలు గతంలో కాలనీ అభివృద్ధికి కేటాయించిన స్థలాలని కాలనీ వాసులు చెబుతున్నారని.. ఆ స్థలాలను ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నామన్నారు. స్థలాలు కేటాయించామని చెప్పారే గానీ నేటి వరకు పేదలకు ప్లాట్ల పొజిషన్ చూపించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి, బూరుగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను తక్షణం విడుదల చేయాలి

మంత్రి భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

మంగళగిరి టౌన్: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1,200 కోట్ల రాయితీలను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళగిరి ఏపీఐఐసీ భవనంలో బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డీజీ భరత్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఆ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొదటి తరం ఎస్సీ, ఎస్టీ యువతీ యువకులు పరిశ్రమలు పెడుతున్నారని, వాటిని నడపడంలో వారికి అనుభవం లేకపోవడంతో వచ్చే నష్టాలను భర్తీ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రోత్సాహం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు కల్పించిందని అన్నారు. రాయితీలు విడుదల చేయకపోవడం వల్ల పలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి భరత్ మార్చి నెలాఖరులో చెల్లించే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం రాష్ట్ర నాయకులు మాల్యాద్రి ఉన్నారు.

7.5 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

మేడికొండూరు: రేషన్ బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేయాల్సిన డీలర్రే అక్రమ మార్గంలో సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన మేడికొండూరు మండలంలోని చోటుచేసుకుంది. మేడికొండూరు ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. తురకపాలెం గ్రామానికి చెందిన షేక్ తాజ్ హుస్సేన్(23) అదే గ్రామంలో తన తండ్రి రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం తన ఇంటి వద్ద ఉన్న 7.5 క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని హుస్సేన్ అక్రమంగా ఆటోలో లోడ్ చేసుకున్నాడు. వీటిని బయట మార్కెట్లో అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి వాహనాన్ని అడ్డగించారు. తనిఖీల్లో రేషన్ బియ్యం అని తేలడంతో బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హుస్సేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

తాడేపల్లి రూరల్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటల పోటీలు సుందరయ్యనగర్, మహానాడులో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సంక్రాంతి ఆటల పోటీలలో భాగంగా కలర్స్, షాట్‌పుట్, తాడు లాగుట పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి సంక్రాంతి పండుగ రోజున బహుమతి ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా తాడేపల్లి పట్టణ కార్యదర్శి గిరిజ, స్థానిక కమిటీ కార్యదర్శి జ్యోతి, అధ్యక్షులు నారిన రేణుక, భ్రమరాంబ, సత్యవతి, అంజలి, సుధ, ఉష, నాగమణి, సౌజన్య పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌తో పూర్తయిన ఒప్పందం

తాడికొండ: ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి గ్రామాల పరిధిలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ కార్యకలాపాలకు మార్గం సుగమమైంది. రాజధానిలో తమ ప్రాంతీయ కార్యాలయాన్ని నిర్మించేందుకు సిద్ధమైన నేపథ్యంలో కార్యాలయ ఏర్పాటు కార్యాచరణలో భాగంగా ఐవోబీ ప్రతినిధులు, ఏపీ సీఆర్డీయే మధ్య బుధవారం ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఒప్పంద పత్రాలను సీఆర్డీయే జాయింట్ డైరెక్టర్(ఎస్టేట్స్) వి.డేవిడ్ రాజు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ ప్రాంతీయ కార్యాలయ చీఫ్ రీజినల్ మేనేజర్ హర్జిత్ సింగ్‌కు అందజేశారు. అమరావతిలో సుమారు రూ.10 కోట్లతో పెట్టుబడి పెట్టనున్నట్లు హర్జిత్ సింగ్ వెల్లడించారు.

సంక్షోభంలో చేనేత వృత్తి

మాట్లాడుతున్న చేనేత నాయకులు

మంగళగిరి టౌన్: కళాత్మకమైన చేనేత వృత్తి నేడు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని పలువురు చేనేత నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చేనేత నాయకులు మాట్లాడుతూ.. 78 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న చేనేత వ్యతిరేక, జౌళి పరిశ్రమ అనుకూల విధానాలే ఈ దుస్థితికి ప్రధాన కారణమని విమర్శించారు. చేనేత రంగ రక్షణకు రాష్ట్రస్థాయి ఉద్యమం తప్పనిసరి అంటూ పేర్కొన్నారు. ఫిబ్రవరి 22న మంగళగిరి ఎన్ఆర్ఐ వై జంక్షన్‌లోని నేతన్న సర్కిల్ వద్ద నిర్వహించనున్న చేనేత గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నైపుణ్యం ఉన్న నేతన్నలు ఇతర పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.25 వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించి సకాలంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, బండారు ఆనందప్రసాద్, పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, శివదుర్గారావు, పరమేశ్వరరావు, వెంకట కృష్ణారావు, బాలతేడేరు, వెంకటేశ్వరరావు, సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో యువకుడు

- నుదిటిపై తీవ్ర గాయం
- కొట్టి పడేశారా.. రోడ్డు ప్రమాదమా అని స్థానికుల్లో అనుమానం!

అపస్మారక స్థితిలో యువకుడు

వైద్య నిమిత్తం 108లో విజయవాడ ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ కరకట్ట నుంచి మణిపాల్ హాస్పిటల్‌కు వెళ్లే 40 అడుగుల రోడ్డులో పంట పొలాల్లో రోడ్డు పక్కనే ఓ యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన రైతులు, స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చేసరికి ఆ యువకుడు కొన ఊపిరితో ఉన్నాడని గమనించి 108 ద్వారా వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న తాడేపల్లి ఎస్ఐ సాయి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని పరిశీలించారు. ఎస్ఐ సాయి తెలిపిన వివరాల ప్రకారం.. యువకుడు తూర్పుగోదావరి జిల్లా, అమలాపురం తాలూకా ఉప్పలగుప్తం మండలం, సరిపల్లె గ్రామానికి చెందిన చవుటపల్లి దొరబాబుగా గుర్తించారు. దొరబాబు ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ మహానాడులోని ఒక రూమ్‌ను అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అదే రోడ్డులో నివాసముంటున్న బంధువుల ఇంటికి వచ్చి తిరిగి మళ్లీ రూమ్‌కు వెళుతున్నప్పుడు ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. యాక్సిడెంటా లేక ఎవరైనా కొట్టారా అని స్థానికులు అనుమానం పడుతున్నారు. ఘటనపై ఎస్ఐ సాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

షాపుల వేలంతో ఏటా రూ.13.32 లక్షల ఆదా

పేరేచర్ల వేలం పాటలో పాల్గొన్న పంచాయతీ అధికారులు

మేడికొండూరు: పేరేచర్ల గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంచే దిశగా అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. పంచాయతీ మెయిన్ సెంటర్‌లోని వాణిజ్య సముదాయానికి బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం ఆసక్తికరంగా సాగింది. డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.పూర్ణ శంకరరావు పర్యవేక్షణలో మొత్తం 12 షాపులకు వేలం నిర్వహించగా, 8 షాపులకు రికార్డు స్థాయి ధరలు పలికాయి. మొత్తంగా 8 షాపుల ద్వారా పంచాయతీకి ఏటా రూ.13,32,000 ఆదాయం సమకూరనుందని డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పాములపాటి సురేష్, గ్రామ పెద్దలు పాములపాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివాణపై అవగాహన

దుగ్గిరాల: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ప్రధాన సమస్యగా ఉందని.. నివారణకు రైతులు అవగాహన కలిగి ఉండాలని ఆర్.విజయబాబు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమలో రైతులతో ఆయన సమావేశం అయ్యారు. పురుగు ఉధృతిని రైతులు నిరంతరం గమనిస్తూ ఉండాలని ఆయన తెలియజేశారు. నివారణకు వాడాల్సిన మందుల వివరాలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, వీఏఏలు సంసోనమ్మ, గోవిందమ్మ, ఎంపీఈవో రాఘవ, రైతు సోదరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

దుగ్గిరాల: గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన భూ యజమానులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు, పెనుమూలి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సచివాలయాలలోని రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు ఐ.సునీత, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వో, వీఆర్ఏలు, పాల్గొన్నారు.

మిరప తెగుళ్లపై క్షేత్ర ప్రదర్శన

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో మిరప పంటలో వచ్చే తెగుళ్లు.. వాటి నివారణ పద్ధతులు, మందు గురించి రైతులకు బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెస్టిసైడ్స్ ఇండియా కంపెనీ మేనేజర్ ఎం.మణికంఠారెడ్డి మాట్లాడుతూ.. జీవ రసాయన ఫంగిసైడ్ అనేది సిలీంద్ర కణగోడల నిర్మాణాన్ని అడ్డుకుంటుందని చెప్పారు. తెగుళ్ల నివారణను రైతులకు వివరించారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

మంగళగిరి టౌన్: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని వీజే జూనియర్, డిగ్రీ కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, కళాశాల రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రెయిన్‌బో బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలను పలువురు వక్తలు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజోమూర్తి, డిస్ట్రిక్ట్ ఛైర్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ పీడీజీ రత్నప్రభాకర్, రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్, రోటరీ క్లబ్ కార్యదర్శి నిరంజన్ గుప్త, రెయిన్‌బో బ్లడ్‌బ్యాంక్ వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై ప్రమాదకర గుంత!

మంగళగిరి టౌన్: మంగళగిరి గౌతమబుద్ధ రోడ్ ప్రధాన రహదారిపై ఓ గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ పరిధి ఆంజనేయస్వామి బొమ్మ ఎదురు రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. దగ్గరకు వచ్చేవరకు ఆ గుంత కనబడకపోవడంతో పలువురు ద్విచక్రవాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. కొన్ని రోజుల క్రితం దీనిని గమనించిన స్థానికులు చెత్తను కప్పి ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ప్రమాద సూచికను తొలగించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

పచ్చని సుక్షేత్రమే కానీ.. పిన్ను పీకేసిన గ్రనేడ్..

అపార చమురు, సహజవాయు నిక్షేపాలు..
అనునిత్యం పొంచి ఉన్న ప్రమాదాలు..
గోదావరి పాయలు.. కొబ్బరి అందాల వెనుక కానరాని కష్టాలు..

సైరన్ వినిపించినా.. టముకు శబ్దం చెవిని తాకినా.. హఠాత్తుగా కరెంటు ఆపేసినా.. అక్కడ జనం వణికిపోతారు.. తట్టాబుట్టతో పిల్లాజెల్లాతో బంధువుల ఇళ్లకు బయల్దేరతారు.. కోనసీమలోని 316 గ్రామాలలోని పరిస్థితి ఇది. కోనసీమ అంటే.. అఖండ గోదావరి ఏడు పాయలుగా విచ్చుకున్న సుందరప్రదేశం.. గలగలపారే కాలువల నడుమ వరిపైర్లు.. కొబ్బరితోటలు.. అరటివనాలతో ఆహ్లాదాన్ని పంచే అందమైన ప్రాంతం. కానీ.. అందరికి తెలియని కోనసీమ మరొకటుంది. చిన్న శబ్దానికే చిగురుటాకులా వణికిపోయే ప్రాంతం అది.. దానికి కారణం చమురు, సహజవాయువు నిక్షేపాలు.. ఆ సంపదను ఒడిసిపట్టుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలు.. అందుకే కోనసీమ అంటే.. పిన్ను పీకేసిన గ్రనేడ్.. అది ఏ క్షణంలో ఎక్కడ పేలుతుందో ఎక్కడ మండుతుందో.. ఇరుసుమండలో మండుతున్న ఓఎన్జీసీ బావి తాజా దృష్టాంతం.. అది ఓ సజీవ సాక్ష్యం..

– ఏపీ సెంట్రల్ డెస్క్



అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీకి చెందిన మోరి-5వ నంబర్ బావి వద్ద ఈ నెల 5న భారీ బ్లోఅవుట్ సంభవించింది. పెద్దఎత్తున మంటలు ఎగసిపడుతుండటంతో చుట్టుపక్కల భీతావహ వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. మంటల తీవ్రత తగ్గినప్పటికీ బ్లోఅవుట్ ఇప్పటికీ అదుపులోకి రాలేదు. ముందుజాగ్రత్తగా ఇరుసుమండ, లక్కవరం గ్రామాలను ఖాళీ చేయించారు. మంటలు అదుపులోకి రావడానికి వారం రోజులు పడుతుందని అంచనా.

కోనసీమ కాదు బ్లో అవుట్ల సీమ..

కోనసీమలో చమురు, సహజవాయు సంస్థ ఓఎన్జీసీ జరుపుతున్న తవ్వకాలలో భాగంగా నిత్యం ఏదో ఒకమూల చిన్నపాటి బ్లోఅవుట్లు, గ్యాస్ లీక్ ఘటనలు చోటు చేసుకుంటూనే ఉంటాయి. కాని ఓఎన్జీసీ నిపుణులు వెంటనే అరికట్టడంతో.. అందువల్ల వాటి గురించి జనబాహుళ్యానికి పెద్దగా తెలియదు. రికార్డులకూ ఎక్కవు. భారీ బ్లోఅవుట్ అయితేనే ప్రపంచానికి తెలుస్తుంది. అలాంటివాటిలో కొన్ని..

తొలి బ్లోఅవుట్ కొమరాడలో..

1993 మార్చిలో మామిడికుదురు మండలం కొమరాడలోని ఓఎన్జీసీ సైట్లో బ్లోఅవుట్ సంభవించింది. లీకైన గ్యాస్ బురద నీటిలో కలిసింది.. ఆ ప్రాంతంలో పలుచోట్ల మంటలు ఎగసిపడి, కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయి. కొన్ని రోజుల తర్వాత లీక్ అదుపులోకొచ్చింది..

ప్రపంచంలోనే పెద్దది.. పాశర్లపూడి బ్లోఅవుట్

1995 జనవరి 8న మామిడికుదురు మండలం పాశర్లపూడిలో పెద్దఎత్తున గ్యాస్ లీకైంది. పాశర్లపూడి-19 బావి వద్ద డ్రిల్లింగ్ సమయంలో ఏర్పడిన గ్యాస్ లీక్కు నిప్పురవ్వ తోడవడంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దాదాపు 65 రోజులపాటు కొనసాగాయి. ప్రమాద సంభవించిన రిగ్గుకు రెండు కిలోమీటర్ల పరిధిలోని ఏడు గ్రామాలలో దాదాపు 5వేలకుపైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.. ఓఎన్జీసీ అంతర్జాతీయ నిపుణులను సంప్రదించింది. చివరకు స్థానిక నిపుణుల బృందమే బావిని మూసివేయగలిగింది. మార్చి 15న మంటలు అదుపులోకి వచ్చాయి. ఓఎన్జీసీకి రూ.16 కోట్ల నష్టం వాటిల్లింది. ప్రమాద ప్రదేశంలో ధ్వంసమైన రిగ్గు ఖరీదు రూ.9కోట్లు. రూ.7 కోట్ల విలువైన ఇతర పరికరాలు ధ్వంసమయ్యాయి. వీటికి క్రైసిస్ మేనేజ్మెంట్ ఖర్చులు అదనం. ప్రపంచంలోనే పెద్ద బ్లోఅవుట్గా పేరు తెచ్చుకున్న ఈ ప్రమాదంలో రోజుకు వంద క్యూబిక్ మిలియన్ల గ్యాస్ వృథాగా మండిపోయింది.

దేవరపల్లి బ్లోఅవుట్

1997 ఫిబ్రవరి 19 మధ్యాహ్నం రావులపాలెనికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పితానివారిపాలెంలో గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి.. తీవ్రంగా శ్రమించిన నిపుణుల బృందం ఫిబ్రవరి 23న అదుపులోకి తెచ్చింది. ఆ సమయంలో మంటలు 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుకు ఎగసిపడ్డాయి.

తాండవపల్లి బ్లోఅవుట్

అమలాపురం మండలం తాండవపల్లిలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్ వద్ద 2005 సెప్టెంబర్ 8న భారీ విస్ఫోటనంతో బ్లోఅవుట్ సంభవించింది పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి.

నగరం గ్యాస్ పైప్లైన్ పేలుడు

2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరం గ్రామంలో గెయిల్కు చెందిన ప్రధాన పైప్లైన్ నుంచి గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది మరణించారు. 16 మంది గాయపడ్డారు. అనేక జంతువులు, పక్షులు కూడా మరణించాయి. పెద్దఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం కలిగించిన ఈ ఘటన బ్లోఅవుట్ల చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచింది.

ఉప్పూడి బ్లోఅవుట్

కాట్రేనికోన మండలం ఉప్పూడిలో 2020 ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్యాస్ లీకై పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. రెండురోజులకు ప్రత్యేక బృందం బ్లోఅవుట్ను అదుపులోకి తెచ్చింది.

బ్లో అవుట్ జరిగేది ఇలా..

భూగర్భంలో ఉండే విపరీతమైన గ్యాస్ ఒత్తిడిని నియంత్రించలేని పరిస్థితుల్లో గ్యాస్బావిలోని పైప్లైన్లు లేదా ఇతర పరికరాల రాపిడి వల్ల నిప్పురవ్వలు ఏర్పడి మంటలు చెలరేగుతాయి. బావులు తవ్వుతున్నప్పుడు ఓఎన్జీసీ సిబ్బంది పైపులను దింపడం.. అవసరమైతే పైకి తీయడం చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలోనే నిప్పురవ్వలు రాజుకుంటాయి. గ్యాస్ బావుల తవ్వకంలో సాంకేతిక లోపాలు, పైప్లైన్ల నిర్వహణలో లోపాలు లేదా తుప్పపట్టడం వంటి పరిస్థితులు బ్లోఅవుట్లకు కారణమవుతాయని నిపుణులంటున్నారు. పాశర్లపూడి గ్యాస్ బావి నుంచి పైపులను పైకి తీస్తున్న సమయంలో ఒక పరికరం జారి బోర్వెల్లో ఇరుక్కుపోయింది. అది పైపులకు అడ్డుపడగా.. అవి ఎక్కడికక్కడ బిగుసుకుపోయాయి. వీటిని బయటకు తీయటానికి లాగే క్రమంలో ఒరిపిడికి పుట్టిన నిప్ప రవ్వలతో గ్యాస్ అంటుకుంది. ఆ మంట బోర్వెల్లోకి దూసుకెళ్తున్న సమయంలో పాశర్లపూడి ప్రాంతంలో భూమి పెద్దగా కంపించింది. బోర్వెల్లో ఉన్న పైపులు పెద్ద శబ్దంతో పైకి ఎగిరి కొన్ని కిలోమీటర్ల దూరంలో పడ్డాయి.

కోనసీమలో ఓఎన్జీసీ కార్యకలాపాలు..

ఓఎన్జీసీ, దాని భాగస్వామ్య సంస్థలు 1959 నుంచి చమురు, గ్యాస్ నిక్షేపాలను అన్వేషించడం, ఉత్పత్తి చేయడం కొనసాగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఓఎన్జీసీ కోనసీమ ప్రాంతంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది.

- **1959:** కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్లో హైడ్రోకార్బన్ల కోసం తొలి అన్వేషణ మొదలు. ఓఎన్జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) జియోలాజికల్ మ్యాపింగ్ నిర్వహించింది.
- **1965:** సంప్రదాయ సిస్మిక్ (భూకంపన) సర్వేలు ప్రారంభం.
- **1983:** రాజోలు దీవిలోని బావి నంబర్-1లో మొదటి గ్యాస్ ఆవిష్కరణ.
- **2002:** ప్రపంచంలోనే అతిపెద్ద బ్లాకలలో ఒకటైన కేజీ డీ-6 బ్లాక్లో అపార గ్యాస్ నిక్షేపాలున్నట్లు గుర్తింపు
- **2020:** డీప్-వాటర్ బ్లాక్, కేజీ డీడబ్ల్యూఎన్- 98/2 నుంచి ఓఎన్జీసీ గ్యాస్ ఉత్పత్తి ప్రారంభం.
- **2022:** కోనసీమ జిల్లాలో యూ-ఫీల్డ్ ఆన్షోర్ సౌకర్యాలను ప్రారంభించిన ఓఎన్జీసీ.

బ్లో అవుట్ దోబూచులాట

మలికిపురం: కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలోని ఓఎన్జీసీ మోరి-5 బావి వద్ద ఏర్పడిన బ్లోఅవుట్ ఓఎన్జీసీ విపత్తు నివారణ శాఖ అధికారులను ముప్పుతిప్పలు పెడుతోంది. బుధవారం సాయంత్రం బావివద్ద మంటలు చాలా వరకు తగ్గాయి. దీనిని పరిశీలించిన ఓఎన్జీసీ అధికారులు, జిల్లా అధికారులు ప్రమాదం లేదని ప్రకటించారు. అయితే.. రాత్రి 9గంటల సమయం నుంచి బ్లోఅవుట్ మంటలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో విపత్తు నివారణ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు.

ప్రాణాలు పోతాయనుకున్నా

డ్వాక్రా సంఘం డబ్బులు రూ.30 వేలు మోటార్ సైకిల్ బ్యాగులో పెట్టుకుని బ్యాంకులో కట్టేందుకు సిద్ధమవుతున్నాను. ఇంతలో గ్యాస్ ఎగజిమ్మి శబ్దం రావడంతో గ్రామంలో యువకులు హెచ్చరించారు. ఆందోళనతో మోటార్ సైకిల్ స్టార్ట్ చేయలేక కట్టుబట్టలతో పారిపోయా. పరుగెడుతుండగానే ప్రాణాలు పోతానుకున్నా. ఇలా బతికి వస్తాననుకోలేదు. మోటార్ సైకిల్ను దొంగలు పట్టుకుపోతుంటే యువకులు అడ్డుకుని నాకు తెచ్చి ఇచ్చారు.

– వలవల సత్యనారాయణ, ఇరుసుమండ

భయంతో పారిపోయా..

బ్లో అవుట్ భయంతో ఇల్లు విడిచి పారిపోయాను. వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఏ వస్తువులు పోయాయో చూసుకుంటున్నాను. ఎవరు సాయం చేస్తారో తెలియడం లేదు. ఇంకా ఆ భయం వీడడం లేదు. చుట్టూ ఓఎన్జీసీ బావులే ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి మా ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

– చెట్ల రామలక్ష్మి, ఇరుసుమండ

బతుకుతామనుకోలేదు

ఇంట్లో పని చేసుకుంటున్నాను. ఇంతలో భారీ శబ్దం వచ్చింది. బయటకు వచ్చేసరికి గ్యాస్ ఎగదన్నుతోందని పక్కవాళ్లు చెప్పారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. పెద్ద శబ్దం వచ్చేసరికి ఇంటికి తాళం వేసే ధైర్యం కూడా చేయలేకపోయాను. అందరూ పరుగులు తీస్తుండడంతో నేనూ అడ్డదారిలో పరుగులు పెట్టాను. బతుకుతామనుకోలేదు. ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ రాకూడదు.

– ముగ్గు లక్ష్మి, ఇరుసుమండ

వారం రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం

ఇరుసుమండ ఓఎన్జీసీ గ్యాస్ బావి నుంచి ఎగసిపడుతున్న మంటల్ని పూర్తిగా అదుపు చేసేందుకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం మంటల తీవ్రత చాలా వరకు తగ్గింది. మా సిబ్బంది బావికి దగ్గరగా చేరుకోగలిగారు. అక్కడి నుంచి శిథిలాలు తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. బావికి మరింత సమీపంగా చేరుకున్నాక పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం క్యాప్ ఎలా బిగించాలి అనేదానిపై నిర్ణయం తీసుకుంటాం. హైడ్రో కార్బన్స్ మండేటప్పుడు దాని తీవ్రత అడుగున ఉన్న గ్యాస్ నిల్వలపైన ఆధారపడి ఉంటుంది. నిపుణులైన సిబ్బందిని, అత్యాధునిక పరికరాలను వినియోగిస్తున్నాం.

– విక్రం సక్సేనా, శాంతనూర్దాస్, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు

జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుల ఉద్యమ గళం

- ఫిబ్రవరి 5న ఢిల్లీలో మహా ధర్నా
- సమస్యలపై నిరసనకు పిలుపునిచ్చిన ఏఐ జాక్టో

సాక్షి, అమరావతి: విద్యారంగంలో పెరిగిపోతున్న సమస్యలపై ఉపాధ్యాయులు మరోసారి పోరుబాట పడుతున్నారు. గతేడాది ఆగస్టులో తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో ఇప్పుడు జాతీయ స్థాయిలో ఉమ్మడి సమస్యల పరిష్కారానికి వచ్చేనెల 5న 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. జాతీయ స్థాయిలో 7 ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు అఖిల భారత జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐజాక్టో)గా ఏర్పడ్డాయి. బుధవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఏఐజాక్టో జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏఐఎస్టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.సాయి శ్రీనివాస్, ఆప్టా ప్రధాన కార్యదర్శి ఎం.జి.మెహదీ చలో ఢిల్లీ వివరాలను వెల్లడించారు.

ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లు ఇవీ..

2010 కంటే ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించడం అన్యాయమని, దేశంలో 30 లక్షల మంది ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, పలు ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయని, కేంద్రం చొరవ చూపి పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జాతీయ విద్యా విధానం-2020లోని లోపాలకు సవరణలు చేసి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛనిచ్చి ఎస్సీఈఆర్టీ సిలబస్కు ప్రాధాన్యత ఇస్తూ మాతృ భాషలో బోధనకు అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో బోధనేతర పనులతో విద్యా విధానం కుంటుపడుతోందని, వాటికి నాన్ టీచింగ్ సిబ్బందితో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీనం ప్రతిపాదనలను రద్దు చేయాలని కోరారు. దేశంలో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, విద్యా శాఖలో పనిచేస్తున్న ఒప్పంద ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటి పరిష్కారానికి జాతీయ స్థాయిలో తలపెట్టిన ఉద్యమానికి రాష్ట్రంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు, ఎల్.సాయి శ్రీనివాస్

9 నుంచి మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్

సాక్షి, అమరావతి: మున్సిపల్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఈనెల 9 నుంచి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా భిక్షాటన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏపీటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బరాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఆర్డీఏ భవనంలో సీడీఎంఏ సంపత్ కుమార్ను కలిసి మున్సిపల్ కార్మికుల నిరసన నోటీసు అందజేసినట్టు పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా క్రిస్మస్, సంక్రాంతి పండుగల సమయంలో వేతనాలు నిలిపివేసిన పరిస్థితి రాలేదన్నారు. పర్మనెంట్ ఉద్యోగులు, కార్మికులకు సరెండర్ లీవుల ఎన్క్యాష్మెంట్, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఔట్ సోర్సింగ్ కార్మికులకూ సంక్షేమ పథకాలను ఇవ్వాలన్నారు., సత్వరం వేతనాలు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా భిక్షాటనతో నిరసనలు, ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

జాబ్ క్యాలెండర్ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం

నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర

సాక్షి, అమరావతి: 'ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోతే కాలర్ పట్టుకొని అడగండి' అని బహిరంగంగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్.. రెండో ఏడాది జనవరి వచ్చినా జాబ్ క్యాలెండర్ను ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎంబేటి రామచంద్ర ఓ ప్రకటనలో విమర్శించారు. తమ రాజకీయ స్వప్రయోజనాల కోసం నిరుద్యోగుల భవిష్యత్తో చంద్రబాబు, లోకేశ్ చెలగాటమాడుతున్నారని, జాబ్ క్యాలెండర్ మాట ఎత్తకుండా మొహం చాటేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లలోని పోస్టుల భర్తీని ఇప్పటికీ పూర్తి చేయలేదని, ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఒక్క కొత్త నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఇప్పటికే 5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామంటూ అసెంబ్లీ సాక్షిగా యువతను మోసం చేస్తున్నారని, జాబ్ క్యాలెండర్ కోసం లక్షలాది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించకుంటే నిరుద్యోగ యువత ఆందోళన బాట పడతారని రామచంద్ర హెచ్చరించారు.

గతేడాది మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: మిర్చి ధరల విషయంలో గతేడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు చెప్పారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది కోల్డ్స్టోరేజ్లలో నిల్వ ఉంచిన మిర్చికి రుణాలు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు.

కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగింది వాస్తవమే

సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్తో పోలిస్తే రబీ సీజన్లో కాంప్లెక్స్ ఎరువుల ధరలు కొంత మేర పెరిగాయని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. పోషక ఆధారిత రాయితీ విధానం ప్రకారం భాస్వరం, పొటాష్ ఎరువులలోని నత్రజని, భాస్వరం, పొటాష్, గంధకం ధరలను 6నెలలకు ఒకసారి సమీక్షించి రాయితీలను కేంద్రం ప్రకటిస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ధరలకు ఎరువుల విక్రయించినా, అనవసర ఎరువులను జతచేసి అమ్మే డీలర్ల వివరాలను స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారికి లేదా కాల్ సెంటర్ 155251కు ఫోన్లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేట్పరంపై రేపు ప్రజాపోరు

- విజయవాడ ధర్నాచౌక్లో 50కిపైగా ప్రజాసంఘాల సామూహిక నిరసన దీక్ష
- రాష్ట్రం నలుమూలల నుంచి పాల్గొననున్న మేధావులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సామూహిక నిరసన దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్యకళాశాలల్ని ప్రైవేట్పరం చేయడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. విజయవాడలోని ధర్నాచౌక్లో శుక్రవారం సామూహిక నిరసన దీక్ష చేపట్టనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్ను విజయవాడలో బుధవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్కుమార్, సామాజికవేత్త వసుంధర కుర్ర ఆవిష్కరించారు. సామూహిక నిరసన దీక్షలో వైఎస్సార్సీపీ నాయకుడు, మాజీమంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సహా పలువురు నాయకులు పాల్గొంటారు. 50కిపైగా సంస్థలకు ప్రాతినిత్యం వహిస్తున్న వివిధ విద్యార్థిసంఘాలు, స్వచ్ఛందసంస్థల నేతలు భాగస్వాములవుతున్న ఈ ఆందోళనకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మేధావులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు నిరసన తెలపనున్నారు.

విద్య, వైద్యం ప్రభుత్వరంగంలోనే ఉండాలి

పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రైవేట్ అంటేనే లాభాపేక్ష అని పేర్కొన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వరంగంలోనే ఉంటేనే కోట్లాదిమంది ప్రజలకు మెరుగైన ఫలితాలు లభిస్తాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ అత్యధిక అసమానతలున్న భారత్లో వైద్యరంగాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడితే అసమానతలు మరింత తీవ్రం అవుతాయని పేర్కొన్నారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 20 నెలలుగా 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణపనులు జరగటం లేదన్నారు. గత ప్రభుత్వం మూడేళ్లలో 8 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తిచేస్తే.. నేటి ప్రభుత్వం అన్ని అనుమతులతో 20 శాతం నుంచి 50 శాతం నిర్మాణం పూర్తయిన కళాశాలలను ప్రైవేట్కు కట్టబెడుతోందని విమర్శించారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్కుమార్ ప్రసంగిస్తూ దళిత, గిరిజన, బహుజనవర్గాలకు రిజర్వేషన్లు అమలై సామాజిక న్యాయం పొందాలంటే మెడికల్ కళాశాలలు ప్రభుత్వరంగంలోనే ఉండాలని చెప్పారు. రూ.మూడులక్షల కోట్లకుపైగా వార్షిక బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో సంవత్సరానికి రూ.రెండువేల కోట్లు ఖర్చుచేస్తే మూడేళ్లలో 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తిచేయవచ్చన్నారు. వివిధ రకాల ఈవెంట్స్కు రూ.వేలకోట్లు కేటాయించే బదులు మెడికల్ కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణానికి కేటాయిస్తే పేదప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. సామాజికవేత్త డాక్టర్ వసుంధర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని మన్నించకపోతే ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

నియంత్రణ పేరుతో గొంతు నొక్కుతున్నారు

- వైఎస్సార్సీపీ సోషల్ మీడియా లక్ష్యంగా అక్రమ కేసులు, అరెస్టులు
- చంద్రబాబు ప్రభుత్వ దమనకాండపై ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తాం
- లోకేశ్ ఏ హోదాలో సోషల్ మీడియా కేసులపై సమీక్ష చేస్తారు?
- వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా నియంత్రణ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కుతోందని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ సోషల్ మీడియా లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ పోలీసులను ఉసిగొల్పుతూ, సొంత రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి గత ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సైతం ఉల్లంఘిస్తున్నారని అన్నారు. తాడేపల్లి వైఎస్సార్సీపీ కార్యాలయంలో బుధవారం జూపూడి మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నేతలను అక్రమ కేసులతో అరెస్టు చేయిస్తున్న లోకేశ్.. ఐటీడీపీ పేరుతో టీడీపీ సోషల్ మీడియాలో వస్తున్న అసభ్య పోస్టులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అక్రమ అరెస్టులకు వైఎస్సార్సీపీ భయపడదని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. న్యాయ పోరాటం చేస్తూనే, ప్రజా ఉద్యమం ద్వారా ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ఏ అర్హతతో సమీక్షిస్తారు?

'సోషల్ మీడియా కేసులపై హోం, సమాచార శాఖ మంత్రులతో కలిసి సమీక్షించిన లోకేశ్... తన శాఖ, తన పరిధి కాని అంశాలపై అసలు ఏ అర్హతతో ఈ సమావేశం నిర్వహించారు? వైఎస్సార్సీపీ సోషల్ మీడియా గ్రూప్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఎలా దాడి చేయాలో నిర్దేశించారు. వైఎస్సార్సీపీ సోషల్ మీడియా లేకుండా చేయాలన్నారు. మీ ఆధీనంలోని ఐటీడీపీ.. సోషల్ మీడియా గ్రూపుల్లో వైఎస్సార్సీపీ, వైఎస్ జగన్ కుటుంబంపై విచ్చలవిడిగా పోస్టులు పెడుతోంది. కానీ, సకల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న లోకేశ్ వీటిని పట్టించుకోవడం లేదు. సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ పూర్తిగా టీడీపీకే వర్తిస్తాయి. కానీ, ప్రతిపక్షానికే అన్నట్లు చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోంది' అని జూపూడి తప్పుబట్టారు.

ప్రశ్నిస్తే కేసులా?

'రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండకూడదని భావిస్తున్నారా? మీరు ఏం చేసినా చెల్లుతుందని అనుకుంటున్నారా? సీఎం, ఆయన కుమారుడు కనీస సమాచారం లేకుండా విదేశాలకు వెళ్తే, దానిపై సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే కేసులు పెడతారా? వైఎస్ జగన్, వైఎస్సార్సీపీ తరపున ఎవరూ మాట్లాడకూడదా? వైఎస్సార్సీపీ ఎవరినీ నిందించడం లేదు. కేవలం ప్రభుత్వ తప్పిదాలనే ఎత్తిచూపుతోంది. అదికూడా తప్పనేలా చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. వందలాది యూట్యూబ్ చానెళ్లు, వెబ్ మీడియాల ద్వారా వైఎస్ జగన్ మీద విషం కక్కుతున్న ఐటీడీపీని మూసివేయాలని జూపూడి డిమాండ్ చేశారు. ఏఐతో అశ్లీలాన్ని సృష్టించి వైఎస్సార్సీపీ నేతల కుటుంబాల మీద ఐటీడీపీ పెడుతున్న పోస్టులు కనిపించడం లేదా? సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ అమలు చేయకుంటే మేం మౌనంగా ఉండాలా? అక్రమ కేసులు, అరెస్టులతో మమ్మల్ని భయపెట్టలేరు. మీ నియంత విధానాలు, దుర్మార్గ పాలనను ఎండగడతాం. ఇకపై మీ ఆటలు సాగవు' అని జూపూడి హెచ్చరించారు.

What is Sustainable development?

CHAPTER - 1

Resources and Development

- Anything useful in the environment is called a resource.
- Resources can be biotic or abiotic.
- Resources can be renewable or non-renewable.
- Resources can be owned by individuals, communities, nations, or the world.
- Resources can be potential, developed, stock, or reserves.
- Overuse of resources causes global warming and pollution.
- It also leads to ozone depletion and land degradation.
- In 1992, more than 100 countries met at Rio in Brazil for the Earth Summit.
- The Rio Convention introduced Agenda 21 for sustainable development.
- Jharkhand, Chhattisgarh, and Madhya Pradesh have many minerals and coal.
- Arunachal Pradesh has plenty of water resources.
- Arunachal Pradesh has poor infrastructure.
- Rajasthan has very little water.
- Ladakh is a cold desert.
- Gandhiji said, "There is enough for need, not for greed."
- Schumacher supported Gandhian ideas in his book Small is Beautiful in 1974.
- The Brundtland Report (1987) discussed sustainable development.
- The idea was printed in the book Our Common Future.
- Net sown area means land used once for growing crops.
- Gross cropped area includes land used more than once in a year.
- Land use depends on physical and human factors.
- Physical factors include climate, soil, and topography.
- Human factors include population, technology, and culture.
- India's total area is 3.28 million sq. km.
- India's net sown area is 54%.
- Punjab and Haryana have 80% net sown area.
- Arunachal Pradesh, Mizoram, and Manipur have only 10% net sown area.
- India wants 33% forest area, as per the 1952 Forest Policy.
- Deforestation, overgrazing, and mining have damaged land.
- Land can be saved by planting trees and controlling grazing.

1 MARK

1. Solar energy: Renewable resources :: Fossil fuels : ______?
A. Non-renewable resources.

2. Natural endowments in the form of land, water, vegetation and minerals.
A. Resources.

3. A type of non-renewable resource.
A. Minerals.

4. Soil with high water retaining capacity.
A. Black soil.

5. Which crop is known as the 'golden fibre'?
A. Jute.

6. Plantation of trees on a large scale to check soil erosion.
A. Afforestation.

7. The Great Plains of India are made up of these soils.
A. Alluvial.

8. Based on exhaustibility resources can be classified as ___.
A. Renewable & Non-Renewable.

9. What should be the % of forest in geographical area?
A. 33%.

10. Find out the odd one: (Ladakh, Puducherry, Andhra Pradesh, Chandigarh)
A. Andhra Pradesh.

11. Write any four soil conservation methods.
1. Contour Farming 2. Strip Cropping
3. Crop Rotation 4. Terrace Farming
5. Organic Farming

12. Identify the western most city from the given list: (Imphal - Ranchi - Bhopal – Gandhinagar)
A. Gandhinagar (Gujarat).

13. What is Resource Planning?
A. Resource Planning is the widely accepted strategy for judicious use of resources.

14. Which state is very well endowed with solar and wind energy?
A. Rajasthan.

15. Which state has lacks in water resources?
A. Rajasthan.

16. What lead to socio-economic and environmental problems?
1. Irrational consumption.
2. Over-utilization of resources.

17. At the international level who advocated resource conservation for the first time in a more systematic way?
A. The Club of Rome in 1968.

18. Who is the author of 'Small is Beautiful'?
A. Schumacher.

19. Which philosophy was presented in 'Small is Beautiful'?
A. Gandhian philosophy.

20. What is other than current fallow land?
A. The land which was left uncultivated for the past 1 to 5 agricultural years.

21. Total geographical area of India is _______.
A. 3.28 million sq. km.

22. What is gross cropped area?
A. Area sown more than once in an agricultural year plus net sown area.

23. What is the result of land degradation?
A. Serious repercussions on society and the environment.

24. What are the ways to solve the problems of land degradation?
1. Afforestation 2. Proper management of grazing.

25. What is soil erosion?
A. The denudation of the soil cover and subsequent washing down is called soil erosion.

26. What is sheet erosion?
A. Sometimes water flows as a sheet over large areas down a slope. In such cases the topsoil is washed away. This is known as sheet erosion.

27. What is wind erosion?
A. Wind blows loose soil off flat or sloping land known as wind erosion.

28. Define the term, Bangar.
A. Old alluvial soils are called Bangar.

29. Define the term, Khadar.
1. New alluvial soils are called Khadar.
2. The Khadar has more fine particles and is more fertile.

30. What is Sustainable development?
A. Sustainable economic development means 'development should take place without damaging the environment, and development in the present should not compromise with the needs of the future generations.'

31. Which states are rich in minerals and coal deposits?
1. Jharkhand 2. Chhattisgarh 3. Madhya Pradesh

32. Renewable energy:solar energy :: Non-renewable energy: _?
A. Fossil fuels / Coal / Mineral fuels

33. What are shelter belts?
1.Planting lines of trees to create shelter are called shelter belts.
2. The shelter belts stabilise the sand dunes.

34. Prepare a list of resources found in your state.
1. Limestone. 2. Barytes. 3. Mica.

35. Classify the resources based on origin.
1. Biotic resources. 2. Abiotic resources.

36. Classify the resources on the basis of exhaustibility.
1. Renewable resources.
2. non-renewable resources.

37. Classify the resources on the basis of ownership.
1. Individual resources. 2. Community resources.
3. National resources. 4. International resources.

38. Classify the resources on the basis of status of development.
1. Potential resources. 2. developed stock
3. Reserves.

39. Give examples for global ecological crises.
1. Global warming. 2. Ozone layer depletion.
3. Environmental pollution.

40. Where and when did the Rio de Janeiro Earth Summit held?
A. In June 1992, more than 100 countries met in Rio de Janeiro.

41. On which declaration Rio de Janeiro Earth Summit signed?
A. 'Global Climatic Change and Biological Diversity'.

42. "There is enough for everybody's need and not for any body's greed." Who said it?
1. Gandhiji.

43. Name the human factors that determined the use of land.
1. Population density.
2. Technological capability.
3. Culture and Traditions.

44. What are the causes for the land degradation?
1. Deforestation.
2. Over grazing.
3. Mining and quarrying.

45. Aluminium is extracted from which ore?
A. Bauxite.

46. Expand UNCED.
A. United Nations Conference on Environment and Development.

47. Name the physical factors that determined the use of land.
1. Topography. 2. Climate. 3. Soil types.

48. Define the term "Resource".
1. Everything available in our environment can be termed as 'Resource'.
2. It can be used to satisfy our needs.

49. What are the cropping seasons in India?
A. Rabi, Kharif, Zaid

50. Which one of the following is the main cause of land degradation in Punjab? (C)
(A) Intensive cultivation (C) Over irrigation
(B) Deforestation (D) Overgrazing

51. In which one of the following states is terrace cultivation practiced? (D)
(A) Punjab (C) Haryana
(B) Plains of Uttar Pradesh (D) Uttarakhand

52. In which of the following states black soil is predominantly found? (B)
(A) Uttar Pradesh (C) Rajasthan
(B) Maharashtra (D) Jharkhand

53. Mention the types of soils in India.
1. Alluvial Soils.
2. Black Soil.
3. Red and Yellow Soils.
4. Laterite Soil.
5. Arid Soils.
6. Forest Soils.

54. What is the aim of Agenda 21?
A. Sustainable Development in the 21st century.

55. What is Agenda 21?
1. The Rio Convention in 1992 adopted Agenda 21.
2. It took place at Rio de Janeiro, Brazil.
3. It is the declaration signed by world leaders at the UN Conference on Environment and Development (UNCED).

56. When did the Rio de Janeiro Earth Summit held?
1. In June 1992, more than 100 countries met in Rio de Janeiro.
2. Rio de Janeiro is in Brazil.
3. It is also called the first International Earth Summit.

57. Name the country that occupies the first place in the world in the production of gur.
A. India.

58. Give examples for non-food crops.
A. Rubber, Cotton, Jute.

59. Name the soil that formed from lava.
A. Regur or black cotton soil.

60. Non-renewable energy source(s) :
A. Biomass B. Natural gas
C. Solar energy D. Wind energy

61. Non-conventional source(s):
A. Firewood, coal B. Cattle dung cake
C. Petroleum D. Solar, wind energies

62. Conventional source of energy:
A. Petroleum B. Biogas
C. Atomic energy D. Geothermal energy

63. Arrange the following countries from East to West according to their location. (Egypt, China, England, Japan.)
A. Japan, China, Egypt, and England.

MULTIPLE CHOICE QUESTIONS

1. Resources which are surveyed, and their quantity and quality have been determined for utilisation is known as:
A. Potential resources B. Stock
C. Developed resources D. Reserves

2. In which of the following states is overgrazing responsible for land degradation?
A. Jharkhand and Orissa
B. Madhya Pradesh and Rajasthan
C. Punjab and Haryana
D. Kerala and Tamil Nadu

3. Find the true statement about resources:
A. Resources are free gifts of nature.
B. They are the functions of human activities.
C. All those things which are found in nature.
D. These cannot be used to fulfill our needs.

4. In the process of transformation of things available in our environment involves an interactive relationship between:
A. Nature B. technology
C. institutions. D. All

5. Identify the true statement:
i. Resources are free gifts of nature.
ii. Resources are a function of human actions.
A. i only B. ii only
C. Both are true D. None.

6. Resources can be classified On the basis of:
i. Origin ii. Exhaustibility
iii. Ownership iv. Development
A. i, ii only B. iii, iv only
C. I, ii, iii only D. All.

7. Resources are vital for:
A. Human survival
B. Maintaining the quality of life
C. Both A & B D. Global warming.

8. The soil which is suitable for cashew nut :
A. Alluvial soil B. Black soil
C. Red soil D. Red laterite soil

9. The state having maximum net sown area
A. Jammu and Kashmir B. Uttar Pradesh
C. Tamil Nadu D. Punjab

10. Identify the image:

A. Canal B. Gully erosion
C. Water flow D. Sheet erosion

11. Soil formed by intense leaching is:
A. Alluvial soil B. Red soil
C. Laterite soil D. Desert

12. Which soil is ideal for cotton?
A. Regur B. Laterite
C. Desert D. Mountainous

13. The factor responsible for maximum land degradation is …………
A. Human activities B. Wind
C. Salinity D. Soil erosion

14. The first International Earth Summit held in
A. Geneva B. New York
C. Japan D. Rio de Janeiro

15. Area brought under cultivation in a year:
A. Gross sown area B. Cultivable
C. Net sown area D. Fallow land

16. Major relief feature of India are:
A. Mountains B. Forests
C. Plains D. Plateaus

17. Soil is formed by the process of:
A. Denudation B. Gradation
C. Weathering D. Erosion

18. The old alluvial soil:
A. Bangar B. Bhabar C. Khadar D. Regur

19. Iron ore is a _____ resource:
A. Renewable B. Biotic.
C. Flow D. Non-renewable

20. Erosion of the topsoil when water flows as a sheet over large areas down the slope is:
A. Gully erosion B. Badlands
C. Soil erosion D. Sheet erosion

21. Method of growing long strips of grass between the crops refers to:
A. Contour ploughing B. Terrace farming
C. Strip cropping D. Crop rotation

22. The denudation of the soil cover and washing down of soil by various agents:
A. Weathering B. Gradation
C. Soil erosion D. Soil conservation

23. Ideal method for controlling land degradation in coastal areas and in deserts:
A. Strip cropping B. Contour ploughing
C. Planting of shelter belts D. Plugging of gullies

24. "There is enough for everybody's need but not for anybody's greed" - said by:
A. Nehru B. Vajpayee
C. M. K. Gandhi D. Indira Gandhi

ANSWERS

1. C	2. B	3. B	4. D	5. C	6. D	7. C
8. D	9. D	10. B	11. C	12. A	13. A	14. D
15. C	16. C	17. C	18. A	19. D	20. D	21. C
22. C	23. C	24. C				

Prepared by
K. Suresh, Subject Expert

Daily Quiz 8

1. Mostly, under employment is found in this sector
A) Industries B) Banking
C) Transport D) Agriculture

2. This is an intermediate good
A) Paddy B) Rice
C) Water bottle D) Fan

3. This is one of the service sector activities
A) Mining B) Plantation
C) Teaching D) Industry

4. Majority of workers in agriculture are living in….
A) Cities
B) Towns
C) Rural
D) Urban

5. In which sector more than 90% of urban workers are getting employment?
A) Primary
B) Secondary and Tertiary
C) secondary
D) Tertiary

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

“భారతీయ మహిళకు మానసిక చికిత్స అవసరమైన సందర్భాల్లో ఇటు కుటుంబంగానీ అటు సమాజం కానీ మహిళ పట్ల సానుభూతితో సహానుభూతితో వ్యవహరించడం లేదు. ఇంకా చెప్పాలంటే కాస్త కఠినంగానే వ్యవహరిస్తూనే వచ్చాయి. మనది సహజంగా పితృస్వామ్య వ్యవస్థ కావడంతో అనాదిగా మహిళల పట్ల చిన్నచూపు అలా కొనసాగుతూ పోయిందం”టూ ఆవేదన వ్యక్తం చేశారు ‘ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ’ ప్రెసిడెంట్ డాక్టర్ సవిత మల్హోత్ర.

ఇంటర్వ్యూ

చికిత్సలోనూ వివక్ష!

‘ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఫౌండేషన్ డే’ సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన డాక్టర్ సవిత మల్హోత్ర ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మానసిక చికిత్సల విషయంలో భారతీయ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మాట్లాడారు. మహిళలకు మానసిక వైద్యం అవసరమైనప్పుడు... చికిత్స అందాల్సిన వివిధ సందర్భాల్లో ఇప్పటికీ ఆమె ఎదుర్కొంటున్న వివక్ష గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవిత మల్హోత్ర వెలిబుచ్చిన ఆవేదన ఆమె మాటల్లోనే...

చికిత్సలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు

మహిళలకు మానసికమైన సమస్యలున్నప్పుడు మన సమాజం వారి పట్ల వివక్షతోనే వ్యవహరిస్తూ వచ్చింది. ఇప్పటికీ పల్లెల్లో మహిళలకు మానసిక చికిత్స సక్రమంగా అందడం లేదన్నది నిర్వివాదాంశం. కాకపోతే పాశ్చాత్య సంస్కృతి, అక్కడి స్వేచ్ఛావాతావరణం తాలూకు ప్రభావాలూ మెట్రోపాలిటన్ నగరాలూ, పెద్ద పెద్ద పట్టణాల్లో వారిని స్వేచ్ఛగా వ్యవహరించేలా చేసినప్పటికీ చిన్న చిన్న పల్లెటూళ్లలో మాత్రం వివక్ష అలాగే ఉంది. అయితే ఇక్కడ మరో ప్రమాదం పొంచి ఉంది. పాశ్చాత్య దేశాల విపరీతమైన, మితిమీరిన స్వేచ్ఛాభావనల్లాంటి పెడ ధోరణులతో ఆమె విశృంఖలంగా ప్రవర్తిస్తున్న సందర్భాల్లో పురుషుడే కాస్తంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి వస్తోంది. అయితే మహిళలు ఈ రెండు ఎక్స్‌ట్రీమ్స్‌లో కాకుండా బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలి. మెట్రోపాలిటన్ నగరాలూ, చాలా పెద్ద పెద్ద నగరాల్లో మితిమీరిన నాగరికతా ధోరణులున్న కొన్ని పరిమిత ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్లంతా మహిళ తీవ్రమైన వివక్షకు గురవుతూనే ఉంది.

మహిళలు వివక్షకు లోనయ్యే తీరుతెన్నులు

నిజం చెప్పాలంటే ఆ వివక్ష చెప్పనలవి కాదు. ఉదాహరణకు ఓ మహిళకు పెళ్లి తర్వాత తనకేదైనా మానసిక చికిత్స అవసరమైందనుకోండి. వెంటనే అత్తింటివాళ్లు ఆమెను నిర్దాక్షిణ్యంగా పుట్టింటికి పంపేస్తారు. ఆ మానసిక సమస్య నుంచి విముక్తి కలిగితే తప్ప అత్తింటికి రావద్దంటూ ఆంక్షలు పెడతారు. ఒకవేళ మహిళలు వైద్యం తీసుకునే పరిస్థితి లేకపోతే వాళ్లు అత్తింటి నుంచి శాశ్వతంగా దూరమయ్యే దయనీయమైన పరిస్థితి ఉంటుంది. అదే పురుషుడికి ఏదైనా మానసిక సమస్య వచ్చిందనుకుందాం. అప్పుడు అతడి చికిత్స విషయంలో ఆమె అతడికి చేయూతనందిస్తూ అతడినే అంటిపెట్టుకుని ఉంటుంది. అతడు బాగుపడేందుకు అండదండలందిస్తూనే ఉంటుంది.

ఇక పెళ్లికాని అమ్మాయిల పరిస్థితి ఇంకా దారుణం. మానసిక చికిత్స అవసరమైన మహిళకు అసలు పెళ్లికావడమే పెద్ద సమస్యగా మారుతుంది. ఇక్కడ కూడా పురుషుడికి ఉండే అనుకూతలు వేరు. మగవాడికి ఏదైనా మానసిక సమస్య వస్తే... ‘‘పెళ్లయితే అంతా సర్దుకుంటుంది’’ అంటూ అతడి సమస్య బాధ్యత నుంచి తల్లిదండ్రులు తప్పించుకుని ఓ మహిళ నెత్తి మీదికి నెట్టేస్తారు.

ఒక్కమాటలో చెప్పాలంటే పురుషుడికి మానసిక సమస్య వస్తే మహిళ ఓ సపోర్ట్ సిస్టమ్‌గా అతడికి అండగా ఉంటుంది. కానీ మహిళకే ఆ సమస్య వస్తే అది ఆమెలో ఎమోషనల్ స్ట్రెస్‌ను మరింత పెంచుతుంది.

పిండదశలో ఉన్నప్పట్నుంచే మానసిక సమస్యలు!

ఓ చిన్నారి పిండదశలో ఉన్నప్పట్నుంచే మానసిక సమస్యలను ఎదుర్కొంటూ వస్తోంది. ఉదాహరణకు... ఓ మహిళ గర్భవతిగా ఉన్నప్పుడు ఒత్తిడి (స్ట్రెస్)గానీ, ఉద్విగ్న పరిస్థితుల్ని (యాంగ్జైటీ)గానీ, ఆందోళన, వ్యాకులత, కుంగుబాటు (డిప్రెషన్) వంటివి చోటుచేసుకున్నప్పుడు ఆమె మెదడులోని జీవరసాయనాల్లో మార్పులు రావడం సహజం. ఆ జీవరసాయనాలూ, హార్మోన్ల వంటివే ఆమెలోని మూడ్స్ మార్పులకు కారణమవుతాయి. కాబోయే తల్లిలో... ఆ హార్మోన్లు, జీవరసాయనాల సమతుల్యతల్లో మార్పులు వచ్చాయంటే అవి కడుపులోని బిడ్డపైనా, తన మానసిక స్థితిపైనా ప్రభావాలు చూపే అవకాశముంది. అందుకే గతంలోని మామూలు చైల్డ్ సైకియాట్రీ కంటే ఇప్పుడు మరింత లోతుగా... సైన్స్ గణనీయంగా పురోగమించడంతో... కడుపులోని పిండానికి మానసికంగా కలిగే ప్రభావాలను అధ్యయనం చేసే ఫీటల్ సైకియాట్రీ, అప్పుడే పుట్టిన బిడ్డ విషయంలో ఇన్‌ఫ్యాంట్ సైకియాట్రీ, చైల్డ్ సైకియాట్రీ, అడాలసెంట్ సైకియాట్రీ, వృద్ధాప్యంలోని మానసిక సమస్యల గురించి తెలిపే జీరియాట్రిక్ సైకియాట్రీ అంటూ మానసిక శాస్త్రం ఇప్పుడు చాలా చాలా విస్తృతంగా, ఎంతో లోతుగా అధ్యయనం చేయాల్సిన సైన్స్‌గా పరిణమిస్తూ... విస్తరిస్తోంది.

గతంతో పోలిస్తే కొంత పురోగతి!

నగరాలూ పట్టణ ప్రాంతాల్లో కొంత మేరకు నయమేగానీ చిన్నచిన్న ఊళ్లల్లోనూ, పల్లెల్లో ఇంకా మూఢనమ్మకాలు రాజ్యమేలుతూనే ఉన్నాయి. ఉదాహరణకు పల్లె ప్రాంతాల్లో అమ్మవారు పూనడం, దెయ్యం పట్టడం లాంటి ‘పొసెషన్ స్టేట్’ మానసిక సమస్యలు మహిళల్లోనే కనిపిస్తుండటం గమనించవచ్చు. దెయ్యాన్ని వదిలించడంలో భాగంగా... చికిత్స పేరిట వాళ్లను బెత్తంతో కొట్టడం, దారుణంగా బాధించడం చేస్తుంటారు. గతంతో పోలిస్తే కాస్త నయమే అయినప్పటికీ పల్లెల్లో ఇంకా ఈ ధోరణులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడొచ్చిన మార్పు సరిపోదు. ఇలాంటి మానసికమైన సమస్యలు ఎవరిలో వచ్చినా... ఇంకా ప్రధానంగా మహిళల్లో కనిపించినప్పుడు ఆధునిక వైద్యచికిత్స అందించడం అన్నది ఇప్పుడు చాలా ముఖ్యం.

మానసికమైన అంశాల మీద ఆహారం ప్రభావం

గతంలో మానసిక సమస్యలతో బాధపడే బాధితుల ఆహారం గురించి పెద్ద పట్టింపు ఉండేది కాదు. కానీ అనేక ఆధునిక పరిశోధనల తర్వాత ‘న్యూట్రిషనల్ సైకియాట్రీ’ విభాగం కూడా ఇప్పుడు చాలా కీలకంగా మారుతోంది.

మహిళలకు మరింత మెరుగైన చికిత్స అందడానికి కుటుంబం, సమాజం అందించాల్సిన సపోర్ట్

కెరియర్ విషయంలోగానీ, మేధస్సుపరంగాగానీ మహిళా, పురుషుడూ సమానం. కానీ బయాలజీ, ఫిజియాలజీ పరంగా మహిళ మానసిక స్థితిగతులూ, పురుషుడి మానసిక పరిస్థితులూ వేర్వేరుగా ఉంటాయి. దీన్ని అంగీకరించి తీరాలి. మానసిక ప్రవర్తనల ధోరణుల విషయంలోనూ పురుషుడూ, మహిళలూ భిన్నంగా వ్యవహరిస్తుంటారు. ఉదాహరణకు సాధారణంగా ఒక పురుషుడు ఒక అంశంపై ఫోకస్‌గా వ్యవహరిస్తూ ఉంటే మహిళ మాత్రం తన మల్టీటాస్కింగ్ నైపుణ్యాలతో ఏకకాలంలో అనేక కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటుంది. ఒక విషయాన్ని పురుషుడు తన మెదడు పరిష్కార ధోరణితో ఆలోచిస్తున్న తరుణంలో... అదే సమస్య విషయంలో మహిళ తన మనసుతో ఆలోచిస్తుంది. తన పార్ట్‌నర్ తాలూకు ఎమోషనల్ సపోర్ట్‌తో ఉద్వేగభరితమైన చేయూతతో దాన్ని పరిష్కరించాలనే ధోరణిని పురుషుడి నుంచి ఆశిస్తుంటుంది. ఆ భావోద్వేగాల సపోర్ట్ పురుషుడి నుంచి రావాలని ఎదురుచూస్తుంటుంది. కెరియర్‌కు సంబంధించిన రంగంలో లేదా ప్రొఫెషనల్ స్కిల్స్ ప్రదర్శించాల్సిన చోట మహిళకు తన తోటి ప్రొఫెషనల్స్ నుంచే తాను కోరుకునే సమాన భావన అందదు. మరో మూడువారాల్లో దేశ రాజధానిలో సైకియాట్రిస్టుల సదస్సు జరగనుంది. ఈ విషయమే అక్కడ ప్రస్తావనకు తేవాలనుకుంటున్నాను. ఒక తల్లికి నలుగురు బిడ్డలుంటే... తాను పెద్దగా చదువుకోకపోయినా... ఆ నలుగురు చిన్నారుల స్వభావాలూ, మనస్తత్వాలూ, ప్రవర్తనల తీరుతెన్నులు ఆమెకు స్పష్టంగా తెలుస్తాయి. అలా ఆమెలో అవ్యక్తంగానే లోపల ఓ మనస్తత్వవేత్త ఇన్‌బిల్ట్‌గా ఉంటారు. దాంతో మానసిక రంగాల విషయంలో రానున్న రోజుల్లో ఆమె మరింత క్రియాశీలంగా వ్యవహరిస్తుందని నా భావన. ఈలోపు వ్యక్తిగతంగా ఆమెకు ఇవ్వాల్సిన స్పేస్‌ను ఇస్తూ, ఆమెను ఓ మనిషిగా చూస్తూ, మహిళను తన తోటి వ్యక్తిగా గౌరవించాల్సిన బాధ్యత పురుషులపై ఉందనేది నా స్పష్టమైన అభిప్రాయం. కుటుంబ సభ్యులకే కాదు... ఆమెనో సాటిమనిషిగా చూడాల్సిన బాధ్యత ఈ సమాజానికీ ఉంది’’ అంటూ తన అభిప్రాయాలను వెలిబుచ్చారు డాక్టర్ సవిత మల్హోత్రా.

– యాసీన్

● మన(సు)లో మాట

దేవుడంటే భక్తి.. కానీ ఎందుకీ చెడు ఆలోచనలు?

నాకు మొదటినుంచి దేవుడంటే విపరీతమైన భయభక్తులు. తరచు గుళ్లకు వెళుతుంటాను. రోజూ పూజ చేస్తుంటాను. అయితే గత రెండేళ్లుగా దేవుళ్లపైన విపరీతమైన చెడు ఆలోచనలు వస్తున్నాయి. దేవుడిని బూతుమాటలు తిట్టినట్లు, దేవుడి పటాలను అగౌరవపరచినట్టు... ఇలా రాయడానికి వీలులేని చెడ్డ తలంపులు వస్తున్నాయి. దాంతోపాటే ‘ఇది చాలా తప్పు, నాలాంటి భక్తుడికి ఇలాంటి చెడు ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి...’ అని మానసికంగా చాలా మధన పడుతున్నాను. ఈ ఆలోచనల మూలాన దేవుడు నన్ను శపిస్తాడేమోననే భయంతో సరైన తిండి, నిద్రలతో పాటు మనశ్శాంతికి కూడా దూరం అయిపోయాను. ఏ పనిమీదా ధ్యాస పెట్టలేకపోతున్నాను. నాకీ బాధనుంచి విముక్తి కలిగే మార్గం చెప్పగలరు.

– రఘురామ్, నల్గొండ

ఎంత వద్దనుకున్నా మనసులో ఇలా మాటిమాటికీ చెడు తలంపులు వచ్చి, మనసును బాధించే ఇలాంటి ఆలోచనలను అబ్‌సెషన్స్ అంటారు. ఆ చెడు తలంపులనుంచి బయటపడేందుకు మాటిమాటికీ లెంపలేసుకోవడం, దండాలు పెడుతూ ఉండటాన్ని కంపల్షన్స్ అంటారు. ఇది ఒక ప్రత్యేకమైన మానసిక రుగ్మత. దీనిని ఓసీడీ అంటారు. మన మెదడులోని సెరటోనిన్ అనే ఒక ప్రత్యేకమైన రసాయన పదార్థం సమతుల్యతలో తేడాలొచ్చినప్పుడు కొందరిలో ఇలాంటి విపరీతమైన ఆలోచనలు, ధోరణులు కలుగుతాయి. ఇవి రాకూడదని ప్రయత్నించినకొద్దీ మరింత ఎక్కువగా మనసులోకి చొచ్చుకొచ్చి విపరీతమైన మానసిక సంఘర్షణకు గురిచేస్తాయి. ఈ ఆలోచనలకు మూలకారణమైన మీ మెదడులోని రసాయన చర్యను సరిచేయడం ద్వారా ఈ అబ్‌సెషన్స్‌ను పూర్తిగా అదుపు చేయవచ్చు. ఆధునిక మానసిక వైద్యశాస్త్రంలో ఈ ఓసీడీ జబ్బును పూర్తిగా తగ్గించేందుకు మంచి మందులు, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అనే మానసిక చికిత్స అద్భుతంగా పని చేస్తాయి. మందులతోపాటు థాట్ స్టాపింగ్, ఎక్స్‌పోజర్ రెస్పాన్స్ అండ్ ప్రివెన్షన్ అనే మానసిక చికిత్స ద్వారా దేవుడిపైన మీకు కలిగే చెడు ఆలోచనలనుంచి విముక్తి కలిగించవచ్చు. ఓసీడీ జబ్బును తగ్గించేందుకు వీటికితోడు ఇటీవలే వచ్చిన ఆర్.టి.ఎం.ఎస్. అనే అత్యాధునిక పరికరాన్ని వాడుతున్నాము. మీరు వెంటనే మీకు అందుబాటులో ఉన్న సైకియాట్రిస్టును కలిసి చికిత్స తీసుకోండి. ఆల్ ది బెస్ట్!

డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ. మీ సమస్యలు,
సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● సమ్‌థింగ్ స్పెషల్

బాల్డ్ స్టేట్‌మెంట్!



‘తాచు పాములాంటి జడ’

‘ఆమె కురులు ఇంద్రనీలాలు’... ఇలా మహిళల జుట్టు గురించి ఎన్నో ప్రశంసలు, పాటలు ఉన్నాయి.

కురుల గురించిన అలంకారాలు, ప్రాసలు చివరికి ఎక్కడి వరకు వెళ్లాయంటే...

‘కురులు లేకపోతే స్త్రీలకు అందమే లేదు’ అనుకునేంతగా. ఈ భ్రమను వివిధ రూపాల్లో చాలామంది మహిళలు సవాలు చేశారు.

‘కురులు మాత్రమే అసలు సిసలు అందం కాదు’ అని చెప్పకనే చెప్పారు.

తాజా విషయానికి వస్తే...

చండీగఢ్‌కు చెందిన మహిమ అనే యువతి సంప్రదాయ సౌందర్య ప్రమాణాలను సవాలు చేయాలని నిర్ణయించుకుంది. పాక్షికంగా లేదా పూర్తిగా జుట్టు రాలడానికి కారణమయ్యే అలోపేసియా అనే మెడికల్ కండిషన్‌తో జీవిస్తున్న మహిమకు పెళ్లి రోజు విగ్ సెట్ చేసుకోవాల్సిందిగా సలహా ఇచ్చారు సన్నిహితులు. అయితే వారి సలహాను ఆమె పాటించలేదు.

పెళ్లిరోజున తన వాస్తవ పరిస్థితిని దాచకూడదని నిర్ణయించుకుంది. బోడి తలతోనే పెళ్లి పీటలపై కూర్చుంది. అందం గురించి సంప్రదాయ భావాలకు సరికొత్త నిర్వచనం ఇచ్చింది.

బాల్డ్‌ను దాచుకోకుండా బోల్డ్‌గా కూర్చున్న మహిమపై నెట్‌లోకం ప్రశంసల వర్షం కురిపించింది.

‘ఎంతో ధైర్యం ఉంటే కానీ ఇలా చేయడం కుదరదు. మీ ధైర్యం, ఆత్మస్థైర్యం ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తుంది’

‘జుట్టు రాలడం అనేది సమస్య కావచ్చు, మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకునేంత సమస్య అయితే కాదు అని చెప్పడానికి మహిమ మంచి ఉదాహరణ’... ఇలా నెటిజనుల నుంచి కామెంట్స్ వచ్చాయి.

● ముగ్గు ముచ్చట

9 చుక్కలు,
చుక్క వదిలి చుక్క
1 వచ్చేవరకు



యం.రిధిమ ప్రియ
మల్లాపూర్, హైదరాబాద్

21 చుక్కలు,
7 వరసలు
7 వచ్చేవరకు

బి. నారాయణమ్మ,
మహబూబ్‌నగర్

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● స్ఫూర్తి

అంటార్కిటికాలో 365 రోజులు...

అంటార్కిటికా చూసే అవకాశం భారతీయ స్త్రీలకు అతి తక్కువగా దొరుకుతుంది. ఎవరైనా వెళ్లినా కొన్ని గంటలు లేదా రోజులమజిలీ మాత్రమే చేయగలరు. కాని ముంబైకి చెందిన జనరల్ సర్జన్ వైదేహీ వెంకటేశ్వరన్ అంటార్కిటికాలో సంవత్సరం పాటు ఉండి భారతీయ పరిశోధక బృందానికి వైద్యసేవలు అందించారు. ‘44వ ఇండియన్ సైంటిఫిక్ ఎక్స్‌పెడిషన్ టు అంటార్కిటికా’లో పాల్గొని ఇటీవలే తిరిగి వచ్చిన వైదేహీ అక్కడి అనుభవాలను పంచుకున్నారు.

ప్రపంచంలోని ఏడు ఖండాల్లో అంటార్కిటికా ఒకటి. దాని గురించి విన్న వారే తప్ప అక్కడికి వెళ్లినవారు తక్కువ. వెళ్లి నివసించినవారు అరుదు. చుట్టూ మంచుతో నిండిన ఆ ధ్రువ ప్రాంతంలో జీవనం దుస్సాధ్యం. అయితే భారత దేశానికి చెందిన 31 ఏళ్ల మహిళా జనరల్ సర్జన్ వైదేహీ వెంకటేశ్వరన్ అంటార్కిటికా ఖండంలో అడుగుపెట్టారు. అడుగుపెట్టడమే కాదు, ఏడాది పాటు అక్కడే గడిపి ఇటీవల తిరిగి వచ్చారు. అక్కడున్న ప్రతి క్షణం తన జీవితంలో మర్చిపోలేని అనుభవం అంటున్నారామె.

పదేళ్ల ముందు నుంచి ఆసక్తి

నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషియన్ రీసెర్చ్ (ఎన్.సి.పి.ఓ.ఆర్) ఆధ్వర్యంలో 44వ ఇండియన్ సైంటిఫిక్ ఎక్స్‌పెడిషన్ టు అంటార్కిటికా (ఐఎస్ఈఏ)లో భాగంగా మన దేశం నుంచి వెళ్లిన బృందంలో ఏకైక మహిళ వైదేహీ వెంకటేశ్వరన్. ‘అంటార్కిటికా చూడాలనేది నా చిరకాల స్వప్నం. 2015లో విద్యార్థిగా ఉన్న సమయంలో అంటార్కిటికా ఎక్స్‌పెడిషన్ గురించి విన్నాను. ఎప్పటికైనా అందులో పాల్గొనాలని భావించాను. 2025లో ఎన్‌సీపీఓఆర్‌కు దరఖాస్తు చేసుకున్నాను. మహిళలకు ఈ అవకాశం చాలా అరుదుగా వస్తుంది. నాకు రాగానే చాలా ఆనందంగా అనిపించింది’ అన్నారామె.

వడపోతల ఎంపిక

అంటార్కిటికా మంచు ఖండం. అక్కడికి వెళ్లి ఏడాది పాటు సేవలందించాలంటే చాలా మనోధైర్యం, గుండె నిబ్బరం కావాలి. అందుకే అక్కడికి వెళ్లే వారిని ప్రభుత్వం అనేక వడపోతల తర్వాత ఎంపిక చేస్తుంది. ఎంపికైన వారికి ఇండో-టిబెటియన్ సరిహద్దు పోలీసుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు. అంటార్కిటికాలో పరిస్థితులు, వాతావరణం, అందుకు తగ్గ ఏర్పాట్లు, చేయాల్సిన పనులు, అక్కడి జీవనవిధానం వంటివాటిపై అవగాహన కలిగిస్తారు. ‘శిక్షణ తర్వాత నేను అంటార్కిటికాలో అడుగుపెట్టిన రోజు ‘పోలార్ డే’. అంటే రోజంతా సూర్యుడు ఉండే రోజది. రాత్రి ఆకాశంలో ఒకేసారి సూర్యుణ్ని, చంద్రుణ్ని చూసే ఆ వింతను జీవితంలో మర్చిపోలేను. నేను ఉన్న ప్రదేశంలో నాతో పాటు మరో వైద్యుడు, నర్స్ ఉంటారు. మొబైల్ సిగ్నల్స్ ఉండవు. ఇంటర్‌నెట్ తక్కువ.

బయటి ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలియాలంటే రేడియో ఒక్కటే ఆధారం. శీతాకాలం మొత్తం నా చుట్టూ 24 మంది ఉన్నారు. రోజంతా అత్యంత నిశ్శబ్దంగా ఉండేది’ అని ఆమె వివరించారు.

ఏ క్షణంలోనైనా తప్పిపోయే అవకాశం

‘శీతాకాలంలో మంచంతా గడ్డకట్టుకుపోతుంది. బయటికెళ్లిన వారు ఏ క్షణంలోనైనా తప్పిపోయే అవకాశం ఉంటుంది. చుట్టూ పేరుకు పోయిన మంచులో ఎటు వెళ్తున్నామో కూడా తెలియని పరిస్థితి. దారి చూపేందుకు అక్కడ ఎటువంటి గుర్తులూ ఉండవు. అందుకే వెంట ఎప్పుడూ జీపీఎస్ ఉండేది. అంటార్కిటికా పెంగ్విన్లకు ఆవాసం. అయితే మాకున్న ఆదేశాల వల్ల వాటికి మేము దూరంగా ఉన్నాం’ అన్నారామె.

ఒంటరిగా మనగలగడం కష్టం

‘అంటార్కిటికా ఖండంలో ఒంటరిగా మనగలగడం కష్టం. వేలకొద్దీ కిలోమీటర్ల వరకూ మానవసంచారం ఉండదు. చుట్టూ అంతా నిశ్శబ్దంలో ఒక్కోసారి ఏమీ తోచక డిప్రెషన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. అక్కడ మన దేశంతోపాటు చైనా, రష్యా పరిశోధక స్టేషన్లు ఉన్నాయి. అవసరమైనప్పుడు ఒకరికొకరం సాయం అందించుకునే వాళ్లం. ‘పా’ సినిమాలో అమితాబ్ ఒక తెల్లటి గ్లోబ్ తయారు చేసి ‘ఈ భూమ్మీద ఎటువంటి సరిహద్దులు లేవు’ అంటారు కదా! అంటార్కిటికాలో ఏడాదిపాటు జీవించి, తిరిగి వచ్చాక నాకు ఈ ప్రపంచం అలాగే అనిపిస్తోంది’ అంటున్నారు వైదేహీ.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జనవరి 7న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,41,410	1,41,100	1,39,480	1,41,100	1,41,100	1,40,400
బంగారం (22 క్యారెట్లు)	1,30,159	1,27,850	1,27,850	1,31,680	1,29,810	1,28,700
వెండి	2,54,000	2,55,000	2,83,000	2,55,000	2,52,000	2,83,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

స్పోర్ట్స్

సహజ సంచలన విజయం

భారత మహిళల టెన్నిస్ నంబర్‌వన్, తెలంగాణ ప్లేయర్ సహజ యామలపల్లి కొత్త ఏడాదిని, కొత్త సీజన్‌ను సంచలన విజయంతో ప్రారంభించింది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురిలో జరుగుతున్న అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నీలో సహజ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 378వ ర్యాంకర్ సహజ 3-6, 6-4, 6-4తో ప్రపంచ 237వ ర్యాంకర్, ఐదో సీడ్ చోల్ పాక్వెట్ (ఫ్రాన్స్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 2 గంటల 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఒక ఏస్ సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. ఇదే టోర్నీ డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారిణులు అంకిత రైనా, రుతుజా భోస్లేలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అంకిత-యు యున్ లీ (చైనీస్ తైపీ) ద్వయం తొలి రౌండ్‌లో ఓడిపోగా... రుతుజా-వుషువాంగ్ జెంగ్ (చైనా) జోడీ తొలి రౌండ్‌లో గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

విజేత ప్రణీత్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ చెస్ గ్రాండ్‌మాస్టర్ ఉప్పల ప్రణీత్ అంతర్జాతీయస్థాయిలో మరో టైటిల్ సాధించాడు. స్పెయిన్‌లో బుధవారం ముగిసిన రొకెటాస్ చెస్ ఫెస్టివల్‌లో ప్రణీత్ చాంపియన్‌గా అవతరించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత అతను 7.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నికో చాసిన్ (అమెరికా)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను ప్రణీత్ 25 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. అంతకుముందు షువావు (మాల్దీవులు), విక్టర్ నవారో (స్పెయిన్), ఇవాన్ పోప్‌షెడ్నీ (ఉక్రెయిన్), గియాన్‌వార్కో (పెరూ), బ్రోడోవ్‌స్కీ (పోలాండ్), షాహిల్ డే (భారత్), గ్లోక్లెర్ (అర్మేనియా)లపై నెగ్గిన ప్రణీత్... స్పెయిన్ ప్లేయర్ మారిన్ ఫెరాగ్ట్‌తో జరిగిన ఆరో రౌండ్‌లో 44 ఎత్తుల్లో ఓడిపోయాడు.

సింధు శ్రమించి...

ప్రిక్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్ షట్లర్

- గాయత్రి-ట్రెసా జోడీకి చుక్కెదురు

కౌలాలంపూర్: గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ ఆడుతున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు గెలుపు బోణీ చేసింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ ఒకదశలో వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్ షట్లర్ ఆ తర్వాత తేరుకోవడం గమనార్హం. తొలి గేమ్‌లో 6-9తో వెనుకబడ్డ దశలో సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా 10 పాయింట్లు గెలిచి 16-9తో ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. అదే జోరులో తొలి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో 3-5తో వెనుకబడ్డ సింధు ఆ తర్వాత కోలుకొని 15-11తో ఆధిక్యంలోకి వచ్చింది. ఈ తరుణంలో సుంగ్ షువో వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి స్కోరును 15-15తో సమం చేసింది. ఆ తర్వాత స్కోరు 20-20 వద్ద సింధు వరుసగా రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజాకి (జపాన్)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో ఇద్దరు 1-1తో సమంగా ఉన్నారు.

సాత్విక్-చిరాగ్ జంట శుభారంభం

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేయగా... హరిహరన్-అర్జున్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. సాత్విక్-చిరాగ్ జంట 21-13, 21-15తో లీ జె హుయ్-యాంగ్ పో సువాన్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది. హరిహరన్-అర్జున్ జంట 10-21, 20-22తో హిరోకి మిదోరికావా-క్యోహీ యామషిటా (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

మహిళల డబుల్స్‌లో భారత జోడీల కథ ముగిసింది. పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ... కవిప్రియ సెల్వం-సిమ్రన్... రుతుపర్ణ-శ్వేతాపర్ణ పాండా జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. గాయత్రి-ట్రెసా 9-21, 23-21, 19-21తో ఫెబ్రియానా కుసుమ-మెలీసా (ఇండోనేసియా) చేతిలో... కవిప్రియ-సిమ్రన్ 12-21, 11-21తో యుకీ ఫకుషిమా-మయు మత్సుమోతో (జపాన్) చేతిలో... రుతుపర్ణ-శ్వేతాపర్ణ 11-21, 9-21తో టాన్ పియర్లీ-థినా మురళీధరన్ (మలేసియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

రుత్విక-రోహన్ జోడీ అవుట్

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ భారత జోడీల పోరాటం ముగిసింది. తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్)... అమృత-అశిత్ సూర్య... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంటలు తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాయి. రుత్విక-రోహన్ 10-21, 17-21తో జియాంగ్ జెన్ బాంగ్-వె యా జిన్ (చైనా) చేతిలో... అమృత-అశిత్ 11-21, 9-21తో పువానత్-బెన్యాప (థాయ్‌లాండ్) చేతిలో... తనీషా-ధ్రువ్ 15-21, 21-18, 15-21తో ప్రెస్లీ-జెనీ గాయ్ (అమెరికా) చేతిలో పరాజయం పాలయ్యారు.

వైభవ్

ఆరోన్ జార్జ్

వైభవ్ మెరుపు సెంచరీ

74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లతో 127

- శతకం బాదిన ఆరోన్ జార్జ్
- చివరి వన్డేలోనూ యువ భారత్ గెలుపు
- దక్షిణాఫ్రికాపై 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

బెనోని: అండర్-19 ప్రపంచ కప్‌కు ముందు తమ స్థాయిని ప్రదర్శిస్తూ భారత అండర్-19 జట్టు మరోసారి చెలరేగింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 233 పరుగుల భారీ తేడాతో దక్షిణాఫ్రికా అండర్-19 టీమ్‌ను చిత్తు చేసింది. ఫలితంగా 3-0తో సిరీస్‌ను మన యువ జట్టు సొంతం చేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 393 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ (74 బంతుల్లో 127; 9 ఫోర్లు, 10 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగగా... మరో ఓపెనర్, హైదరాబాద్ ఆటగాడు ఆరోన్ జార్జ్ (106 బంతుల్లో 118; 16 ఫోర్లు) కూడా శతకం బాదాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 154 బంతుల్లోనే 227 పరుగులు జోడించడం విశేషం. సఫారీ బౌలర్లలో ఎన్‌టాండో సోనీ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం దక్షిణాఫ్రికా 35 ఓవర్లలో 160 పరుగులకే కుప్పకూలింది. పాల్ జేమ్స్ (41), డానిల్ బాస్‌మన్ (40), కార్న్ బోథా (36) మాత్రమే కొద్దిగా పోరాడారు. కిషన్ సింగ్ 3 వికెట్లు తీయగా, మొహమ్మద్ ఎనాన్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచి వైభవ్ సూర్యవంశీ... సిరీస్‌లో మొత్తం 206 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు కూడా గెలుచుకున్నాడు. ఈ నెల 15న అండర్-19 వరల్డ్ కప్ ప్రారంభం కానుండగా... బులవాయోలో జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో అమెరికాతో భారత జట్టు తలపడుతుంది.

ఆంధ్రప్రదేశ్ శుభారంభం

జాతీయ స్కూల్ గేమ్స్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: 69వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) పోటీల్లో భాగంగా అండర్-17 బాలుర కబడ్డీ పోటీలు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడుళ్ల బయ్యారంలో మొదలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నీలో మొత్తం 33 జట్లు పాల్గొంటున్నాయి. తొలి రోజు జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 52-19 పాయింట్ల తేడాతో జార్ఖండ్‌ను ఓడించి శుభారంభం చేసింది. ఇతర మ్యాచ్‌ల్లో తమిళనాడు 48-32తో బిహార్‌పై, కర్ణాటక 51-27తో గుజరాత్‌పై, మహారాష్ట్ర 44-41తో కేరళపై, రాజస్తాన్ 34-33తో ఉత్తరప్రదేశ్‌పై, మధ్యప్రదేశ్ 66-38తో చండీగఢ్‌పై గెలుపొందాయి. టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ క్రీడే అయిన కబడ్డీ ఇప్పుడు అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడల్లో ఒకటిగా మారడం విశేషమని వ్యాఖ్యానించారు. 'మట్టి వాసనతో కూడిన అద్భుతమైన ఆట కబడ్డీ. ఈ క్రీడలకు ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చింది. ఐపీఎల్ తర్వాత అభిమానులు ఎక్కువగా ప్రో కబడ్డీ లీగ్‌ను చూస్తున్నారు. కబడ్డీతో కూడా వ్యక్తిగతంగా గుర్తింపు తెచ్చుకోవచ్చని ఆటగాళ్లు నిరూపించారు' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తదితరులు పాల్గొన్నారు. టోర్నీకి మౌరి టెక్ ఫౌండేషన్, కంది చారిటబుల్ ఫౌండేషన్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

విజయం అటో ఇటో!
రసకందాయలో 'యాషెస్' చివరి టెస్టు
అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు
జిన్సన్ జాన్సన్ రిటైర్మెంట్
అదిరిన నిఖత్ పంచ్
హైదరాబాద్ తూఫాన్స్ విజయం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

థియేటర్లలో గోల చేద్దాం - రవితేజ

- కిశోర్ తిరుమల, డింపుల్ హయతి, రవితేజ, ఆషిక, సుధాకర్

''అందరికీ హాయ్. ఈసారి సంక్రాంతి పండక్కి థియేటర్లలో సరదా సరదాగా గోల గోల చేద్దాం. మా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా ఒక్కటే కాదు. ఈ పండగకి వస్తున్న అన్ని సినిమాలు పూర్తి వినోదాన్ని అందించబోతున్నాయి. ఈసారి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంక్రాంతి అవుతుందని నా ప్రగాఢ నమ్మకం'' అని రవితేజ తెలిపారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 13న విడుదలవుతోంది. బుధవారం నిర్వహించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కిషోర్ తిరుమల మాట్లాడుతూ– ''ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ ఫన్ ఫిల్మ్ ఇది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఈ సంక్రాంతికి రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలు కూడా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''మంచి వినోదాత్మక చిత్రమిది. ప్రేక్షకులు చూసి, ఆనందిస్తారని కోరుకుంటున్నాను'' అని సుధాకర్ చెరుకూరి పేర్కొన్నారు. ''మా చిత్రాన్ని ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అందరూ చూడాలని ఆశిస్తున్నా'' అన్నారు ఆషికా రంగనాథ్. ''నా మొదటి సంక్రాంతి సినిమా ఇది. అందరూ థియేటర్స్‌లో చూడాలి'' అని డింపుల్ హయతి కోరారు.

- అనిల్ రావిపూడి, చిరంజీవి, వెంకటేశ్, సుష్మిత కొణిదెల, సాహు గారపాటి

ఈ సంక్రాంతి మన తెలుగు పరిశ్రమది - చిరంజీవి

''ఈ సంక్రాంతి కేవలం 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రానిదే కాదు.. మొత్తం మన తెలుగు పరిశ్రమది కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రభాస్ 'ది రాజా సాబ్', రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి,', శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'... వీళ్లందరి సినిమాలు కూడా ఈ సంక్రాంతికి సూపర్ హిట్ కావాలి. దాని ద్వారా వాళ్లకి విజయం లభించడమే కాదు.. తెలుగు సినిమా పరిశ్రమ, నిర్మాతలు, బయ్యర్లు సుభిక్షంగా ఉన్నప్పుడే అదే నిజమైన సంక్రాంతి.. ఆ సంక్రాంతి ఇది కావాలని కోరుకుంటున్నాం'' అని చిరంజీవి తెలిపారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ మూవీలో నయనతార హీరోయిన్‌గా నటించగా, వెంకటేశ్ ముఖ్య పాత్ర పోషించారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో **చిరంజీవి మాట్లాడుతూ–** ''వెంకీతో కలిసి ఈ సినిమా చేయడం నాకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. మేమిద్దరం యాక్టింగ్ చేసినట్లు ఉండదు.. ఇద్దరు కుర్రాళ్లు సరదాగా అల్లరి చేసినట్లు ఈ సినిమా ఉంటుంది. మా ఇద్దరి కాంబినేషన్‌లో పూర్తి స్థాయి కథని అనిల్ రాసుకుంటే కచ్చితంగా కలిసి ఇంతే హుషారుగా మరో సినిమా చేస్తాం. సాహులాంటి ఒక మంచి నిర్మాత నాకు దొరికినందుకు ధన్యవాదాలు. ఇక.. నా బిడ్డ సుష్మిత.. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడింది. 2026 సంక్రాంతిని తెలుగు పరిశ్రమ మరచిపోకూడదు. అలాంటి సంక్రాంతిని ప్రేక్షకులు మాకు ఇవ్వాలి. దయచేసి అన్ని సినిమాలను థియేటర్‌కి వెళ్లి చూడండి.. ఆస్వాదించండి.. ఆశీర్వదించండి'' అని కోరారు.

వెంకటేశ్ మాట్లాడుతూ– ''చిరు సర్‌తో పనిచేయడం నాకు అద్భుతమైన అనుభూతి. నేను.. తమ్ముళ్లు మహేశ్, పవన్ కల్యాణ్‌తో చేశాను.. అప్పుడు మీరు ఎలా సౌండ్ చేశారో.. ఇప్పుడు అన్నయ్య చిరంజీవితో చేస్తున్నాను.. ఆ సౌండ్ ఇంకా ఉండాలి. ఇంత మంచి సినిమా తీసిన సుష్మిత, సాహులకు థ్యాంక్స్. మంచి ఫ్యామిలీ, ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ ఇది. మీరు ఎప్పటిలాగే ఆదరించి, హిట్ చేస్తారని కోరుకుంటున్నాను. ఈ సంక్రాంతికి వస్తున్న సినిమాలన్నీ విజయం సాధించాలి. తెలుగు ఇండస్ట్రీ బాగుపడాలంటే అన్ని సినిమాలూ బాగా ఆడాలి. మీరు అన్ని సినిమాలు చూసి, బాగా ఎంజాయ్ చేస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని చెప్పారు.

అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''ఈ సినిమా ఒక ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్ అనుకుంటున్నారు. అంతకుమించిన ఎమోషనల్ డ్రామా కూడా ఉంది. ఇదొక ఫుల్ మీల్స్‌లాంటి మూవీ. వినోదం, సెంటిమెంట్, భావోద్వేగాలు, డ్యాన్స్, సాంగ్స్.. వెంకటేశ్‌గారు వచ్చాక అద్భుతమైన అల్లరి... కంప్లీట్ ప్యాకేజ్ మూవీ ఇది'' అని పేర్కొన్నారు.

- తమన్, కృతీ ప్రసాద్, నిధీ అగర్వాల్, టీజీ విశ్వప్రసాద్, రిద్దీకుమార్, మారుతి

ప్రభాస్‌గారు గ్లోబల్‌స్టార్ - మారుతి

''ప్రభాస్‌గారు ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్‌స్టార్ మాత్రమే కాదు. ఆయన సినిమాలు విదేశాల్లోనూ విడుదల అవుతున్నాయి. ప్రభాస్‌గారు గ్లోబల్‌స్టార్. 'ది రాజాసాబ్' సినిమా చేసే విషయంలో నాకు ఒత్తిడి లేదు అని చెప్పలేను. అయితే సినిమా చూసుకున్నాను. హీరో క్యారెక్టర్‌తో పాటు సరికొత్త క్యారెక్టరైజేషన్స్‌ను కూడా సినిమాలో చూస్తారు. ప్రభాస్‌గారిని ఎలా చూడాలని ఆడియన్స్ అనుకున్నారో అలానే చూస్తారు'' అని చెప్పారు దర్శకుడు మారుతి. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ది రాజాసాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా నటించగా, సంజయ్‌దత్ మరో ప్రధాన పాత్రలో నటించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో మారుతి మాట్లాడుతూ– ''నేడు మా సినిమా ప్రీమియర్స్ పడుతున్నాయి. ప్రభాస్ ఫ్యాన్స్ ఎంత సంతోషంతో థియేటర్స్‌కి వెళ్తారో, అంతకు రెట్టింపు ఆనందంతో బయటకు వస్తారు''అని చెప్పారు. ''హ్యూజ్ హారర్ ఫాంటసీ చిత్రంగా 'ది రాజాసాబ్' ఆడియన్స్‌ను మెప్పిస్తుంది. ఈ పండక్కి ఏడు సినిమాల వరకు విడుదల అవుతున్నాయి. దీంతో థియేటర్స్‌ను షేర్ చేసుకోకతప్పదు'' అని చెప్పారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ''ప్రభాస్‌గారి ఓవరాల్ పెర్ఫార్మెన్స్‌ను ఈ సినిమాలో చూస్తారు'' అన్నారు తమన్. ''ఈ నెల 9 నుంచి మా సినిమాను థియేటర్స్‌లో చూసి, ఎంజాయ్ చేయండి'' అని పేర్కొన్నారు కృతీ ప్రసాద్.

ఆయన మాట నిలబెట్టుకున్నారు - సాక్షీ వైద్య

'''నారీ నారీ నడుమ మురారి' సినిమా కథ విన్నప్పుడు మంచి సినిమా చేసే అవకాశం వచ్చిందనిపించి, వెంటనే అంగీకరించాను. అంతేకానీ.. ఈ మూవీలో నా క్యారెక్టర్‌కి ఎంత స్క్రీన్ టైమ్ ఉంటుంది? నాతో పాటుగా మరో హీరోయిన్ నటిస్తున్నారా? లేదా? అనే విషయాలను ఆలోచించలేదు. ఈ సినిమాకు స్టోరీ ఈజ్ కింగ్. మంచి వినోదాత్మక చిత్రం. కుటుంబమంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అని చెప్పారు హీరోయిన్ సాక్షీ వైద్య. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సాక్షీ వైద్య, సంయుక్త హీరోయిన్లుగా నటించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న సాయంత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సాక్షీ వైద్య విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్రంలో అమాయకంగా, చాలా నిజాయితీగా ఉండే నిత్య పాత్రలో నటించాను. ఈ క్యారెక్టర్ నాకు పర్సనల్‌గానూ రిలేట్ అవుతుంది. శర్వాగారి కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుంది. సంయుక్తతో నాకు మంచి కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. తెలుగులో డైలాగ్స్ చెప్పడంలో దర్శకుడు రామ్‌గారు నాకు సాయపడ్డారు. నాకు మరోసారి అవకాశం కల్పిస్తానని 'ఏజెంట్' సినిమా సమయంలోనే నిర్మాత అనిల్‌సుంకరగారు చెప్పారు.. 'నారీ నారీ నడుమ మురారి' ద్వారా ఆ మాటని నిలబెట్టుకున్నారు. అనూప్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేను ఫిజియోథెరపీ చేశాను. కానీ, ఇప్పుడు ప్రాక్టీస్ చేయడం లేదు. సంక్రాంతిని మేం సెలబ్రేట్ చేసుకుంటాం. అయితే ఉత్తరాదిలో సంక్రాంతి సెలబ్రేషన్స్ హడావిడి కాస్త తక్కువగా ఉంటుంది. కొన్ని కొత్త సినిమాలకు సైన్ చేశాను'' అని పేర్కొన్నారు.

నాకు చాలా ప్రత్యేకం!

- వర్ష బొల్లమ్మ

''కానిస్టేబుల్ కనకం 2' నాకు చాలా ప్రత్యేకం. ఇంత అద్భుతమైన భావోద్వేగంతో ఉన్న కథకి నన్ను ఎంపిక చేసినందుకు డైరెక్టర్ ప్రశాంత్‌కి థ్యాంక్యూ. 'కానిస్టేబుల్ కనకం' సీజన్ 3 కూడా చేయాలని కోరుకుంటున్నాను'' అని హీరోయిన్ వర్ష బొల్లమ్మ చెప్పారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన వెబ్ సిరీస్ 'కానిస్టేబుల్ కనకం 2'. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఈ సిరీస్ నేటి నుంచి ఈటీవీ విన్‌లో ప్రసారం అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈవెంట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ–''ఈ సంక్రాంతికి అందరికీ మంచి వినోదం అందిస్తున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ సాయిబాబా, హేమంత్, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, ఈటీవీ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి, బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, నటి మేఘలేఖ మాట్లాడారు.

బాలీవుడ్‌లో టాప్

- రణ్‌వీర్ సింగ్

హిందీ చిత్రం 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డును సృష్టించింది. రణ్‌వీర్‌సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన సినిమా 'ధురంధర్'. మాధవన్, సంజయ్‌దత్, అక్షయ్‌ఖన్నా, సారా అర్జున్, అర్జున్ రాంపాల్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్ పతాకాలపై ఆదిత్యధర్,లోకేష్ ధర్, జ్యోతిదేశ్‌పాండే నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబరు 5న థియేటర్స్‌లో విడుదలైంది. కాగా 'ధురంధర్' సినిమా 33 రోజుల్లో రూ.831.40 కోట్ల రూపాయల కలెక్షన్స్‌ను సాధించి, ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రంగా నిలిచిందని చిత్ర నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ సోషల్ మీడియా మాధ్యమాల్లో పేర్కొంది. ఇక ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్' చిత్రం రూ. 1200 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను సాధించి, ఇంకా థియేటర్స్‌లో ప్రదర్శించబడుతోంది. ఇక 'ధురంధర్ 2' చిత్రం మార్చి 19న రిలీజ్ కానుంది.

ప్రేమికుల రోజున...

- సంతోష్, మానస

సంతోష్ శోభన్, మానసా వారణాసి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ ద్విభాషా (తెలుగు, తమిళ) చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. రొమాంటిక్ లవ్‌స్టోరీగా రూపొందిన ఈ సినిమాని ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాకు సహ నిర్మాత: అజయ్‌కుమార్ రాజు. పి, సంగీతం: ఆదిత్య రవీంద్రన్.

జన నాయకుడు వాయిదా

- విజయ్

హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు') సినిమా విడుదల వాయిదా పడింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై వెంకట్. కె.నారాయణ నిర్మించిన ఈ చిత్రం రేపు(శుక్రవారం) విడుదల కావాల్సి ఉండగా, వాయిదా వేశారు. ''మా నియంత్రణకు మించిన కొన్ని అనివార్య కారణాల వల్ల 'జన నాయగన్' రిలీజ్‌ను వాయిదా వేస్తున్నాం. వీలైనంత తొందర్లోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో బాబీ డియోల్, ప్రియమణి, మమితాబైజు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
102	38
84,961	26,141

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,718	△	172
డోజోన్స్	49,379	▽	83
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,057	▽	66
డాక్స్	25,174	△	282
షాంఘై	4,086	△	2
నికాయ్	51,962	▽	556

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.05	91.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.88	123.25
€	యూరో	ఎస్‌బీఐ	102.89	106.83
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.17	62.06
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.84	71.54
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.07	24.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.58	24.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.96	13.79

జీడీపీ వృద్ధి 7.4 శాతం

- మెరుగైన అంచనాలు ప్రకటించిన **కేంద్రం**
- ఆర్‌బీఐ అంచనా 7.3 శాతం కంటే **ఎక్కువ**

న్యూఢిల్లీ: తయారీ, సేవల రంగాల బలమైన పనితీరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ 7.4 శాతం వృద్ధి సాధిస్తుందని, ప్రపంచంలో వేగవంతమైన పెద్ద ఆర్థిక వ్యవస్థగా తన గుర్తింపును కొనసాగిస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవ జీడీపీ స్థిర ధరల వద్ద 2025–26లో రూ.201.90 లక్షల కోట్లకు చేరుతుందని, 2024–25లో ఉన్న రూ.187.97 లక్షల కోట్ల కంటే 7.4 శాతం పెరుగుదల ఉంటుందని పేర్కొంది. 6.3–6.8 శాతం మధ్య వృద్ధి నమోదు కావొచ్చన్న గత అంచనాల కంటే ఇది ఎక్కువ. ఆర్‌బీఐ అంచనా 7.3 శాతం కంటే అధికం కావడం గమనార్హం. భారత ఉత్పత్తులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ సెప్టెంబర్ త్రైమాసికంలోనూ బలమైన పనితీరు (8.2 శాతం) నమోదు చేయడం తెలిసిందే. కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ ఈ మేరకు తొలి ముందస్తు అంచనాలను విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉంది. జీఎస్‌టీ సంస్కరణలతో 375 ఉత్పత్తులపై ధరలు దిగిరావడం, ఆదాయపన్ను కొత్త విధానంలో మినహాయింపులను గణనీయంగా పెంచడం, కార్మిక సంస్కరణలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించడం, ద్రవ్యోల్బణం దిగిరావడం, గ్రామీణ వినియోగం పుంజుకోవడాన్ని సానుకూలతలుగా గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ పేర్కొంది. స్థూల జోడించిన విలువ (జీవీఏ) 7.3 శాతం వృద్ధి చెందుతుందని తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 6.4 శాతంగా ఉంది.

తయారీ 7 శాతం

తయారీ రంగం 7 శాతం వృద్ధిని సాధిస్తుందని (గత ఏడాది 4.5 శాతం) ప్రభుత్వం అంచనా వేసింది. సేవల రంగంలో వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న 7.2 శాతం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9.1 శాతానికి విస్తరిస్తుందని పేర్కొంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

వెండి ప్రాసెసింగ్ సామర్థ్యం పెంచుకోవాలి	ఎగుమతుల వృద్ధితోనే ఎదుగుతాం: గడ్కరీ

బీఎండబ్ల్యూ ఇల్లు.. బెంజ్ విల్లా

- ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, గుర్గావ్‌లో ప్రాజెక్టులు
- జాబితాలో లాంబోర్గిని, బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్
- లగ్జరీ, బ్రాండెడ్ రెసిడెన్షియల్, కన్సల్టెన్సీ సర్వీసులపై దృష్టి

రియల్టీలోకి దూసుకొస్తున్న లగ్జరీ కార్ల కంపెనీలు



ఇప్పటివరకూ భారత్‌లో విలాసవంత కార్ల విక్రయాలకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన గ్లోబల్ ఆటో దిగ్గజాలు తాజాగా దేశీ రియల్టీ రంగంపై కన్నేశాయి. ప్రధాన ప్రాంతాలలో రియల్టీ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా దేశీయంగా సరికొత్త వ్యాపార ప్రణాళికలను అమలు చేయనున్నాయి. ఇందుకు 2026 కేలండర్ ఏడాదిలో తెరతీయనున్నాయి. ముంబై, చెన్నై సహా ప్రధాన నగరాలు, గుర్గావ్, హైదరాబాద్ తదితర అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు వేస్తున్నాయి. ఇందుకు వివిధ రియల్టీ డెవలపర్స్‌తో చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే లగ్జరీ కార్ల దిగ్గజం లాంబోర్గిని ప్రమోటర్ కుటుంబం దేశీ రియల్టీలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతోంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గుర్గావ్‌లో విలాసవంత బ్రాండెడ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు మెర్సిడెస్ బెంజ్ రియల్టీ డెవలపర్స్‌తో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక బీఎండబ్ల్యూ సైతం దేశీ రియల్టీ గ్రూప్‌లతో చర్చలు నిర్వహిస్తోంది. అయితే బ్రాండెడ్ ప్రాజెక్ట్ చేపడుతుందా లేక .. రియల్టీలో కార్యకలాపాలు కలిగిన క్రియేటివ్ డిజైన్ కన్సల్టెన్సీ అనుబంధ సంస్థ డిజైన్‌వర్క్స్‌పై ముందుకెళుతుందా అనే విషయంపై సందిగ్ధత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి.

ముంబై, చెన్నైలలో

హైపెర్ఫార్మెన్స్ కార్లు, ఎస్‌యూవీలు రూపొందించే లాంబోర్గిని ప్రమోటర్ టోనినో ఇప్పటికే ముంబై, చెన్నైలలో ప్రాజెక్టులపై కసరత్తు చేస్తున్నారు. ఇందుకు లాంబోర్గిని టోనినో ఎస్‌పీఏ ద్వారా చర్చలకు తెరతీశారు. కార్ల దిగ్గజం లాంబోర్గినీ వ్యవస్థాపకుడు ఫెరూసియో లాంబోర్గిని కుమారుడితడు. కాగా.. ఇప్పటికే దుబాయ్, మియామీ(ఫ్లోరిడా)లలో ప్రాజెక్టులు చేపట్టిన గ్లోబల్ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ దేశీ ప్రణాళికలు వెల్లడికావలసి ఉంది. ఈ బాటలో ఆటోమొబైల్ దిగ్గజాలేకాకుండా దేశీయంగా రియల్టీ రంగ కార్యకలాపాలపట్ల ప్రీమియం వెల్‌నెస్ బ్రాండ్లు, ఫ్యాషనబుల్ క్లాతింగ్ సంస్థలు, యూరోపియన్ డిజైన్ స్టూడియోలు సైతం ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. వ్యూహాత్మకంగా కీలకమైన నగరాలలో బ్రాండెడ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు పలు రంగాల గ్లోబల్ దిగ్గజాలు ఇప్పటికే డెవలపర్స్‌తో విస్తృతంగా చర్చలు నిర్వహిస్తున్నట్లు నిపుణులు తెలియజేశారు.

సరికొత్త బ్రాండ్లతో

సరికొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడంతోపాటు.. నాణ్యతా ప్రమాణాలకు హామీనిచ్చేందుకు వీలుండటంతో దేశీయంగా రియల్టీ డెవలపర్లు సైతం గ్లోబల్ దిగ్గజాలవైపు చూస్తున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. దీంతో సంప్రదాయ బ్రాండెడ్ రెసిడెన్షియల్ మార్కెట్లయిన యూఎస్, యూఏఈ, థాయ్‌లాండ్, వియత్నాం తదితరాల జాబితాలో భారత్ సైతం చేరనున్నట్లు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో బ్రాండెడ్ రెసిడెన్స్ సరఫరాలు 55 శాతం జంప్ చేసినట్లు శావిల్స్ బ్రాండెడ్ రెసిడెన్స్ 2025–26 నివేదిక వెల్లడించింది. ఇందుకు ప్రధానంగా వియత్నాం, థాయ్‌లాండ్ తోపాటు.. భారత్‌లో వృద్ధి సహకరించినట్లు తెలియజేసింది. ఈ ప్రభావంతో టాటా గ్రూప్ దిగ్గజం ఇండియన్ హోటల్స్ కంపెనీ(తాజ్ హోటళ్లు) సైతం చెన్నైలో బ్రాండెడ్ రెసిడెన్సీవైపు దృష్టి పెట్టడం గమనార్హం!

ఆకర్షణీయ మార్కెట్‌గా

ఒకప్పుడు దిగ్గజాల లక్ష్యంగా నిలిచిన దుబాయ్, మియామీ, లండన్ బాటలో ఇప్పుడు భారత్ భారీ పెట్టుబడులు, ప్రాజెక్టులను ఆకట్టుకుంటున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. బ్రాండెడ్ రెసిడెన్స్‌లకు దేశీయంగా అత్యంత సంపన్నవర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్ ప్రభావం చూపుతున్నట్లు తెలియజేశారు. నోయిసిస్ క్యాపిటల్ అడ్వయిజర్స్ విశ్లేషణ ప్రకారం టైర్–1 మార్కెట్లు ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైల బాటలో టైర్–2 పట్టణాలు సైతం దిగ్గజాలను ఆకట్టుకుంటున్నాయి. ఈ జాబితాలో భువనేశ్వర్, చండీగఢ్, అహ్మదాబాద్, గోవా, సూరత్ తదితరాలున్నాయి. గత మూడేళ్లుగా లగ్జరీ ప్రాజెక్టులు జోరందుకోవడం ఇందుకు తోడ్పాటునిస్తోంది!

కారణాలున్నాయ్..

ప్రస్తుతం లైవ్ బ్రాండెడ్ రెసిడెన్స్ ప్రాజెక్టుల విషయంలో భారత్ ప్రపంచంలో ఆరో ర్యాంకును ఆక్రమిస్తోంది. గ్లోబల్ సరఫరాల్లో నాలుగో స్థానంలో నిలుస్తోంది. చేపట్టనున్న ప్రపంచ ప్రాజెక్టులలో పదో ర్యాంకును అందుకుంది. దేశీ రియల్టీ రంగంలో ఇప్పటికే కార్యకలాపాలు విస్తరించిన గ్లోబల్ బ్రాండ్లలో ఫోర్ సీజన్స్, రిట్జ్ కార్ల్‌టన్, మారియట్, అర్మాణీ కాసా, వెర్సేస్ హోమ్, ట్రంప్ ఫ్యామిలీ, హయత్, పుల్‌మ్యాన్, ఐటీసీ, హిల్టన్ తదితరాలున్నాయి. ఈ బాటలో తాజాగా లగ్జరీ బ్రాండ్ల ఆటో దిగ్గజాలు క్యూ కట్టడం గమనించదగ్గ అంశం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

మూడోరోజూ నష్టాల ముగింపు

85,000 దిగువకు సెన్సెక్స్

ముంబై: అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలతో దేశీయ స్టాక్ మార్కెట్‌లో మూడోరోజూ అమ్మకాలు కొనసాగాయి. సెన్సెక్స్ 102 పాయింట్లు నష్టపోయి 85,000 స్థాయి దిగువన 84,961 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 38 పాయింట్లు నష్టపోయి 26,141 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 446 పాయింట్లు క్షీణించి 84,617 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు పతనమై 26,068 వద్ద కనిష్టాన్ని తాకింది. ట్రేడింగ్ చివర్లో ఐసీఐసీఐ బ్యాంకు(1.25%), టైటాన్(4%), ఇన్ఫోసిస్(2%), టీసీఎస్(1%) షేర్లు రాణించడంతో నష్టాలు పరిమితమయ్యాయి.

- డిసెంబర్ క్వార్టర్‌లో కంపెనీ వార్షిక ఆదాయం 40% వృద్ధి సాధించడంతో టైటాన్ షేరు మెరిసింది. బీఎస్‌ఈలో 4% పెరిగి రూ.4,273 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 5% ర్యాలీ చేసి రూ.4,312 వద్ద ఏడాది గరిష్టాన్ని నమోదు చేసింది.
- డాలరుతో మారకంలో రూపాయి తాజాగా 31 పైసలు బలపడి 89.87 వద్ద ముగిసింది.

అమెజాన్ పేలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు

న్యూఢిల్లీ: ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో భాగమైన అమెజాన్ పే ఫిక్స్‌డ్ డిపాజిట్ల సేవలను ప్రవేశపెట్టింది. ఇందుకు శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్‌లతో పాటు 5 బ్యాంకులతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. సౌత్ ఇండియన్ బ్యాంక్, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు వీటిలో ఉన్నాయి. ప్రత్యేకంగా సేవింగ్స్ ఖాతా అవసరం లేకుండా రూ. 1,000 నుంచి ఎఫ్‌డీ ఖాతాను తెరవొచ్చని సంస్థ తెలిపింది. వార్షికంగా 8% వరకు వడ్డీ రేటు పొందవచ్చని పేర్కొంది. ప్రతి బ్యాంకులో రూ. 5 లక్షల వరకు ఎఫ్‌డీలకు బీమా రక్షణ ఉంటుంది.

వెండి.. వేరే లెవెల్

కిలోకి రూ. 5,000 అప్ ● రూ. 2,56,000కి

న్యూఢిల్లీ: సురక్షిత పెట్టుబడి సాధనంగా, పారిశ్రామిక అవసరంగా వెండికి డిమాండ్ మరింతగా పెరుగుతోంది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం బుధవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ. 5,000 ఎగిసి మరో కొత్త రికార్డు స్థాయి రూ. 2,56,000కి చేరింది. అమెరికా–వెనెజువెలా మధ్య ఉద్రిక్తతలు పెరగడం వెండికి సానుకూలంగా మారిందని ట్రేడర్లు తెలిపారు. మరోవైపు, 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాముల రేటు స్వల్పంగా రూ. 100 మేర తగ్గి రూ. 1,41,400కి పరిమితమైంది. ఇటీవలి ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం, అమెరికా డాలరు కోలుకోవడం వంటి కారణాలతో ధర స్వల్పంగా తగ్గినట్లు నిపుణులు తెలిపారు.

పసిడి డీలా..

అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో పసిడి ధర ఔన్సుకి (31.1 గ్రాములు) 45.22 డాలర్లు తగ్గి 4,449.87 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. వెండి ఇంట్రాడేలో 82.75 డాలర్ల గరిష్టాన్ని తాకినప్పటికీ, 2.55 డాలర్లు క్షీణించి 78.69 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: భౌతిక శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: జనరల్ ఇంగ్లిష్

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ విభాగంలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అయితే ఈ కోర్సులు చదవడానికి బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌ను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యం. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్).. ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో పలు స్థాయిల్లో చక్కటి కోర్సులను అందిస్తోంది. వీటిలో ప్రవేశానికి ప్రతి ఏటా జాతీయ స్థాయిలో సీపెట్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తోంది. తాజాగా 2026కు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. సీపెట్ ప్రత్యేకత, కోర్సులు, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

సిపెట్-2026

ప్లాస్టిక్ రంగంలో పాగా వేస్తారా

» సిపెట్ క్యాంపస్‌ల్లో పలు ప్లాస్టిక్ కోర్సులు
» డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులకు సిపెట్ నోటిఫికేషన్
» విస్తృత కెరీర్ అవకాశాలు కల్పిస్తున్న ప్లాస్టిక్ ఇంజనీరింగ్

మొత్తం 30 క్యాంపస్‌లు

ప్లాస్టిక్ రంగంలో నిపుణులైన మానవ వనరుల కొరత కనిపిస్తోంది. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేలా ప్లాస్టిక్ రంగంలో మానవ వనరులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్)ను నెలకొల్పింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొత్తం 30 సిపెట్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో పీజీ, పీహెచ్‌డీ, బీటెక్, ఎంటెక్, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులను అందిస్తున్నారు.

కోర్సులు-అర్హతలు

- దేశ వ్యాప్తంగా 30 క్యాంపస్‌ల ద్వారా పలు స్థాయిల్లో కోర్సులను అందిస్తున్న సిపెట్.. తాజాగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
- **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ(డీపీఎంటీ): అర్హత:** పదో తరగతి; కోర్సు వ్యవధి: మూడేళ్లు
- **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ(డీపీటీ): అర్హత:** పదో తరగతి; కోర్సు వ్యవధి: మూడేళ్లు.
- **పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్(పీడీ-పీఎండీ క్యాడ్/క్యామ్): కోర్సు వ్యవధి:** ఒకటిన్నర సంవత్సరం; **అర్హత:** మెకానికల్ /ప్లాస్టిక్/పాలిమర్/టూల్/ప్రొడక్షన్ /మెకట్రానిక్స్/ఆటో మొబైల్/టూల్ అండ్ డై మేకింగ్/పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్రాంచ్‌లలో ఏదో ఒక దానిలో డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి లేదా సిపెట్ డీపీఎంటీ/ డీపీటీ ఉత్తీర్ణులవ్వాలి.
- **పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ-పీపీటీ): కోర్సు వ్యవధి:** రెండేళ్లు; **అర్హత:** బీఎస్సీ(ఎంపీసీ)ఉత్తీర్ణత ఉండాలి.
- ఆయా అర్హత పరీక్షల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే.. అడ్మిషన్ టెస్ట్ ముగిసిన ఎనిమిది వారాల్లోగా సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్

సిపెట్ క్యాంపస్‌లు అందించే డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి సిపెట్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. అందులో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

పరీక్ష విధానం.. వేర్వేరుగా

- సిపెట్ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ కోర్సును అనుసరించి వేర్వేరుగా ఉంటుంది.
- డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశ పరీక్షను మూడు విభాగాల్లో (జనరల్ నాలెడ్జ్ - 25 ప్రశ్నలు, 25 మార్కులు), (సైన్స్ 20 ప్రశ్నలు-20 మార్కులు), (ఇంగ్లిష్ 5 ప్రశ్నలు-5 మార్కులు) నిర్వహిస్తారు. మొత్తం 50 ప్రశ్నలతో 50 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సు ప్రవేశ పరీక్షను నాలుగు విభాగాల్లో 50 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్ (20 ప్రశ్నలు-20 మార్కులు),సైన్స్(10 ప్రశ్నలు-10 మార్కులు),ఇంగ్లిష్ (10ప్రశ్నలు-10మార్కులు),కెమిస్ట్రీ,బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్(10 ప్రశ్నలు-10 మార్కులు)సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ కోర్సు ప్రవేశ పరీక్షను.. జనరల్ నాలెడ్జ్ (20 ప్రశ్నలు-20 మార్కులు), సైన్స్(10 ప్రశ్నలు-10 మార్కులు), ఇంగ్లిష్ (10 ప్రశ్నలు-10 మార్కులు), ప్లాస్టిక్స్/పాలిమర్స్, టూల్స్ రూమ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్(10 ప్రశ్నలు -10 మార్కులు) విభాగాల్లో 50 మార్కులకు నిర్వహిస్తారు.
- అన్ని కోర్సుల ప్రవేశ పరీక్షకు గరిష్ఠంగా 50 మార్కులు కేటాయించారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు లభించే సమయం ఒక గంట.

విస్తృత అవకాశాలు

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకుంటే.. చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ప్లాస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం- 2026 చివరి నాటికి ప్లాస్టిక్ రంగంలో దాదాపు 2.6 లక్షల మంది నిపుణుల అవసరం ఏర్పడనుంది.

ఉపాధి వేదికలు

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సుల ఉత్తీర్ణులకు ఆటోమొబైల్ కంపెనీలు, పెట్రోలియం ఉత్పత్తుల సంస్థలు, ఆర్ అండ్ డీ విభాగాలు ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ రంగంలో పెట్రోలియం మంత్రిత్వ శాఖ, ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా కార్పొరేషన్ తదితర సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి. ఇక ప్రైవేటు రంగంలో ప్రతి ఉత్పత్తి పరిశ్రమలోనూ ప్లాస్టిక్ ఇంజనీర్ల అవసరం ఉంటుంది.

సిపెట్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

సిపెట్ క్యాంపస్‌ల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగాల పరంగా ఢోకా లేదు. కారణం.. ఇక్కడ పలు కార్పొరేట్ సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ డ్రైవ్స్ నిర్వహించి మరీ నియామకాలు చేపడుతుండటమే. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. సిపెట్ క్యాంపస్‌లలో దాదాపు 90 శాతం మందికి ఆఫర్లు లభించాయి.

ఆసక్తి ప్రధానం

ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో రంగంలో రాణించాలంటే ఆసక్తి ప్రధానమని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సృజనాత్మకత, కొత్త అంశాలను ఇట్టే పసిగట్టే నేర్పు ఎంతో అవసరం. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశించే కొత్త వస్తువులు, వాటి డిజైన్ వెనుక ఇమిడి ఉన్న సాంకేతికత, సృజనాత్మకతలను పరిశీలించే నైపుణ్యం, మన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తులను డిజైన్ చేసే సామర్థ్యం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2026, మే 28
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** 2026, జూన్ 7
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cipet26.onlineregistrationform.org/CIPET

ప్రవేశ పరీక్షలో రాణించేలా

- సిపెట్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌లో రాణించేందుకు సబ్జెక్టులవారీగా పట్టు సాధించాల్సిన అంశాలు..
- **మ్యాథమెటిక్స్:** డిస్క్రీట్ మ్యాథమెటిక్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ కాలిక్యులస్, అనలిటికల్ జామెట్రీ.
- **ఫిజిక్స్:** ఆసిలేషన్స్, థర్మల్ అండ్ కెమికల్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్స్, సాలిడ్స్ అండ్ సెమీ కండక్టర్ డివైజెస్, వర్క్-ఎనర్జీ-పవర్, రే ఆప్టిక్స్, ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, మ్యాగ్నటిక్ ఎఫెక్ట్స్ ఆఫ్ కరెంట్.
- **కెమిస్ట్రీ:** సొల్యూషన్స్, ట్రాన్సిషన్ ఎలిమెంట్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, సాలిడ్ స్టేట్, ఆల్కేన్స్ అండ్ ఆల్కైన్స్ తయారీ ధర్మాలు, సర్ఫేస్ కెమిస్ట్రీ, కెమికల్ కైనెటిక్స్, అమినో యాసిడ్స్ అండ్ పెప్టైడ్స్, కెమికల్ ఈక్విలిబ్రియమ్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ కెమికల్ బాండింగ్.
- **ఇంగ్లిష్:** బేసిక్ గ్రామర్ అంశాలు, కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, యూసేజ్ ఆఫ్ వర్డ్స్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్‌లపై పట్టు సాధించాలి.
- **జనరల్ నాలెడ్జ్:** ఈ విభాగం కోసం హిస్టరీ, పాలిటీ, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ సైన్స్, క్రీడలు, అవార్డులు-విజేతలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ అండ్ డిజైన్ కోర్సుకు మాత్రమే ఉండే కోర్ సబ్జెక్ట్ ప్రశ్నలకు సంబంధించి అభ్యర్థులు డిప్లొమా స్థాయిలో తాము చదివిన సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయి అవగాహనతో అడుగులు వేయాలి.
- జీకే, సైన్స్, ఇంగ్లిష్ విభాగాలు అన్ని కోర్సుల ప్రవేశ పరీక్షలోనూ ఉన్నాయి.

కోర్సు స్థాయిని అనుసరించి ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు.. తాము దరఖాస్తు చేసుకున్న కోర్సుకు అర్హతగా పేర్కొన్న కోర్సులోని అంశాలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.

సిపెట్ క్యాంపస్‌లు

- దేశంలో ప్రస్తుతం అహ్మదాబాద్, అమృత్‌సర్, ఔరంగాబాద్, బడ్డి, బాలాసోర్, భోపాల్, భువనేశ్వర్, చంద్రాపూర్, డెహ్రాడూన్, గువహటి, హాజీపూర్, హల్దియా, హైదరాబాద్, ఇంఫాల్, జైపూర్, కొచి, లక్నో, మధురై, ముర్తాల్, మైసూర్, రాయ్‌పూర్, కోర్బా, విజయవాడ, అగర్తల, గ్వాలియర్, వారణాసి, భగల్పూర్, అయోధ్యలో సిపెట్ క్యాంపస్‌లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీని భువనేశ్వర్ మినహా అన్ని క్యాంపస్‌లు అందిస్తున్నాయి.
- డిప్లొమా ఇన్ ప్లాసిక్ మౌల్డింగ్ టెక్నాలజీ.. అయోధ్య క్యాంపస్ మినహా అన్ని క్యాంపస్‌లలో అందుబాటులో ఉంది.
- పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డింగ్ టెక్నాలజీ–క్యాడ్ క్యామ్‌ను ఔరంగాబాద్, భోపాల్, చెన్నై, హల్దియా, హైదరాబాద్, మధురై, ముర్తాల్ క్యాంపస్‌లలో అందిస్తున్నారు.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ టెక్నాలజీ కోర్సును అహ్మదాబాద్, అమృత్‌సర్, ఔరంగాబాద్, బడ్డి, బాలాసోర్, భోపాల్, చెన్నై, గువహటి, హాజీపూర్, హల్దియా, హైదరాబాద్, ఇంఫాల్, లక్నో, మూర్తాల్, రాయ్‌పూర్, విజయవాడ క్యాంపస్‌లలో అందిస్తున్నారు.

ప్లాస్టిక్ ఇంజనీరింగ్.. ముఖ్యాంశాలు

- ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అనుబంధ కోర్సుల్లో డిప్లొమా,పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి కామన్ అడ్మిషన్ టెస్ట్.
- కోర్సులు పూర్తి చేసుకుంటే.. మాన్యుఫ్యాక్చరింగ్, డిజైన్ రంగాల్లో కొలువులు.
- ప్రారంభంలోనే నెలకు రూ.50వేల వరకు వేతనం
- సిపెట్ హైదరాబాద్‌లో 300, విజయవాడ క్యాంపస్‌లో 150 సీట్లు.

విద్య, ఉద్యోగ సమాచారం

సీయూఈటీ యూజీ-2026

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)..దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్శిటీలు, ఇతర విద్యా సంస్థల్లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) యూజీ–2026కి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **అర్హత:** ఇంటర్మీడియట్/తత్సమాన అర్హత కలిగి ఉండాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.01.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2026
» **ఫీజు చెల్లించడానికి చివరితేది:** 31.01.2026
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 02.02.2026 నుంచి 04.02.2026 వరకు
» **పరీక్ష తేదీలు:** 11.05.2026 నుంచి 31.05.2026 వరకు
» **వెబ్‌సైట్:** https://cuet.nta.nic.in

నాల్కో, భువనేశ్వర్‌లో 110 గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టులు

భువనేశ్వర్(ఒడిశా)లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 110.
» **పోస్టుల వివరాలు:** మెకానికల్–59, ఎలక్ట్రికల్–27, కెమికల్–24.
» **అర్హత:** 65 శాతం మార్కులతో బీఈ, బీటెక్ ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతో పాటు గేట్–2025 అర్హత సాధించి ఉండాలి. చివరి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 22.01.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** శిక్షణా కాలంలో రూ.40,000 నుంచి రూ.1,40,000, శిక్షణ అనంతరం రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **ఎంపిక విధానం:** ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(గేట్–2025)మార్కులు,పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.01.2026
» **వెబ్‌సైట్:** https://mudira.nalcoindia.co.in

మిమ్మల్ని నమ్మి ▸ భూములు ఎలా ఇవ్వాలి?

- రాజధాని భూసమీకరణపై వడ్డమాను గ్రామసభలో రైతుల నిలదీత
- గతంలో రోడ్డున పడినా పట్టించుకోలేదంటూ మంత్రి నారాయణపై ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడికొండ: ''మిమ్మల్ని నమ్మి భూములు ఎలా ఇవ్వాలి? భవిష్యత్తులో మాకు అన్యాయం జరిగితే పరిస్థితి ఏంటి? మీరు హామీలిచ్చి వెళ్లిపోతారు. తర్వాత దిక్కెవరు?'' అని రాజధాని అమరావతి రెండో విడత భూ సమీకరణలో వడ్డమాను గ్రామ రైతులు మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌లను నిలదీశారు. భూములు తీసుకున్న మూడేళ్లలో అభివృద్ధి చేసివ్వకపోతే ఎకరాకు రూ.5 లక్షల చొప్పున ఏటా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బుధవారం తుళ్లూరు మండలం వడ్డమాను, అమరావతి మండలం యండ్రాయి గ్రామాల్లో సభలు నిర్వహించారు. ''గతంలో ప్రభుత్వాన్ని నమ్మి 33 వేల ఎకరాలు అందజేయగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. రోడ్డున పడినా పట్టించుకోలేదు. ప్రభుత్వం చేయలేకపోతే ఏంటి? అనేదానిపై సరైన జవాబు చెప్పాలి'' అని వడ్డమానులో మంత్రి నారాయణను రైతులు ప్రశ్నించారు. రైతు ఆళ్ల బసవ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ''ప్రభుత్వం మారితే మా పరిస్థితి ఏంటి? మూడు కాదు నాలుగేళ్లు తీసుకోండి. అనుకున్న సమయంలో ప్లాట్లు అభివృద్ధి చేయలేకపోతే మేం కోర్టులకు వెళ్లి లేదా ప్రభుత్వం మెడలు వంచి హక్కులు సాధించుకునేలా ప్రభుత్వం అగ్రిమెంట్ చేయాలి'' అని కోరారు.

☛ ల్యాండ్ పూలింగ్ కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించి గ్రామస్థులతో మంత్రి నారాయణ నిర్వహించిన సమావేశంలో భూములు ఇచ్చేందుకు సమ్మతిస్తూ వడ్డమాను రైతులు మైనేని సత్యనారాయణ, సాయితరుణ్, వడ్లమూడి శ్రీలక్ష్మిలు ఫారం–1ను అందజేశారు. సీఎం సూచనతో పూలింగ్‌లో భూములిచ్చే రైతు కుటుంబాలకు రూ.లక్షన్నర రుణ మాఫీ ప్రకటిస్తున్నట్లు నారాయణ తెలిపారు. కౌలు పెంచేందుకు సీఎం అంగీకరించారని చెప్పారు. వడ్డమానులో 1,768 ఎకరాల పూలింగ్ ప్రారంభించిగా ముగ్గురు రైతులు ఫారం–1 ఇచ్చారన్నారు. గతంలో మాస్టర్ ప్లాన్ రూపకల్పన, ఇతర కారణాలతో ఎన్నికలకు ఏడాదిన్నర ముందు పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. అమరావతిలో పనులు మూడేళ్లలో పూర్తవుతాయని, రైతులకిచ్చే ప్లాట్‌లలో ముందు 2 వరుసల రోడ్లు నిర్మిస్తామన్నారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిమెంట్‌పై మీకు అభ్యంతరం ఏమిటి?

వడ్డమాను రైతు చిట్టా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ''ఇదివరకు మెట్టకు 1,250, జరీబుకు 1,450 గజాలు రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వానికి సరిపడా భూములున్నాయి కనుక 1,450 గజాలు ఇవ్వాలి'' అని కోరారు. ఎకరాకు రూ.60 వేల కౌలు ఇవ్వాలని, భూ సమీకరణ చట్టం రైతులకు అనుకూలంగా లేదని, ప్లాట్ల అభివృద్ధిపై అగ్రిమెంట్ చేసివ్వడానికి ప్రభుత్వానికి అభ్యంతరమేంటి? అని రైతులు సూటిగా ప్రశ్నించారు. అగ్రిమెంట్ చేసేది లేదంటూ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పదేపదే చెప్పడంతో పాటు ''మీ దగ్గర ఉన్న డాక్యుమెంట్లతో కోర్టుకు వెళ్లొచ్చు'' అని సమాధానమిచ్చారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చేయలేదనే గడువు పెంచి ఇప్పుడు రైతులకు పరిహారం ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

వివాహేతర సంబంధమే కారణం ● విశాఖ జిల్లా మధురవాడలో ఘటన

నాగరాజు(ఫైల్)

మధురవాడ: ప్రియుడి మోజులో పడి, సుపారీ ఇచ్చి మరీ భర్తను అంతమొందించింది ఓ ఇల్లాలు. విశాఖపట్నం జిల్లాలోని మధురవాడలో జరిగిన ఈ ఘటన వివరాలు పీఎం పాలెం పోలీసులు బుధవారం తెలిపారు. బక్కనపాలెం ఎన్టీఆర్ కాలనీకి చెందిన అల్లాడ నాగరాజు(38), రమ్య దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కంచరపాలేనికి చెందిన సంజీవి వసంతరావుతో రమ్య వివాహేతర సంబంధం పెట్టుకుంది. తమకు అడ్డు వస్తున్నాడనే నెపంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి హత్యకు పథకం రచించింది. నాగరాజును చంపేందుకు వీరిద్దరూ కంచరపాలేనికి చెందిన బాలకృష్ణ, ప్రవీణ్‌కు రూ.50 వేలు ఇచ్చారు. నిందితులు వసంతరావు, బాలకృష్ణ, ప్రవీణ్ పథకం ప్రకారం నవంబరు 29న మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో గల ఓ లాడ్జిలో నాగరాజును హత్య చేసి శవాన్ని తిమ్మాపురం వెళ్లే రోడ్డులో ఉన్న బావికొండ సమీప నిర్మానుష్య ప్రాంతంలో పడేశారు. అనంతరం ఏమీ తెలియనట్లు రమ్య తన భర్త కనిపించడం లేదంటూ డిసెంబర్ 17న పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. మిస్సింగ్ కేసు నమోదు చేయాలని, తన భర్త మద్యానికి బానిసయ్యాడని, రూ.5 వేలు నగదు, బంగారం పట్టుకుని వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొంది. అనుమానం వచ్చిన పోలీసులు రమ్యను తమదైన శైలిలో విచారించగా, హత్య ఉదంతం బయటపడింది. పథకం ప్రకారం తామే హత్య చేసినట్లు ఒప్పుకుంది. దీంతో పోలీసులు బుధవారం మృతదేహం పడేసిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. బాగా పాడైపోయిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి, నిందితులు నలుగురినీ అరెస్టు చేసినట్లు పీఎంపాలెం సీఐ బాలకృష్ణ చెప్పారు.

లాభాపేక్ష సంస్థలు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయవచ్చు

- దీనికనుగుణంగా నిబంధనలు సవరించాం
- ఎన్‌ఎంసీ చైర్మన్ డాక్టర్ అభిజిత్ శేత్ వెల్లడి

సాక్షి, అమరావతి: లాభాపేక్షసంస్థలు కూడా వైద్య కళాశాలలు ఏర్పాటు చేయవచ్చని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) చైర్మన్ డాక్టర్ అభిజిత్ చంద్రకాంత్ శేత్ తెలిపారు. ఇప్పటివరకూ సెక్షన్ 8లో ఉండే నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్ మాత్రమే వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేలా నిబంధనలు ఉన్నాయని, వీటిని ఇటీవలే సవరించామని చెప్పారు. వారం రోజుల్లో సవరించిన నిబంధనలపై ప్రకటన చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న అభిజత్ బుధవారం విజయవాడలోని ఆరోగ్య వర్సిటీలో మీడియాతో మాట్లాడారు. వైద్య విద్యార్థులు, వర్సిటీలు, విద్యా సంస్థలు, ఇతర భాగస్వామ్య పక్షాలందరి నుంచి నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్)పై అంగీకారం లభించాకే దాని అమలుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. నెక్స్ట్ అమలుకు రెండేళ్లకు పైగా సమయం పట్టవచ్చన్నారు. ఇప్పటికే సాంకేతికపరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని చెప్పారు. భాగస్వామ్య పక్షాలకు అపోహలు నివృత్తి చేసి, సానుకూల దృక్పథం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో వైద్యులకు నేషనల్ మెడికల్ రిజిస్ట్రీ (ఎన్‌ఎంఆర్) స్వచ్ఛందమేనని చెప్పారు. దేశ వ్యాప్తంగా 13 లక్షల మందికిపైగా వైద్యులు ఉన్నారని, ఎన్‌ఎంఆర్‌లో వైద్యుల నమోదులో వచ్చే ఏడాది మంచి పురోగతి ఉంటుందన్నారు. దేశంలో వైద్య కళాశాలల గుర్తింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నామని వివరించారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించడానికి కృషి చేస్తున్నామన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేదు?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పదోన్నతుల్లో దివ్యాంగులకు చట్ట ప్రకారం కల్పించాల్సిన రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం కల్పించడం లేదంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దివ్యాంగులకు చట్టప్రకారం కల్పించాల్సిన రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం కల్పించడం లేదని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం అమలు చేయడం లేదంటూ స్వచ్ఛంద సంస్థ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ కార్యదర్శి పరమానంద్ ద్వివేది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, అంధుడైన ఎస్‌కే రుంగ్టా వాదనలు వినిపించారు.

2015లోనే సుప్రీంకోర్టు చెప్పింది..

దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని సుప్రీంకోర్టు 2015లోనే స్పష్టమైన తీర్పు ఇచ్చినా.. రాష్ట్రప్రభుత్వం మాత్రం అమలు చేయడం లేదని ధర్మాసనం రుంగ్టా దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి స్పందిస్తూ, దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

రాజాసాబ్ ప్రీమియర్ షో టికెట్ రూ.1,000

సాక్షి, అమరావతి: ప్రభాస్ నటించిన కొత్త సినిమా రాజాసాబ్ ఈ నెల 9న విడుదల కానున్న నేపథ్యంలో టికెట్ల ధరలను పెంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. గురువారం సాయంత్రం ప్రదర్శించే ప్రీమియర్ షోల టికెట్ ధర రూ.1000గా నిర్ణయించింది. 10 రోజుల పాటు రోజుకు 5 షోలు వేసుకోవచ్చని, ఒక్కో టికెట్‌పై అదనంగా సింగిల్ స్క్రీన్‌లో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచుకోవడానికి అంగీకరిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ తీరంలో క్షిపణి పరీక్ష

12, 13 తేదీల్లో నిర్వహించేందుకు రక్షణ శాఖ సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం తీరం నుంచి ఈ నెల 12, 13 తేదీల్లో క్షిపణి పరీక్షకు రక్షణ శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా నోటీస్ టు ఎయిర్‌మెన్(నోటమ్) జారీ చేసినట్లు తెలిసింది. బంగాళాఖాతం వెంబడి 500 కి.మీ పరిధిలో 12వ తేదీ అర్ధరాత్రి 2 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 9 గంటల వరకు నోటమ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నిర్దిష్ట సమయాల్లో ఈ ప్రాంతం మీదుగా విమాన రాకపోకలపై నిషేధం విధించారు. డిసెంబర్ 24న విశాఖ కేంద్రంగా ఐఎన్‌ఎస్ అరిఘాత్ నుంచి అత్యంత శక్తిమంతమైన కే–4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. 3,500 కి.మీ దూరంలోని లక్ష్యాల్ని ఈ మిసైల్ ఛేదించింది. ఈ నేపథ్యంలో మరోసారి విశాఖ కేంద్రంగా క్షిపణి పరీక్ష నిర్వహించేందుకు భారత నౌకాదళం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే.. ఈసారి ఏ తరహా మిసైల్‌ను ప్రయోగిస్తున్నారన్న విషయంపై ఇంకా ప్రకటన వెలువడలేదు.

ఇటీవల విశాఖ తీరంలో నిర్వహించిన కే–4 బాలిస్టిక్ మిసైల్ టెస్టింగ్(ఫైల్)

8, 9 తేదీల్లో పాక్ నోటమ్!

మరోవైపు శత్రుదేశం పాకిస్తాన్ కూడా ఈనెల 8, 9 తేదీల్లో ఉత్తర అరేబియా సముద్రంపై నోటమ్ జారీ చేసింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పాక్ నౌకాదళం విన్యాసాలు నిర్వహిస్తోంది. 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుంచి 9వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు నోటమ్ అమల్లో ఉంటుందని పాక్ పేర్కొంది.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

దగ్ధమవుతున్న బస్సు

తాళ్లపూడి: కొవ్వూరులోని గామన్ బ్రిడ్జి సమీపంలోని ఫ్లైఓవర్‌పై బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఓ ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఖమ్మం నుంచి విశాఖపట్నం వెళుతున్న ఆర్‌ఆర్ ట్రావెల్స్ బస్సు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వద్దకి వచ్చేసరికి సెల్ఫ్ మోటార్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ మరిపల్లి సైదులు వెంటనే బస్సును నిలిపివేసి అందులో ఉన్న ప్రయాణికులను కిందికి దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. కొవ్వూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

JASPER INDUSTRIES
Guntur: 7506024486; Chilakaluripet, Pidugurala: 9167061571; Narasaraopet: 9619940147

Images and illustrations are indicative and for information purpose only. All feature / specifications mentioned may vary from model to model and may not be available across all personas / variants. Features and specifications are subject to change without prior information. Please consult an authorized TATA Motors dealer for latest information on features / specifications before deciding to place an order. Colours may not match actual colours due to printing limitations. ♦As per Bharat NCAP 2024 score, applicable to Punch.ev, Curvv.ev and Nexon.ev. ~As per internal data provided by charge point operators. ##Based on internal calculations. ◊"Never-before" refers to the overall value proposition across offers. Offers vary by model, variant, manufacturing year, location, and dealer stock. Please check with authorised dealers for exact details. #Cumulative sales milestone achieved across the TATA.ev portfolio since inception. Sales figures are indicative and rounded off. ▲Finance at the sole discretion of Financier The EMI figures shown above are based on specific loan amount and 120 month repayment period. Actual EMI amounts may vary based on loan amount and total on road price T&C Apply. *All India ex-showroom price. ■Offers vary by manufacturing year and personas. Discounts applicable on MY2025 vehicles may differ from those on MY2026 vehicles. Please check with authorised dealers for variant-wise and stock-wise details. Terms & conditions apply.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వాయు వేగంగా

నగరంలో డేంజర్ బెల్స్

అందమైన తీరం, ఆహ్లాదకరమైన వాతావరణం అంటూ విశాఖపట్నం గురించి గొప్పగా చెప్పకోవడం ఇక గతమేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత కొన్ని రోజులుగా నగరం కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. సిటీ ఆఫ్ డెస్టినీ' కాస్తా 'సిటీ ఆఫ్ డస్ట్'గా మారుతుంటే.. పాలక యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. దేశంలోనే కాలుష్య పరిస్థితి విషమంగా ఉన్న జాబితాలో విశాఖ నగరం రెండో స్థానానికి చేరుకుందంటే వాయు కాలుష్య పరిస్థితులు ఎంత దుర్భరంగా మారాయో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర పర్యావరణ సంస్థలు హెచ్చరించిన తర్వాత.. ఇన్నాళ్లూ చాంబర్లకే పరిమితమైన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై జరిమానాల జులుం విదిల్చారు. రవాణా శాఖ యంత్రాంగం కాలం చెల్లిన వాహనాలపై ఫైన్లు విధించడం మొదలు పెట్టింది. - సాక్షి, విశాఖపట్నం

విశాఖలో పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం
తీరిగ్గా మేల్కొన్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి
నిబంధనలు పాటించని 7 పరిశ్రమలకు రూ.10 కోట్ల జరిమానా
తనిఖీలు, జరిమానాల పేరుతో రవాణా శాఖ హడావుడి
విషపు గ్యాస్ చాంబర్లుగా మారుతున్న పలు ప్రాంతాలు

బౌల్ ఏరియాతో సంకట స్థితి

నగరంలో కాలుష్య పరిస్థితులు

గాలి, నీరు, నేల కాలుష్య కోరల్లో చిక్కుకొని నగరానికి సవాల్ విసురుతున్నాయి. ఓవైపు సుందర తీరం.. మూడు వైపులా కొండలు.. మధ్యలో సుమారు 265 చ.కి.మీ విస్తీర్ణంలో ఉన్న విశాఖకు వరంగా భావించేవారు. కానీ.. అదే ఇప్పుడు కొంప ముంచే కాలుష్యానికి కారణంగా మారుతోంది. ఈ విధంగా ఉండటాన్ని బౌల్ ఏరియాగా పిలుస్తుంటారు. ఈ బౌల్ ఏరియాలోకి కాలుష్యం విస్తరిస్తే బయటకు వెళ్లే మార్గముండదని పర్యావరణవేత్తల అభిప్రాయం. ఏడాదికి 9 నెలల పాటు నైరుతి దిశగా నగరం వైపు గాలులు వీస్తుంటాయి. ఈ దిక్కున భారీ పరిశ్రమలు ఉండడంతో ఏడాదికి 8 నెలలపాటు అంటే మార్చి నుంచి అక్టోబర్ వరకు అవి వెలువరించే వాయు, ధూళి కాలుష్యాలు గాలివాటంతో నగరాన్ని తాకుతున్నాయి. సుమారు 300 నుంచి 500 మీటర్ల ఎత్తుగా ఉండే ఈ కొండలు ఈ కాలుష్య వాయువులకు అడ్డుగా నిలబడి, వెనక్కు నెట్టి వేస్తున్నాయి. నగరంలోనే అవి తిష్ట వేసుకొనేటట్లు చేస్తున్నాయి. శీతాకాలంలో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తక్కువ ఉష్ణోగ్రతలు, మంచు కారణంగా కాలుష్యభరిత వాయువులు, హానికర ధూళి పదార్థాలు వాతావరణంలో పైకి పోలేక భూమి పైనే కేంద్రీకృతం అవుతున్నాయి. సాధారణంగా భూమి మీద వేడి గాలులు, ఆ పైన చల్ల గాలులు ఉంటాయి. ఇవి శీతాకాలంలో తారుమారు అవుతూ ఉంటాయి. దీంతో హానికర ధూళి పదార్థాలు ఉపరితల వాతావరణంలోకి వెళ్లడం లేదు.

రాత్రి పూట విషవాయువులు వెదజల్లుతున్నాయి

భూ ఉపరితలం నుంచి పైకెళ్లే కొద్దీ ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కానీ ఇప్పుడు పెరుగుతున్నాయి. దీన్నే ఇన్వర్షన్ లేయర్ అంటారు. ఇది ఒక లిడ్‌లా మారిపోయింది. పరిశ్రమలు రాత్రి వేళల్లో రసాయన వాయువులు వెదజల్లుతుంటాయి. ఇన్వర్షన్ లేయర్ వల్ల ఈ వాయువులు పైకెళ్లే పరిస్థితులు కనిపించక.. కాలుష్యం పెరుగుతోంది. ఇది చాలా ప్రమాదకరం. ఈ వాయువుల కారణంగా క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. కార్సినోజెనిక్ వాయువులతో పాటు గతంతో పోలిస్తే.. ధూళి కణాలు పెరగడం ఆందోళన కలిగించే అంశంగా పరిగణించవచ్చు. చెట్లు పెంచడమే మన ముందున్న తక్షణ కర్తవ్యం.

– ప్రొ.భానుకుమార్, పర్యావరణ నిపుణుడు

నిద్రలేచిన ఏపీపీసీబీ, రవాణా శాఖ!

ఇన్నాళ్లూ అవే పరిశ్రమలు, అదే కాలుష్యం వెదజల్లుతున్నా.. కనీస తనిఖీలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిస్థితుల చేయి దాటిన తర్వాత ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ), జిల్లా రవాణా శాఖ అధికారులు నిద్రలేచారు. కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వం కమిటీలు వేయడంతో హడావుడి మొదలు పెట్టారు. గత డిసెంబర్ 21 నుంచి పరిశ్రమల్లో తనిఖీలు మొదలుపెట్టారు. నిబంధనలు పాటించని ఏడు పరిశ్రమలను గుర్తించి రూ.10 కోట్ల జరిమానాలు విధించారు. ఇన్నాళ్లూ ఈ పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుంటే ఏపీపీసీబీ మొద్దు నిద్ర వ్యవహరించిందా? అనే విమర్శలొస్తున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి బాటలోనే జిల్లా రవాణాశాఖ అధికారులు నడిచారు. ఇప్పుడు చలానాలు వేయడం మొదలెట్టారు. డిసెంబర్ 21 నుంచి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో తనిఖీలు మొదలుపెట్టి.. 32 వాహనాలపై ఓవర్ లోడింగ్, 69 వాహనాలపై పొల్యూషన్ సర్టిఫికెట్ లేదని, టార్పాలిన్ లేకుండా.. దుమ్ము ధూళి లోడింగ్‌తో వెళ్తున్న 58 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.17.54 లక్షల జరిమానా విధించారు. జీవీఎంసీ అధికారులు కూడా కాలుష్య నియంత్రణ కోసం జూలు విదిల్చామని చెప్పేందుకు 10 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల్ని ఏర్పాటు చేశారు. ఇంతవరకూ ఈ బృందాలు ఏం చేశాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మారింది.

ఆందోళనకరంగా సూచీలు

గత నెల రోజులుగా విశాఖలో గాలి నాణ్యత సూచీలు(ఏక్యూఐ) ఆందోళనకరంగా ఉన్నాయి. చలికాలంలో కమ్ముకుంటున్న కాలుష్య మేఘాలు ఊపిరి సలపనివ్వకుండా చేస్తున్నాయి. గత వారం రోజులుగా ఢిల్లీలో మాదిరిగా ఏక్యూఐ 326 దాటుతోంది. పలు సందర్భాల్లో 329 కూడా నమోదై ఆందోళన కలిగించింది. ముఖ్యంగా రాత్రి సమయాల్లోనే కాలుష్య ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తిగా, 101 నుంచి 200 అయితే మోడరేట్‌గా, అంతకు మించి 201 నుంచి 300 అయితే పూర్, 301 నుంచి 400 వరకు అయితే వెరీ పూర్, 401 నుంచి 500 అయితే తీవ్ర ఆందోళనకర పరిస్థితిగా పేర్కొంటారు. విశాఖలో మాత్రం ప్రతి గంటకు గాలి నాణ్యత సూచీ పెరుగుతోంది. సాయంత్రం 6 గంటల తర్వాత నుంచి ఏక్యూఐ 290 దాటి అర్ధరాత్రికి 329కి చేరుకుంటోంది. గాలి కాలుష్య రేణువులు క్యూబిక్ మీటరుకు 60 మైక్రో గ్రాములు మించితే ప్రమాదం. పార్టికులేట్ మేటర్(పీఎం) 10 రేణువులు ప్రమాదకర స్థాయిలో 436 చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కానీ పీఎం 2.5 రేణువులు రాత్రి వేళల్లో 386గా నమోదవుతోంది.

ప్రభుత్వ ప్రకటనలపై పిల్‌ను కొట్టేసిన హైకోర్టు

సుప్రీంకోర్టుకు వెళ్లాలని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: అధికార పార్టీ నేతల, మంత్రుల ఫొటోలతో ప్రభుత్వం ప్రకటనలు ఇస్తోందని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, దీనిని అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు కొట్టేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టుకే వెళ్లాలని పిటిషనర్‌కు తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అధికార పార్టీ నేతలు, మంత్రులు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తూ తమ ఫొటోలతో ప్రభుత్వ ప్రకటనలు జారీ చేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలంటూ విజయవాడకు చెందిన విశ్రాంత ఉద్యోగి కొండలరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

బయో ఇంజనీర్డ్ ఊపిరితిత్తుల అభివృద్ధిలో కీలక అడుగు

- ఊపిరితిత్తుల ఆరోగ్య సంబంధ పరిశోధనల కోసం దేశంలోనే తొలి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం
- ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన జర్మనీ యూనివర్సిటీ
- పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించిన ఏఐజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి

ఊపిరితిత్తుల పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్.డి.నాగేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్ మూర్తి, జర్మనీ ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సమీప భవిష్యత్తులో బయో ఇంజనీర్డ్ ఊపిరితిత్తులు, రక్తనాళాల నమూనాల అభివృద్ధే లక్ష్యంగా కీలక అడుగు పడింది. ఊపిరితిత్తుల ఆరోగ్య సంబంధ పరిశోధనల కోసం దేశంలోనే తొలి బయోఇంజనీరింగ్ పరిశోధన కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో బుధవారం ప్రారంభమైంది. జర్మనీకి చెందిన జస్టస్ లీబిగ్ యూనివర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ లంగ్‌హెల్త్ (ఐఎల్‌హెచ్), ఐఐటీ హైదరాబాద్ సంయుక్తంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశాయి. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి, ఇన్‌స్టిట్యూట్ ఫర్ లంగ్ హెల్త్ ప్రతినిధులు ప్రొఫెసర్ వెర్నర్ సీగర్, ప్రొఫెసర్ సోని సవాయ్ పుల్లంశెట్టి సమక్షంలో పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, ఏఐజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న గాలి కాలుష్యం ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని.. ఈ పరిస్థితుల్లో ఊపిరితిత్తుల ఆరోగ్య పరిశోధనలపై దృష్టి సారించడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ లంగ్‌హెల్త్ (ఐఎల్‌హెచ్)తో కలిసి ఏర్పాటు చేసిన ఈ కేంద్రం క్లినికల్ పరిశోధన, రోగుల ప్రయోజనాలకు కీలక పరిష్కారం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశీయ పరిస్థితులకు ప్రపంచస్థాయి పరిష్కారాలే లక్ష్యం..

ఇప్పటివరకు ఊపిరితిత్తులు పాడైన రోగులకు అవయవ మార్పిడి చికిత్స విధానమే అందుబాటులో ఉండగా బయో ఇంజనీర్డ్ ఊపిరితిత్తులు, రక్తనాళ నమూనాల అభివృద్ధి పూర్తి స్థాయిలో జరిగితే ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం రానుందని నిపుణులు చెబుతున్నారు. మెకానోబయాలజీ, లేబుల్–ఫ్రీ ఇన్‌వివో ఇమేజింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జంతు పరిశోధన సదుపాయాలు ఐఐటీహెచ్‌లో ఉన్నాయి. అలాగే ఐఐటీహెచ్‌లోని మైక్రోఫ్లూయిడిక్స్ ల్యాబ్, 3డీ ప్రింటింగ్ వంటి సదుపాయాలను కూడా ఈ పరిశోధన కేంద్రం ఉపయోగించుకోనుంది. నాన్–ఇన్వేసివ్ డయాగ్నొస్టిక్స్, ఆధునిక చికిత్సా విధానాల అభివృద్ధికి ఈ కేంద్రం బాటలు వేయనుంది. వాయు కాలుష్యానికి తోడు, ధూమపానం, ఆహార అలవాట్ల కారణంగా దేశంలో లక్షలాది మంది ఊపిరితిత్తుల కేన్సర్లు, ఆస్తమా వంటి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారు. దేశీయంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేస్తూ ప్రపంచస్థాయిలో పరిష్కారాలను చూపడమే లక్ష్యంగా ఈ కేంద్రంలో పరిశోధనలు సాగనున్నాయి.

ప్రణయ్ హత్య కేసులో శ్రవణ్‌కుమార్‌కు బెయిల్

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసు నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్, మరో రూ.25 వేలకు రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. కులాంతర వివాహం చేసుకున్న ప్రణయ్ హత్య కేసులో జిల్లా కోర్టు గతేడాది తీర్పు వెలువరించడం తెలిసిందే. తనకు విధించిన జీవిత ఖైదును సవాల్ చేస్తూ శ్రవణ్‌కుమార్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. విచారణ ముగిసే వరకు బెయిల్ మంజూరు చేయాలంటూ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) వేశారు. ఈ ఐఏపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. నిందితుడు గతంలో జైల్లో ఉన్న విషయాన్ని, అతని వయసును పరిగణనలోకి తీసుకుని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

భర్తను కొట్టి చంపిన భార్య, పిల్లలు

తాగివచ్చి వేధిస్తున్నాడని ఘాతుకం

మహబూబ్‌నగర్ క్రైం: తాగివచ్చి వేధిస్తున్న భర్తను భార్య, ఇద్దరు పిల్లలు కర్రతో కొట్టి చంపిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మర్లు ఎంప్లాయీస్ కాలనీకి చెందిన రాములు నాయక్ (57)కు శ్రుతితో 32 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలున్నారు. కుమార్తె సవిత, కుమారుడు పాండుకు తప్ప మిగిలిన వారికి వివాహాలు జరిగాయి. కాగా.. రాములునాయక్ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి కుటుంబసభ్యులను మానసికంగా వేధించసాగాడు. దీంతో నిత్యం భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాములు మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భార్య, పిల్లలతో గొడవ పడుతూనే ఉన్నాడు. విసుగుచెందిన వారు కర్రలతో విచక్షణరహితంగా దాడి చేశాడు. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

గనుల శాఖలో 11 మంది డీడీల సీనియారిటీ

జాబితా ఖరారు

సాక్షి, అమరావతి: గనుల శాఖలో 11 మంది డిప్యూటీ డైరెక్టర్ల ప్రొబేషన్ కాలాన్ని క్రమబద్ధీకరించి తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ జాబితాలో జి.పాపారావు, సి.మోహన్‌రావు, టి.రాజశేఖర్, ఈ.నరసింహారెడ్డి, ఎన్.చంద్రశేఖర్, ఎ.శ్రీనివాసకుమార్, సూర్యచంద్రరావు, రవిచంద్ర, బి. జగన్నాధరావు, ఎస్.కే.వి. సత్యనారాయణ, జి.వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ జాబితాపై కొందరు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా నిబంధనల ప్రకారం మూడేళ్లు దాటిన తర్వాత సీనియారిటీని తిరిగి మార్చే అవకాశం లేదని ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది. పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ విచారణలు, కోర్టు కేసుల తుది తీర్పులకు లోబడి ఈ సీనియారిటీ అమలులో ఉంటుందని పేర్కొంది.

ప్రేమ కథ.. విషాదాంతం

24 గంటల వ్యవధిలో ప్రేమికుల బలవన్మరణం
ఇరు కుటుంబాల్లో తీరని శోకం

యాచారం, హయత్‌నగర్: ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణాలను బలిగొనడంతో పాటు ఇరుకుటుంబాల్లో తీరని విషాదం నింపింది. నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన సిద్దగోని యాదయ్య, పార్వతమ్మల కుమారుడైన మహేశ్ (20), పోతురాజు మహేశ్, అలివేలు కూతురు పూజ (17) ప్రేమించుకున్నారు. పూజ ఇంటర్ సెకండియర్, మహేశ్ డిగ్రీ చదువుతున్నారు. వీరి ప్రేమ వ్యవహారం తెలియడంతో ఇరు కుటుంబాల పెద్దలు తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఇద్దరూ గతంలో ఆత్మహత్యకు ప్రయత్నించారు. ప్రాణాలతో బయటపడి, పరిస్థితి సద్దుమణుగుతోందనుకుంటున్న సమయంలో మహేశ్ మళ్లీ పూజకు ఫోన్ చేసి, తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే చనిపోతానని వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియడంతో పూజ తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీంతో మహేశ్ వేధింపులు తీవ్రం చేయగా, మనస్తాపానికి గురైన పూజ మంగళవారం ఇంట్లోనే ఉరేసుకుని చనిపోయింది. ఎంతగానో ప్రేమించిన ప్రియురాలు చనిపోవడం, పోలీసులు తనకోసం వెదకడంతో ఆందోళనకు గురైన మహేశ్ మంగళవారం గ్రామం వదిలి, హయత్‌నగర్‌లోని స్నేహితుల ఇంటికి వెళ్లాడు. పూజ మృతితో కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. దీంతో భయాందోళనకు గురైన అతను బుధవారం ఉదయం హయత్‌నగర్ సమీపంలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని, తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. లొకేషన్ ఆధారంగా వెళ్లిన పోలీసులకు మృతదేహం లభ్యమైంది. 24 గంటల్లో ఇద్దరి మృతితో నక్కర్తమేడిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాజాసాబ్, మన శంకరవరప్రసాద్ సినిమాలకు ఊరట

టికెట్ల పెంపుపై సింగిల్ జడ్జి ఉత్తర్వులు వర్తించవన్న తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా విడుదల కానున్న రాజాసాబ్, మన శంకరవరప్రసాద్ సినిమాలకు తెలంగాణ హైకోర్టు భారీ ఊరట కల్పించింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు ఈ రెండు చిత్రాలకు వర్తించవని స్పష్టం చేసింది. ఓజీ, గేమ్ చేంజర్, పుష్ప–2కు మాత్రమే ఆ ఉత్తర్వులు అమలవుతాయని చెప్పింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల అనుమతికి నిర్మాతలు పెట్టుకున్న వినతులను పరిశీలించి, చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. రెండు సినిమాల టికెట్ల ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు సినీ నిర్మాతలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే గత నెల సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు టికెట్ల పెంపు, ప్రత్యేక షోలకు ఆటంకంగా మారింది. ఈ నేపథ్యంలోనే సింగిల్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని రాజాసాబ్ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, క్రితిప్రసాద్, మన శంకర వరప్రసాద్ నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

విచారణకు అవకాశం ఇవ్వకుండా...

ప్రతివాదుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సినిమాటోగ్రఫీ చట్టంలోని సెక్షన్ 12కు టికెట్ ధరల పెంపు విరుద్ధమన్నారు. తెల్లవారుఝాము, మధ్యరాత్రి సమయాల్లో సినిమాలు ప్రదర్శిస్తే ప్రమాదాలకు అవకాశం ఉంటుందని చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎవరూ హాజరు కాకపోవడంతో హోం జీపీ హాజరు కావాలని ధర్మాసనం కోరింది. మహేశ్ రాజే హాజరై వాదనలు వినిపిస్తూ.. టికెట్ల పెంపు, స్పెషల్ షోలకు సంబంధించి మెమోలను సింగిల్ జడ్జి నిలిపివేశారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఈ చిత్రాలకు వర్తించవని చెబుతూ ఆదేశాలు జారీ చేసింది. టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై నిర్ణయం తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వానికి కల్పించింది.

కొత్త జిల్లాలకు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోలు

సాక్షి, అమరావతి: కొత్తగా ఏర్పాటైన మార్కాపురం, పోలవరం జిల్లాలకు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోలను ప్రభుత్వం నియమించింది. సింగరాయకొండ పీహెచ్‌సీలో పనిచేసే డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ టి.వాణిశ్రీకి మార్కాపురం డీఎంహెచ్‌వోగా, రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సరితకు పోలవరం డీఎంహెచ్‌వోగా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) ఇచ్చారు. ఈ మేరకు బుధవారం వైద్యశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

11న బీజేపీ యూత్ మారథాన్

సాక్షి, అమరావతి: ఈనెల 11న బీజేపీ ఆధ్వర్యంలో విజయవాడ సహా పలు ముఖ్యనగరాల్లో ఐదు కిలోమీటర్ల యూత్ మారథాన్ నిర్వహించనున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. బుధవారం ఆయన విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మారథాన్ పోస్టర్ విడుదల చేశారు. అలాగే సంక్రాంతి సందర్భంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలుచోట్ల ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మనోవ్యాధులూ మామూలు జబ్బులే

సాక్షి, హైదరాబాద్: మానసిక రుగ్మతలు కూడా శారీరక అనారోగ్యాల వంటివేనని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ సవితా మల్హోత్రా అన్నారు. మానసిక వైద్యాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ 79వ వార్షికోత్సవాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధుల తరహాలోనే మానసిక వ్యాధులు ఉంటాయన్నారు. వందేళ్ల క్రితం మానసిక వ్యాధులకు చికిత్స ఉండేది కాదని.. ఇప్పుడు సాధారణ జబ్బులకు ఉన్నట్లే మానసిక సమస్యలకు కూడా పరిష్కారం ఉందని వివరించారు. మానసిక వైద్యులకు దేశంలో ఆదరణ పెరుగుతోందని చెప్పారు. 79 ఏళ్ల క్రితం కొందరు వైద్యులతో ఏర్పాటైన సైకియాట్రిక్ సొసైటీలో ఇప్పుడు 10 వేల మంది సభ్యులుగా ఉన్నారని సవితా మల్హోత్రా చెప్పారు.

ఏఐ ఆధారిత వ్యవసాయ ప్రాజెక్టుతో రైతుల ఆదాయం పెంపు

సాక్షి, అమరావతి: డిజిటల్ గ్రీన్, సిస్కో ఇండియా, ఉద్యాన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ మేధ ఆధారిత వ్యవసాయ సలహా ప్రాజెక్టు రైతుల ఆదాయం పెంపునకు ఎంతగానో దోహదపడుతుందని ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. ఈ ప్రాజెక్టును బుధవారం గుంటూరులో ఆయన ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు రైతులకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వాతావరణ అనుకూల సలహాలు అందించేందుకు ఉపకరిస్తుందన్నారు. చిన్న తరహా ఉద్యాన రైతులకు దిగుబడి, నాణ్యతలో స్పష్టమైన మార్పు కన్పిస్తుందని తెలిపారు. ఫార్మర్ చాట్ సమర్థంగా వినియోగించడం, మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.


తొలి సంధ్య వేళలో..

అరకు కొండల్లో వెండి మబ్బుల సొబగులు

ప్రకృతి ఒడిలో పర్యాటకుల పరవశం

ఆకు పచ్చని అరకులోయ పొగ మంచు జలతారు ముసుగు ధరించి, ముగ్ధమనోహరంగా మురిపిస్తోంది. కొండ కోనలను ముద్దాడుతున్న మంచు తెరలు, భూమిపైకి దిగివచ్చిన ఆకాశ మల్లికల్లా మెరిసిపోతున్నాయి. వేకువజామున వీచే చలి గాలుల సవ్వడికి, ప్రకృతి ఒడిలో బంధీ అయిన పర్యాటకులు తన్మయత్వంతో పులకించిపోతున్నారు. భానుడి లేత కిరణాలు మంచు పొరలను చీల్చుకుంటూ వస్తుంటే, ఆ దృశ్యం ఒక అపురూప కావ్యంలా ఆవిష్కృతమవుతోంది. మడగడ వ్యూ పాయింట్ వద్ద సాక్షాత్కరిస్తున్న ఈ ప్రకృతి అందాలను వీక్షించేందుకు రెండు కళ్లు చాలడం లేదంటూ పర్యాటకులు మురిసిపోతున్నారు. సూర్యోదయపు కాంతి మంచు బిందువులపై చిందులు వేస్తుంటే, అరకు సరిహద్దులు దాటి మరో అద్భుత లోకానికి చేరుకున్న అనుభూతి కలుగుతోందంటున్నారు


తెలి మంచు సొగసులు

ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

● వివేకవాణి



(జనవరి 12న
స్వామి వివేకానంద
జయంతి
యువజనుల దినోత్సవం)

> గొప్ప అవకాశాలే వస్తే ఏమి చేతకాని వారు కూడా ఏదో ఒకటి సాధించవచ్చు. ఏ అవకాశాలూ లేనప్పుడు కూడా ఏదైనా సాధించినవాడే గొప్పవాడు. అదే అసలైన విజయం.

లే..! మేలుకో! గమ్యాన్ని చేరేవరకు విశ్రమించకు!

'సోదర... సోదరీమణులారా' అన్న ఒక మాటతో సర్వమత సమ్మేళనంలోని సభ్యులందరి హృదయాలలో చోటు సంపాదించాడు. ఆకాశమంత విశాలమూ, సముద్రమంత లోతైన తన ధర్మాన్ని గురించి చిత్తశుద్ధి కలిగిన మాటలతో, తేజస్సు నిండిన ముఖవర్చస్సుతో విశ్వవేదికపై భారతీయ తాత్త్వికతను రెపరెపలాడించి, అద్భుత ప్రసంగంతో ఆధ్యాత్మిక చరిత్రలో మైలురాయిలా నిలిచాడు. ఆయనే స్వామి వివేకానంద.

పసితనంనుండే సర్వభూతాల పట్ల జాలి, సన్యాసం పట్ల ఆకర్షణ మొదలైన గుణాలు వివేకానందుడిలో కనిపించేవి. యువకునిగా బలమైన శరీరాన్ని, సింహంతో సమానమైన ధైర్యాన్ని కలిగి వుండేవాడు. వికసించిన బుద్ధితో పాటు, శ్రావ్యమైన కంఠాన్ని కలిగిన వివేకానందుడు భగవంతుడ్ని దర్శింపజేయని చదువులన్నీ నిరర్థకమని భావించి, భగవంతుడ్ని దర్శించాలనే సంకల్పంతో రామకృష్ణులను చేరాడు. గురుదేవుల నీడలో వివేకానందుని స్వప్నాలు సాకారమయ్యాయి.

ఆయన మాటలు రాచబాటలు

సాధకులకు వివేకానందుడి మాటలే రాచబాటలు. ఆయన రచనలు యోగులకు ఆత్మశక్తిని వెలికితీసే ఆయుధాలు. భారతీయ తత్త్వశాస్త్రంలో నైపుణ్యం, ఉన్నతమైన వ్యక్తిత్వ వికాస గుణాలతో ఆయన అందరి మనసులను గెలిచాడు. తలమానికమైన గుణాలతో శక్తిమంతుడైన యువకునిగా ఎదిగాడు.

సనాతనధర్మ ప్రతినిధిగా ప్రపంచ సర్వమత సమ్మేళనంలో భారతీయ జీవనవిధానాన్ని ఆవిష్కరింపజేశాడు. సాధారణవ్యక్తిగా అమెరికా వెళ్లిన ఆయన సందేశాన్ని అందుకోవడానికి గొప్ప ఆత్రుతతో ఎదురుచూస్తున్న జన్మభూమిపై విశ్వవిఖ్యాతుడిగా కాలుమోపాడు. పాశ్చాత్య సమాజం బయటి ప్రకృతిని జయించేందుకు ప్రయత్నిస్తే, భారతీయ సమాజం శరీరం లోపలి ప్రకృతిని జయించడానికి ప్రయత్నిస్తుందని ప్రకటించి ప్రాచీన–పాశ్చాత్య సమాజాల మధ్య వైరుధ్యాలను విశదీకరించాడు.

ఆత్మవిశ్వాసమే నడిపిస్తుంది

దేశ ప్రగతికి యువతే కీలకమని గ్రహించి యువతను జాగృతం చేసేందుకు వేదాంతభేరిని మోగించారు స్వామి వివేకానంద. ఉపనిషత్తులను మథించి యువతకోసం వారు ఉపదేశించిన బోధలు నాటినుండి నేటివరకు ఎంతోమంది జీవితాలలో వెలుగురేఖలను ప్రసరింపజేసాయి.

★ ఆత్మవిశ్వాసం లేకపోవడం అనేది క్షమించరాని నేరం. చరిత్రలో గొప్పకార్యాలు సాధించిన వ్యక్తుల జీవితాలను నడిపించింది ఆత్మవిశ్వాసమే!

★ భగవంతుడి పట్ల నమ్మకం లేనివాడు నాస్తికుడన్నది ఒకప్పటి మాట. ఆత్మవిశ్వాసం లేనివాడు నాస్తికుడనేది నేటి మాట.

★ రోజుకు ఒక్కసారైనా నీతో నువ్వు మాట్లాడుకో. లేకపోతే ఒక అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని కోల్పోతావు.

★ ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్ని నాశనం చేస్తుంది.

★ మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి, బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి.

★ తనను తాను చిన్నబుచ్చుకోవడం అన్ని ఇతర బలహీనతలకంటే పెద్ద బలహీనత. తనను తాను ద్వేషించుకోవడం మొదలుపెట్టిన వ్యక్తికి పతనం తప్పదు.

★ ప్రయత్నం చేసి ఓడిపో! కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు.

★ ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం, విజయాన్ని కాంక్షించే వారి ప్రాథమిక లక్షణాలు.

★ విజయం కలిగిందని విర్రవీగకు, అపజయం కలిగిందని నిరాశపడకు. విజయమే అంతం కాదు, అపజయం తుది మెట్టు కాదు.

★ పట్టుదల, సంకల్పబలం, శ్రమించే తత్వం ఉన్నవారికి అసాధ్యమంటూ ఏదీలేదు.

★ గొప్ప అవకాశాలే వస్తే ఏమి చేతకాని వారు కూడా ఏదో ఒకటి సాధించవచ్చు. ఏ అవకాశాలూ లేనప్పుడు కూడా ఏదైనా సాధించినవాడే గొప్పవాడు. అదే అసలైన విజయం.

లే! మేలుకో! గమ్యాన్ని చేరేవరకు విశ్రమించకు!

- అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని
వేదపండితులు

● బౌద్ధదీపం

సత్యం విలువ

ఒకరోజు బుద్ధుడు తన శిష్యులతో కలిసి రాజగృహం సమీపంలోని వెదురు వనంలో ఉన్నాడు. సత్యం, విలువను, విశిష్టతను శిష్యులకు వివరిస్తున్నాడు.

శిష్యులలో ఒకడైన ఆనందుడు ముందుకు వచ్చి, వినయ పూర్వకంగా బుద్ధుడికి నమస్కరిస్తూ, 'గురుదేవా! సత్యం అంటే ఏమిటి? మన జీవితం సత్యంతో ఏవిధంగా పరిపూర్ణమవుతుంది' అని ప్రశ్నించాడు.

బుద్ధుడు, ఆనందుడిని చిరునవ్వుతో చూస్తూ, సమీపంలో ఉన్న మట్టిపాత్రను తెచ్చి తన చేతిలో పెట్టమని చెప్పాడు. ఆనందుడు బుద్ధుని చేతిలో మట్టిపాత్రను పెట్టాడు.

'ఈ పాత్రను చూడు. ఇది ఖాళీగా ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగకరంగా ఉంటుంది. కానీ మురికి నీటితో నిండితే, మంచినీటిని పట్టలేము కదా. అదే విధంగా మన మనస్సును కూడా అసత్యం వంటి మలినంతో నింపితే, సత్యాన్ని గ్రహించలేము. ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెబుతాను విను...

ఒక గ్రామంలో ఇద్దరు స్నేహితులు ఉండేవారు. మొదటివాడు, ఎన్ని కష్టాలెదురైనా, సత్యాన్ని విడిచి పెట్టలేదు. రెండోవాడు, అసత్యం పలకడమే తన నిత్య కృత్యంగా చేసుకున్నాడు. గ్రామ బాధ్యతను కూడా, తన అసత్యపు మాటలతో, ప్రజలను ప్రలోభ పెట్టి తీసుకున్నాడు. అయితే ఋజువు వరకూ వచ్చేసరికి సత్యం నిలబడుతుంది. అసత్యం తడబడుతుంది. అసత్యాన్నే ఆయుధంగా చేసుకున్న రెండోవాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడు. సత్యాన్నే తన ప్రవర్తనగా మార్చుకున్న మొదటివానికి గ్రామస్తులు బాధ్యతలు అప్పగించారు.

కనుక 'సత్యం' అనేది కేవలం మన మనసులో ప్రతిబింబించాలి. మాటలో వినిపించాలి. ప్రవర్తనలో కనిపించాలి. త్రికరణ శుద్ధిగా సత్యమార్గం అనుసరించిన వారికి అపజయం ఉండదు. సత్యమే దారి దీపం అవుతుంది.

అలా 'సత్యం విలువ'ను చాటి చెప్పిన బుద్ధుని బోధనలు శిష్యులకే కాదు, తరతరాల మానవాళికి శాశ్వత దీపంగా నిలిచాయి.

- శ్రీదేవి

● కృష్ణ తత్వం

పరిత్రాణాయ సాధూనాం...

కురుక్షేత్ర మహా యుద్ధానికి ముందు.. పాండవ రాయబారిగా కౌరవ సభలో యుద్ధం వద్దు అని మాట్లాడి కౌరవులు క్రోధంతో ఒప్పుకోకున్నా.. సర్వ సైన్యం, ఆయుధాలు, శక్తులు ఇంకా చెప్పాలి అంటే అన్ని అధర్మశక్తులు ఒకవైపు వున్నా ఆయుధం పట్టను కేవలం రథ సారథిగా ఉంటా అన్నారు కృష్ణుడు, నిజమే! పరమాత్మకి ఆయుధాలు ఎందుకు? అది తెలుసుకున్న వారు పాండవులు కనుకనే, కృష్ణా! మీరు మా వైపు ఉంటె చాలు అన్నారు.. రహస్యమేంటంటే సర్వ ఆయుధాలు, సైన్యం తానే కౌరవులకు ఇచ్చేసి ఒక్కడిగా పాండవులతో నిలబడ్డారు.. శక్తులు, బలం, సైన్యం కాదు వాటి కన్నా మించిన 'మంచి' వైపు నిలబడ్డాడు.. కృష్ణుడు పాండవుల పక్షాన ఉండడం చేత గెలువలేదు... కృష్ణుడే ధర్మం కాబట్టి 'ధర్మం గెలిచింది' అనే మాట ప్రాముఖ్యత సంతరించు కోవడానికి కారణం అందులోని పరమార్థం 'కృష్ణ తత్వం' అందుకనే, ఆయన జగద్గురువు.. ఆయుధం పట్టకుండా, అధర్మాన్ని ఓడించిన పరమాత్మ ఆ కృష్ణ భగవానుడు. సాంకేతికంగా చెప్పాలి అంటే సర్వ శస్త్రాలకు, శక్తులకు ఎదురుగా వెళ్ళి నిలిచి, గురువుగా బోధిస్తూ వాటిని విచ్ఛిన్నం చేసిన విరుపాక్షుడు రుద్ర రూపి ఆ కృష్ణుడు ఒక మనిషిగా చూడండి! ఎంత ధైర్యం? శౌర్యం? సంస్కారం? ఆచరణ! సత్యం వైపు నిలబడి ఆ కర్తవ్య నిష్ఠ!! ఆ మహానుభావుడి సొంతం. ఇది కదా మనం నేర్చుకోవలసింది ఆయన నుండి!! అయన తలచుకుంటే క్షణంలో లక్షవంతులో సర్వశక్తులని సంహరించి గెలిపించగలరు కాని మనిషిగా జన్మించి, ఎన్నోకష్టాలు పడినా నిలబడి ధర్మం వైపు ఉండి గెలిపించి మనకి నేర్పిన వ్యక్తి కాబట్టే ఆయన జగద్గురువు అయ్యారు...

ఒక మనిషి ఎటు నడవాలో, ఎలా ఉండాలో, ఎలా ప్రవర్తించాలో, ఎప్పుడు ప్రశ్నించాలో, ఎలా బదులు ఇవ్వాలో, ఎట్లా కాపాడాలో, ఒక శిశువుగా ఎలా ఉండాలో, ఒక బాలుడిగా ఎలా ఉండాలో, ఒక గోపాలకుడిగా గో సేవ ఎలా చెయ్యాలో, గోపిప్రియుడిగా ఎలా ప్రేమించాలో, అస్ఖలిత బ్రహ్మచారిగా ఎలా నిలవాలో, ధర్మగ్లాని జరిగితే ఎలా సంహరించాలో, తల్లిదండ్రుల చెంతన ఎలా ఒదగాలో, స్నేహితుల పంచన ఎలా మెలగాలో, అన్నిటికన్నా మించి భగవద్గీతలో 'పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి తదహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః' అనే శ్లోకం ద్వారా ఆయన అపారమైన కరుణ, సర్వ జీవుల యందు ఆయనకున్న ప్రేమ వాత్సల్యం తెలియడం లేదా!

అలాగే,

''పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే''

ఈ రెండు శ్లోకాలు చాలు ఆ పరమాత్మ సంకల్పం, లోక క్షేమం కోసం అయన పూనిన దీక్ష గురించి చెప్పడానికి? కాబట్టి, ఇవి కేవలం ఆయన ఆ సమయంలో చెప్పిన మాటలే కాదు సర్వ యుగాలయందు, సర్వ కాలాల యందు జీవోద్ధరణకి ఆయన పెట్టుకున్న బాధ్యత. కాబట్టి, ఇవి మహా మంత్రాలు, కేవలం పఠనకే పరిమితం కాకుండా కృష్ణ తత్వం తెలుసుకొని ఆచరిస్తే అప్పుడు మనం కూడా ఆయనవైపు ఉన్నట్లు... అందరూ మన దేశం వైపు, ధర్మం వైపు నిలవాలని ఆశిస్తూ...

- కోనా నవీన్ కుమార్

● ఇస్లాం వెలుగు

సుందర సమాజం

వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతి దుష్ట కార్యం, బహు చెడ్డ మార్గం, ఏ ప్రాణాన్ని హతమార్చకండి న్యాయంగా తప్ప. దానిని హతమార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు. (17:32). వివరణ... ఇందులో రెండు విషయాలు చెప్పబడ్డాయి.

(1) వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి అనేది.

ఈ ఆదేశానికి సంబోధితులు వ్యక్తులూ అవుతారు. మొత్తం సమాజం కూడా అవుతుంది. వ్యక్తులకు ఈ ఆదేశంలోని ఉద్దేశ్యం, వారు కేవలం వ్యభిచార క్రియలకు దూరంగా మెలగడమే కాదు, వ్యభిచారానికి తొలి అడుగు లాంటి చర్యలకు తీసుకువెళ్లే ప్రారంభ ప్రేరణలకు కూడా దూరంగా ఉండాలన్నది. సమాజం మాటకు వస్తే ఈ ఆదేశం రీత్యా అది సామూహిక జీవితంలో వ్యభిచారం, వ్యభిచార ప్రేరకాలు వ్యభిచార కారణాలను నిరోధించాలి. దీనికి చట్టం ద్వారా, బోధన, శిక్షణాలద్వారా, సామూహిక వాతావరణ సంస్కరణల ద్వారా, సామాజిక జీవితాన్ని సముచిత రీతిలో మార్చడం ద్వారా ఇంకా ఇతర ప్రభావశీలమైన మార్గాలన్నింటి ద్వారా దీన్ని సాధించాలి.

అందుకే ఇస్లాంలో నికాహ్ (వివాహం) సులభతరం అయి, వ్యభిచారానికి దోహదపడగల సామాజిక కారణాల నిర్మూలన జరిగేటటువంటి దాంపత్య విధానం చట్టం చేయడం జరిగింది.

(2) న్యాయంగా తప్ప ఏ ప్రాణిని హతమార్చకండి

ప్రాణ సంహారం అంటే ఇతర మానవుని హత్య మాత్రమే కాదు తనను తాను హతమార్చుకోవడం (ఆత్మహత్య) కూడా ఇందులో చేరి ఉంది. ఎందు వల్లనంటే ప్రాణాన్ని అల్లాహ్ పవిత్రమైంది, (హానికి) నిషిద్ధమైనదిగా నిర్ణయించాడు. దీని నిర్వచనంలో ఇతర ప్రాణాల మాదిరిగానే మానవుని సొంత ప్రాణమూ వస్తుంది కనుక మానవ హత్య ఎంత నేరమో ఎంత పెద్ద పాపమో, ఆత్మహత్య కూడా అంతే పెద్ద నేరం, పాపమున్నూ.

ఆత్మహత్యకు మరో భావం ఏమిటంటే మనిషి ఈ ప్రపంచంలో ఎదురయ్యే చిన్న చిన్న కష్టాలను, అవమానాలను, తప్పించుకొని, మరో మహా దౌష్ట్యం, శాశ్వత కష్టం, అనంత పరాభవం వైపునకు పరిగెడుతున్నాడు అన్నమాట.

- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● నిర్మల వాణి

ధర్మమే రాజ్యలక్ష్మీ తత్త్వం

రాజ్యలక్ష్మి ధర్మాన్ని ఆధారం చేసుకొని ఉంటుంది. అధర్మ పరులకు ఆమె ఆశీర్వచనాలు లభించవు. ఒక ధర్మపరుని రక్షించడానికి ఆమె తన సర్వశక్తులు ధారపోస్తుంది. రాజ్యలక్ష్మి ఏనుగును అధిరోహించి ఉంటుంది. కారణం ఏనుగు జంతువులన్నిటి కన్న ఎత్తైనది. అంతేగాక అది సాధు జంతువు, దానిలో క్షమాగుణం ఉంది. దాని జ్ఞాపక శక్తి గొప్పది. అందువలన ఆ దేవి ఏనుగు పైన ఆసీనురాలై ఉంటుంది. అంతేగాని తన గొప్పను ప్రదర్శించుటకు కూర్చోలేదు. తన చుట్టూ జరిగే విషయాలు తెలుసుకొనడానికి 'ఆమె ఒక ఉన్నతాసనంపై ఉంది. అదేవిధంగా ఒక రాజు కూడా ఉన్నతమైన సింహాసనం పైన అధిష్ఠించి కూర్చుని ఉంటాడు. అటువంటి ఎత్తైన ప్రదేశం నుండి ఇతరులను చక్కగా గమనించడానికి అంతేగాని ప్రదర్శన కొరకు కాదు. కేవలం ప్రజలకు మేలు చెయ్యడం కొరకే తాను సింహాసనం మీద కూర్చుంటున్నానని రాజు భావించాలి.

మెడలో పూలదండతో వీధుల్లో తిరగటం కాదు. అంతర్గతంగా అటువంటి వ్యక్తిత్వం కలిగి ఉండాలి. అలాగ రాజులాగ వ్యవహరించే వ్యక్తికి రాజ్యలక్ష్మి ఆశీర్వచనాలు ఉంటాయి. అటువంటి వ్యక్తికి ఆయన పాలించే ప్రజల హృదయాల్లో ఆయన పేరు లిఖిస్తుంది. అప్పుడు ప్రజలు ఆ రాజును ఆరాధిస్తారు. ఆయన సుగుణాలను తాము కూడా ఆలవరచుకొనే ప్రయత్నం చేస్తారు..

ఈ తత్వంతో ఉన్న వారు స్వార్థపరులుగా ఉండరు. తమ గురించి స్వంత ప్రచారం చేసుకోరు. కాని వారెక్కడ ఉన్నా, వారుండే పద్ధతి ఒక ప్రత్యేకతను కనబరుస్తుంది. రాజ్యలక్ష్మి వలన అనుగ్రహింపబడిన వారే ప్రజల హృదయాల్లో చిరకాలం నిలుస్తారు.

ఒక రాజకీయవేత్త అర్థం చేసుకొనవలసింది, తాను రాజకీయాల్లో ధనార్జన చేయకూడదని. అతను చేయవలసినదేమిటి? ఒక మంచి మనిషిలాగ కీర్తిని గడించాలని కోరుకోవాలి. తన మరణానంతరం ప్రజల్లో తన గురించి మిగిలే కీర్తి ప్రతిష్ఠల గురించి ఆందోళన చెందాలి.

శ్రీ మాతాజీ నిర్మలాదేవి

ఉదాహరణకు, శ్రీరాముడు అందరి క్షేమం కోరే రాజు. అందులో సందేహం లేదు. తన భార్యయైన సీత, రావణుని వద్ద అంత కాలం ఉంది. పవిత్రంగా ఉండే వీలుందా అనే అనుమానం ఎవరో వ్యక్తపరచారు. సీత పరమ పవిత్రురాలని రామునికి తెలుసు. అయినా తన్ను విడిచి వెళ్లమని ఆమెతో చెప్పాలని భావించాడు. ఎందుకంటే, ఒక రాజు కుండవలసిన హుందాతనాన్ని ఆయన ప్రజల ముందు వ్యక్తపరచాలని ఆలోచించాడు. ఆ కారణంగా ఆమెను అడవులకు పంపాడు.

రాజ్యలక్ష్మి మనలో మేల్కొనబడినప్పుడు, మనకు సంబంధించిన అన్ని విషయాలు మార్పు చెందుతాయి. మన ఆలోచనలు మన స్వంత విషయాలకే పరిమితం కాకుండా సామూహిక దిశగా సాగుతాయి. మనం మనకే పరిమితమవక యావత్ ప్రపంచం గురించి ఆలోచించడం మొదలు పెడతాం. మన గురించి మనం ఆలోచించం. మిగతా ప్రపంచం గురించి ఆలోచిస్తాం. ప్రతి దేశంలోను ఇటువంటి రాజ్యలక్ష్మీ తత్వం కలిగిన ప్రజలు అభివృద్ధి లోనికి రావాలి.

మానవ సూక్ష్మశరీరంలో నాభీ చక్రంలో ఎడమ వైపు గృహలక్ష్మి, కుడివైపు రాజ్యలక్ష్మి ఆసీనులై ఉంటారు. సహజ యోగా ధ్యానసాధన ద్వారా కుండలినీ శక్తి ఊర్ధ్వ ముఖంగా ప్రయాణించి సహస్రారం చేరుకునే ప్రయాణంలో అది నాభి చక్రం వద్ద వున్న కుడి పార్శ్వాన్ని తాకినప్పుడు ఆ చక్రం పరిశుద్ధమై అక్కడున్న రాజ్యలక్ష్మీ తత్వం జాగృతమైన మనలో స్థిరపడుతుంది. తద్వారా రాజ్యలక్ష్మీ తత్వం మనలో సంతరించుకోవడం సాధ్యమవుతుంది.

- డా. పి.రాకేశ్
(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచన సారాంశం ఆధారంగా)

● సువార్త

ప్రపంచ పునర్జననము

ఆదిలో ఆదాము చేసిన పాపం క్షమించబడి అతడు పరిశుద్ధుడైతే ఎలా ఉంటుందో అలాంటి పరిశుద్ధతే అట్టి వాతావరణమే ఆదిమ సంఘం అనుభవించింది (మత్త 19:28). ఆదాము, హవ్వల పాప, శాప విమోచన యుక్త కాలాన క్రీస్తునందు దేవుడు తన సంకల్పం ద్వారా చేసాడు. క్రీస్తు మరణానంతరం తొట్ట తొలిగా మూడు వేలమంది యూదులు, ఆ తరువాత గ్రీసు దేశస్తులు క్రీస్తు రక్తం ద్వారా పరిశుద్ధులుగా మార్పు చెందుటే, దేవుని సంకల్పం ఎరిగి భద్రంగా హుందాగా జీవించుటే 'ప్రపంచ పునర్జననము' అంటుంది గ్రంథ రాజం.

రోజురోజుకు వీరి సంఖ్య విస్తరిస్తూ ప్రపంచమంతటా నిండింది (కొలొస్స 1:23, రోమా 1:8). అపొస్తులుల వలన ఆ రోజున ప్రపంచ సువార్తతో యేసు బోధలతో క్రీస్తు సంఘాలు ఏర్పడి క్రైస్తవ దేశాలుగా పేరుగాంచాయి. ప్రపంచం యావత్తూ ఆత్మమూలంగా అనగా దేవుని బట్టి పైనుండి కొత్తగా తిరిగి మరల జన్మించుటే ప్రపంచ పునర్జననం (యోహాను 3:3–6). దేవుని స్వహస్తాలతో ఆయన నోటి ఊపిరిచేత నిర్మించబడ్డ ఆదాము పాపం చేయక మునుపు ఉండిన అతని పరిశుద్ధ స్థితే, ఆ వైభవమే ప్రపంచ పునర్జన్మ అనగా ఆనాటి ఏదెను వనమందున్నట్టి పునర్వైభవ స్థితి స్థాపనమందు ఉండే పరిశుద్ధ స్థితినే అనుభవించగలుగుతున్నారు, నేడు క్రీస్తునందున్న నూతన సృష్టి సంబంధులు.

క్రీస్తుకు పూర్వం ఇశ్రాయేలీయుల అపవిత్రత విషయమై హెచ్చరికలు చేస్తూ, వాగ్దానాలు చేస్తూ దేవుడు వారి పాపాలను పరిహరించడం, వారిని శుద్ధులుగా చేయడం గమనార్హం. పితరుల కుటుంబాల పాపాలే కాక, ధర్మశాస్త్రంలో ఉన్న వారి పాపాలు కూడా క్రీస్తు రక్తం ద్వారా దేవుడు కప్పివేసి ఉన్నాడు (కీర్తన 85:2). ఆనాడు దేవునిలో నిద్రించిన వీరంతా ఇప్పటి పునర్జన్మ అనుభవం పొందవీలులేనప్పటికీ క్రీస్తురక్త పరిశుద్ధానుభావం వారిని తాకి కమ్ముకుంది. నేటి క్రీస్తు యుగాన ఈ క్రొత్త నిబంధన కాలపువారు దేవుని సంకల్పమైన బాప్తిస్మమును నిరాకరించక దానికి తలవంచి విధేయులగుట వారికే బహు మేలు (లూకా 7:30).

ప్రపంచ పునర్జననం అనేది ఆదిలో స్త్రీ సంతానంగా చెప్పబడిన ప్రవచనం నేడు క్రీస్తులో నెరవేరింది. ఆదాము మొదలుకొని మోషే వరకు మరణం ఏలుబడి చేస్తూ వచ్చింది. క్రీస్తు రాకతో, ఆయన మరణంతో పాప మరణం ఏలుబడి ముగిసింది. అపవాదిపై క్రీస్తు ఆధిపత్యం మొదలైంది. క్రీస్తు స్త్రీ సంతానంగా వచ్చి సాతాను తలను చితకకొట్టడం. అపవాది గుప్పెట్లో నుండి సర్వ మానవాళిని తన విలువైన రక్తాన్ని మూల్యంగా చెల్లించి విమోచించడం. క్రీస్తు మానవ విరోధియైన సాతానుతో సిలువలో తలపడి అతని రాజ్యాన్ని సమూలంగా కూల్చి దానికి రూపురేఖలు లేకుండా చేయడం అన్నీ నెరవేరాయి. మరీ ముఖ్యంగా చెప్పాలంటే, పేతురు ప్రసంగం ద్వారా మూడు వేలమంది కొత్తగా క్రీస్తు నందు నూతనంగా జన్మించడం. దీన్నే ప్రపంచ పునర్జనన ప్రారంభం లేదా మరో ఉన్నతార్థంలో 'క్రీస్తునందున్న నూతన సృష్టి' అంటారు.

- జేతమ్



అప్పుడు ఇప్పుడు జరుగుతున్న ఘన కార్యమేమంటే, దేవుడు క్రీస్తు సువార్త ద్వారా పిలుస్తూ, ఆయన మరణ, సమాధి, పునరుత్థానాలలో పాలిభాగస్తులమయ్యే విధంగా మనలను బాప్తిస్మం ద్వారా రక్షించుకుంటున్నాడు. ఇదే పునర్జన్మ సంబంధ స్నానం. 'మనం నీతిని అనుసరించి చేసిన క్రియల మూలంగా కాక, తన కనికరంతోనే పునర్జన్మ సంబంధ స్నానం ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావం కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను' – తీతు 3:5. క్రైస్తవ్యం మతమని, క్రీస్తు మత స్థాపకుడని రాజ గ్రంథమనే పరిశుద్ధ బైబిలు ఎక్కడా చెప్ప లేదు. ఆయన దేవుని చెంతకు నడిపించే సత్య జీవ మార్గ స్థాపకుడు. ప్రేమ, క్షమాపణ, త్యాగం వంటివి అసాధారణ రీతిలో తనదైన జీవిత విధానం ద్వారా తేటగా ప్రదర్శించాడు. నేడు ఇదే ఆయన నీతివంతమైన యోగ్య పరిశుద్ధ సత్ప్రవర్తన జీవితం ఎల్లరకు మార్గదర్శకమై ప్రపంచ పునర్జననానికి దారితీస్తూ ఉంది.

బిజినెస్ రీల్

డిజిటల్ మోసాలకు యాక్సిస్ బ్యాంక్ 'సేఫ్టీ సెంటర్'తో చెక్

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాల బారిన పడకుండా కస్టమర్లు తమ ఖాతాలను స్వయంగా నియంత్రించుకునే వీలు కల్పిస్తూ యాక్సిస్ బ్యాంక్ తమ మొబైల్ యాప్ 'ఓపెన్'లో 'సేఫ్టీ సెంటర్' ఫీచరును ప్రవేశపెట్టింది. సందేహాస్పద సందర్భాల్లో ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కి యాక్సెస్‌ని డిసేబుల్ చేసేందుకు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లను బ్లాక్ చేసేందుకు, యూపీఐ చెల్లింపులను నియంత్రించేందుకు, పరిమితులను సెట్ చేసేందుకు, కొత్త పేయీలను జోడించకుండా నివారించేందుకు ఇది సహాయకరంగా ఉంటుంది. దీనితో కస్టమర్ కేర్ సెంటర్ లేదా బ్రాంచీలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఖాతాను స్వయంగా నియంత్రించుకోవచ్చని బ్యాంకు తెలిపింది. అలాగే, బ్యాంకు మెసేజీల ప్రామాణికతను ధృవీకరించేలా ఎస్ఎంఎస్ షీల్డ్ సేవలను కూడా అందిస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు, కళలు, సాహిత్యానికి సంబంధించిన స్ప్లాష్ 2025 పోటీలను నిర్వహించినట్లు వివరించింది. ఇందులో దేశవ్యాప్తంగా 995 పాఠశాలల నుంచి 2.66 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు బ్యాంకు పేర్కొంది. దక్షిణాదిలో హైదరాబాద్, వైజాగ్ సహా 308 స్కూళ్ల నుంచి 1.01 లక్షల మంది పాల్గొన్నట్లు వివరించింది. ఇందులో ఆరుగురు విజేతలకు రూ. 1 లక్ష చొప్పున, ఆరుగురు రన్నర్స్ అప్‌లకు తలో రూ. 50,000 చొప్పున బహుమతి ఉంటుంది.

గోద్రెజ్ నుంచి సరికొత్త ఫ్రిజ్‌ల శ్రేణి

ధర రూ. 29,000 నుంచి ప్రారంభం

ముంబై: గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్‌లో భాగమైన అప్లయెన్సెస్ వ్యాపార విభాగం తాజాగా ఇయాన్ ఇన్‌స్పైర్, ఎడ్జ్ ఇంప్రెస్ పేరిట ఫ్రాస్ట్ ఫ్రీ, డైరెక్ట్ కూల్ ఫ్రిజ్‌ల శ్రేణిని ప్రవేశపెట్టింది. వీటి ధర రూ. 29,000 నుంచి రూ. 56,000 వరకు ఉంటుంది. ఇవి 194 లీటర్ల – 330 లీటర్ల సామర్థ్యంతో లభిస్తాయని కంపెనీ తెలిపింది. అధునాతన టెక్నాలజీ ఫీచర్లతో పాటు దేశీయంగా తొలిసారిగా డోర్ హ్యాండిల్‌పైనే టచ్ కంట్రోల్స్ అమర్చిన మోడల్స్ కూడా వీటిలో ఉన్నాయని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-1-2026	
విశాఖ	585–00
చిత్తూరు	623–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585–00
విజయవాడ	610–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	580–00
వరంగల్	582–00
రిటైల్ ధర	6.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	4,273.90	3.94
HCLTECH	1,654.50	2.36
WIPRO	270.35	1.79
TECHM	1,630.00	1.76
JIOFIN	303.7	1.73

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,465.30	-4.28
MARUTI	16,806.00	-2.81
TMPV	363	-1.6
POWERGRID	264.25	-1.6
MAXHEALTH	1,034.90	-1.59

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,166
ఎన్ఎస్ఈ	1,06,463
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,49,974
ఎఫ్ఐఐ	- 1,528
డీఐఐ	+ 2,889

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	శ్రీతం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	55.92	$ 57.13
బ్రెంట్	59.87	$ 60.07

ఈ ఏడాది చివరికి 93,918 పాయింట్లకు సెన్సెక్స్

- పోర్ట్‌ఫోలియో వైవిధ్యీకరణలో పసిడి, వెండి కీలకం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి 6.8%
- క్లయింట్ అసోసియేట్స్ అంచనా

న్యూఢిల్లీ: బీఎస్ఈ ఎక్స్ఛేంజ్‌లోని బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 2026 డిసెంబర్ నాటికి 93,918 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ క్లయింట్ అసోసియేట్స్ అంచనా వేసింది. అంటే సెన్సెక్స్ ప్రస్తుత స్థాయి (84,961)తో పోలిస్తే 11% పెరిగే వీలుందని అభిప్రాయపడింది. ''దేశీయ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయి. కార్పొరేట్ ఆదాయాల అవుట్‌లుక్ మెరుగ్గానే ఉన్నాయి. అయితే షేర్ల వాల్యుయేషన్లు అధికంగా ఉండటం, అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా ఇన్వెస్టర్లు 'క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి' వ్యూహాన్ని అనుసరించవచ్చు. దీంతో ఈ ఏడాది భారతీయ మార్కెట్ విస్తృత స్థాయి ర్యాలీలకు స్వస్తి పలికి.., ఎంపిక చేసుకున్న, ఫండమెంటల్ ఆధారిత అవకాశాల దిశగా అడుగులు వేయొచ్చు'' అని సంస్థ రీసెర్చ్ హెడ్ నితిన్ అగర్వాల్ తెలిపారు. రిస్క్ అంచనాలను మెరుగుపరుచుకుంటూ.., సరైన డైవర్సిఫికేషన్ విధానాలను అనుసరిస్తే ధీర్ఘకాలంలో సంపద సృష్టికి ఈక్విటీలు ప్రధాన వనరులుగా కొనసాగుతాయని అగర్వాల్ పేర్కొన్నారు. ఇంకా 2026కి సంబంధించిన క్లయింట్ అసోసియేట్స్ వార్షిక ఈక్విటీ అంచనా నివేదికలో....

- పోర్ట్‌ఫోలియో వైవిధ్యీకరణలో బంగారం, వెండి కీలకం. డాలర్ బలహీనత, భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధానాల్లో మార్పుల కారణంగా గతేడాదిలో విలువైన లోహాలు భారీ రాబడులు ఇచ్చాయి. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో బంగారం డిమాండ్ పెరిగి, వ్యూహాత్మక పెట్టుబడి సాధనగా పసిడి ప్రాధాన్యం మరింత పెరిగింది. అంతర్జాతీయంగా సరఫరా సమస్యలు, అమెరికా–చైనా ఉద్రిక్తతలు, వెండిని కూడా కీలక లోహంగా గుర్తించే చర్చల నేపథ్యంలో వెండి ధరలు గణనీయంగా పెరిగాయి.
- భారత్ వృద్ధి అవుట్‌లుక్ మెరుగ్గానే ఉంది. బలమైన డిమాండ్, తయారీ–సేవల రంగ విస్తరణ, స్థిరమైన జీఎస్టీ వసూళ్ల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశీయ జీడీపీ వృద్ధి 6.8 శాతంగా నమోదవ్వొచ్చు.

2026–27లో జీడీపీ వృద్ధి 6.8 శాతం

రేట్ల కోతకు పరిమిత అవకాశాలే ● గోల్డ్‌మ్యాన్ శాక్స్ అంచనా

ముంబై: భారత్ జీడీపీ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంచనా 7.3 శాతం నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2026–27) 6.8 శాతానికి పరిమితం అవుతుందని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మ్యాన్ శాక్స్ అంచనా వేసింది. రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం పెరగొచ్చని, దీంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తదుపరి తగ్గింపునకు అవకాశాలు పరిమితమేనని పేర్కొంది. రియల్ జీడీపీ 2026 సంవత్సరంలో 6.7 శాతం ఉంటుందని అంచనా వేసింది. వృద్ధిని వేగవంతం చేసే ప్రైవేటు మూలధన వ్యయాలు లేదా కొత్త పెట్టుబడులు ఇటీవలి కాలంలో నెమ్మదించడాన్ని ప్రస్తావించింది. 2025లో అమెరికా సుంకాలు మూలధన వ్యయాలపై (తాజా పెట్టుబడులు) ప్రభావం చూపించినట్టు పేర్కొంది. 2026లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.9 శాతంగా ఉంటుందని, ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతానికి దగ్గర అని, దీంతో రేట్ల కోత పెద్దగా ఉండకపోవచ్చని అభిప్రాయపడింది. యూఎస్ టారిఫ్ సంబంధిత అనిశ్చితి కొనసాగి, వృద్ధిపై ప్రభావం పడితే పావు శాతం వరకే రేటు తగ్గింపు ఉండొచ్చని అంచనా వేసింది. వడ్డీ రేట్లు తగ్గింపు, జీఎస్టీ హేతుబద్ధీకరణ పట్టణ వినియోగానికి మద్దతునిస్తుందని, బ్యాంకు రుణ వితరణ 2026లో 13 శాతం పెరిగేందుకు దారితీస్తుందని పేర్కొంది. డాలర్‌తో రూపాయికి గడ్డుకాలం ముగిసినట్టేనని తెలిపింది.

ఐపీవోకు ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్

డిసెంబర్‌లోగా లిస్టింగ్ యోచన

న్యూఢిల్లీ: నేచురల్ గ్యాస్ సరఫరాల కోసం దేశంలోనే తొలిసారి ఏర్పాటైన ఆన్‌లైన్ డెలివరీ ఆధారిత ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్(ఐజీఎక్స్) ఈ కేలండర్ ఏడాది(2026)లో పబ్లిక్ ఇష్యూకి రావాలని భావిస్తోంది. నిజానికి 2025లోనే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కావడానికి ప్రణాళికలు వేసినప్పటికీ అదనంగా ఏడాది గడువును పొందింది. దీంతో 2026 డిసెంబర్‌లోగా ఐపీవోకు రానున్నట్లు ఐజీఎక్స్ ఎండీ, సీఈవో రాజేష్ కుమార్ ఎం. పేర్కొన్నారు. సంస్థలో ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్(ఐఈఎక్స్)కు 47 శాతం వాటా ఉంది. అయితే నిబంధనల ప్రకారం 25 శాతానికి వాటా తగ్గించుకోవలసి ఉంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి జూన్ తదుపరి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. సుమారు 22 శాతం ఈక్విటీ వాటాలను ఐపీవోలో ఆఫర్ చేయనున్నట్లు రాజేష్ వెల్లడించారు. కాగా.. స్టాక్ బ్రోకరేజీలు ఐజీఎక్స్ విలువను రూ. 2,200–3,000 కోట్లుగా మదింపు చేశాయి. వెరసి 22 శాతం వాటా విలువ అటూఇటుగా రూ. 600–700 కోట్లుగా నమోదుకావచ్చని భావిస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఐజీఎక్స్.. నేచురల్ గ్యాస్‌పై స్పాట్, ఫార్వార్డ్ డెలివరీ ఆధారిత కాంట్రాక్టులకు వీలు కల్పిస్తోంది. గత నెలలోనే ఐపీవో ప్రాసెస్‌ను ప్రారంభించేందుకు బోర్డు అనుమతించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఐజీఎక్స్ సమాచారమివ్వడం గమనార్హం!

ఎగుమతుల వృద్ధితోనే ఎదుగుతాం

- అప్పుడే మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుంది
- ఇంధన తయారీలో స్వావలంబన అవసరం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలంటే దిగుమతులు తగ్గించుకుని, ఎగుమతులను పెంచుకోవాలని కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. సీఎస్ఐఆర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. వ్యవసాయ వ్యర్థాలను విలువైన జాతీయ వనరుగా మార్చుకోవడం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవచ్చని చెప్పారు. దీనివల్ల వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం కారణంగా వెలువడే కాలుష్యాన్ని నిరోధించొచ్చన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్‌ను 15 శాతం కలపడం ద్వారా ఏడాదిలో 4,500 కోట్ల డాలర్ల విదేశీ మారకాన్ని ఆదా చేసుకోవచ్చని చెప్పారు. ఇటీవలే జపాన్‌ను దాటేసి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం తెలిసిందే. రహదారుల నిర్మాణంలో బయో బిటుమన్‌ను (పెట్రోలియం రహిత) వినియోగించడం 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా పరివర్తనాత్మక అడుగుగా మంత్రి గడ్కరీ పేర్కొన్నారు. వాణిజ్య పరంగా బయో బిటుమన్‌ను ఉత్పత్తి చేసిన మొదటి దేశం భారత్ అని చెప్పారు. ఇది రైతుల జీవితాలను మార్చేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలుస్తుందన్నారు. వ్యవసాయం, నిర్మాణ రంగ సామగ్రి తయారీదారులు ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఫ్లెక్స్ ఇంజన్లతో కూడిన వాహనాలను ప్రోత్సహించాలని కోరారు. హైడ్రోజన్ రవాణా అన్నది పెద్ద సమస్యగా పేర్కొంటూ.. ఈ విషయంలో భారత్ ఇంధన ఎగుమతిదారుగా అవతరించాలన్నారు. శిలాజ ఇంధనాల దిగుమతి కోసం భారత్ రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు.

హైదరాబాద్‌లో మెరుగ్గా ఇళ్ల అమ్మకాలు

- ప్రముఖ నగరాల్లో మాత్రం క్షీణత
- నైట్ ఫ్రాంక్ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు గతేడాది మెరుగ్గా కొనసాగాయి. 2024తో పోల్చితే 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరాయి. ఇళ్ల ధర చదరపు అడుగునకు (ఎస్ఎఫ్టీ) 13 శాతం పెరిగి రూ.6,271కు చేరుకుంది. దేశవ్యాప్తంగా టాప్–8 నగరాల్లో చూస్తే మొత్తం మీద ఇళ్ల అమ్మకాలు గతేడాది ఒక శాతం తగ్గి 3,48,207 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇళ్ల ధరలు మాత్రం ఎస్ఎఫ్టీకి 19 శాతం పెరిగాయి. రేట్లు పెరగడంతో డిమాండ్ నెమ్మదించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ గృహ రుణాలపై రేట్లు తగ్గడం, బలమైన ఆర్థిక వృద్ధితో ఇళ్ల డిమాండ్‌ను స్థిరంగా కొనసాగేలా చేసింది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ విడుదల చేసింది. ప్రధాన ప్రాంతాల్లోని ఇళ్ల అమ్మకాల డేటా ఆధారంగా ఈ వివరాలు ప్రకటించింది.

పట్టణాల వారీ..

- ముంబై మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉన్నాయి. ఇక్కడ చదరపు అడుగు ధర 7 శాతం పెరిగి రూ.8,856కు చేరింది.
- బెంగళూరులో ఇళ్ల విక్రయాలు ఎలాంటి మార్పు లేకుండా 55,373 యూనిట్లుగా ఉన్నాయి. ఇళ్ల ధర ఎస్ఎఫ్టీకి 12 శాతం పెరిగి రూ.7,388గా ఉంది.
- పుణెలో ఇళ్ల అమ్మకాలు 3 శాతం తగ్గి 50,881 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇక్కడ ధర 5 శాతం పెరిగి రూ.5,016కు చేరింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో అమ్మకాలు 9 శాతం తగ్గి 52,452 యూనిట్లుగా ఉన్నాయి. ఇళ్ల ధర ఎస్ఎఫ్టీకి 19 శాతం ఎగసి రూ.60,28గా ఉంది.
- అహ్మదాబాద్‌లో విక్రయాలు 2 శాతం పెరిగి 18,752 యూనిట్లుగా నమోదయ్యాయి. ధర 3 శాతం పెరిగి రూ.3,197కు చేరింది.
- చెన్నైలో ఇళ్ల అమ్మకాలు 12 శాతం పెరిగాయి. 18,262 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇళ్ల ధర ఎస్ఎఫ్టీకి 7 శాతం వృద్ధితో రూ.5,135గా ఉంది.
- కోల్‌కతాలో అమ్మకాలు 3 శాతం పడిపోయి 16,896 యూనిట్లుగా ఉన్నాయి. ఇళ్ల ధర 6 శాతం పెరిగి ఎస్ఎఫ్టీకి రూ.4,037గా నమోదైంది.

ఎస్‌బీఐ నుంచి సీఎంఎస్‌కి భారీ డీల్

రూ. 1,000 కోట్ల విలువ

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నుంచి రూ. 1,000 కోట్ల భారీ డీల్ లభించినట్లు నగదు లాజిస్టిక్స్ సేవలందించే సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ వెల్లడించింది. దీని ప్రకారం జనవరి 1 నుంచి మొదలుపెట్టి పదేళ్ల పాటు 5,000 ఏటీఎంలను నిర్వహించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా మెషిన్ల నిర్వహణకు సంబంధించి బడా ప్రభుత్వ రంగ బ్యాంకు ఇంత భారీ స్థాయి ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఇవ్వడం ఇదే తొలిసారని సీఎంఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. దీనితో తమకు రూ. 500 కోట్ల అదనపు ఆదాయం లభించగలదని వివరించింది. ఈ దీర్ఘకాలిక కాంట్రాక్టు కోట్ల మంది కస్టమర్లకు నిలకడగా, అత్యంత నాణ్యమైన సేవలు అందించేందుకు తోడ్పడుతుందని సంస్థ పేర్కొంది.

బీఎస్ఈలో బుధవారం సీఎంఎస్ ఇన్ఫో షేరు సుమారు 2 శాతం లాభంతో రూ. 349.60 వద్ద క్లోజయ్యింది.

కొత్త ఆదాయపన్ను చట్టానికి సిద్ధం కండి

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి ● అధికారులకు సీబీడీటీ ఆదేశం



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1 నుంచి) కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానున్నందున అధికారులు, అందుకు సంసిద్ధం కావాలని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) కోరింది. అధికారులు కొత్త చట్టాన్ని పూర్తిగా అర్థం చేసుకుని, తగినంత స్పష్టతతో పనిచేస్తారన్న ఆశాభావాన్ని సీబీడీటీ చైర్మన్ రవి అగర్వాల్ వ్యక్తం చేశారు. ఆదాయపన్ను శాఖ అధికారులకు నూతన సంవత్సరం సందర్భంగా ఇచ్చిన సందేశంలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. కొత్త చట్టానికి మారేందుకు వీలుగా నిబంధనలు, విధానాలు, పత్రాల రూపకల్పన జరుగుతున్నట్టు, ఇందుకు సంబంధించి శిక్షణ కూడా కొనసాగుతున్నట్టు చెప్పారు. ఆదాయపన్ను శాఖ పరిపాలనను సీబీడీటీయే చూస్తుంటుంది. ఏప్రిల్ 1 నుంచి ఆదాయపన్ను చట్టం 1961 స్థానంలో.. ఆదాయపన్ను చట్టం 2025 అమల్లోకి రానుండడంతో ఇచ్చిన ఈ సందేశానికి ప్రాధాన్యం నెలకొంది. ''మీ ప్రమేయం, ఉత్సాహం కొత్త చట్టానికి సాఫీగా మారడాన్ని నిర్ణయిస్తుంది. ఆదాయపన్ను శాఖ పాత్ర అన్నది పన్నుల వసూళ్లు, అమలు వరకే కాకుండా ప్రక్రియలను సులభతరం చేయడం, విశ్వాసం పెంపొందించడం, సేవల కేంద్రంగా మారుతోంది''అని అగర్వాల్ తన సందేశంలో పేర్కొన్నారు.

వెండి ప్రాసెసింగ్ సామర్థ్యం పెంచుకోవాలి

- రిఫైన్డ్ సిల్వర్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవాలి
- జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు శ్రీవాస్తవ సూచన



న్యూఢిల్లీ: విలువైన లోహంగానే కాకుండా పారిశ్రామిక అవసరాలకు కూడా కీలకంగా ఉంటున్న వెండి ప్రాసెసింగ్ సామర్థ్యాలను పెంచుకోవడంపై భారత్ మరింతగా దృష్టి పెట్టాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) సూచించింది. విదేశాల నుంచి దీర్ఘకాలికంగా సరఫరా, దేశీయంగా రిఫైనింగ్..రీసైక్లింగ్ సామర్థ్యాలను పెంచుకోవడంపై ఫోకస్ చేయాలని పేర్కొంది. కొన్ని దేశాలపై మాత్రమే ఆధారపడకుండా మరిన్ని ప్రాంతాల నుంచి వెండిని దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నించాలని సూచించింది. ఫినిష్డ్ సిల్వర్ దిగుమతులను తగ్గించుకోవాలని తెలిపింది. ఖనిజం నుంచి వెండిని ప్రాసెస్ చేసే ప్రక్రియపై భారత్ పట్టు సాధించాలని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. అంతర్జాతీయంగా వెండి ఖనిజ మార్కెట్ 6.3 బిలియన్ డాలర్లుగా ఉండగా, చైనా అత్యధికంగా ఏటా సుమారు 5.6 బిలియన్ డాలర్ల విలువ చేసే ఖనిజాన్ని దిగుమతి చేసుకుంటోందని పేర్కొన్నారు. దేశీయంగా దాన్ని శుద్ధి చేశాక, ఎలక్ట్రానిక్స్, మెడికల్ డివైజ్‌లు, సోలార్ ప్యానెళ్లలో ఉపయోగించేందుకు వీలుగా, అధిక విలువ చేసే వెండి రూపంలో దాన్ని ఎగుమతి చేస్తోందని శ్రీవాస్తవ చెప్పారు. భారత్ దానికి విరుద్ధంగా 2024లో 6.4 బిలియన్ డాలర్ల విలువ చేసే రిఫైన్డ్ వెండిని దిగుమతి చేసుకుందని, గ్లోబల్ ట్రేడ్‌లో ఇది 21.4 శాతమని వివరించారు. ఆ విధంగా ప్రాసెసర్‌గా కంటే ఫినిష్డ్ సిల్వర్‌కి అతి పెద్ద వినియోగదారుగా భారత్ నిల్చిందన్నారు. ఈ నేపథ్యంలో దేశీయంగా మరింత విలువ జోడించేందుకు ఖనిజ దశ నుంచి వెండిని ప్రాసెస్ చేసే ప్రక్రియపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని శ్రీవాస్తవ వివరించారు.

9 బిలియన్ డాలర్లకు దిగుమతులు..

2025 ఆర్థిక సంవత్సరంలో 4.83 బిలియన్ డాలర్ల వెండి ఉత్పత్తులు దిగుమతి చేసుకున్న భారత్ 478.4 మిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను మాత్రమే ఎగుమతి చేసిందని శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఇక 2025 జనవరి–నవంబర్ మధ్య కాలంలో 8.5 బిలియన్ డాలర్ల విలువ చేసే వెండిని దిగుమతి చేసుకోగా, పూర్తి సంవత్సరానికి ఇది 9.2 బిలియన్ డాలర్లకు చేరనుందని తెలిపారు. 2024తో పోలిస్తే ఇది 44 శాతం అధికమని వివరించారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఇంధన భద్రత తరహాలోనే వెడి భద్రతను సాధించడం కూడా కీలకంగా మారిందని వివరించారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా వెండికి నెలకొన్న డిమాండ్‌లో 55–60 శాతం వాటా ఎలక్ట్రానిక్స్, సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు, డిఫెన్స్ పరికరాలు మొదలైన పారిశ్రామిక విభాగాల నుంచి ఉంటోంది. గత రెండు దశాబ్దాలుగా వెండి ఖనిజం, కాన్సెంట్రేట్‌ల వాణిజ్యం 2000లో 0.1 బిలియన్ డాలర్లుగా ఉండగా 2024లో 6.27 బిలియన్ డాలర్లకు చేరింది. శుద్ధి చేసిన వెండి వ్యాపారం (కడ్డీలు, తీగలు మొదలైనవి) 2000లో 4.06 బిలియన్ డాలర్లుగా ఉండగా 2024లో 31.42 బిలియన్ డాలర్లకు చేరింది.

బియ్యం ఎగుమతులను ప్రోత్సహించాలి

- వడ్డీ రాయితీ కల్పించాలి
- కేంద్రానికి ఎగుమతుల సమాఖ్య వినతి

న్యూఢిల్లీ: పన్ను ప్రోత్సాహకాలు, రుణాలపై వడ్డీ రాయితీలు, రవాణా పరమైన మద్దతు చర్యలను 2026–27 బడ్జెట్‌లో ప్రకటించాలని భారత బియ్యం ఎగుమతిదారుల సమాఖ్య (ఐఆర్ఈఎఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. తద్వారా ఈ రంగం పోటీతత్వం బలపడుతుందని పేర్కొంది. ఎగుమతుల కోసం తీసుకునే రుణాలపై 4 శాతం మేర వడ్డీలో రాయితీ కల్పించాలని.. అలాగే, రోడ్డు, రైలు రవాణాపై వ్యయాలపైనా 3 శాతం రాయితీ కల్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరింది. ఎగుమతులపై సుంకాలు, పన్నుల మినహాయింపులను సకాలంలో అందించాలని పేర్కొంది. ఈ చర్యలతో వ్యయాలు తగ్గుతాయని, ఎగుమతులు పెరుగుతాయని సూచించింది. అంతర్జాతీయంగా బియ్యం వాణిజ్యంలో భారత్ వాటా 40 శాతంగా ఉంటుందని, 2024–25లో 170కు పైగా దేశాలకు భారత్ నుంచి బియ్యం ఎగుమతులు జరిగినట్టు ఐఆర్ఈఎఫ్ ప్రెసిడెంట్ ప్రేమ్ గార్గ్ తెలిపారు. రైతుల ఆదాయానికి, గ్రామీణ ఉపాధికి బియ్యం ఎగుమతులు ఎంతో కీలకమన్న విషయాన్ని గుర్తు చేశారు. విలువైన వరి రకాలకు (ప్రీమియం బాస్మతి, ఆర్గానిక్/నాన్ బాస్మతి రకాలు) మళ్లేందుకు ప్రోత్సాహకాలను బడ్జెట్‌లో ప్రకటించాలని ఈ సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది.

విజయం అటో ఇటో!

119 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్

బెథెల్

- రెండో ఇన్నింగ్స్‌లో 302/8
- జాకబ్ బెథెల్ అజేయ సెంచరీ
- 'యాషెస్' ఐదో టెస్టు

సిడ్నీ: ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్ ఆఖరి టెస్టుకు రసకందాయ ముగింపు లభించనుంది. ఆతిథ్య ఆస్ట్రేలియా విజయంపై గురి పెట్టినా... ఇంగ్లండ్ జట్టు అద్భుతంపై ఆశలు పెట్టుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మూడు టెస్టులు నెగ్గిన ఆస్ట్రేలియా ఇప్పటికే సిరీస్ గెలుచుకోగా... గత మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం సాధించింది. ఫలితంగా ప్రస్తుతం సిరీస్‌లో ఆసీస్ 3–1తో ఉండగా... ఐదో టెస్టు చివరి అంకానికి చేరింది. ఇంగ్లండ్ ప్రధాన బ్యాటర్లు విఫలమైన చోట... ఓ యువ ఆటగాడు అజేయ సెంచరీతో కదంతొక్కడంతో... బుధవారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. కెరీర్‌లో ఆరో టెస్టు ఆడుతున్న 22 ఏళ్ల జాకబ్ బెథెల్ (232 బంతుల్లో 142 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ సెంచరీతో విజృంభించాడు. ఆసీస్ బౌలర్లకు ఎదురునిలిచి కీలక పరుగులు రాబట్టాడు. బెన్ డకెట్ (55 బంతుల్లో 42; 6 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (48 బంతుల్లో 42; 5 ఫోర్లు) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో వెబ్‌స్టర్ 3 వికెట్లు పడగొట్టగా... స్కాట్ బోలాండ్ రెండు వికెట్లు తీశాడు. చేతిలో రెండు వికెట్లు ఉన్న ఇంగ్లండ్.. ప్రస్తుతం 119 పరుగుల ఆధిక్యంలో ఉంది. బెథెల్‌తో పాటు మాథ్యూ పాట్స్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 518/7తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా చివరకు 133.5 ఓవర్లలో 567 పరుగులకు ఆలౌటైంది. క్రితం రోజు స్కోరుకు మరో 49 పరుగులు జోడించి మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. స్టీవ్ స్మిత్ (220 బంతుల్లో 138; 16 ఫోర్లు, 1 సిక్స్) త్వరగానే వెనుదిరగగా... ఆల్‌రౌండర్ వెబ్‌స్టర్ (87 బంతుల్లో 71 నాటౌట్; 7 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులకే ఆలౌట్ కావడంతో... ఆస్ట్రేలియాకు 183 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. నేడు ఆటకు చివరి రోజు కాగా... చేతిలో రెండు వికెట్లు ఉన్న ఇంగ్లండ్.. ప్రత్యర్థి ముందు పోరాడే లక్ష్యాన్ని నిర్దేశించి మ్యాచ్‌ను రసవత్తరంగా మారుస్తుందా వేచిచూడాలి!

ఆదుకున్న బెథెల్...

తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని కోల్పోయిన ఇంగ్లండ్‌కు రెండో ఇన్నింగ్స్‌లోనూ శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్ ఐదో బంతికే జాక్ క్రాలీ (1)ని స్టార్క్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ దశలో క్రీజులోకి అడుగు పెట్టిన బెథెల్... మరో ఓపెనర్ డకెట్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించే పనిలో పడ్డాడు. ఈ జంట వీలు చిక్కినప్పుడల్లా ఫోర్లు కొడుతూ... స్కోరు బోర్డును ముందుకు నడిపింది. రెండో వికెట్‌కు 81 పరుగులు జోడించాక డకెట్ అవుట్ కాగా... తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో జో రూట్ (6) విఫలమయ్యాడు. హ్యారీ బ్రూక్ సహకారంతో ముందుకు సాగిన బెథెల్... జట్టు తొలి ఇన్నింగ్స్ లోటు పూడ్చాడు. ఈ క్రమంలో బెథెల్ 162 బంతుల్లో తొలి టెస్టు సెంచరీ తన ఖాతాలో వేసుకున్నాడు. బ్రూక్‌తో కలిసి బెథెల్ నాలుగో వికెట్‌కు 102 పరుగులు జోడించడంతో ఒక దశలో ఇంగ్లండ్ 219/3తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే అదే స్కోరు వద్ద బ్రూక్‌తో పాటు, విల్ జాక్స్ (0)ను మూడు బంతుల వ్యవధిలో వెబ్‌స్టర్ అవుట్ చేశాడు. జేమీస్మిత్ (26) ఫర్వాలేదనిపించగా... గాయంతో ఇబ్బంది పడుతున్న కెప్టెన్ బెన్ స్టోక్స్ (1) ప్రభావం చూపలేకపోయాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా... బెథెల్ మాత్రం పోరాటం ఆపలేదు. చివరి వరుస బ్యాటర్ల సాయంతో ఇంగ్లండ్‌కు 119 పరుగుల ఆధిక్యం అందించాడు. ఇప్పటికే స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్ చివరి రోజు మరింత మారడం ఖాయం కాగా... ఇంగ్లండ్ ప్రత్యర్థికి ఎంత లక్ష్యాన్ని నిర్దేశిస్తుందో చూడాలి. జట్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగిన ఆసీస్... వెబ్‌స్టర్ ద్వారా బౌలింగ్ చేయించి ఫలితం రాబట్టినప్పుడు... ఇంగ్లండ్ జట్టులో జాకబ్ బెథెల్, విల్ జాక్స్, జో రూట్ రూపంలో ముగ్గురు స్పిన్నర్లు ఉండటంతో... లక్ష్యం ఏమాత్రం కఠినంగా ఉన్నా ఆసీస్‌కు తిప్పలు తప్పకపోవచ్చు. ఈ సుదీర్ఘ సిరీస్‌కు నేడు తెరపడనుంది.

జాన్సన్ రిటైర్మెంట్

అథ్లెటిక్స్‌కు వీడ్కోలు పలికిన భారత స్టార్ రన్నర్

న్యూఢిల్లీ: భారత మిడిల్ డిస్టెన్స్ రన్నర్ జిన్సన్ జాన్సన్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 1500 మీటర్ల విభాగంలో జాతీయ రికార్డు నెలకొల్పడంతో పాటు... ఆసియా క్రీడల్లో పసిడి పతకం సాధించిన జాన్సన్ బుధవారం ట్రాక్‌కు వీడ్కోలు పలికాడు. 15 ఏళ్ల పాటు కెరీర్ కొనసాగించిన కేరళకు చెందిన 34 ఏళ్ల ఈ అథ్లెట్... 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల పురుషుల 1500 మీటర్ల విభాగంలో కాంస్యం నెగ్గిన అనంతరం తిరిగి బరిలోకి దిగలేదు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో 1500 మీటర్ల దూరాన్ని 3 నిమిషాల 44.72 సెకన్లలో పూర్తి చేసి పసిడి పతకం నెగ్గిన జాన్సన్... అదే క్రీడల్లో 800 మీటర్ల విభాగంలో రజత పతకం సైతం గెలిచాడు. 'అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని కలలు కంటూ పాఠశాల స్థాయిలో కోల్‌కతా నుంచి ప్రయాణం ప్రారంభించి... ఆసియా క్రీడల పోడియం వరకు చేరుకున్నాను. ఇదంతా అథ్లెటిక్స్ వల్లే సాధ్యమైంది. కొన్ని ప్రయాణాలను మీటర్లు, నిమిషాల్లో లెక్కిస్తారు. కొన్ని ప్రయాణాలను కన్నీళ్లు, త్యాగాలు, నమ్మకంతో కొలుస్తారు. అందులో నాది రెండోది' అని జాన్సన్ పేర్కొన్నాడు. 2018 అంతరరాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిన్సన్ 800 మీటర్ల పరుగును 1 నిమిషం 45.65 సెకన్లలో పూర్తి చేశాడు. ఫలితంగా 42 ఏళ్ల క్రితం దిగ్గజ అథ్లెట్ శ్రీరామ్ సింగ్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టాడు. గతేడాది మొహమ్మద్ అఫ్జల్ దీన్ని తిరగరాశాడు. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల 1500 మీటర్ల విభాగంలో 3 నిమిషాల 37.86 సెకన్ల టైమింగ్‌తో జాన్సన్ జాతీయ రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత మరో రెండుసార్లు దాన్ని అతడే మెరుగు పరిచాడు. ఈ విభాగంలో ప్రస్తుతం జాతీయ రికార్డు (3 నిమిషాల 35.24 సెకన్లు) జాన్సన్ పేరిటే ఉంది. 'రెండు జాతీయ రికార్డులు బద్దలు కొట్టడంతో పాటు భారత అథ్లెటిక్స్‌కు నా వంతు తోడ్పాటు అందించడం ఎప్పటికీ మరవలేను. ఒలింపిక్స్, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. 2007లో కోల్‌కతాలో తొలిసారి జాతీయ స్థాయి పాఠశాల పోటీల్లో పసిడి నెగ్గా. అక్కడి నుంచి దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా పరుగుతీశా. ఈ ప్రయాణంలో ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయి. గాయాలు వెనక్కిలాగే ప్రయత్నం చేశాయి. అయినా వాటన్నింటినీ దాటుకొని కఠోర సాధనతో ఇక్కడి వరకు చేరుకున్నా. 2018 సంవత్సరం నా కెరీర్‌లో అత్యుత్తమమైంది. ఆ ఏడాది ఆసియాలో అత్యుత్తమ అథ్లెట్‌గా నిలవడంతో పాటు ఆసియా క్రీడల్లో పసిడి, రజత పతకాలు సాధించా. కొవిడ్ ప్రభావం, ఆ తర్వాత గాయాలతో నా కెరీర్ వెనుకబడి పోయింది. వాటి నుంచి కోలుకొని 2023 ఆసియా క్రీడల్లో కాంస్యం గెలవడం సంతృప్తినిచ్చింది. ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని జాన్సన్ వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు.

నిఖత్ పంచ్ అదిరింది

గ్రేటర్ నోయిడా: జాతీయ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల 51 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో నిఖత్ రెండు నిమిషాల్లోపే విజయాన్ని అందుకుంది. నిఖత్ సంధించిన పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి కుల్సుమా బానో (లడఖ్) ఎదురునిలువలేకపోయింది. దాంతో రిఫరీ రెండు నిమిషాల్లోపే బౌట్‌ను నిలిపివేసి నిఖత్‌ను విజేతగా ప్రకటించారు. 48 కేజీల విభాగంలో మీనాక్షి (హరియాణా) కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. పురుషుల విభాగంలో స్టార్ బాక్సర్లు అమిత్ పంఘాల్ (55 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), జాదూమణి సింగ్ (55 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), హితేశ్ గులియా (70 కేజీలు) కూడా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు.

టి20 ప్రపంచకప్ టోర్నీకి న్యూజిలాండ్ జట్టు ప్రకటన

వెల్లింగ్టన్: గత ఏడాది నిలకడగా రాణించిన న్యూజిలాండ్ పేస్ బౌలర్ జేకబ్ డఫీకి తగిన ప్రతిఫలం లభించింది. 31 ఏళ్ల డఫీకి కెరీర్‌లో తొలిసారి టి20 ప్రపంచకప్‌లో ఆడే అవకాశం దక్కింది. ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు భారత్, శ్రీలంకలలో జరిగే పురుషుల టి20 ప్రపంచకప్‌లో పోటీపడే న్యూజిలాండ్ జట్టును బుధవారం ప్రకటించారు. గత ఏడాది 81 అంతర్జాతీయ వికెట్లు పడగొట్టిన డఫీ టి20 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేయనున్నాడు. ఆల్‌రౌండర్ మిచెల్ సాంట్నర్ సారథ్యంలో న్యూజిలాండ్ ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగనుంది.

న్యూజిలాండ్ టి20 జట్టు: సాంట్నర్ (కెప్టెన్), అలెన్, మైకేల్ బ్రేస్‌వెల్, చాప్‌మన్, కాన్వే, డఫీ, ఫెర్గూసన్, హెన్రీ, మిచెల్, మిల్నే, నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి.

మెరిసిన షాదాబ్, ఫర్హాన్

తొలి టి20లో శ్రీలంకపై పాకిస్తాన్ విజయం

ఫర్హాన్

దంబుల్లా: టి20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా శ్రీలంకతో మొదలైన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాకిస్తాన్ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి పోరులో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో లంకను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 19.2 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. జనిత్ లియనాగే (31 బంతుల్లో 40; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. కుశాల్ మెండిస్ (14), నిసాంక (12), ధనంజయ డిసిల్వా (10), అసలంక (18), హసరంగ (18), దసున్ షనక (12) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరుకున్నారు. పాకిస్తాన్ బౌలర్లలో సల్మాన్ మీర్జా, అబ్రార్ అహ్మద్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... మొహమ్మద్ వసీమ్, షాదాబ్ ఖాన్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 16.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (36 బంతుల్లో 51; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. సయిమ్ అయూబ్ (24; 3 ఫోర్లు, 1 సిక్స్), షాదాబ్ ఖాన్ (18 నాటౌట్; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో ఆడుతున్న పలువురు పాకిస్తాన్ స్టార్ ఆటగాళ్లు ఈ సిరీస్‌కు దూరంగా ఉన్నారు. షాదాబ్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం రెండో టి20 జరగనుంది.

పోరాడి ఓడిన అనిరుధ్ జోడీ

బెంగళూరు: స్వదేశంలో జరుగుతున్న బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్‌కు నిరాశ ఎదురైంది. గత ఏడాది ఇదే టోర్నీలో రే హో (చైనీస్ తైపీ)తో కలిసి డబుల్స్ టైటిల్ నెగ్గిన అనిరుధ్ ఈసారి మాత్రం తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్–అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6–2, 6–7 (4/7), 5–10తో 'సూపర్ టైబ్రేక్'లో మాక్స్ హుకెస్–నీల్స్ విస్కెర్ (నెదర్లాండ్స్) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 91 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్–అర్జున్ ఏడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం అనిరుధ్–అర్జున్ తడబడి మూల్యం చెల్లించుకున్నారు.

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ఓడిపోగా... దక్షిణేశ్వర్ సురేశ్, మానస్ ధామ్నె రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. సుమిత్ నగాల్ 6–7 (2/7), 6–1, 6–7 (11/13)తో రెండో సీడ్ హరోల్డ్ మాయోట్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమి చవిచూశాడు. దక్షిణేశ్వర్ సురేశ్ 6–3, 1–6, 7–6 (7/4)తో ఫెలిక్స్ బాల్‌షా (ఫ్రాన్స్)పై, మానస్ 6–2, 3–6, 6–2తో జుఖయెవ్ (కజకిస్తాన్)లపై గెలిచారు.

హైదరాబాద్ తూఫాన్స్ విజయం

చెన్నై: హాకీ ఇండియా లీగ్ పురుషుల విభాగంలో భాగంగా బుధవారం జరిగిన పోరులో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు కీలక విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో తూఫాన్స్ 3–2 గోల్స్ తేడాతో రాంచీ రాయల్స్‌ను ఓడించింది. హైదరాబాద్ తరఫున అమన్‌దీప్ లక్డా (42వ నిమిషంలో), నిక్ వుడ్స్ (45వ నిమిషంలో), తల్విందర్ సింగ్ (57వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాంచీ రాయల్స్ తరఫున టామ్ బూన్ (11వ, 17వ నిమిషాల్లో) రెండు గోల్స్ కొట్టడం విశేషం. మరో మ్యాచ్‌లో హెచ్ఐఎల్ జీసీ టీమ్ 6–3తో బెంగాల్ టైగర్స్‌ను ఓడించింది. హెచ్ఐఎల్ తరఫున కేన్ రసెల్ ఒక్కడే మూడు గోల్స్ కొట్టి సత్తా చాటాడు. స్యామ్ వార్డ్ (19వ నిమిషంలో), కేన్ రసెల్ (19వ, 36వ, 44వ నిమిషాల్లో), సుదీప్ (38వ నిమిషంలో), జేమ్స్ అల్బరీ (59వ నిమిషంలో) గోల్స్ నమోదు చేయగా... బెంగాల్ ఆటగాళ్లలో జుగ్‌రాజ్ సింగ్ (12వ నిమిషంలో), గ్రామ్‌బష్ (40వ నిమిషంలో), క్రిస్టోఫర్ (40వ నిమిషంలో) గోల్స్ సాధించారు. నేడు జరిగే పోరులో బెంగాల్ టైగర్స్ జట్టు కళింగ లాన్సర్స్‌ను ఎదుర్కొంటుంది. హెచ్ఐఎల్ మహిళల విభాగం పోరులో సూర్మా హాకీ క్లబ్ 3–2తో బెంగాల్ టైగర్స్‌పై గెలుపొందింది. సూర్మా తరఫున సోనమ్ (10వ నిమిషంలో), పెన్నీ స్క్విబ్ (50వ నిమిషంలో), గ్రానటో (53వ నిమిషంలో) గోల్స్ కొట్టారు. బెంగాల్ ప్లేయర్లలో గార్జెలానీ (37వ నిమిషంలో), లాల్‌రెమ్‌సియామి (60వ నిమిషంలో) గోల్స్ నమోదు చేశారు.

ఐసీసీ మా సమస్యను పరిష్కరిస్తుంది: బీసీబీ

ఢాకా: భద్రతా కారణాలను చూపిస్తూ భారత్‌లో టి20 ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఆడేందుకు నిరాకరిస్తున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ఎలాంటి హామీ లభించలేదు. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలంటూ బీసీబీ చేసిన విజ్ఞప్తిని పట్టించుకోని ఐసీసీ... తగిన రీతిలో పరిష్కారాన్ని సూచిస్తామని మాత్రం చెప్పింది. తాజా వివాదంపై ఐసీసీ అధికారులతో తాము భేటీ అవుతామంటూ బీసీబీ అధికారులు లేఖ రాశారు. అనంతరం ఐసీసీ నుంచి ప్రత్యుత్తరం వచ్చిన అనంతరం ఈ వివరాలను బీసీబీ వెల్లడించింది. అయితే తాము భారత్‌లో ఆడతామా, లేదా అనే విషయంపై మాత్రం ఇందులో ఎలాంటి సమాచారం లేదు. 'టి20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడితే ఎదురయ్యే సమస్యలు, భద్రతాపరమైన ఆందోళన గురించి మేం రాసిన లేఖపై ఐసీసీ స్పందించింది. టోర్నీలో బంగ్లా జట్టుకు ఇబ్బంది లేకుండా చూస్తామనే తమ మాటకు కట్టుబడి ఉన్నామని... ఈ విషయంలో బీసీబీ అధికారులతో కలిసి పని చేసేందుకు సుముఖంగా ఉన్నామని వెల్లడించింది. టోర్నీకి సంబంధించి మేం చేసిన పలు సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కూడా ఐసీసీ చెప్పింది' అని బీసీబీ పేర్కొంది. అయితే భారత్‌లో ఆడాల్సిందేనని, లేదంటే పాయింట్లు కోల్పోయేందుకు సిద్ధంగా ఉండాలంటూ ఐసీసీ హెచ్చరించిందంటూ వచ్చిన వార్తలను బీసీబీ కొట్టిపారేసింది.

అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు

కోల్‌కతా: టాటా స్టీల్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు తొలి రోజు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మొదటి రోజు మూడు గేమ్‌లు జరగ్గా... అర్జున్ రెండింటిలో ఓడిపోయి, ఒక గేమ్‌లో గెలుపొందాడు. విదిత్ (భారత్)తో జరిగిన తొలి గేమ్‌లో 81 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద (భారత్)తో జరిగిన రెండో గేమ్‌లో 43 ఎత్తుల్లో అర్జున్ ఓడిపోయాడు. నిహాల్ సరీన్ (భారత్)తో జరిగిన మూడో గేమ్‌లో అర్జున్ 39 ఎత్తుల్లో నెగ్గాడు. పది మంది గ్రాండ్ మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. మూడో రౌండ్ తర్వాత భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, హాన్స్ నీమెన్ (అమెరికా) 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. మహిళల విభాగంలో హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మూడు రౌండ్‌లు ముగిశాక ఒక పాయింట్‌తో ఏడో స్థానంలో ఉంది. దివ్య దేశ్‌ముఖ్ (భారత్), నానా జాగ్నిడ్జె (జార్జియా)లతో జరిగిన గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక... వంతిక (భారత్) చేతిలో 47 ఎత్తుల్లో ఓడిపోయింది.

పారిస్‌లో రోడ్డు, సీన్ నదీతీరం కన్పించనంతగా బుధవారం భారీ స్థాయిలో కురిసిన మంచును ఆస్వాదిస్తున్న స్థానికులు

అమెరికాలోని లాస్‌వెగాస్ నగరంలో బుధవారం సీఈఎస్ టెక్‌షోలో బట్టలను చక్కగా మడతబెడుతున్న ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వారి క్లోయిడ్ రోబో

కుక్క కాటే కాదు

ప్రాణాలపై వేటూ పడుతోంది

వీధి శునకాల కారణంగా రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి

స్కూళ్లు, ఆస్పత్రులు, కోర్టుల వంటి సంస్థాగత ప్రాంగణాల్లో శునకాల స్వైరవిహారం ఎక్కువైంది

అధికారుల వైఫల్యానికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాలా?

నిలదీసిన సర్వోన్నత న్యాయస్థానం • రాష్ట్రాల తీరుపైనా తీవ్ర అసహనం

సాక్షి, న్యూఢిల్లీ: పాఠశాలలు, ఆస్పత్రులు, కోర్టులు మొదలు ఎక్కడ పడితే అక్కడ తిష్టవేస్తున్న వీధి శునకాల కారణంగా జనం కుక్కకాటు బారిన మాత్రమేకాదు రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. వీధి శునకాలను జనసమ్మర్ధ ప్రాంతాల నుంచి తరలించి షెల్టర్లకు తరలించాన్న అంశంపై బుధవారం జస్టిస్ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల సుప్రీంకోర్టు ధర్మాసనం సుదీర్ఘంగా విచారించింది. ఈ సందర్భంగా శునకాలు సహా వీధి జంతువుల బెడదను జడ్జీలు ప్రస్తావించారు. ''అసలు రహదారుల వెంబడి శునకాలు, వీధి జంతువులు లేకుండా చేయాలి. కుక్కకాటు మాత్రమే జనాల సమస్య కాదు.. వీధి జంతువులు రోడ్లపై ఇష్టారీతిగా తిరగడంతో జనం అన్యాయంగా రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నా రు. గత 20 రోజుల్లో రాజస్థాన్ హైకోర్టులో ఇద్దరు జడ్జీలు ఇలాగే రోడ్లపై వీధి జంతువుల కారణంగా ప్రమాదాలకు గురయ్యారు. ఒకరు ఇంకా వెన్నుముక గాయాలతో ఆస్పత్రిలోనే ఉన్నారు. ఇది నిజంగా ఆందోళకరమైన విషయం''అని జస్టిస్ మెహతా అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కల్పించుకుని వాదించారు. ''వీధి శునకాల తరలింపునకు గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించండి. బహిరంగ ప్రదేశాల్లోని శునకాలను బంధించడం సమస్యకు **పరిష్కారం** అనిపించుకోదు. జంతువులు–మానవుల మధ్య ఘర్షణను రూపుమాపేలా అంతర్జాతీయంగా ఆమోదింపబడిన శాస్త్రీయ పరిష్కారాన్ని చూపండి''అని ఆయన కోరారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పందించారు. ''చికిత్స కంటే నివారణ అత్యుత్తమం. అయినా ఈ అంశంలో అతిగా వాదించడానికి ఏమీ లేదు. మేం కేవలం రోడ్ల మీద వీధి శునకాలను తొలగించాలని సూచించాం. సంబంధిత నియమనిబంధనల జోలికి వెళ్లలేదు. ఇప్పటికే ఉన్న చట్టాలు, నియమాలను రాష్ట్రాలు, ప్రభుత్వరంగ సంస్థలు విధిగా అమలుచేస్తే సరిపోతుంది. గతంలో మా తీర్పుకు అనుగుణంగా అఫిడవిట్లు సమర్పించాలని కోరాం. కొన్ని రాష్ట్రాలు మౌనం వహించాయి''అని న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ఈ అంశంలో కోర్టు సలహాదారు(అమికస్ క్యూరీ)గా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ మాట్లాడారు. ''జాతీయరహదారుల్లో దాదాపు 1,400 కిలోమీటర్ల రోడ్డు మార్గాలు జంతువులతో ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇక్కడ రహదారి మీద వీధి శునకాలు, పశువుల బెడద ఎక్కువ. ఇవి రహదారి మీదకు రాకుండా కంచె వేయాలని సూచించాం. కోర్టు గత తీర్పును మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, పంజాబ్‌లు పట్టించుకోలేదు. అవి అఫిడవిట్లు సమర్పించలేదు. మిగతా రాష్ట్రాలు సమర్పించినా అవి పేలవంగా ఉన్నాయి''అని గౌరవ్ అగర్వాల్ వెల్లడించారు. వాటిపై కఠిన నిర్ణయాలు తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది.

కుక్క మూడ్ చెప్పగలమా?

'పాఠశాలలు, ఆసుపత్రులు, కోర్టుల వంటి సంస్థాగత ప్రాంగణాల్లో వీధి కుక్కలు ఎందుకు ఉండాలి? ఏ కుక్క ఎప్పుడు ఏ 'మూడ్'లో ఉంటుందో.. ఎవరిని కరుస్తుందో ఎవరైనా గుర్తించగలరా?' అని సుప్రీంకోర్టు అధికారులను నిలదీసింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలను అధికారులు సరిగ్గా అమలు చేయకపోవడం వల్లే సమస్య జఠిలమైందని జంతు ప్రేమికుల సంఘం తరపు న్యాయవాది ఆనంద్ గ్రోవర్ వాదించారు. దీనిపై స్పందించిన జస్టిస్ సందీప్ మెహతా.. 'అధికారులు తమ పని చేయడంలో విఫలమయ్యారని చెప్పి ప్రజలు నిరంతరం బాధలు పడాలా?'అని ఘాటుగా ప్రశ్నించారు.

ఆహారం పెట్టేవారిపై దాడులు

సీనియర్ న్యాయవాది కోలిన్ గొన్సాల్వేజ్ సైతం వాదించారు. ''వీధి కుక్కలకు ఆహారం పెట్టే వారిని, ముఖ్యంగా మహిళలను టార్గెట్ చేసి వేధిస్తున్నారని, వారి బట్టలు చించేసి కొడుతున్నారు''అని కోర్టు దష్టికి తెచ్చారు. ''మనుషులు కుక్కల పట్ల క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. వాటిని విషం పెట్టి చంపడం, అసహజ సంభోగం చేయడం వంటి అతి జుగుప్సాకర వికృత చర్యలకు పాల్పడుతున్నారు. వీటిని కోర్టు పరిగణనలోకి తీసుకోవాలి''అని కోరారు. తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది.

కుక్కలకు కౌన్సిలింగ్ మిగిలింది

ఈ సందర్భంగా న్యాయస్థానం సరదా వ్యాఖ్య చేసింది. ''ఈ లెక్కన తోటి కుక్కలకు రేబిస్ వంటి వ్యాధి సోకినా అంటించుకోకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరినీ కరవొద్దని ఇతర శునకాలకు హితబోధ చేయాలి. ఆ మేరకు వాటికి కౌన్సిలింగ్ ఇవ్వాలి. అలా కుక్కలకు కౌన్సిలింగ్ చేయడం ఒక్కటే మిగిలిపోయింది. అయితే అంతగా కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత కూడా ఆ కౌన్సిలింగ్ ఇచ్చిన వ్యక్తిని బయటికొచ్చిన కుక్క కరవకుండా ఉంటుందనే గ్యారెంటీ అయితే లేదు''అని సరదా వ్యాఖ్యచేసింది.

సీఐఏ డబుల్ ఏజెంట్ జీవితం... అలా జైల్లోనే తెల్లారిపోయింది!

వాషింగ్టన్: అతనో గూఢచారి. పని చేసింది అలాంటిలాంటి సంస్థలో కాదు. అగ్ర రాజ్యం అమెరికా అత్యంత గర్వంగా చెప్పుకునే నిఘా సంస్థ సెంట్రల్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)లో. అంతటి ప్రతిష్టాత్మక సంస్థలో పని చేస్తూ సొంత దేశపు రహస్యాలన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రత్యర్థి దేశం రష్యాకు చేరవేస్తూ వచ్చాడు. కర్మ కాలి ఓ దుర్దినాన దొరికిపోయాడు. సాక్ష్యాలన్నీ స్పష్టంగా ఉండటంతో విచారణ కూడా అవసరం లేదంటూ నేరాలన్నీ తనే ఒప్పేసుకున్నాడు. అతని పేరు ఆల్డ్రిచ్ ఏమ్స్. అలా 1994 నుంచీ ఆజన్మ ఖైదు అనుభవిస్తున్న ఆ సీఐఏ డబుల్ ఏజెంట్ 84 ఏళ్ల వయసులో మేరీలాండ్ జైల్లో ఇటీవలే కన్నుమూశాడు. బ్యూరో ఆఫ్ ప్రిజన్స్ సోమవారం ఈ విషయాన్ని ధ్రువీకరించింది.

ఖతర్నాక్ ఖిలాడీ

ఆల్డ్రిచ్ సీఐఏలో చిన్నాచితకా ఏజెంటు కాదు. ఏకంగా 31 ఏళ్లపాటు సంస్థలో 'నమ్మకంగా'పని చేశాడు. ఏళ్ల తరబడి ఇటలీ తదితర దేశాల్లో సీఐఏ నిఘా కార్యకలాపాల్లో కీలకంగా కూడా వ్యవహరించాడు. అలాంటివాడు తీవ్రంగా అప్పులపాలై, ఆ ఊబి నుంచి బయటపడేందుకు కిందా మీదా అవుతున్న రోజుల్లో, అంటే 1985లో సోవియట్ యూనియన్ గూఢచార సంస్థ కేజీబీ అతన్ని అప్రోచ్ అయింది. ఎందుకంటే అప్పుడతను పని చేస్తున్నది వర్జీనియాలోని సీఐఏ ప్రధాన కార్యాలయంలో సోవియట్/తూర్పు యూరప్ విభాగంలోనే! డబ్బుల కోసం మనవాడు వెంటనే అమ్ముడుపోయాడు. అవి ప్రచ్ఛన్న యుద్ధం రోజులు కావడంతో నిఘా సమాచారానికి అత్యంత ప్రాధాన్యత ఉండేది. దాంతో ఆల్డ్రిచ్‌కు సోవియట్ ఏకంగా 25 లక్షల డాలర్లు ముట్టజెప్పిందట. అలా స్వదేశం అమెరికాకు అతను చేసిన నష్టం అంతా ఇంతా కాదు. అతనిచ్చిన సమాచారంతో రష్యా తమ దేశంలోని సీఐఏ ఏజెంట్లను చాలావరకు ఏరిపారేసింది. అంతేగాక సీఐఏ దశాబ్దాల తరబడి కష్టించి మరీ తమ దేశంలో ఏర్పాటు చేసుకున్న సమాచార తదితర వ్యవస్థలను కూడా చాలావరకు తుంచేయగలిగింది. ఇదంతా ఎలా జరుగుతోందో అర్థం కాక విస్తుపోవడం అమెరికా వంతుగా మారింది. అంతేకాదు, సీఐఏకు సమాచారం చేరవేస్తున్న 10 మంది రష్యా డబుల్ ఏజెంట్ల గురించి కూడా ఉప్పందించి వారి మరణాలకు కారకుడయ్యాడు ఆల్డ్రిచ్. అంతేగాక రష్యాకు వ్యతిరేకంగా అమెరికా తలపెట్టిన మరెన్నో ఉపగ్రహ నిఘా ఆపరేషన్లు తదితరాల గురించి కూడా ఎప్పటికప్పుడు సమాచారమిచ్చేవాడు. 1985 నుంచి 1994లో పట్టుబడేదాకా, అంటే ఏకంగా తొమ్మిదేళ్లపాటు మనవాడి వ్యవహారం నిర్నిరోధంగా సాగిపోయింది. ఇంతా చేసి, తనవల్ల అమెరికాకు పెద్దగా నష్టమంటూ ఏమీ జరగలేదంటూ వాషింగ్టన్ పోస్ట్‌కు ఆల్డ్రిచ్ ఇచ్చిన ఇంటర్వ్యూ సంచలనం రేపింది. సొంత దేశంపై అతడి నిఘా కార్యకలాపాలకు సహకరించిన భార్య రొసారియో కూడా కటకటాలపాలైంది.

ఆల్డ్రిచ్ ఏమ్స్ (ఫైల్)

హీరో కాబోయి జీరో

అమ్మాయి ప్రేమ కోసం 'యాక్సిడెంట్' డ్రామా..

ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలి.. తన దృష్టిలో హీరోగా నిలిచిపోవాలి.. ఇదీ ఒక యువకుడి పిచ్చి ఆలోచన. దీనికోసం అతను వేసిన ప్లాన్ వింటే వెన్నులో వణుకు పుట్టాల్సిందే.

రోడ్డుపై ఘోర ప్రమాదం

డిసెంబర్ 23వ తేదీ సాయంత్రం 5.30 గంటలు. కోచింగ్ క్లాస్ ముగించుకుని ఓ యువతి తన స్కూటర్‌పై ఇంటికి వెళ్తోంది. పతనంతిట్ట సమీపంలోని వళముట్టం ఈస్ట్ వద్దకు రాగానే, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కారు ఆమె స్కూటర్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ ధాటికి ఆమె గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడిపోయింది. కారు ఆగకుండా మెరుపు వేగంతో వెళ్లిపోయింది. రక్తపు మడుగులో ఉన్న ఆమెను చూసి స్థానికులు భయభ్రాంతులయ్యారు.

'రక్షకుడు' ఎంట్రీ

ఏం చేయాలో తెలియక జనం తత్తరపడుతున్న సమయంలో.. అక్కడికి ఒక ఇన్నోవా కారు వచ్చి ఆగింది. అందులో నుంచి రంజిత్ రాజన్ అనే యువకుడు కంగారుగా దిగాడు. 'నేను ఆమె భర్తను'.. అంటూ అందరినీ నమ్మించాడు. ఎంతో ఆవేదన నటిస్తూ ఆమెను హుటాహుటిన కొన్నీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. అందరూ అతన్ని 'దేవుడు పంపిన రక్షకుడు' అని మెచ్చుకున్నారు.

విస్తుపోయే నిజం!

ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య తనిఖీల్లో.. ఆ యువతికి తీవ్ర గాయాలైనట్లు తేలింది. కుడి చేయి ఎముక పక్కకు జరగడం, వేలు విరగడంతో పాటు ఒళ్లంతా గాయాలయ్యాయి. మొదట ఇది సాధారణ హిట్ అండ్ రన్ కేసు అని పోలీసులు భావించారు. కానీ, విచారణ ముదిరే కొద్దీ పోలీసులకు అనుమానం కలిగింది. రంజిత్ మాటల్లో పొంతన లేకపోవడంతో లోతుగా ఆరా తీశారు. అప్పుడు బయటపడింది అసలు గుట్టు.

పక్కా ప్రణాళికతో..

ఆ ప్రమాదం అనుకోకుండా జరిగింది కాదు.. రంజిత్ పక్కాగా ప్లాన్ చేసి చేయించాడు.. అదెలా అంటే.. 'యువతిని తన స్నేహితుడు అజాస్ కారుతో గుద్దిస్తాడు. వెంటనే తనే అక్కడికి చేరుకుని కాపాడినట్టు నటించాలి. యువతికి, ఆమె కుటుంబానికి తనపై విపరీతమైన ప్రేమ, కృతజ్ఞత కలిగేలా చేయాలి. మళ్లీ ఆమెను తన దారిలోకి తెచ్చుకోవాలి..'

పారని సైకో ప్రేమికుడి పాచిక

ప్రేమ పేరుతో ప్రాణాల మీదకు తెచ్చిన ఈ 'సైకో' ప్రేమికుడి పాచిక పారలేదు. పోలీసులు రంజిత్‌తో పాటు అతడికి సహకరించిన అజాస్‌ను అరెస్ట్ చేశారు. సాధారణ యాక్సిడెంట్ కేసు కాస్తా ఇప్పుడు 'హత్యాయత్నం' కేసుగా మారింది. నకిలీ 'ప్రేమల' వెనుక దాగున్న ఇలాంటి క్రూరత్వాలపై అప్రమత్తంగా ఉండాల్సిందే..

– సాక్షి, నేషనల్ డెస్క్

అగ్నికి ఆహుతైన 200 ఏళ్ల నాటి ప్యాలెస్

షిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో ఆనాటి కియోంథల్ సంస్థానాధీశులు నిర్మించిన 200 ఏళ్లనాటి అందమైన జుంగా ప్యాలెస్ బుధవారం బుగ్గిపాలైంది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ప్యాలెస్‌లో మంటలు చెలరేగాయి. వెనువెంటనే అగ్నికీలలు ప్యాలెస్ మొత్తాన్నీ ఆక్రమించాయి. షిమ్లా నగరానికి 26 కిలోమీటర్ల దూరంలోని జుంగా ప్రాంతంలో ఈ జుంగా మహల్ ప్యాలెస్ ఉంది. అగ్నిప్రమాదంలో మహల్‌లోని చారిత్రక పత్రాలు, పురాతన ఫర్నీచర్, అత్యంత రమణీయమైన కళాఖండాలు, చిత్రాలు, అబ్బురపరిచే నిర్మాణ కౌశలంతో ఉట్టిపడే భవనంలోని దర్వాజాలు, కిటికీలు, షాండ్లియర్లు అన్నీ కాలిపోయాయి. హిమాచల్ ప్రదేశ వారసత్వ సంపదగా ఈ మహల్‌కు ఎంతో పేరుంది. ఏటా ఈ మహల్‌ను సందర్శించే దేశవిదేశీ పర్యాటకుల సంఖ్య సైతం చాలా ఎక్కువ. అగ్ని ప్రమాద ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు.

కుట్టు ఊడింది.. కుర్చీ పోయింది!

35 ఏళ్ల నాటి 'అండర్‌వేర్' కేసు మిస్టరీ..

కేరళ మాజీ మంత్రి ఆంటోనీ రాజు ఖతర్నాక్ క్రైమ్ స్టోరీ!

అది 1990వ సంవత్సరం.. తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్. ఆస్ట్రేలియాకు చెందిన ఆండ్రూ సాల్వెటర్ సెర్వెల్లి అనే వ్యక్తి 61.5 గ్రాముల హషీష్ తో పట్టుబడ్డాడు. తన అండర్‌వేర్ లో ప్రత్యేకంగా కుట్టిన రహస్య జేబులో డ్రగ్స్ దాచి స్మగ్లింగ్ చేస్తూ దొరికిపో యాడు. సాక్ష్యాలు బలంగా ఉన్నాయి.. నిందితుడికి శిక్ష ఖాయమని అంతా భావించారు. కానీ, అక్కడే సినిమా కథకు తీసిపోని మలుపు తిరిగింది.

కోర్టుకే టోకరా..

ఈ కేసులో నిందితుడి తరపున జూనియర్ లాయర్‌గా ఉన్న వ్యక్తి మరెవరో కాదు.. కేరళ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆంటోనీ రాజు. 1991లో హైకోర్టులో అప్పీల్ నడుస్తున్నప్పుడు డిఫెన్స్ లాయర్లు ఒక వింత వాదన తెరపైకి తెచ్చారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న అండర్‌వేర్ నిందితుడిది కాదని వాదించారు. ఆశ్చర్యకరంగా, నిందితుడు కోర్టులోనే ఆ అండర్‌వేర్‌ను వేసుకోవడానికి ప్రయత్నించగా.. అది అతనికి అస్సలు సరిపోలేదు.. అది చాలా చిన్నదిగా ఉంది. దీంతో పోలీసులు తప్పుడు సాక్ష్యాన్ని సృష్టించారని నమ్మిన కోర్టు, సెర్వెల్లిని నిర్దోషిగా విడుదల చేసింది. ఇంకేముంది.. అతను ఆస్ట్రేలియాకు చెక్కేశాడు.

ఆస్ట్రేలియా జైల్లో లీకైన సీక్రెట్

కేసు ముగిసిపోయిందని అంతా అనుకుంటున్న వేళ.. కొన్నేళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో ఒక హత్య కేసులో సెర్వెల్లి జైలుకు వెళ్లాడు. అక్కడ తోటి ఖైదీ వెస్లీ జాన్‌పాల్‌తో మాట్లాడుతూ.. 'ఇండియాలో డ్రగ్స్ కేసులో నేను ఎలా తప్పించుకున్నానో తెలుసా? మా కుటుంబం అక్కడి లాయర్లకు లంచం ఇచ్చింది. అసలు అండర్‌వేర్ స్థానంలో చిన్న సైజు అండర్‌వేర్‌ను పెట్టించింది'.. అని మురిసిపోతూ రహస్యం ఊదేశాడు. ఆ ఖైదీ ఈ విషయాన్ని ఆస్ట్రేలియా పోలీసులకు చెప్పడం.. అది ఇంటర్‌పోల్ ద్వారా భారత్‌కు చేరడంతో ఆంటోనీ రాజు పాపం పండింది.

ఫోరెన్సిక్ రిపోర్ట్.. బట్టబయలైన కుట్ర

కేసును పునర్విచారించిన దర్యాప్తు బృందం దిమ్మతిరిగే నిజాలు బయటపెట్టింది. తిరువనంతపురం కోర్టు క్లర్క్‌ను లాయర్ ఆంటోనీ రాజు బుట్టలో వేసుకున్నారు. సాక్ష్యంగా ఉన్న అండర్‌వేర్‌ను 'పొరపాటున తీసుకున్నాను'.. అని చెప్పి 4 నెలలు తన వద్దే ఉంచుకున్నారు. ఒక టైలర్ కంటే అద్భుతంగా, మెషీన్ కుట్లు విప్పేసి, చేతి కుట్లు వేసి దాని పరిమాణాన్ని తగ్గించేశారు. కంపెనీ తయారీ లేబుల్‌ను కట్ చేసి మళ్లీ అతికించారు. ఫోరెన్సిక్ నిపుణులు మైక్రోస్కోప్ కింద పెట్టి చూస్తే తప్ప ఈ తిమ్మినిబమ్మి వ్యవహారం బయటపడలేదు.

పాపం పండింది..

మూడు దశాబ్దాల పాటు ఈ కేసు ఎన్నో మలుపులు తిరిగింది. మధ్యలో ఆంటోనీ రాజు రాజకీయాల్లో ఎదిగారు, మంత్రి అయ్యారు. కానీ సుప్రీంకోర్టు జోక్యంతో విచారణ వేగవంతమైంది. 1990లో కోర్టు వరండాలో రాజు అన్నారట.. 'మేము ఈ కేసులో ఒక బాంబు పెట్టాం, అది ట్రయల్ అయ్యాక పేలుతుంది'.. అని. సరిగ్గా 35 ఏళ్ల తర్వాత ఆ బాంబు ఆయన పదవినే బలి తీసుకుంది. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు ఆంటోనీ రాజును దోషిగా తేలుస్తూ కోర్టు జనవరి 3న తీర్పు చెప్పింది. ఆంటోనీ రాజుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యారు. ఈ మేరకు జనవరి 5న అసెంబ్లీ సెక్రటేరియట్ అధికారిక నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. సాక్ష్యాన్ని మార్చడానికి ఒక లాయర్ వేసిన 'కుట్టు'.. ఆయన రాజకీయ జీవితాన్నే నిలువునా కాటేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

జార్ఖండ్ గ్రామాల్లో ఏనుగు దాడి

2 రోజుల్లో 13 మంది మృతి

చైబాసా: జార్ఖండ్‌లోని గ్రామాల్లో ఏనుగు దాడులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాష్ట్రంలోనిపశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో రెండు రోజుల్లో ఏనుగు చేసిన వేర్వేరు దాడుల్లో 13 మంది మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. దీంతో ఆ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. కొన్ని రోజులుగా గ్రామాల్లో దాడి చేస్తున్న ఏనుగు మంగళవారం రాత్రి నోవాముండి, హత్‌గమారియా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరుగురిని తొక్కి చంపింది. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురున్నారు. అంతకు ముందు రోజు కోల్హన్ ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురితో సహా ఏడుగురి ప్రాణాలను తీసింది. ఏనుగును తిరిగి అడవిలోకి పంపించడానికి పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాకు చెందిన నిపుణులతో కూడిన అటవీ అధికారుల బృందాలు రంగంలోకి దిగాయి.

29 నుంచి పాక్, బంగ్లా మధ్య విమానాలు

ఢాకా: పాకిస్తాన్‌తో ప్రత్యక్ష విమాన సర్వీసులను బంగ్లాదేశ్ పునఃప్రారంభించనుంది. జనవరి 29 నుంచి బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ ఢాకా–కరాచీ మార్గంలో వారానికి రెండుసార్లు సేవలు ప్రారంభించనుంది. గురు, శనివారాల్లో ఢాకా–కరాచీ మార్గంలో ఈ విమానాలు నడవనున్నాయి. ఒక దశాబ్దం తర్వాత రెండు దశాబ్దాల తరువాత నాన్‌స్టాప్ కనెక్టివిటీ పునరుద్ధరించనున్నారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ప్రయాణించేవారు ఎక్కువగా దుబాయ్, దోహా వంటి నగరాల నుంచి అనుసంధాన విమానాలపై ఆధారపడతారు. వాణిజ్యం, పర్యాటకం, విద్య రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు బిమాన్ అధికారులు వెల్లడించారు.

ఇరాన్‌లో ఒకరికి ఉరిశిక్ష

టెహ్రాన్: ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొసాద్‌కు గూఢచర్యం చేసిన ఓ వ్యక్తికి ఇరాన్ ఉరిశిక్ష విధించింది. క్రిప్టో కరెన్సీ రూపంలో బహుమతుల కోసం అలీ అర్దెస్తానీ గూఢచర్యం చేశాడని ఇరాన్ తెలిపింది. మిలియన్ డాలర్ల విలువైన బహుమతుల తోపాటు బ్రిటిష్ వీసాకోసం గూఢచర్యం చేసినట్లు అలీ అంగీకరించాడని పేర్కొంది. ఇజ్రాయెల్ అలీ అర్దెస్తానీని ఆన్‌లైన్‌లో సంప్రదించగా, ఆయన కొన్ని రహస్య ప్రాంతాల చిత్రాలు, ఫుటేజ్‌ను మొసాద్ ఏజెంట్లకు ఇచ్చాడని తెలిపింది.

పెళ్లి పేరుతో గిరిజన మహిళ అమ్మకం

మహారాష్ట్రలో నలుగురిపై కేసు నమోదు

పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పెళ్లి పేరుతో గిరిజన మహిళను రూ.3 లక్షలకు అమ్మేశారు. 20 ఏళ్ల గిరిజన మహిళను అమ్మి, పెళ్లి చేసుకోవాలంటూ బలవంతం చేసిన నలుగురిపై కేసు నమోదు చేశారు. 2024 మే నెలలో నాసిక్‌కు చెందిన ఓ వ్యక్తి, అతని తల్లి మధ్య వర్తులకు రూ.3లక్షలు చెల్లించారని, దీంతో వారు తనను బలవంతంగా తీసుకెళ్లి పెళ్లి జరిపించారని కట్కరీ వర్గానికి చెందిన మహిళ పాల్ఘర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త కుటుంబం తనను శారీరకంగా, మానసికంగా హింసించడంతోపాటు కులం పేరుతో దూషించారని తెలిపింది. గర్భవతిగా ఉన్నప్పుడు భర్త తనపై దాడి చేశాడని, సమయానికి భోజనం పెట్టకుండా వేధించాడని ఆమె ఆరోపించింది. కుమారుడు పుట్టిన తర్వాత 2025 జూన్‌లో తల్లి ఇంటికి తిరిగి వచ్చానని, జనవరి 6న తన బిడ్డను బలవంతంగా తీసుకెళ్లడానికి ప్రయత్నించారని పోలీసులకు తెలిపింది. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ/ఎస్టీ కేసు నమోదు చేశారు.

ఫిలిప్పీన్స్‌లో అగ్నిపర్వతం పేలుడు

3వేల మందిని ఖాళీ చేయించిన అధికారులు

మనీలా: ఫిలిప్పీన్స్‌లోని అత్యంత చురుకైన అగ్నిపర్వతం మాయోన్ వద్ద స్వల్ప పేలుళ్లు సంభవించాయి. వరుస పేలుళ్లతో పర్వత ప్రాంతంలోని ప్రమాదంలో ఉన్న గ్రామాల నుంచి 3వేల మందిని అధికారులు బుధవారం ఖాళీ చేయించారు. ఇటీవలి కాలంలో అగ్ని పర్వతం నుంచి కార్లంత పెద్ద రాళ్లు, ప్రాణాంతకమైన పైరోక్లాస్టిక్ ప్రవాహం, సూపర్–హాట్ రాతి శకలాలు, బూడిదను గుర్తించిన అధికారులు అల్బేలోని అగ్నిపర్వతం చుట్టూ హెచ్చరిక స్థాయిని పెంచారు.

అశ్లీల కంటెంట్‌ను అరికడతాం

వివరణ ఇచ్చిన 'గ్రోక్' యాజమాన్యం

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమం 'ఎక్స్'కు సంబంధించిన కృత్రిమ మేధ(ఏఐ) గ్రోక్ చాట్‌బాట్‌లోని అసభ్యకర కంటెంట్‌పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది కలిగించే అంశాలు ఇందులో ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పార్లమెంట్ సభ్యులు సైతం దీనిపై స్పందించారు. గ్రోక్ చాట్‌బాట్ దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని కేంద్ర ఐటీ శాఖ గ్రోక్ యాజమాన్యాన్ని ఆదేశించింది. అభ్యంతకర, అశ్లీల కంటెంట్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని పేర్కొంది. దాంతో సదరు యాజమాన్యం బదులిచ్చింది. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేసింది. అయితే, దీనిపై ఐటీ శాఖ సంతృప్తి చెందలేదు. మరిన్ని వివరాలు సమర్పించాలని పేర్కొంది. అందుకు బుధవారం సాయంత్రం 5 గంటల దాకా గడువు విధించింది. గడువులోగా గ్రోక్ యాజయాన్యం ప్రతిస్పందించింది. భారతదేశ చట్టాలను, ప్రభుత్వ మార్గదర్శకాలను గౌరవిస్తున్నామని స్పష్టంచేసింది. భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అని వెల్లడించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారం, అభ్యంతరకర అంశాలు, అశ్లీల ఫోటోలను ఎవరూ వ్యాప్తి చేయకుండా కఠిన చర్యలు చేపడతామని పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో ఆగని దాడుల పర్వం

- దొంగతనం ఆరోపణలపై హిందూ యువకుడిని తరిమిన మూక
- భయంతో కాలువలో దూకి మునిగి చనిపోయిన యువకుడు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా బతుకీడుస్తున్న హిందువులపై దాడుల పరంపర ఆగట్లేదు. వరసబెట్టి జరుగుతున్న దాడులకు తోడుగా మంగళవారం మరో హిందూ యువకుడిని ఆగంతకులు పరోక్షంగా అంతమొందించారు. ఉత్తర బంగ్లాదేశ్‌లోని నౌగావ్ జిల్లాలోని మహదేవ్‌పూర్ పట్టణంలో పాతికేళ్ల మిథున్ సర్కార్‌ను మంగళవారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వెంటబడ్డారు. దొంగతనం చేశాడని ఆరోపిస్తూ కొట్టి చంపే ప్రయత్నంచేశారు. దీంతో ప్రాణభయంతో మిథున్ దగ్గర్లోని కాలువలో దూకాడు. దీంతో మునిగిపోయి చనిపోయాడు. విషయం తెల్సి బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తంచేసింది. మైనారిటీలపై దాడులను ప్రభుత్వం ఇకనైనా అడ్డుకోవాలని, బాధ్యులను శిక్షించాలని యూనిటీ కౌన్సిల్ అధికార ప్రతినిధి కాజోల్ దేబ్‌నాథ్ డిమాండ్‌చేశారు.

మీరు ముఖం చూపించకుంటే మేం నగలు కూడా చూపించం

చోరీల వేళ దొంగలను గుర్తించేందుకు బిహార్ నగల వ్యాపారుల కొత్త ఎత్తుగడ

పట్నా: హిజాబ్, మాస్క్, ముఖాన్ని దాచే మరేదైనా తరహా వస్త్రంతో బంగారం దుకాణంలోకి వచ్చి ఆభరణాలను కొనుగోలుచేస్తామంటే వాళ్లకు బంగారునగలు విక్రయించబోమని బిహార్ నగరవ్యాపారులు తెగేసి చెప్పారు. హిజాబ్, మాస్క్ వంటివి ధరించి వచ్చిన మహిళలు, వ్యక్తులు దొంగతనాలకు పాల్పడిన సందర్భాల్లో సీసీటీవీల్లో చూసి తర్వాత వారిని గుర్తించడం చాలా కష్టంగా మారిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖిలభారత ఆభరణాలు, స్వర్ణకారుల సమాఖ్య(ఏఐజేజీఎఫ్) బిహార్ శా ప్రకటించింది. ఈ మేరకు ఏఐజేజీఎఫ్ బిహార్ విభాగ అధ్యక్షుడు అశోక్ వర్మ బుధవారం పట్నాలో మీడియాతో మాట్లాడారు. ''ముఖం కన్పించకుండా హిజాబ్, మాస్క్ వంటివి ధరించి నగల దుకాణంలోకి వచ్చిన వారికి మేం నగలను ప్రదర్శించబోం. ముఖం చూపిస్తేనే మేం నగలను చూపిస్తాం. మా నగల, కస్టమర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయానికొచ్చాం'' అని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో ముఖం కన్పించకుండా, వినియోగదారుల్లా దుకాణాల్లోకి అడుగుపెట్టిన పలువురు దొంగలు కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను చాకచక్యంగా కొట్టేయడం తెల్సిందే. తర్వాత సీసీటీవీల్లో పోలీసులు, నగల వ్యాపారులు పరిశీలించినా దొంగలను గుర్తుపట్టలేని పరిస్థితి దాపురించింది.

రాజ్యాంగ రచనకు అనుసరించిన పద్ధతి?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగ రచన - రాజ్యాంగ పరిషత్తు

రాజ్యాంగ అమలు తేది

జనవరి 26ను రాజ్యాంగ అమలు తేదీగా నిర్ణయించడానికి చారిత్రక నేపథ్యం ఉంది. నెహ్రూ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ 'లాహోర్ సమావేశం'(1929 డిసెంబర్ 31) జనవరి 26ను పూర్ణ స్వరాజ్య దినోత్సవంగా ప్రకటించింది. ఆ సంఘటనకు గుర్తుగా జనవరి 26ను అమలు తేదీగా నిర్ణయించారు.

రాజ్యాంగ పరిషత్తు ఇతర విధులు

భారత రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగ రచనతోపాటు కొన్ని సాధారణ చట్టాలను కూడా రూపొందించి ఆమోదించింది. అందులోని ముఖ్యాంశాలు.

- 1947 జూలై 22న జాతీయ జెండాను ఆమోదించింది.
- రాజ్యాంగ పరిషత్తు కేంద్ర శాసనసభగా కూడా పనిచేసింది. స్వతంత్ర శాసనసభగా 1947 నవంబర్ 17న సమావేశమై మొదటి స్పీకర్‌గా జి.వి.మౌలాంకర్‌ను ఎన్నుకుంది.
- భారత రాజ్యాంగ పరిషత్తు చిహ్నంగా ఏనుగును గుర్తించింది.
- దేవనాగరి లిపిలో ఉన్న హిందీని కేంద్ర ప్రభుత్వ భాషగా 1949 సెప్టెంబర్ 14న ఆమోదించింది.
- కామన్‌వెల్త్‌లో భారత సభ్యత్వాన్ని 1949 మే నెలలో ధ్రువీకరించింది.
- తొలి రాష్ట్రపతిగా రాజేంద్రప్రసాద్‌ను 1950 జనవరి 24న ఎన్నుకుంది (అప్పటి వరకు ఎన్నికైన పార్లమెంటు ఏర్పడలేదు కాబట్టి).
- 1950 జనవరి 24న జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించింది.

సబ్ కమిటీలు

కమిటీ పేరు	చైర్మన్
ప్రాథమిక హక్కుల ఉప కమిటీ	జె.బి. కృపలాని
మైనారిటీల సబ్ కమిటీ	హెచ్.సి.ముఖర్జీ
ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ	గోపినాథ్ బోర్డోలాయ్
ప్రత్యేక ప్రాంతాల కమిటీ	ఎ.వి.టక్కర్

రాజ్యాంగ రచనకు అనుసరించిన పద్ధతి

రాజ్యాంగ రచనలో పరిషత్తు ఏ అంశాన్నీ ఓటింగ్ ద్వారా ఆమోదించలేదు. ప్రతి ప్రతిపాదనను, సమస్యను సుదీర్ఘంగా చర్చించి సర్దుబాటు, సమన్వయం లేదా ఏకాభిప్రాయ సాధన ద్వారా పరిష్కరించిందని ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణులు 'గ్రాన్‌విలె ఆస్టిన్' పేర్కొన్నారు.

సమ్మతి పద్ధతి (Consensus)

ఒక సమస్య లేదా ప్రతిపాదన వచ్చినప్పుడు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా దాదాపు అందరు సభ్యులు ఒప్పుకునేలా చేసే పద్ధతి. ఈ పద్ధతి ద్వారా సమాఖ్య వ్యవస్థ,ప్రాంతాల ప్రత్యేకత, భాషకు సంబంధించిన అంశాలను పరిష్కరించారు.

సమన్వయ పద్ధతి (Accommodation)

ఒక సమస్యపై మధ్యే మార్గాన్ని సాధించడం. పరస్పర వ్యతిరేక వాదనలు ఉన్నప్పుడు సుదీర్ఘంగా చర్చించి గుణ దోషాలపై వివేచనతో, తర్కబద్ధంగా ఒక అభిప్రాయానికి రావడం. భారత రాజ్యాంగంలోని చాలా అంశాలను ఈ పద్ధతి ద్వారానే అంగీకరించారు.

రాజ్యాంగం - ముఖ్య ఆధారాలు

భారత రాజ్యాంగ రచనపై ఆనాటి ప్రపంచ రాజ్యాంగాల ప్రభావం గణనీయంగా ఉంది. వివిధ దేశాల్లోని రాజ్యాంగాల్లో ఉన్న ఉత్తమ లక్షణాలను స్వల్ప మార్పులతో రాజ్యాంగంలో పొందుపరిచారు. అందుకే భారత రాజ్యాంగాన్ని 'అతుకుల బొంత' అంటారు. మన రాజ్యాంగానికి అత్యంత ముఖ్యమైన ఆధారం భారత ప్రభుత్వ చట్టం–1935. అందుకే రాజ్యాంగాన్ని '1935 చట్టానికి నకలు'గా అభివర్ణిస్తారు.

భారత రాజ్యాంగంలో మౌలికాంశాలు

భారత రాజ్యాంగంలో కింది లక్షణాలను స్వతహాగా ఏర్పాటు చేసుకున్నాం.

- రాష్ట్రపతిని ఎన్నుకునే నియోజక గణం
- పంచాయతీరాజ్ వ్యవస్థ
- అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక హక్కులు.
- రక్షిత వివక్షత
- ఆర్థిక సంఘం, కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, భాషా సంఘాలకు సంబంధించిన ప్రత్యేకాంశాలు.
- ఏకీకృత సమగ్ర న్యాయ వ్యవస్థ
- అఖిల భారత సర్వీసులు
- ఏక పౌరసత్వం

రాజ్యాంగ పరిషత్తు–అదనపు, విశిష్ట సమాచారం

- రాజ్యాంగ పరిషత్తు రచనకు అయిన ఖర్చు – రూ. 64 లక్షలు.
- భారత రాజ్యాంగానికి ఆధార రాజ్యాంగాల సంఖ్య – 60
- రాజ్యాంగ పరిషత్తులో నామినేటెడ్ సభ్యుల సంఖ్య – 15. ముఖ్య నామినేటెడ్ సభ్యులు.. సర్వేపల్లి రాధాకృష్ణన్, కె.టి.షా
- రాజ్యాంగ పరిషత్తులో సభ్యులు కానివారు – బి.యన్.రావు, ఎస్.వరదాచారియర్, హెచ్.వి.కామత్.
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అని అభివర్ణించింది– అనంత శయనం అయ్యంగార్
- బి.ఆర్.అంబేద్కర్‌ను 'నైపుణ్యం ఉన్న పైలెట్'గా పేర్కొంది– డాక్టర్ రాజేంద్రప్రసాద్
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గోపాలస్వామి అయ్యంగార్, అల్లాడి క్రిష్ణస్వామి అయ్యర్, బి.ఎన్.రావును 'పెట్టీ ఫోరం' అంటారు.
- డాక్టర్ బి.ఎన్.రావును 'రాజ్యాంగ పరిషత్తుకు స్నేహితుడు, మార్గదర్శి, తత్వవేత్త'గా పేర్కొంటారు.
- రాజ్యాంగ పరిషత్తులో ఎక్కువ సవరణలు ప్రతిపాదించింది –హెచ్.వి.కామత్.
- రాజ్యాంగ పరిషత్తుకు కార్యదర్శిగా వ్యవహరించింది – హెచ్.బి.అయ్యంగార్
- రాజ్యాంగ పరిషత్తులో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించినవారు – సోమనాథ్ లహరి
- రాజ్యాంగ విధులను నిర్వర్తించే సమయంలో మాత్రమే డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించారు.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా శాసన విధులు నిర్వహించినప్పుడు జి.వి.మౌలాంకర్ స్పీకర్‌గా వ్యవహరించారు. అనంత శయనం అయ్యంగార్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు.
- రాజ్యాంగ పరిషత్తును ఉద్దేశించి చివరిగా బ్రిటిష్ గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ మాట్లాడారు.
- రాజ్యాంగ రచన కాలీగ్రాఫర్ – ప్రేమ్ బెహారి నారాయిణ్ రైజ్దా. రాజ్యాంగానికి, ప్రవేశికకు ఆర్ట్ వర్క్ చేసింది – నందన్ లాల్ బోస్.
- హన్సా మెహతా భారత జాతీయ పతాకాన్ని రాజ్యాంగ పరిషత్తులో సమర్పించారు.
- మౌలిక రాజ్యాంగ ప్రతిని పార్లమెంట్ గ్రంథాలయంలో భద్రపరిచారు. మౌలిక రాజ్యాంగంలో 230 పేజీలు ఉన్నాయి.

రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

సమావేశాలు	కాలం	పని విధానం - దశలు
మొదటి సమావేశం	1946 డిసెంబర్ 09–23	I. ఈ దశలో రాజ్యాంగ రచన విధుల్ని నిర్వర్తించింది.
రెండో సమావేశం	1947 జనవరి 20–25	
మూడో సమావేశం	1947 ఏప్రిల్ 28–మే 02	
నాలుగో సమావేశం	1947 జూలై 14–31	
అయిదో సమావేశం	1947 ఆగస్టు 14–30	
ఆరో సమావేశం	1948 జనవరి 27	
ఏడో సమావేశం	1948 నవంబర్ 4 నుంచి 1949 జనవరి 08	II. రాజ్యాంగ రచన విధులతో పాటు తాత్కాలిక పార్లమెంటు విధులను కూడా నిర్వర్తించింది.
ఎనిమిదో సమావేశం	1949 మే 16 – జూన్ 16	
తొమ్మిదో సమావేశం	1949 జూలై 30 – సెప్టెంబర్ 18	
పదో సమావేశం	1949 అక్టోబర్ 6–17	
పదకొండో సమావేశం	1949 నవంబర్ 14–26	III. 1949 నుంచి 1952 వరకు కేవలం తాత్కాలిక పార్లమెంటు విధులను మాత్రమే నిర్వర్తించింది.

ముఖ్య ప్రపంచ రాజ్యాంగాల రచనా కాలం- తులనాత్మక పరిశీలన

దేశం	ప్రకరణల సంఖ్య	రచనకు పట్టిన కాల వ్యవధి
అమెరికా	7	నాలుగు నెలల కంటే తక్కువ కాలం
కెనడా	147	2 సంవత్సరాల 6 నెలలు
ఆస్ట్రేలియా	126	9 సంవత్సరాలు
దక్షిణాఫ్రికా	153	1 సంవత్సరం
భారతదేశం	395	2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు

రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం పనితీరుపై విమర్శ

- రాజ్యాంగ పరిషత్తు సార్వభౌమ సంస్థ కాదు. ప్రజలకు నేరుగా ప్రాతినిధ్యం వహించలేదు. కేవలం 28 శాతం జనాభాకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది.
- ప్రజలు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధం కల్పించింది.
- స్వదేశీ సంస్థానాల ప్రతినిధులు నామినేషన్ పద్ధతి ద్వారా సభ్యత్వం పొందడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం.
- రాజ్యాంగ పద్ధతిలో ఒక వర్గం (హిందువులు) ఆధిపత్యం ఉండేదని పాశ్చాత్య రచయితల అభిప్రాయం.

ఆధారం	గ్రహించిన అంశాలు
1935 చట్టం	కేంద్ర, రాష్ట్రాలతో సమాఖ్య వ్యవస్థ, ఫెడరల్ కోర్టు, రాష్ట్రపతి పాలన (ఆర్టికల్ 356), గవర్నర్ పదవి, విచక్షణాధికారాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, ఇతర పరిపాలన అంశాలు.
బ్రిటిష్ రాజ్యాంగం	పార్లమెంటు/కేబినెట్ తరహా పాలనా పద్ధతి, ద్విసభా పద్ధతి, సమన్యాయ పాలన, శాసన నిర్మాణ ప్రక్రియ, శాసన సభ్యుల స్వాధికారాలు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్, అటార్నీ జనరల్ మొదలైన పదవులు, రిట్లు జారీచేసే విధానం.
అమెరికా రాజ్యాంగం	ప్రాథమిక హక్కులు, న్యాయసమీక్ష, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయశాఖ, ఉప రాష్ట్రపతి రాజ్యసభకు చైర్మన్‌గా వ్యవహరించడం, రాష్ట్రపతిని తొలగించే మహాభియోగ తీర్మానం, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రాలు ఆమోదం తెలపడం.
కెనడా	బలమైన కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ నియామక పద్ధతి. రాజ్యాంగం అవశిష్ట అధికారాలను కేంద్రానికి ఇవ్వడం, ఆర్టికల్ 143 ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం.
ఐర్లాండ్ రాజ్యాంగం	ఆదేశిక సుత్రాలు, రాష్ట్రపతిని ఎన్నుకునే నైష్పత్తిక ప్రాతినిధ్యం, ఓటు బదిలీ పద్ధతి, రాజ్యసభకు విశిష్ట సభ్యుల నియామకం.
వైమార్ రిపబ్లిక్(జర్మనీ)	జాతీయ అత్యవసర పరిస్థితి, ప్రాథమిక హక్కులను రద్దుచేసే అధికారం మొదలైనవి. (వైమార్ అనేది జర్మనీ దేశ రాజ్యాంగ పరిషత్తు సమావేశమైన నగరం).
ఆస్ట్రేలియా	ఉమ్మడి జాబితా, పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశం (బిల్లు ఆమోదం విషయంలో వివాదం తలెత్తితే), వాణిజ్య, వ్యాపార లావాదేవీలు, అంతర్రాష్ట్ర వ్యాపారం.
దక్షిణాఫ్రికా	రాజ్యాంగ సవరణ విధానం, రాజ్యసభ సభ్యుల ఎన్నిక పద్ధతి.
ఫ్రాన్స్	గణతంత్ర విధానం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, తాత్కాలిక సభాధ్యక్షుల నియామకం.
రష్యా	ప్రాథమిక విధులు, దీర్ఘకాలిక ప్రణాళిక, సామ్యవాద సూత్రాలు.
జపాన్	నిబంధన 21లో పేర్కొన్న చట్టం నిర్దేశించిన పద్ధతి.
స్విట్జర్లాండ్	ప్రధాని, మంత్రిమండలి మధ్య సమష్టి బాధ్యత.

ఉప్పు కలిపితే ఉత్తమ విద్యుత్ వాహకంగా మారే నీరు!

లైటెనింగ్ కండక్టర్ల ద్వారా పిడుగు బారి నుంచి ఇళ్లు, కట్టడాలను రక్షించడానికి కావాల్సిన ఏర్పాటు చేస్తారు. ఇందులో ఒక లోహపు కడ్డీని ఇంటి పైభాగంలో అమర్చుతారు. దీన్ని తీగ ద్వారా భూమికి కలుపుతారు. పిడుగు పడే సమయంలో అక్కడికి వచ్చిన ఆవేశాలను లోహపు కడ్డీ గ్రహించి వాటిని భూమిలోకి పంపిస్తుంది. ఈ ఆవేశాలు భూమిలో ఉండే వ్యతిరేక ఆవేశాలతో కలిసి తటస్థమవుతాయి.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

విద్యుత్

విద్యుత్ అనేది ఆవేశాల వల్ల జనించే శక్తి స్వరూపం. దీని గురించి మొదటిసారిగా క్రీ.పూ. 600 ఏళ్ల కిందట 'ఏథెన్స్' (గ్రీస్ రాజధాని) పట్టణంలో ఏడుగురు మేధావులు పరిశోధన చేశారు. పరిశోధనల్లో భాగంగా వీరు 'అంబర్' అనే ఒక రాయిని జంతు చర్మంతో కొంతసేపు రాపిడి చేసినప్పుడు (రుద్దడం) వాటి ఉపరితలాలపై వ్యతిరేక ఆవేశాలు ఏర్పడతాయని, అవి పరస్పరం ఆకర్షించుకుంటాయని తెలుసుకున్నారు.

విద్యుత్ గురించి తొలిసారిగా 16వ శతాబ్దంలో విలియం గిల్‌బర్ట్ శాస్త్రీయ పరిశోధన చేశాడు. ఆ తర్వాత అనేక మంది శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు.

విద్యుత్ ఆవేశం: విద్యుత్ ఆవేశాన్ని Q అనే అక్షరంతో సూచిస్తారు. దీన్ని 'కూలుంబ్' ప్రమాణాల్లో కొలుస్తారు.

$Q = ne$

n = ఎలక్ట్రాన్ల సంఖ్య

e = ఎలక్ట్రాన్ ఆవేశం

$= -1.602 \times 10^{-19}$ కూలుంబ్స్

- ధనావేశాలు, రుణావేశాలు సమానంగా ఉన్న ఏ వస్తువునైనా విద్యుత్ దృష్ట్యా 'తటస్థ ఆవేశ పదార్థం' అంటారు. ఇలాంటి పదార్థాలను తాకినప్పుడు ఎలాంటి 'షాక్' కలుగదు.
- బెంజిమన్ ఫ్రాంక్లిన్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా విద్యుత్ ఆవేశాలను ధనావేశాలు, రుణావేశాలుగా విభజించారు. వీటిలో సజాతి ఆవేశాలు వికర్షించుకుంటాయి, విజాతి ఆవేశాలు ఆకర్షించుకుంటాయి.

అనువర్తనాలు

- ఒక సబ్బు బుడగ ఉపరితలంపై సజాతి ఆవేశాలను ఇచ్చినప్పుడు అవి పరస్పరం వికర్షించుకొని, ఒకదాని నుంచి మరొకటి దూరం వెళ్లడం వల్ల ఆ బుడగ పరిమాణం పెరుగుతుంది.
- ఒక వస్తువు ఉపరితలంపై కొంత ఆవేశాన్ని ఇచ్చినప్పుడు అది ఆ వస్తువు మూలలు లేదా శీర్ష భాగాల వద్ద కేంద్రీకృతమవుతుంది. ఈ ధర్మం ఆధారంగా బెంజిమన్ ఫ్రాంక్లిన్ పిడుగు బారి నుంచి ఇళ్లు, కట్టడాలను రక్షించడానికి కావాల్సిన 'లైటెనింగ్ కండక్టర్స్' కనుగొన్నాడు.
- ఒక బోలు వస్తువు లోపల ఇచ్చిన ఆవేశం ఆ వస్తువు ఉపరితలం పైకిచేరి స్థిరత్వం పొందుతుంది. కాబట్టి పిడుగు పడే సమయంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి తనను తాను రక్షించుకోవడానికి ఆ కారు లోపలే ఉండాలి. కారు అనేది లోపల ఖాళీగా ఉన్న ఒక బోలు వస్తువు లాంటిది. దానిపై పతనమైన ఆవేశం ఆ కారు ఉపరితలంపై మాత్రమే స్థిరత్వం పొందుతుంది. కారు లోపలికి చొచ్చుకువెళ్లదు.

గమనిక: భూమిలో అనంత సంఖ్యలో ధన, రుణ ఆవేశాలు ఉంటాయి. కాబట్టి భూమి ఎన్ని ఆవేశాలనైనా ఇవ్వగలుగుతుంది లేదా తీసుకోగలుగుతుంది. అందువల్ల విద్యుత్ దృష్ట్యా భూమిని 'ఎలక్ట్రికల్ సింక్' అంటారు.

విద్యుత్‌లో రకాలు

సాధారణంగా విద్యుత్‌ను రెండు రకాలుగా విభజించవచ్చు.

1. **స్థిర (స్థావర) విద్యుత్:** ఒక వస్తువు ఉపరితలంపై స్థిరంగా ఉన్న ఆవేశాల వల్ల కలిగే విద్యుత్‌ను 'స్థిర లేదా స్థావర విద్యుత్' అంటారు. ఇలాంటి విద్యుత్‌ను జిరాక్స్ చేసే సాధనాల్లో ఉపయోగిస్తారు.
2. **ప్రవాహ విద్యుత్:** ఒక తీగ ద్వారా ప్రవహిస్తున్న ఆవేశాల ప్రవాహ రేటును 'ప్రవాహ విద్యుత్' అంటారు.

ప్రవాహ విద్యుత్ [I] =

ఆవేశాల సంఖ్య [Q] పట్టిన కాలం [T]

ప్రమాణం: ఆంపియర్.

ప్రవాహ విద్యుత్‌ను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ఎ) **ఏకాంతర విద్యుత్ (ఆల్టర్‌నేట్ కరెంట్):** ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు.. ఆ ప్రవాహ దిశ ధనాత్మకం నుంచి రుణాత్మకం, రుణాత్మకం నుంచి ధనాత్మకానికి ఏకాంతరంగా మారుతూ ఉంటే దాన్ని 'ఏకాంతర విద్యుత్' అంటారు. ఇలాంటి విద్యుత్‌ను గృహావసరాలకు, వ్యవసాయ, పరిశ్రమల రంగాల్లో ఉపయోగిస్తారు.

బి) **ఏకముఖ విద్యుత్ (డైరెక్ట్ కరెంట్):** ఒక తీగ ద్వారా ప్రవహిస్తున్న విద్యుత్ ప్రవాహం ఎల్లప్పుడూ ఒకే దిశలో ఉంటే దాన్ని 'ఏకముఖ విద్యుత్' అంటారు. ఇలాంటి విద్యుత్‌ను మనం ఘటాల నుంచి పొందుతున్నాం.

ఏకాంతర విద్యుత్‌ను ఏకముఖ విద్యుత్‌గా మార్చడాన్ని ధిక్కారం అంటారు. దీని కోసం ఉపయోగించే పరికరాన్ని 'ధిక్కారి' అంటారు.

ఉదా: మొబైల్ ఫోన్ చార్జర్.

పదార్థాలు - రకాలు

ఆవేశాలను (విద్యుత్‌ను) తమ ద్వారా ప్రసారం చేసే ధర్మం ఆధారంగా మనకు లభిస్తున్న పదార్థాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **విద్యుత్ వాహకాలు:** ఈ పదార్థంలో స్వేచ్ఛగా చలించగలిగే ఎలక్ట్రాన్లు ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. అందువల్ల ఇవి తమ ద్వారా విద్యుత్ ప్రవాహానికి అనుమతి ఇస్తాయి. మనకు లభిస్తున్న పదార్థాలన్నింటిలో.. ముఖ్యంగా లోహాలతో పోల్చినప్పుడు అత్యుత్తమ విద్యుత్ వాహక పదార్థం 'వెండి' (అత్యుత్తమ ఉష్ణ వాహక పదార్థం కూడా ఇదే). ఆ తర్వాత రాగి, అల్యూమినియం, ఇనుము, ఉప్పు మొదలైనవి ఉంటాయి.
   - ద్రవ పదార్థాల్లో పాదరసం, సాధారణ నీరు మంచి విద్యుత్ వాహకాలుగా పని చేస్తాయి. సాధారణ నీరు విద్యుత్ విశ్లేషణం చెంది H^+, OH^- అయానులుగా మారడం వల్ల అది విద్యుత్ వాహకంగా పనిచేస్తుంది. ఈ నీటికి కొంత పరిమాణంలో ఉప్పు కలిపితే అది మరింత ఉత్తమమైన విద్యుత్ వాహక పదార్థంగా మారుతుంది.
   - మంచు, మానవ శరీరం కూడా విద్యుత్ వాహకాలుగా పనిచేస్తాయి.
2. **విద్యుత్ బంధకాలు:** ఈ పదార్థాల్లో స్వేచ్ఛగా చలించే ఎలక్ట్రాన్ల సంఖ్య దాదాపు శూన్యం. కాబట్టి ఈ పదార్థాల ద్వారా విద్యుత్ ప్రవాహం జరగదు.

   ఉదా: మనకు లభిస్తున్న పదార్థాల్లో అత్యుత్తమ విద్యుత్ బంధకం వజ్రం (అత్యుత్తమ ఉష్ణ బంధకం కూడా ఇదే). ఆ తర్వాత
   - PVC (పాలీ వినైల్ క్లోరైడ్), ప్లాస్టిక్, రబ్బరు, పొడిగా ఉన్న చెక్కదిమ్మ, శుద్ధమైన నీరు, సాధారణ పీడనం వద్ద మన చుట్టూ ఉన్న గాలి విద్యుత్ బంధకాలుగా పని చేస్తాయి.
   - స్వచ్ఛమైన నీటిలో ఉండే H_2O అణువులు విద్యుత్ విశ్లేషణం చెందవు. కాబట్టి ఈ నీటి విద్యుత్ నిరోధం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల స్వచ్ఛమైన నీటికి బంధక ధర్మం ఉంటుంది.
3. **అర్ధ వాహకాలు:** ఈ పదార్థాల్లో స్వేచ్ఛగా చలించే ఎలక్ట్రాన్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. అందువల్ల అర్ధ వాహకాల విద్యుత్ వాహకత్వం విద్యుత్ వాహకాల కంటే తక్కువగా, బంధకాల కంటే ఎక్కువగా ఉంటుంది. అంటే ఈ విద్యుత్ వాహకాల వాహకత్వం వాహకాలకు, బంధకాలకు మధ్యస్థంగా ఉంటుంది.

   ఉదా: మనకు లభిస్తున్న పదార్థాలన్నింటిలో సిలికాన్ అత్యుత్తమ అర్ధ వాహక పదార్థం. జెర్మేనియం, సెలీనియం కూడా అర్ధవాహకాలుగా పనిచేస్తాయి.
   - **సిలికాన్:** భూమి ఉపరితలంపై సిలికాన్ (Si) అనేది ఇసుక, రాళ్లలో 'సిలికాన్ డై ఆక్సైడ్' (SiO_2) రూపంలో ఎక్కువగా లభిస్తుంది.
   - కంప్యూటర్లలో ఉపయోగించే ఇంటిగ్రేటెడ్ చిప్ (IC)లను 'సిలికాన్'తో తయారు చేస్తారు. అందువల్ల దీన్ని 'సిలికాన్ చిప్' అని కూడా అంటారు. ఈ చిప్‌ను అమెరికాలోని 'బెల్ లేబొరేటరీ' అభివృద్ధి చేసింది.
   - మనదేశంలో కంప్యూటర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్న బెంగళూరు నగరాన్ని 'సిలికాన్ సిటీ'(లేదా)'సిలికాన్ వ్యాలీ'గా పేర్కొంటారు.
   - సౌరశక్తిని విద్యుత్ శక్తిగా మార్చే 'ఫొటో వోల్టాయిక్' (సౌర ఘటాలను) సిలికాన్‌తో తయారు చేస్తారు. ఈ పద్ధతిని 1954లో అమెరికాకు చెందిన బెక్వెరల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు.
   - అంతరిక్షంలో పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల్లో సిలికాన్ పలకలను అమర్చుతారు. ఈ పలకలు వాటికి కావాల్సిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి అందిస్తాయి.

గమనిక: ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్‌కు 75 కి.మీ. దూరంలో ఉన్న సాంబార్ సరస్సు వద్ద ప్రపంచంలో అతిపెద్ద 'సోలార్ ప్లాంట్'ను నిర్మిస్తున్నారు. దీని విద్యుత్ సామర్థ్యం 4000 MW.

- 1000 MW సామర్థ్యం ఉన్న సౌరవిద్యుత్ ప్లాంట్‌ను తెలంగాణలోనూ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎలక్ట్రిక్ పొటెన్షియల్

విద్యుత్ వలయంలో ఏదైనా ఒక బిందువు వద్ద ఉన్న ఆవేశాల సంఖ్య, వాటి స్థితి గురించి ఎలక్ట్రిక్ పొటెన్షియల్ తెలియజేస్తుంది. ఆవేశాల సంఖ్య తక్కువగా ఉంటే ఎలక్ట్రిక్ పొటెన్షియల్ తక్కువగా ఉంటుంది.

ప్రమాణం: ఎలక్ట్రిక్ పొటెన్షియల్‌లోని తేడాను కొలవడానికి ఉపయోగించే ప్రమాణం – వోల్ట్ (V).

- ధనావేశాలు ఎల్లప్పుడూ అధిక పొటెన్షియల్ నుంచి అల్ప పొటెన్షియల్ వైపు ప్రవహిస్తాయి. ఇవి ప్రవహించే దిశను విద్యుత్ ప్రవాహ దిశగా తీసుకుంటారు.
- రుణావేశితాలైన ఎలక్ట్రానులు అల్ప పొటెన్షియల్ నుంచి అధిక పొటెన్షియల్ వైపు ప్రవహిస్తాయి.
- మన దేశంలో గృహావసరాల కోసం వినియోగిస్తున్న విద్యుత్‌ను 220V వద్ద సరఫరా చేస్తున్నారు. ఈ వోల్టేజీ వద్ద గృహంలోని పరికరాలన్నీ (ట్యూబ్‌లైట్, ఫ్యాన్, రిఫ్రిజిరేటర్ మొదలైనవి) పని చేస్తున్నాయి. 220V కంటే ఎక్కువ వోల్టేజ్ ఉంటే దాన్ని 'హై వోల్టేజ్'గా, తక్కువగా ఉంటే 'లో వోల్టేజ్'గా పేర్కొంటారు.
- ఈ వోల్టేజ్‌ను ఎల్లప్పుడూ ఒక స్థిర బిందువు వద్ద స్థిరీకరించడానికి 'స్టెబిలైజర్' అనే సాధనాన్ని ఉపయోగిస్తారు.
- ఈ వోల్టేజ్ వద్ద ఏకాంతర విద్యుత్ పౌనపున్యం 50 Hz గా ఉంటుంది.
- భూమిలో అనంతమైన సంఖ్యలో ధన, రుణావేశాలు ఉంటాయి. కాబట్టి భూమికి అదనంగా ఆవేశాన్ని అందించినా లేదా భూమి నుంచి ఆవేశాలను సంగ్రహించినా దాని పొటెన్షియల్‌లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ కారణం వల్ల భూమి నికర పొటెన్షియల్ లేదా ఫలిత పొటెన్షియల్‌ను '0'గా పరిగణిస్తారు.

$$V = 0$$

ఓమ్ నియమం

స్థిర ఉష్ణోగ్రత వద్ద ఒక లోహపు తీగ ద్వారా ప్రవహిస్తున్న విద్యుత్ ప్రవాహం దానికి అనువర్తింపజేసిన విద్యుత్ పొటెన్షియల్‌కు అనులోమానుపాతంలో ఉంటుంది.

$$i \propto V$$

$$\Rightarrow i = \frac{1}{R} V$$

$\Rightarrow V = iR$ లేదా $R = \frac{V}{i}$

పై సమీకరణంలో Rను విద్యుత్ నిరోధం అంటారు.

విద్యుత్ నిరోధం: ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవాహాన్ని వ్యతిరేకించే పదార్థ స్వభావాన్నే 'విద్యుత్ నిరోధం' అంటారు.

ప్రమాణం: ఓమ్ Ω

నిరోధాల సంధానం

శ్రేణి సంధానం (Series Combination): ఒక తీగ రెండో చివరను దాని తర్వాతి తీగ మొదటి చివరకు కలిపే పద్ధతిని 'శ్రేణి సంధానం' అంటారు. ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం

$$R_s = R_1 + R_2 + ...$$

ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం పెరగటం వల్ల ఆ తీగల్లో ప్రవహిస్తున్న విద్యుత్ ప్రవాహం తగ్గుతుంది.

సమాంతర సంధానం: ఇచ్చిన తీగల మొదటి చివరలను ఒక బిందువుకు,రెండో చివరలను మరో బిందువుకు కలిపే పద్ధతిని 'సమాంతర సంధానం' అంటారు. ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం

$$\frac{1}{R_s} = \frac{1}{R_1} + \frac{1}{R_2} + \frac{1}{R_3} ....$$

ఈ సంధానంలో ఫలిత విద్యుత్ నిరోధం తగ్గటం వల్ల ఆ తీగల ద్వారా ప్రవహించే విద్యుత్ ప్రవాహం పెరుగుతుంది.

విద్యుత్ నిరోధాన్ని ప్రభావితం చేసే అంశాలు:

1. పదార్థాల స్వభావం
2. తీగ మితులు
3. ఉష్ణోగ్రత ప్రభావం
4. పదార్థంలో కలిపిన మలిన పదార్థం స్వభావం

దేశంలో అతి పెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం ఖనిజాధార పరిశ్రమలు

ఖనిజాలు, లోహాలను ముడి సరుకులుగా ఉపయోగించే పరిశ్రమలను ఖనిజాధార పరిశ్రమలు అంటారు.

ఇనుము-ఉక్కు పరిశ్రమ, అల్యూమినియం, సిమెంట్, ఎరువులు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు, రాగి పరిశ్రమ మొదలైనవి కొన్ని ముఖ్యమైన ఖనిజాధార పరిశ్రమలు.

ఇనుము - ఉక్కు పరిశ్రమ

ఏ దేశ ఆర్థికాభివృద్ధికైనా ఇనుము-ఉక్కు పరిశ్రమల అభివృద్ధి అతి ముఖ్యమైంది. అందువల్లే ఈ పరిశ్రమను 'మూల పరిశ్రమ' అంటారు. ఖనిజాధార పరిశ్రమల్లో ఇనుము-ఉక్కు పరిశ్రమ అత్యంత ప్రధాన, అతి పెద్ద పరిశ్రమ.

- భారతదేశంలో మొదటి ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని 1830లో తమిళనాడులోని పోర్టోనోవో వద్ద స్థాపించారు. 1866లో దీన్ని మూసేశారు.
- 1870లో పశ్చిమ బెంగాల్‌లోని కుల్టీ వద్ద 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ఇనుము-ఉక్కు పరిశ్రమను నెలకొల్పారు. ఇది దేశంలో మొట్టమొదటి ఇనుము-ఉక్కు పరిశ్రమ. దీన్ని బర్నాపూర్‌లోని ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ(ఐఐఎస్‌సీవో)లో విలీనం చేశారు.

టాటా ఇనుము - ఉక్కు కర్మాగారం(టిస్కో): ఇది దేశంలోని మొదటి భారీ ఆధునిక ఇనుము-ఉక్కు కర్మాగారం. దీన్ని జార్ఖండ్‌లోని సక్చీ వద్ద 1907లో జంషెడ్‌జీ టాటా స్థాపించారు. ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన మొదటి కర్మాగారం ఇది. ప్రస్తుతం పనిచేస్తున్న అతి పురాతన ఇనుము-ఉక్కు కర్మాగారం. జంషెడ్‌జీ టాటా గౌరవార్థం సక్చీని 'జంషెడ్‌పూర్'గా వ్యవహరిస్తున్నారు.

- 1919లో పశ్చిమ బెంగాల్‌లోని 'బర్నాపూర్' వద్ద 'ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ'(ఐఐఎస్‌సీవో)ని స్థాపించారు. దీన్ని 1972లో కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- 1923లో కర్ణాటకలో షిమోగా జిల్లాలోని భద్రావతి వద్ద 'మైసూర్ స్టీల్ వర్క్స్' (మిస్కో) అనే ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని నిర్మించారు. అనంతరం విశ్వేశ్వరయ్య గౌరవార్థం ఈ పరిశ్రమకు 'విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్'(వీఐఎస్ఎల్) గా పేరు మార్చారు.

భిలాయ్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలోని 'భిలాయ్' వద్ద రష్యా సహకారంతో నిర్మించారు. కోర్బా ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఇది వినియోగించుకుంటోంది. దీని ఉత్పత్తి 1959లో ప్రారంభమైంది.

రూర్కెలా ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని ఒడిశాలో సుందర్‌గఢ్ జిల్లాలోని 'రూర్కెలా' వద్ద బ్రాహ్మణీ నది ఒడ్డున నిర్మించారు. దీనికి 'పశ్చిమ జర్మనీ' సహకారం చేసింది. ఇది 1959 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

దుర్గాపూర్ ఇనుము - ఉక్కు కర్మాగారం: దీన్ని పశ్చిమ బెంగాల్‌లోని బురద్వాన్ జిల్లాలో దామోదర్ నదీ ప్రాంతంలో దుర్గాపూర్ వద్ద నిర్మించారు. దీనికి బ్రిటన్ సహకారం చేసింది. ఇది 1962 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఇనుము-ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారు.

బొకారో ఇనుము - ఉక్కు కర్మాగారం: ఇది మూడో పంచవర్ష ప్రణాళిక కాలం (1964)లో ఏర్పాటైంది. దీన్ని జార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాలోని బొకారో, దామోదర్ నదుల సంగమ ప్రాంత సమీపంలో నిర్మించారు. అత్యధికంగా స్వదేశీ పరిజ్ఞానంతో, కొంత రష్యా సహకారంతో స్థాపించిన నాలుగో ప్రభుత్వరంగ ఇనుము-ఉక్కు కర్మాగారం.

- ప్రస్తుతం ఇది భారతదేశంలో అతిపెద్ద ఇనుము-ఉక్కు కర్మాగారం. 1972 నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది.

విశాఖ స్టీల్ ప్లాంట్: ఇది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉంది. దీన్ని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్.. రష్యా సహాయంతో నిర్మించింది. 1992 ఆగస్టు 1న నాటి ప్రధాని పీవీ నరసింహారావు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కర్మాగారం భారతదేశంలో అత్యాధునిక, తీరప్రాంతంలో ఉన్న ఏకైక ఇనుము-ఉక్కు కర్మాగారం.

- 1982లో తమిళనాడులోని 'సేలం' వద్ద ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఈ కర్మాగారం నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి. మరో కర్మాగారాన్ని కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలోని విజయనగర్ వద్ద నిర్మించారు.

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్): దీన్ని 1973లో న్యూఢిల్లీలో స్థాపించారు. ఇది పూర్తిగా ప్రభుత్వాధీన సంస్థ. దీనికి మహారత్న హోదా ఉంది. భిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా, బొకారో, బర్నాపూర్, సమీకృత ఉక్కు కర్మాగారాలు మొదలైన వాటి నిర్వహణ బాధ్యత దీనిదే.

- భారతదేశంలో ఏర్పాటైన తొలి స్పాంజ్ ఐరన్ కర్మాగారం తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని పాల్వంచ (కొత్తగూడెం)లో ఉంది.

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో ఇనుము తర్వాత ఇది రెండో పెద్ద ఖనిజరంగ పరిశ్రమ. దీన్ని మన దేశంలో వార్‌బోర్న్ పరిశ్రమ అంటారు. 'అల్యూమినియం'ను విశ్వలోహం అంటారు. భారతదేశంలో 1937లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అసన్‌సోల్ సమీపంలో 'జాయక్‌నగర్' ప్రాంతంలో 'అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు.

- భారతదేశంలో 8 అల్యూమినియం శుద్ధి కర్మాగారాలు ఉన్నాయి. అవి..

1. **ఇందాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ):** దీనికి అలువాపురం(కేరళ), హీరాకుడ్ (ఒడిశా), బెల్గాం (కర్ణాటక)లో యూనిట్లు ఉన్నాయి.
2. **హిందాల్కో(హిందుస్తాన్ అల్యూమినియం కంపెనీ):** ఇది రేణుకూట్ (ఉత్తరప్రదేశ్)లో ఉంది.
3. **బాల్కో(భారత్ అల్యూమినియం కంపెనీ):** దీనికి కోర్బా(ఛత్తీస్‌గఢ్), రత్నగిరి(మహారాష్ట్ర)లో యూనిట్లు ఉన్నాయి. బాల్కో మొదటిసారి లక్ష టన్నుల కెపాసిటీ సాధించింది.
4. **నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ):** ఇది దామన్‌జోడి(ఒడిశా)లో ఉంది.
5. **మాల్కో(మద్రాస్ అల్యూమినియం కంపెనీ):** ఇది మెట్టూరు (తమిళనాడు)లో ఉంది.

సిమెంటు పరిశ్రమ

భారతదేశంలో మొదటి సిమెంటు పరిశ్రమ 1904లో చెన్నైలో ప్రారంభమైంది. ప్రస్తుతం దీన్ని మూసివేశారు. పూర్తి స్థాయిలో 1912లో గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు.

- సిమెంటు ఉత్పత్తిలో భారత్‌ది రెండో స్థానం కాగా మొదటి స్థానంలో చైనా ఉంది.
- భారతదేశంలో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సిమెంటు ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. సిమెంటు పరిశ్రమకు ప్రధాన ముడి సరుకు సున్నపురాయి.
- ప్రస్తుతం మనదేశంలో 128 భారీ, 322 చిన్న సిమెంటు కర్మాగారాలున్నాయి.
- ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ సిమెంటు కర్మాగారాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీలు దాదాపు 65 శాతం సిమెంటును ఉత్పత్తి చేస్తున్నాయి. అసోసియేట్ సిమెంటు కంపెనీ(ఏసీసీ) లిమిటెడ్ అతి పెద్ద సిమెంట్ తయారీ సంస్థ కాగా దాల్మియా గ్రూపు రెండోది.

ఎరువుల పరిశ్రమ

దేశంలో మొదటి ఎరువుల పరిశ్రమను 1906లో తమిళనాడులోని రాణిపేటలో ప్రారంభించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ రంగంలో మొదట 1951లో బిహార్‌లోని సింద్రీ (ప్రస్తుతం ఈ ప్రాంతం జార్ఖండ్‌లో ఉంది) వద్ద ఆధునిక ఎరువుల కర్మాగారాన్ని నిర్మించారు. చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో ఎరువుల ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది.

- 1961లో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, 1974లో నేషనల్ ఫెర్టిలైజర్ లిమిటెడ్‌ను స్థాపించడం ద్వారా ఎరువుల పరిశ్రమ అభివృద్ధి చెందింది.

గాజు పరిశ్రమ

భారతదేశంలో మొదటి గాజు పరిశ్రమను 1941లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో స్థాపించారు. ఈ పరిశ్రమకు కావాల్సిన ముడి పదార్థాలు.. ఇసుక, సున్నపురాయి, సిలికా, సోడా యాష్. ఫిరోజాబాద్ పరిశ్రమ గాజులు, పూసలకు ప్రసిద్ధి.

ఇంజనీరింగ్ పరిశ్రమలు

మనదేశంలో 1958లో హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ను రాంచీ(జార్ఖండ్)లో స్థాపించారు. దీని స్థాపనతో ఇంజనీరింగ్ పరిశ్రమ అభివృద్ధి ప్రారంభమైంది. ప్రస్తుతం దేశ అవసరాలకు కావాల్సిన అన్ని రకాల సామగ్రిని మన దేశం తయారు చేస్తోంది.

దేశంలోని ప్రధాన ఇంజనీరింగ్ పరిశ్రమలు

హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్: జార్ఖండ్‌లోని రాంచీలో ఉంది. ఇది ఉక్కు పరిశ్రమ. యంత్ర సామగ్రి, హెవీ క్రషింగ్, గ్రైండింగ్ యంత్రాలు, క్రేన్లు, రోలింగ్ యంత్రాలు, నూనె బావుల డ్రిల్లింగ్ రిగ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది.

మైనింగ్ అండ్ అల్లైడ్ మిషనరీ కార్పొరేషన్ లిమిటెడ్: ఇది దుర్గాపూర్ (పశ్చిమ బెంగాల్) ఉంది. రకరకాల ఖనిజ యంత్రాలను తయారు చేస్తోంది.

భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్: ఇది విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)లో ఉంది. పెట్రో రసాయనాలు, ఎరువుల యంత్రాలను తయారు చేస్తోంది. దీన్ని 2009లో బీహెచ్ఈఎల్‌లో విలీనం చేశారు.

తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్: ఇది కర్ణాటకలో ఉంది. గేట్స్, ట్రాన్స్‌మిషన్ టవర్స్, పెన్‌స్టాక్ పైప్స్ తయారు చేస్తుంది.

ఇతర పరిశ్రమలు

1. **హిందుస్తాన్ మెషీన్ టూల్స్(హెచ్ఎంటీ):** దీన్ని 1953లో కర్ణాటకలోని బెంగళూరులో స్థాపించారు. దీనికి అయిదు యూనిట్లు ఉన్నాయి. శ్రీనగర్ (జమ్మూకశ్మీర్), బెంగళూరు (కర్ణాటక), హైదరాబాద్, కాలమస్సేరి (కేరళ) యూనిట్లలో హెచ్ఎంటీవాచ్‌లు, పింజోర్ (హర్యానా) యూనిట్‌లో ట్రాక్టర్లను తయారు చేస్తారు.
2. **భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్):** దీన్ని 1956లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో స్థాపించారు. దీనికి జగదీశ్‌పూర్, హరిద్వారా (ఉత్తరప్రదేశ్) తిరుచిరాపల్లి (తమిళనాడు), హైదరాబాద్‌లో యూనిట్లు ఉన్నాయి.
3. **ప్రాగా టూల్స్:** ఇది సికింద్రాబాద్ లో ఉంది. ఇక్కడ రక్షణ సామగ్రిని తయారు చేస్తారు.
4. **హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్):** దీనికి హైదరాబాద్, రూప్ నారాయణపూర్ (పశ్చిమబెంగాల్)లో యూనిట్లు ఉన్నాయి.
5. **హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ:** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
6. **హెవీ వెహికల్ ఫ్యాక్టరీ:** ఇది ఆవడి (చెన్నై)లో ఉంది.
7. **హిందుస్తాన్ హౌజింగ్ ఫ్యాక్టరీ లిమిటెడ్:** ఇది న్యూఢిల్లీ ఉంది.
8. **భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్):** ఇది బెంగళూరు (కర్ణాటక)లో ఉంది.
9. **హిందుస్తాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్:** ఇది పింప్రీ(మహారాష్ట్ర)లో ఉంది.
10. **హిందుస్తాన్ ఫొటో ఫిల్మ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్:** దీన్ని 1960లో భారత ప్రభుత్వం తమిళనాడులోని ఊటీ వద్ద ఏర్పాటు చేసింది.
11. **ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఐడీపీఎల్):** దీని కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మనదేశంలో మొదటి స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు? (కానిస్టేబుల్ -2012)
   1) కొత్తగూడెం
   2) విశాఖపట్నం
   3) భోపాల్
   4) కోల్‌కతా
2. దేశంలోని అతిపెద్ద ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) భిలాయ్
   2) బొకారో
   3) రూర్కెలా
   4) దుర్గాపూర్
3. భారత్ హెవీ ఎలక్ట్రికల్ కర్మాగారం ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) విశాఖపట్నం
   2) భువనేశ్వర్
   3) హైదరాబాద్
   4) ముంబై
4. దేశంలోని మొదటి ఉక్కు కర్మాగారమైన టాటా ఇనుము-ఉక్కు కంపెనీ ఎక్కడ ఉంది? (కానిస్టేబుల్ - 2009)
   1) దుర్గాపూర్ 2) నాగపూర్
   3) బీజాపూర్ 4) జంషెడ్‌పూర్
5. బొకారో ఉక్కు కర్మాగారాన్ని ఏ దేశ సహాయంతో నిర్మించారు? (జైల్ వార్డెన్ - 2012)
   1) అమెరికా సంయుక్త రాష్ట్రాలు
   2) ఇంగ్లండ్
   3) జర్మనీ
   4) సోవియెట్ యూనియన్
6. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి. (జైల్ వార్డెన్ - 2012)
   1) విశాఖపట్నం – నౌకా నిర్మాణం
   2) టిట్లాఘర్ – రైల్వే సామగ్రి
   3) భద్రావతి – ఇనుము, ఉక్కు
   4) పింజోర్ – యంత్ర పరికరాలు

సమాధానాలు:

1) 1; 2) 2; 3) 3; 4) 4; 5) 4; 6) 2.

The mountain tops were hidden..

BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. No. 1-5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

Internet giant Google could be on the side of forces working towards thwarting net neutrality in India. The company has allegedly been trying to prevent the Internet and Mobile Association of India, a body that represents internet firms in India, from opposing Zero Rating, the practice of letting users access select applications/websites free of data charges by striking deals with telecom operators. It's worth pointing out that so far, Google has chosen to remain silent on the matter of net neutrality in India.

As pointed out by MediaNama, Google has not participated in the consultation process for net neutrality and has not submitted any comments to the TRAI. It opted out of **deposing** before the Parliamentary Standing Committee on IT looking into Net Neutrality, despite receiving a specific invite from the committee. In its report, the DoT had opposed Zero Rating plans from content providers like Facebook and had said that "content and application providers cannot be permitted to act as gatekeepers and use network operations to extract value in violation of core principles of Net Neutrality, even if it is for an **ostensible** public purpose." It had said that partnerships between telecom operators and content providers that enable gatekeeping should be actively discouraged, opposing Facebook's Internet.org.

It's worth mentioning that Google had put on hold plans to provide free data to end users in India by zero rating certain apps in May, following public backlash against Facebook's and Airtel's Zero rated offerings.

The internet giant, which was in early discussions with telecom operators and applications developers to launch a zero rating platform, had decided to take a wait and watch approach, as per sources close to the company.

1. The central theme of the passage is about
   1) Net neutrality in India
   2) Rating plans from content providers
   3) Partnerships between telecom operators and content providers
   4) To launch a zero rating platform
   5) Proposing Zero Rating plans
2. DoT's report states that
   1) content and application providers can be permitted
   2) content and application providers cannot be opposed
   3) use network operations to enable gatekeeping
   4) content and application providers cannot be permitted
   5) gatekeeping should be actively encouraged
3. Google had put on hold plans to provide free data to end users because
   1) Public's hostile response against Facebook's and Airtel's Zero rated offerings
   2) public appreciation against Facebook's and Airtel's Zero rated offerings
   3) rise of Facebook's and Airtel's Zero rated offerings
   4) had decided to take a wait and watch approach
   5) has chosen to remain silent
4. The synonym of ostensible is
   1) professed 2) real
   3) genuine 4) valid
   5) authentic
5. The antonym of depose is
   1) overthrow 2) topple
   3) pressure 4) install
   5) conquer

Directions (Q. No. 6-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. His resignation has created a ___ which cannot be easily filled.
   1) gap 2) space 3) room
   4) vacuum 5) ridge
7. The bank provides valuable information on recent _______.
   1) trends 2) method
   3) policy 4) bond
   5) loan
8. Politics is _____ often concerned with the personal _______ of politicians.
   1) to – attitude
   2) very – characters
   3) much – appearance
   4) many – approach
   5) too – vanities
9. New techniques ____ introduced with _____ degrees of success.
   1) are – many
   2) is – shaded
   3) were – varying
   4) was – different
   5) have – various
10. The mountain tops were hidden _______ a veil of mist.
    1) Beside 2) under 3) because
    4) beneath 5) below
11. A ______ business venture ____ him thousands of dollars.
    1) prosperous – puts
    2) lucrative – loss
    3) good – bet
    4) disastrous – lost
    5) bad – debt
12. He's a ______ genius but he has ______ verbalizing his ideas.
    1) good – differences
    2) matured – symptoms
    3) true – similarities
    4) real – difficulty
    5) great – trouble
13. The English ____ of the novel is ____ for publication next year.
    1) part – suppose
    2) model – to be
    3) module – probably
    4) section – definite
    5) version – due
14. The conference spent days discussing the ____ question ____border controls.
    1) same – about 2) different – off
    3) vexed – of 4) vested – along
    5) similar – also
15. This evidence supports the ____ that there is too ____ violence on television.
    1) ideas – many
    2) principle – most
    3) rule – often 4) view – much
    5) statement – regular

Directions: (Q.No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

16. The debate <u>veered side</u> from the main topic of discussion.
    1) Veer aside 2) Veered away
    3) Veered to 4) Veered along
    5) No correction required
17. Be there by six at the <u>many</u> latest.
    1) much 2) more 3) most
    4) very 5) No correction required
18. Thailand is at its <u>very bright</u> during the New Year celebrations.
    1) Many good 2) much light
    3) mostly brighter
    4) most vibrant
    5) No correction required
19. For years the family <u>was been</u> victimized by racist neighbours.
    1) were 2) was be
    3) had been
    4) have being
    5) No correction required
20. Anti-nuclear protestors <u>regarding</u> the Chernobyl accident as a clear vindication of their campaign.
    1) is regards 2) are regarded
    3) were regards 4) regarded
    5) No correction required

Directions (Q. No. 21-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

21. She accused (1)/ the press photographers (2)/ of violence (3)/ her privacy. (4)/ No error. (5)
22. They could see (1)/ no virtue (2)/ in discussing it (3)/ farther. (4)/ No error. (5)
23. He was feeling virtuous (1)/ because (2)/ he had finished (3)/ and they haven't. (4)/ No error. (5)
24. The advertisements intention (1)/ to increase (2)/ the company's visibility (3)/ in the market. (4)/ No error. (5)
25. It is vital (1)/ that you keeping (2)/ accurate records (3)/ when you are self employed. (4)/ No error. (5)

Directions (Q.No. 26-30): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

26. He **gave** (1) a **vived** (2) account of **his life** (3) as **a fighter** (4) pilot.
27. **The** (1) protestors **is** (2) a small **but** (3) **vocal** (4) minority.
28. **The void** (1) **leaved** (2) by his mother's death **was** (3) never **filled.** (4)
29. She **is** (1) a doctor **with** (2) a strong **sense** (3) of **vaccination.** (4)
30. New roads **are being** (1) built to **cope up with** (2) the **increased** (3) volume **of** (4) traffic.

Directions (Q.No. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) In our modern world, many of the constellations have been redefined so now every star in the sky is in exactly one constellation.
B) On a really dark night, you can see about 1000 to 1500 stars. Trying to tell which is which is hard.
C) The constellations are totally imaginary things that poets, farmers and astronomers have made up over the past 6,000 years.
D) The real purpose for the constellations is to help us tell which stars are which, nothing more.
E) The constellations help by breaking up the sky into more managable bits. They are used as mnemonics, or memory aids.
F) The constellations have changed over time.

31. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Answers

1) 1	2) 2	3) 1	4) 1	5) 4
6) 4	7) 1	8) 5	9) 3	10) 4
11) 4	12) 4	13) 5	14) 4	15) 4
16) 2	17) 3	18) 4	19) 3	20) 4
21) 3	22) 4	23) 4	24) 2	25) 2
26) 2	27) 2	28) 2	29) 4	30) 2
31) 1	32) 2	33) 4	34) 3	35) 3